భారతి

సాహిత్య మాసపత్రిక

మార్చి 1979

దిక్కులేనోడు

కొలకలూరి

వేదనా వాసుదేవము

భూమయ్య

టెర్రరిస్టుతో ఇంటర్వ్యూ

హవుసర్

సాంప్రదాయేతర విద్యా విధానము

తిలక్

సముద్రం అంచున

నారాయణరెడ్డి

అశ్రుధార

కుఞ్ఞిరామన్‌నాయర్

ఇంకా శ్రీధర్, మనోహర్‌రెడ్డి, లక్ష్మీనారాయణశర్మ, రఘునాధం, రామారావు, రామాచంద్రమౌళి, సూర్యనారాయణమూర్తి, రావు, దక్షిణామూర్తి, రామకృష్ణకటాక్ష, భక్తవత్సలరెడ్డి, నాగభూషణం, హెచ్చార్కె ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు

లక్షాధిపతి కావటానికి

వేలాది రూపాయలు ఖర్చుపెట్ట నవసరంలేదు. మీరు కేవలం రు 464/-లను లేదా రు. 24 లు ఖర్చుచేస్తే చాలును. వేలాది ప్రజలు గెలుపొందారు. మీరు కూడా లక్షల రూపాయలు గెలుపొందవచ్చును. మీ పొదుపు ఖర్చుతోబాటు బోనసు రు. 250లు చేర్చి వాపసు తీసుకోండి.

త్వరపడండి ! కాలము ధనము, మీ బహుమతులు మీకోసం ఎదురుచూస్తున్నవి. సభ్యత్వాలు త్వరితంగా భర్తీ కాబడుతున్నవి. మా భూదేవి గ్రూపు మొదటి డ్రా 30 మార్చి 1979న నెల్లూరులో తీయుటకు నిర్ణయించబడినది.

ఉచిత దరఖాస్తు ఫారం, స్కీము లిటరేచరు మొదలైన వానికి మీరు సమీపంలోని ఏజంటు లేదా గుజరాత్ సేవింగ్స్ బ్రాంచిని సంప్రదించండి / వ్రాయండి

For more details contact or write to

GUJARAT SAVINGS

Regional offices

Bank 5 1-751 Street Kotwal, Opp Taj Hotel, HYDERABAD-1 Tel. 57406

Gandhi Nagar Kotwari Building Basant Road, VIJAYAWADA- Tel: 72152.

Dr S N. Sahu Building Rani Hat, CUTTACK 7

తిరుపతి : 2వ అంతస్థు 490, బండ్లవీధి,
తిరుపతి.

46 22 5 Dondaparti Station Road VISHAKHAPATNAM 530 016
1-6 51 Market Road Near Clock Tower, Jagtiyal P O . KARIMNAGAR
Dr Subhedhar s clinic Gandhi Chowk, NIZAMABAD
1 6 5, Shastri Road KARIMNAGAR,
Rashtrapati Road NALGONDA
3 8 27, Shah Bazar MEHABOOBNAGAR,
D No 23/11 40, Nerala Bldg Bazar GUNTUR 3
13 177 Nehru Road KURNOOL
8 24 151 K V P Bldg Main Road RAJAHMUNDRY
Bose Road Opp Rama shna Theatre TENALI
Subhash Road KAMAR DY
71, Chandralok Building, 11 Sarojini Devi Road, Opp Coromandal SEC NDERABAD 500 003
P V N Mansion, Seshapuran Street, CHITTOOR
Near Ashok Talkies P O NIRMAL
Opp Cochin Cafe Trunk Road ONGOLE.
21 186 Sowcar Fakir Saheb Street, CUDDAPAH,
P R Rao Bldg Main Road KAKINADA
Raja Building 3rd floor, Opp Muncipal Bus Stand SRIKAKULAM
7 142, Prakash Road ANANTAPUR.
15, J V Muncipal Buildings, Trunk Road, NELLORE.
8 3 51, Sunder Talkies Road, KHAMMAM.
Atreya Vilas, Main Road MACHILIPATNAM 521 001.
Ganesh Bhavan Hanamkonda Chawrasta, WARANGAL 506 001.
College Road KADIRI
Door No 6/6 A, Gandhi Road, PRODDATUR 516 360
Muncipal Building Up Stairs, Room No. 3 ADONI
Urban Bank Road Near Batam BERHAMPUR ORISSA
Dr S.N. Sahu Building Rani Hat CUTTACK -7

BRANCHES ALL OVER INDIA
H O 518 Kalbadevi Road BOMBAY 400 002 Tel· 310605—310533.

ICLVA104M147

భారతి

మాసపత్రిక

❀

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

❀

మార్చి 1979

సంపుటము : 56 సంచిక : 3

విడిపత్రిక వెల రూపాయిన్నర

ప్రళయం నుంచి ప్రగతికి

ఆంధ్రప్రదేశ్‌లోని తుఫానుకు గురైన కోస్తా జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో ఈనాడు పచ్చని పంట చేలు బాలభానుని వెచ్చని కిరణాల గిలిగింతలకు కళకళలాడుతూ లాస్యం చేస్తున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బాగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ముమ్మరంగా కొన సాగుతున్నది.

బహువిధాలైన పునరావాస కార్యక్రమాలు ప్రారంభం కావడంతో బాధితులలో అలముకున్న విషాదచ్ఛాయలు క్రమంగా విడిపోయి వారిలో ఆశాకిరణాలు వెల్లివిరుస్తున్నాయి.

"ఇళ్లు లేనివారికి ఇళ్లు" అనేది ఇంకెంత మాత్రం నినాదం కాదు. ఈ నినాదం కార్యరూపం ధరిస్తున్నది. నిర్మించ తల పెట్టిన 20,000 ఇళ్లలోనూ 13,000 ఇప్పటికే పూర్తయ్యాయి. వీటి నిర్మాణానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచీ, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచీ సహాయం అందుతూంది. తీరం పొడవునా తుఫాను రక్షక భవనాల నిర్మాణానికి ప్రాముఖ్యత నిస్తున్నారు.

ప్రళయానికి గురైన తీరప్రాంతం, ముమ్మరంగా జరిగే ఈ గృహనిర్మాణ పునరావాస కార్యక్రమాల ఫలితంగా తిరిగి ప్రగతి పథంలో అడుగెడుతూంది.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

35/78–79

౩

విషయానుక్రమణిక

మార్చి 1979

సముద్రం అంచున సంతకం	డా. సి. నారాయణరెడ్డి	4
జాన్ మారిస్ క్లార్క్ ఆర్థిక ఆలోచన	డా. బి. ఆర్. కె. రావు	5
మీ దగ్గరేమన్నావుంటే పంపండి ! ప్లీజ్ !	డా. చెళ్ళపిళ్ళ సూర్యనారాయణమూర్తి	7
నవ్యతా ప్రయోక్త — నారాయణరెడ్డి	శ్రీ నా. భక్తవత్సలరెడ్డి	8
సాంప్రదాయేతర విద్యావిధానము: వయోజనవిద్య	శ్రీ జంధ్యాల బాలగంగాధరతిలక్	12
విలయతాణ్డవమ్	హెచ్చార్కె	18
వేడిలేని నిప్పు	రామకృష్ణ కటాక్ష	19
అశ్రుధార	మళయాళమూలం: భక్తకవి పి.కుఞ్ఞిరామన్ నాయర్ తెలుగుసేత : శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు శ్రీ సి. అమ్మినికుట్టి	20
మరో 'లా' ఉందా ?	శ్రీ కుంటముక్కల లక్ష్మీనారాయణశర్మ	21
అక్షర కుక్షిపక్షి	శ్రీ కోడూరి శ్రీధర్	28
రా !	శ్రీ మల్లాప్రగడ రామారావు	28
దిక్కులేనోడు	కొలకలూరి	29
మాటలు	శ్రీ గజ్జెల దక్షిణామూర్తి	37
శిల్పంలో శ్రీరాముడు	శ్రీ కాసల నాగభూషణం	38
ఒంటరి ఆకాశం	శ్రీ రామాచంద్రమౌళి	42
వేదనా వాసుదేవము	శ్రీ ఎ. భూమయ్య	44
కవిత	శ్రీ గుడిహాళం రఘునాథం	57
జర్మన్ టెర్రరిస్టుతో ఇంటర్వ్యూ	శ్రీ పీటర్ న్యూహవుసర్	58
విలాసం	శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి	62
కలగూరగంప		64
గ్రంథ విమర్శలు		77

(*)

సముద్రం అంచున సంతకం

డా॥ సి. నారాయణరెడ్డి

సముద్రం అంచున
  సంతకం చేస్తున్నాను
చెరిపేస్తున్నాయి తెల్లగుర్రాలు
నురగల డెక్కలతో.

సముద్రం నా భాష
అక్కడే పుట్టింది నా
ఆత్మఘోష.

ఎన్నెన్ని స్వరాలు వశీకరించు
కున్నాను ఆ ఒడిలో
త్రిసంధ్యల్ని మంత్రీకరించుకుంటూ.

నాలోని చిచ్చు
ఆలాపనగా ఏడుస్తూవుంటే
సముద్రం నోరు నొక్కుకుంటుంది.

సముద్రం గొంతు
ఉప్పెనలా అరుస్తూవుంటే
నా గుండె ఆవిరవుతుంది.

కడలికీ నాకూవున్న ముడినీ;
అలల్నీ నా గుండె ఆవిరుల్నీ
కలిపికుట్టే అంజడినీ;
అర్థం చేసుకోలేవు
పైపైన లొక్కులాడే నురగలు
దూది పరుగులు.

ఇసుక మీద చేసిన సంతకం
ఇట్టే చెరిగిపోయినా
కాలం నుదుట చెక్కిన సంతకం
కడలిలా మిగిలిపోతుంది

డాక్టర్ బి. ఆర్. కె. రావు

జాన్ మారిస్ క్లార్క్ ఆర్థిక ఆలోచన

ప్రఖ్యాత అమెరికన్ ఆర్థిక శాస్త్రవేత్త జాన్ బేట్స్ క్లార్క్ కుమారుడు జాన్ మారిస్ క్లార్క్ 1884వ సం॥ నవంబరు 30వ తేదీన నార్తాంప్టన్‌లో జన్మించాడు. యామ్‌హర్స్ట్ కాలేజిలోను, కొలంబియా యూనివర్సిటీలోను విద్యాభ్యాసం చేసాడు. 1908లో కొలరాడో కాలేజిలో ఇన్‌స్ట్రక్టర్‌గా చేరి, ఏడు సంవత్సరాల తర్వాత ఆ స్థానాన్ని వదిలి చికాగో విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా చేరాడు. వీరి ప్రముఖ గ్రంథాలు : (1) స్టడీస్ ఇన్ ది ఎకనామిక్స్ ఆఫ్ ఓవర్ హెడ్ కాస్ట్స్ (1923) (2) సోషల్ కంట్రోల్ ఆఫ్ ఎకనామిక్స్ (1926) (3) స్ట్రాటజిక్ ఫాక్టర్స్ ఇన్ బిజినెస్ సైకిల్స్ (1934) (4) ప్రిఫేస్ టు సోషల్ ఎకనామిక్స్ (1936) (5) డీ మోబిలైజేషన్ ఆఫ్ వార్ టైమ్ ఎకనామిక్ కంట్రోల్స్ (1940) (6) ఆల్టర్‌నేటివ్స్ టు సర్ఫ్‌డమ్ (1948) (7) ఎకనామిక్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ హ్యూమన్ వెల్‌ఫేర్ (1957) (8) కాంపిటిషన్ యాస్ ఎ డైనమిక్ ప్రోసెస్ (1961). ఇప్పుడాయన ఆర్థిక ఆలోచన చూద్దాము.

అధ్యయన పద్ధతి: నూతన కూర్పులు :

జాన్ మారిస్ క్లార్క్ ముఖ్యంగా సాంఘిక ఆర్థిక శాస్త్రవేత్త (Social Economist). సాంఘిక ఆర్థిక శాస్త్రము, గతిశీల (Dynamic) ఆర్థిక శాస్త్రము అనే రెండు శాఖలను ఏర్పరచడానికి పూనుకున్నాడు. చార్లెస్. హెచ్. కూలే అనే అమెరికన్ సాంఘిక శాస్త్రవేత్త ప్రభావం క్లార్క్ రచనల్లో కనిపిస్తుంది. కూలే ఆగమన పద్ధతి (Inductive Method) అధ్యయనాన్ని, సమష్టి కార్యాచరణ కావాలని కోరేవాడు. సాంస్కృతిక ప్రక్రియల సంశ్లిష్ట చట్రంలో మానవ ప్రవృత్తిలోని సాంఘిక స్వభావాన్ని అధ్యయనం చెయడము, సాంఘిక వ్యవస్థను భాష్యం చెప్పడము, ఆగమన పద్ధతి అధ్యయనాల భాగాయిగా ఉండాలని కూలే కోరారు. ఈ దృక్పథాలు మారిస్ క్లార్క్ రచనల్లో కూడా కనిపిస్తాయి అతని తండ్రి జాన్ బేట్స్ క్లార్క్ నిశ్చల (Static) ఆర్థిక శాస్త్రాన్ని ప్రతిపాదించాడు. జాన్ మారిస్ క్లార్క్ తన తండ్రి వదిలివేసిన గతిశీల (Dynamic) ఆర్థిక శాస్త్రాన్ని ప్రతిపాదించడానికి పూనుకున్నాడు. మారిస్ క్లార్క్ "జెనెటిక్ థీరి ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్"ను అభివృద్ధి చేసాడు.

మారిస్ క్లార్క్‌కు అధ్యయన పద్ధతులమీద వివాదానికి దిగడం ఇష్టం లేదు. ఆగమన పద్ధతివైపుకు మొగ్గుదల కనిపించినా, శాస్త్రీయ అధ్యయన పద్ధతి కేవలం ఆగమన (Inductive) పద్ధతిలో గాని, కేవలం నిగమన (Deductive) పద్ధతిలో గాని ఉండదని, సంగతమైన సత్యాలలో దేనిని వదలకుండా అన్నిటిని తీసుకుని విశ్లేషించడం వల్ల అది జరుగుతుందని చెప్పాడు.

వ్యవస్థా వ్యయము :

వ్యవస్థా వ్యయాల (Over head costs) సిద్ధాంతాన్ని రచించినందుకు మారిస్ క్లార్క్‌కు మంచిపేరు వచ్చింది. ఆర్థిక వ్యవస్థ ఒకేరకంగా నడిచే అనంతమైన శాశ్వత గమనంగల నిశ్చల యాంత్రికత (Static Mechanism) కంటె గమనశీలంగల సాంఘిక అంగ నిర్మాణమనే ప్రమేయంతో బయలుదేరి వ్యవస్థా వ్యయ సిద్ధాంత నిర్మాణానికి పూనుకున్నాడు మూలధనం గమనశీలత గలదని రెండవ ప్రమేయం పెట్టుకుని కూడా పై సిద్ధాంత నిర్మాణానికి పూనుకున్నాడు.

ఉత్పాదనశక్తి : వ్యయ విశ్లేషణ :

ఆధునిక కాలంలో పెద్దతరహా ఆర్థిక ఉద్యమాలు (Enter-Prises) చాలా ఏర్పడుతున్నవి. అయితే ఈ వ్యవస్థల ఉత్పాదన శక్తి, సాపేక్షికంగా చూస్తే, అస్థితిస్థాపకంగా (Inelastic) ఉన్నది. ఈ పరిస్థితుల్లో ఆర్థికశాస్త్రం హెచ్చుగా ఆమోదయోగ్యమైన విషయం కావడానికి వ్యయవిశ్లేషణ (Cost analysis) వెలుగులో దాని సూత్రాలను పునర్నిర్మాణం చేసుకోవాలి.

శ్రామికులు, స్థిర (fixed) మూలధనము వ్యవస్థా స్థాపన ఖర్చుల క్రిందికి వస్తాయి. అవి ఉత్పత్తి చేస్తున్నా, లేకున్నా వాటిని పోషించాలి. ఈ విధంగా పారిశ్రామిక సంస్థల (Firms)ను కార్యనిర్వహణ స్థితిలో ఉంచేందుకు చేసే ఖర్చు సాంఘిక వ్యవస్థాపన ఖర్చు (Social over head cost) అవుతుంది.

యంత్రానికి మనిషి బానిస :

యంత్రాలు మానవుణ్ణి లోబరచుకుని బానిసగా చేసుకోవడం చూచి మారిస్ క్లార్క్ బాధపడ్డాడు. ఆధునిక సంస్థలు గట్టి అసమతౌల్యం (Dis Equilibrium) వైపుకు నడిచే ప్రవృత్తిలో ఉన్నాయి. అవసరమైన వస్తువులు ఉత్పత్తి చేయటం లేదు. ఈ అనుచిత పరిస్థితుల్ని సాంకేతిక సామర్థ్యాన్ని వా

కంటె సాంఘిక సామర్థ్యం ద్వారా సరిచేయ వచ్చుననే అభిప్రాయానికి హెచ్చు ప్రాముఖ్యత ఇవ్వబడుతోందని 'ది సోషలైజింగ్ ఆఫ్ థీరిటికల్ ఎకనామిక్స్' (పే. 73)లో వ్రాసాడు.

వ్యక్తికి ఉపయోగము సంఘానికి విలువ కావాలి :

మారిస్ క్లార్క్ సాంఘిక విలువల సిద్ధాంతాన్ని కూడా తయారుచేసాడు. వ్యక్తులు వినియోగించుకునే ఉపయోగితలు సంఘానికి విలువ కావడము సాంఘిక విలువ అవుతుంది. వ్యక్తులు భరించే ఖర్చులు సంఘానికి చెందిన ఖర్చుకావడం కూడా సాంఘిక విలువ అని చెప్పవచ్చునని 'ప్రిఫేస్ టు సోషల్ ఎకానామిక్స్' (పే 49)లో వ్రాసాడు. అయితే సాంఘిక విలువలకు ప్రమాణాల నేర్పర్చలేకపోయాడు కాని ఆస్తిహక్కుల్ని నిర్ధారణచేసి, నడిపించే సూత్రాలను, శాసనాలను మెరుగుపర్చడంద్వారా ఈ సాంఘిక విలువలను పెంచవచ్చని చెప్పాడు.సాంఘికవిలువలను సృష్టించడంలోసాంఘిక సంస్థలు(Institutions)ప్రముఖపాత్రను నిర్వహిస్తాయి. సాంఘిక దుబారాను(దుర్వ్యయాన్ని)క్లార్క్ వ్యతిరేకించాడు.వస్తువులకువిలువ కట్టడానికంటె సంస్థలకు విలువ కట్టడం హెచ్చు ప్రాముఖ్యంగల విషయము. సాంఘిక సంయుక్త ఉత్పత్తి గొప్పది; ఇందులో ప్రతి వస్తువు భాగము. అందువల్ల వస్తువు విలువకంటె సంస్థ విలువ హెచ్చు ప్రాముఖ్యత గలది. సాంఘిక కాస్ట్-కీపింగ్ (Social-cost keeping)ను సాంఘిక ఎకౌంటింగును (Social accounting)ను నిర్వహిస్తూ ఉండడము చాల అవసరమని ''స్టడీస్ ఇన్ ది ఎకనామిక్స్ ఆఫ్ ఓవర్ హెడ్ కాస్ట్స్'' (P 485)లో వ్రాసాడు.

సమాజంలో వ్యక్తులు, ప్రయోజనాలు:

వ్యక్తులు, ప్రయోజనాలు (Interests), సముదాయాలు (Groups) కలసి సమాజమౌతోంది. ఈ ప్రయోజనాలు, సముదాయాలు అంతర్గత సంబంధం గలవి. అందువల్ల కలసి ఉన్నయ్యి. అయితే వీటిని వేరు వేరుగా చూడవచ్చు. కాని వివిధ సముదాయాల మధ్య స్వీయ ప్రయోజనాల సాధనకొరకు సంఘర్షణ జరుగుతుంటుంది. శ్రామికుల ప్రయోజనాలు ఉత్పత్తిదారుల ప్రయోజనాలతోను, గుత్తవ్యాపారాధిపతుల ప్రయోజనాలతో చిన్న వ్యాపారుల ప్రయోజనాలు సంఘర్షణకుదిగుతున్నయ్యి. మానవులమధ్యగల సంఘర్షణలను తొలగించడానికి, మానవుల తెలివి తేటలను మెరుగుపర్చడానికి తోడ్పడే పరిస్థితుల్ని సృష్టించాలి. మార్కెట్ యంత్రాంగము (Market Mechanism) శ్రామికుల కోరేపనిని ఇవ్వలేకపోవడమేగాక, వారి అవసరాలను తీర్చలేదు. అందువల్ల ప్రస్తుతమున్న మార్కెట్ యంత్రాంగాన్ని మారిస్ క్లార్క్ వ్యతిరేకించాడు. ప్రస్తుత మార్కెట్ యంత్రాంగం, మూల్యీకరణ వ్యవస్థలవల్ల సమాజంలోని వనరులు ఉపయోగించబడుటలేదు; వినియోగదారుల్ని చేరకముందే వస్తువుల ధరలు నిర్ణయించబడుతున్నవి. అందువల్ల సహజ యంత్రాన్ని తమ వ్యక్తిగత లాభాలకు ఉపయోగించుకునేవారి దయాదాక్షిణ్యాలమీద మొత్తం సమాజం ఆధారపడవలసి వస్తోంది. ఈ పరిస్థితినికముందు సాగనివ్వకూడదు. అందువల్ల గుత్తాధిపత్యాల నియంత్రణకు అవసరమైన చర్యలను ఆయన రచించాడు.

ప్రణాళికా రచన స్వభావాలు :

పరిమిత ప్రణాళికా రచనకు, సమగ్ర ప్రణాళికా రచనకు బేధం ఉన్నది. పరిమిత ప్రణాళికలో రచనలో ''కార్టెలైజేషన్'' ప్రాతిపదికమీద పారిశ్రామిక ప్రణాళికా రచన. ప్రాంతీయ, స్థానిక ప్రణాళికా రచనలు ఉంటాయి. సమగ్ర ప్రణాళికా రచనలో సోషలిస్టు ప్రణాళికా రచన, సోషల్-లిబరల్ ప్రణాళికా రచన (సాంఘిక ఉదార ప్రణాళికా రచన) ఉంటాయి. ఆర్థిక ప్రణాళికా రచనకు (Economic planning) ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థకు (Planned Economy) తేడాఉన్నది. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ సోషలిస్టు రాజ్యంలో మాత్రమే ఉంటుంది. మారిస్ క్లార్క్ కోరే ప్రణాళికా రచనలో ''సహేతుక పరిధులలో సాధారణ నియంత్రణ, వ్యూహాత్మక ప్రాధాన్యతగల కారకాల (factors) మీద పూర్తి నియంత్రణ ఉంటుంది. వ్యూహాత్మక ప్రాధాన్యత కారకాలను ఉదారవాద ప్రభుత్వం నడుపుతూ ఉంటుంది'' అని 'సోషల్ కంట్రోల్ ఆఫ్ బిజినెస్' (పే.464)లో వ్రాసాడు. అందువల్ల శాంతియుతంగా నడిచే ప్రణాళికా రచనలో క్లార్క్‌కు నమ్మకమున్నట్లు కన్పిస్తున్నది. ఈ ప్రణాళికా రచనక్రింద దేశంలోని ఉత్పాదక వనరులు, దేశంలోని ప్రజలందరికి మంచి జీవనస్థాయి ఏర్పడేటట్లుగా ఉపయోగించబడతాయి. 'నేషనల్ ప్లానింగ్ కౌన్సిల్'ను ఏర్పాటు చెయ్యాలని క్లార్క్ కోరాడు. జాతీయ ఆదాయాన్ని పెంచడానికి జాతీయ ప్రణాళికా సంఘము పని చేస్తుంది.

వ్యాపార చక్రాలు : లాభాలు :

వ్యాపార వ్యవస్థమీద బయటి శక్తులు పనిచేయడంవల్ల వ్యాపార చక్రాలు (Business Cycles) ఏర్పడతాయి. యుద్ధాలు, ఇన్వెన్షన్లు (Inventions), ధరలస్థాయి, విదేశీ వ్యాపారము మొ॥ బయటి శక్తులు వ్యాపారాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ శక్తుల ప్రభావంవల్ల వ్యాపార వ్యవస్థలో కొన్ని మార్పులు జరుగుతాయి. తత్కారణంగా లాభాలలోను, ధరలలోను, మూలధన సామగ్రిని పనిలో పెట్టడంలోను ఎగుడు దిగుళ్లు ఏర్పడతాయి, అందువల్ల వ్యాపార చక్రాలు ఆ పై జెప్పిన శక్తులు పనిచేయడంవల్ల, అవి వాటిలో అవి ఒకదానిమీద ఒకటి పనిచేయడంవల్ల ఏర్పడుతున్నవి. కేవలం పై జెప్పిన మొదటి పనులవల్ల గాని, రెండవ పనులవల్ల గాని మాత్రమే అవి ఏర్పడడం లేదు అని ''స్ట్రాటజిక్ ఫాక్టర్స్ ఇన్ బిజినెస్ సైకిల్స్'' (పే. 14)లో

వ్రాసాడు. వ్యాపారులు తమ వ్యాపారాన్ని వ్యాపార విజృంభణ (Boom) కాలంలో విస్తృతం చేస్తారు. వ్యాపారమాంద్యం (Depression) కాలంలో మందగింపచేస్తారు. వ్యాపారులు ఈ ప్రవృత్తివల్లనే అనిశ్చిత పరిస్థితులు ఏర్పడుతున్నవి. తాత్కాలిక లాభాలకంటె సాంఘిక ప్రయోజనాలు ఎక్కువ ముఖ్యమని గ్రహించేటట్లుచేసి వ్యాపార పరిస్థితులను స్థిరీకరణ (Stabilization) పొందేటట్లు చేయవలసి ఉన్నది. అందువల్ల వ్యాపారుల వర్గాలు ఔద్యోగిత, ఉత్పత్తి (Out put) మూలధన విస్తరణల విషయంలో నూతన విధానాలను రూపొందించవలసి ఉన్నది.

సోషల్ ఎకనామిస్టు :

జాన్ మారిస్ క్లార్క్ తన తండ్రి అయిన జాన్ బేట్స్ క్లార్క్ నిశ్చల ఆర్థిక శాస్త్రానికి (StaticEconomics) థోరెస్టెయిన్ వెబ్లిన్ చెప్పిన సంస్థాగత ఆర్థిక శాస్త్రానికి (InstitutionalEconomics) మధ్య నిలబడి సాంఘిక ఆర్థిక శాస్త్రాన్ని (SocialEconomics) రచించినట్లు చెప్పబడుతోంది.

మీ దగ్గరేమన్నా ఉంటే పంపండి! ప్లీజ్!

డాక్టర్ చెళ్ళపిళ్ళ సూర్యనారాయణమూర్తి

రమ్మంటే రావడంలేదు, రప్పించుకోడం ఎలా ?
ఎన్నిక్షణాల్నని ఇలా పట్టుకుని వేళ్ళాడేది —
ఏ తల్లీ కరుణించని అదృష్టంకోసం;

ఆ బ్రహ్మగాడు
కొందరి నుదుట అదృష్టాన్ని
వినుకొండ ముగ్గుతో రాస్తాడు కాబోలు —
ఊదితే సర్వం చెదిరిపోవడానికి;
దురదృష్టాన్ని ప్రింటింగ్ ఇంకుతో రాస్తాడు కాబోలు —
ఊదినా తడిసినా చెరక్కుండా ఉండడానికి.

ఎప్పుడూ ఎవర్నీ ఏ రకంగానూ బాధపెట్టలేదు
మరి ఎందువల్లనో నాకింతబాధ ?
అది కష్టాల్ని కట్టిపెట్టుకొని దండయాత్ర చేస్తోంది నామీద
ఆత్మఘోష బైటపెట్టుకోడానికి ఆత్మీయులెవరు
ఆత్మీయులను కొన్నవాళ్ళ
చేతిలో చెయ్యివేసినట్లుండి చెయ్యిచ్చి పోతున్నారు.

నా గుండె గూటిలో వాళ్ళకోసం
నే వెలిగించిన దీపాన్ని వాళ్ళే ఆర్పేసుకుని పోతున్నారు
వాళ్ళకి కావల్సింది వెలుగుకాదు చీకటే అన్న విషయం
మోసపోయాక కానీ తెలుసుకోలేకపోయా !
పవిత్రమైన ఆత్మల్ని పళ్ళకింద నొక్కిపెట్టి
నానాయాతన పెట్టే ధీరులు వారు
పైపై మాటల్ని పైకివదిలి
పైపై హోదాల్ని పెంచుకోదలచేవారు

వాళ్ళు అలా అయ్యారనీ
నానుంచి దూరమయ్యారనీ కాదు నా బాధ —
ఆత్మీయు డొక్కడూ లేడనే,
"జీవన రహదారిపై ఎందరో నడుస్తున్నా
తన గమ్య సాధనలో ప్రతిమనిషీ ఏకాకి"
అన్న నగ్న సత్యాన్ని యవ్వనంలోనే గ్రహించాల్సిన దురవస్థ
వచ్చిందనే.

బ్రహ్మగాడు — ఒహో ! బిద్దుగాడు !
పట్టుకుంటే వదలనే వదలడు !
సర్వనాశనం చేయదల్చుకుంటే చేసేదాకా ఊరుకోడు !
సర్వ సౌభాగ్యాలీయ దల్చుకుంటే ఇచ్చేదాకా ఊరుకోడు !
నన్ను పట్టుకుని సర్వనాశనం చేయదల్చుకున్నాడేమో !
కాకపోతే యవ్వనంలోనే ఒంటరిని చేసి — వేదాంతిని చేసి —
నన్ను బంతిలా తన్నడమేమిటి ?
ఎక్కడ వదలానో అని ఏడుస్తుంటే
నోళ్ళు మూసుకు కూర్చోడమేమిటి ?
అవును ! బ్రహ్మరాత నన్ను
శనిలా — బంకలా — ప్రింటింగ్ ఇంకులా పట్టుకొంది.

చెరపడానికి కావాలి, ఏదో ఒక నిరంజన కరి కావాలి !
మీదగ్గరేమన్నాఉంటే పంపండి ! ప్లీజ్ !
మీ సాయం మరవలేను ! నెవర్ ! నెవర్ !
అదృష్టం లేకపోయినా దురదృష్టాన్నన్నా వదిలించు
కుంటాను ! ప్లీజ్ !

శ్రీ నా. భక్తవత్సలరెడ్డి

నవ్యతాప్రయోక్త - నారాయణరెడ్డి

స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత కొంగొత్త రూపుల్తో, వికసించిన సుమ సౌరభాల్తో మత్తెక్కించే పైరగాలిలాగ, నిద్రించు వానిని సైతం తట్టి లేపే ఝుంఝూ మారుత పళయం లాగా దొర్లుతూ వుంది. 'వసంతంలో సహింపరాని గ్రీష్మహేమంత కాల కాళికలు' చూస్తూ, 'ఉషస్సులో భరింపరాని అంబువాహ సందోహ నిశాలి'ని భరిస్తూ తెలుగు కవిత కనబడుతూవుంది. ఒకపరి 'మాదీ మీ వూరే మహారాజా!' అంటూ పరామర్శిస్తూ, 'లే!' 'మార్చ్' అంటూ సాయుధ పోరాటానికి పిలుపు నిస్తూ కారాలు మిరియాలు మారుతూ వుంది. ఒక పక్క 'అగ్నిధార'లు కురిపిస్తూ, వేరొక పక్క 'పైలా పచ్చీసు' లాగా చలాకీగా పోతూ 'మధ్యతరగతి మందహాసం'ని 'అక్షరాల గవాక్షాలు'గుండా వీక్షిస్తూ 'మండుతున్న తరం'ని 'మరోహరివిల్లు' ద్వారా 'గమ్యం' చేరుస్తూ వుంది. విశాల భారతంలో 'విషాద భారతం'ని చూస్తోంది నేటి కవిత. 'గోడల వెనుక' దాక్కొన్న 'రేపటి వసంతం'కి సుస్వాగతం పలికేందుకు 'ఆలోచనాలోచనాల' ద్వారా 'మేల్కొన్న ఈ సమయం'లో తెలుగు కవిత హుందాగా సాగిపోతూవుంది. హుందాగా సాగిపోయే ఈ కవితలో నారాయణరెడ్డి గమ్యం సుగమ్యం, సుస్థిరం. ఆ విషయంని పరామర్శించటం ఈ వ్యాసోద్దేశం.

కవిత్వం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకొంటే, ప్రాచీన లాక్షణికులు చెప్పిన ఆలంకారిక లక్షణాల్ని వదిలిపెట్టి, ఆధునిక విమర్శకుల లక్షణాల్ని స్వీకరిస్తే మొట్ట మొదట మనకు కన్పించేవి రొమాంటిక్ కవుల నిర్వచనాలు. ఆంగ్ల సాహిత్య ప్రభావం కుత్తుక బంటిగా గల భారతీయ భాషలు దాని బిగి కౌగిలినించి రాలేక పోయాయి. కారణాలు ఏమయినా, భారతీయ భాషల్కి అది ఒక చైతన్యంని ప్రసాదించింది. వర్డ్స్‌వర్తు, కాలరిడ్జి "లిరికల్ బ్యాలడ్స్"ని 1798లో ప్రకటించారు, అందులో రొమాంటిక్ కవితా లక్షణాల్ని వివరించారు. ఈ ఆంగ్ల రొమాంటిసిజం ప్రకారం 'కవిత్వం' అంటే కవి కేవలం 'వూహించి' రాసేదికాదు. అలా అని వస్తువుని యధాతథంగా చిత్రించే వాస్తవిక రచనా కాదు. కవి ఒక వస్తువుని చూస్తాడు. వెంటనే అతని మనసులో ఒక కదలిక ఏర్పడుతుంది. కదలిక ఏర్పడ్డ తర్వాత ఆ వస్తువుని గురించి ఆలోచించడం/భావించడం జరుగుతుంది. ఆ ఆలోచన/భావనలవల్ల వస్తువుకి మనసులో ఒక బింబం గోచరమవుతుంది. అంతకు ముందు ఖాళీగావున్న మనసు, ఈ వస్తువుకి సంబంధించిన వూహల్తో/భావనల్తో నిండి పోతుంది. అంటే కనబడే వస్తువు, దాన్ని మననం చేయడంవల్ల గోచరమయ్యే బింబం, మనసు ఒకే పంక్తిలో వుంటాయి. ఇంకా వివరిస్తే, వస్తువు, బింబం, మనసు అనే వాటికి భేదమే వుండదు. ఈ సమయంలో ఇవి తమ ధర్మాల్ని కొన్నిటిని కోల్పోతాయి. దీనివల్ల వాస్తవిక ప్రపంచంలో వున్న వస్తువు తన వాస్తవ రూపాన్ని కోల్పోతుంది. మననంవల్ల సరికొత్త రూపుని సంతరించు కొంటుంది. ఈ సరికొత్త రూపు భౌతిక జగత్తు రూపం కన్నా విశిష్టమైంది. దాని అంత సౌందర్యాన్ని బయల్పెట్టుతుంది.

'ట్రాన్‌సెండెంటల్ మెడిటేషన్' చేసేవాడు కూడా సరిగ్గా ఇలాంటి అనుభూతినే పొందుతాడు. ధ్యానం ప్రారంభంలో అతని మనసులో, సర్పాలు వువ్వెత్తున పైకి లేచినట్టు, అనేక రకాల వూహలు బయలుదేరాయి. కొంతసేపు అలాగే మెడిటేషన్‌లో వుంటే, వూహలన్నీ తగ్గి, మనసులో ఒక నిశ్చలస్థితి గోచరిస్తుంది. ఆ నిశ్చలస్థితి నించే, యోగోపాసకుడు నిజమైన ఆనందాన్ని పొందుతాడు. ఆ లోకం భౌతిక లోకం కన్నా, వేరైందిగా వుంటుంది. అది అతనికి స్వర్గతుల్యం. దీన్నే సమాధ్యవస్థ అంటారు. అలాగే కవికి కూడా సమాధ్యవస్థ వుంటుంది. వస్తువుని చూస్తాడు. దానికి సంబంధించి అనేక కోణాల్ని ఆలోచిస్తాడు. వాటికొక స్థిరరూపం వుండదు. అపుడు, అలాగే మననం చేస్తూండటం వల్ల, వాటికొక బింబం స్థిరత్వం పొందుతుంది. మనసుని పూర్తిగా వశం చేసుకొంటుంది. దీన్ని కవి పొందే సమాధ్యవస్థగా గుర్తించొచ్చు. అలా మనసుని వశం చేసుకొన్న బింబం భౌతిక రూపం కన్నా వేరైనది; మేల్తరమైనది. ఆ బింబానికి అక్షర రూపం కల్గించేదే కవిత్వం.

దీన్ని కవిత్వంగా నిర్ణయించుకొంటే, ఈ కోవకి చెందిన కవుల్ని వేళ్లపై లెక్కించొచ్చు. ఆ కోవలోకి సునాయాసంగా చేరగల్గిన వాడూ, చేరినవాడూ నారాయణరెడ్డి.

నారాయణరెడ్డి ఒక విచిత్ర పరిస్థితిలో తెలుగు కవితా రంగంలో స్థిరపడ్డాడు. ఆంగ్ల రొమాంటిక్ ప్రభావ ప్రేరితంగా ఏర్పడ్డ భావ కవిత్వం లోపలి పుటల్లో దాక్కొనింది. అభ్యుదయ కవిత్వంలో — శ్రీశ్రీ, ఆరుద్ర లాంటి వారి చేతుల్లో వాస్తవిక రచనలు ఒకపక్క నిగ్గుతేలుతూ వున్నా, ఇంకొపక్క అనుకరణ రాయుళ్ల చేతిలో పడి అది కాస్త నలిగిపోతూ వుంది. అలాంటి పరిస్థితుల్లో నారాయణరెడ్డి తెలుగు కవితా కన్యని పరామర్శించాడు. సంప్రదాయం పేరుతో వచ్చే రచనల్నీ, భావ కవితా విహాయసంలో అక్కడక్కడా మినుకు మినుకు మంటున్న కవితల్నీ, వాస్తవికత

పేరుతో బండ్ల కొద్దీ దిగుమతి అయ్యే చొప్పదంటు కవిత్వాన్ని చూసి తన దారి వెతుక్కోసాగాడు.

1 అతని దృష్టిలో 'గతం వర్తమానం అనేదు బిడ్డకు ఇచ్చుస్తన్యం'. అంటే తల్లి తన బిడ్డకి పెరిగేందుకి, రక్షణకి ఎలా పాలనిస్తుందో అలాగే గతం వర్తమానంకి ఆధారమయిందని అతని సిద్ధాంతం. అయితే గతమంతా అనుసరణీయం కాదు. అలాగే వర్తమానం కూడా. గతంలోని మంచిని మాత్రమే తీసుకో, వర్తమానంతో దాన్ని జత చేసుకో, అనేది అతని ప్రతిపాదన. 'కావ్యలహరి' అన్న వ్యాససంకలనంకి 'సారసౌరభం' ని కూర్చుతూ ఇలా అంటాడు:

'అంత కడివెడు పాలపై ఒ
క్కింత మీగడ పేరినట్లుగ
మనకు మిగులును గతము లోపలి
మంచి; అదియే సంప్రదాయము.'

పాలని మరగిస్తే మీగడ పేర్తుంది. పాలన్నీ మీగడగా మారేందుకు వీలవుతుందా ? లేదు; కొన్ని మాత్రమే. అలాగే గతం అంతా అనుసరణీయం కాదు — కొంత మాత్రమే. మనకు కావాల్సింది అనుసరణ యోగ్యమైన 'మంచి' మాత్రమే. అది ఎక్కడున్నా, ఏ రూపంలో వున్నా, కాలభేదం విస్మరించి తీసుకోవాలనేదే అతని బలమైన ప్రవృత్తి. దీనిమీద ఆధారపడే నారాయణరెడ్డి కవిత్వం రాశాడు, రాస్తున్నాడు.

కవికి ప్రతిభ అవసరం. అదిఅతనికి సహజ సిద్ధంగావుంటుంది. ప్రతిభ అనేది కవిని సామాన్యమానవుణ్ణించి వేరుచేసి చూపిస్తుంది. మానవుడు సంఘజీవి. కవి సంఘంలోని మానవుడే కనుక అతనిపై సంఘ ప్రభావం వుంటుంది. వ్యక్తికి వయసు పెరిగే కొద్దీ తెలివి కూడా పెరుగుతుంది. మనసు బాల్యదశ నించి పరిపక్వ దశని చేరుకొంటుంది. అలాగే కవికి కూడా, అలా పరిపక్వ దశని చేరుకొన్న కవి మహాకవి కాగలడు. ఋయాట్స్‌ని గురించి చెబుతూ టి. ఎస్. ఎలియట్ ఇలా అంటాడు.

2 "There are two forms of impersonality; that which is natural to the mere skilful crafts man, and that which is more and more achieved by the maturing artist——The second impersonality is that of the poet, who, out of intense and personal experience is able to express a general truth, retaining all the particularity of his experience to make of it a general symbol".

కవి పలురకాల అనుభవాల్ని అనుభవించేందు వల్ల, అనేక విషయాల్ని తెల్సుకొనేందు వల్ల ఒకానొక నీతిని అందరికీ ఆమోద యోగ్యమైందిగా గుర్తిస్తాడు. అయితే అది అన్ని కాలాల్లోను ఒకటిగానే వుంటుందా ? వుండకపోవచ్చు. కాలం మారుతూంటుంది పరిస్థితులు మారుతుంటాయి. అలాగే ఒకనాడు ఆమోద యోగ్యమైన నీతి, ఇంకొనాడు కాకపోవచ్చు. కవి అన్ని కాలాల్లోను సంఘంని ప్రతిబింబిస్తూ వుండాలి. ఆ కాలంకి ఏ 'నీతి' వర్తిస్తుందో దాన్నే వివరిస్తూ వుండాలి. T. S Eliot–

3 '... For a man who is capable of experience finds himself in a different world in every decade of his life; as he sees it with different eyes, the material of his art is continually renewed. But very few poets have shown this capacity of adoptation to the years. It requires, indeed, an exceptional honesty and courage to face the change" అని అంటాడు.

దీన్ని బట్టి సంఘ పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొని, తమ కవితల్లో ప్రతిబింబించే వారు చాలా తక్కువనీ, ఎదుర్కోవాలంటే గుండె ధైర్యం, చేవ కావాలని తెలుస్తుంది. అలా రెండు గుణాలూ కలవాడు నారాయణరెడ్డి. పరిస్థితులకు అనుగుణంగా సంఘంని కవితలో ప్రతిబింబింప చేసినవాడు నారాయణరెడ్డి. అతను రాసిన కావ్యాల్ని పరిశీలిస్తే మనకీ విషయం తెలుస్తుంది. 'నవ్వని పువ్వు' నించి ఇప్పటి వరకు వచ్చిన అనేక కవితా సంకలనాల్లో విషయ వైవిధ్యం మనకు కన్పడుతుంది.

'నవ్వని పువ్వు' తర్వాత 'జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి' లాంటి పద్యగేయ సంకలనాలెన్నో వచ్చాయి. వస్తున్నాయి. వాటిలో విషయ వైవిధ్యమున్నా తనని నిలబెట్టేవి కావను

భారతి

చందా వివరములు

	ఏజంటుద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు. 1-50	-
6మాసములచందా	రు 9-00	9-60
సంవత్సరచందా	రు. 18-00	19-20

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు
నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 12-00

మేనేజరు
భారతి

కొన్నాడు. తన కవిత్వానికొక స్థిర రూపు కల్పించు కోవాలను కొన్నాడు. అందుకే 'నాగర్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాధనాయుడు' అనే **మూడు** కావ్యాల్ని మూడు రసాల్కి ఆలంబనంగా తీర్చి దిద్దాడు. సంప్రదాయ కవిత్వం క్షుణ్ణంగా అర్థం చేసుకొన్నావాడూ, ఆలంకారిక మర్మాలన్నీ ఆకళింపు చేసుకొన్న వాడూ కనుక పై కావ్యాల్లో రస పోషణ కావించాడు. సంప్రదాయ కవిత్వంలో వచ్చిన రచనల్ని మినహాయిస్తే, మిగిలిన ఏ రచనలూ ఆలంకారిక లక్షణ సమ్మతంగా రసపోషణ కల్గినవి కావు కేవలం సంప్రదాయ కవిత్వాన్నే కాదు ఆకళింపు చేసుకొంది. భావ కవిత్వాన్ని కూడా భావకవిత్వ లక్షణాల్లో 'మధ్యయుగవైభవస్మరణ' ఒకటి. అందుకని తన **మూడు** కావ్యాల్కి ఇతివృత్తాలుగా మధ్య యుగపు కథల్ని, తత్పూర్వ కథల్ని తీసుకొన్నాడు. బౌద్ధమత ప్రచారం జరిగే కాలంలో బుద్ధుని కథల్ని చెప్పేందుకు, శిల్పాల్లో చెక్కేందుకు నియమించబడ్డ శాంతిశ్రీ, పద్మదేవుల ప్రేమ, తత్పర్యవసానం — నాగార్జున సాగరంలోని కథ, కర్పూర వసంత రాయలులోని ఇతివృత్తం, పద్నాలుగో శతాబ్దిలో ఆంధ్రదేశాన్ని పాలించిన కుమారగిరిరెడ్డి (1386-1402), అతని ఆస్థాన నర్తకి లకుమాదేవిల ప్రణయానురాగం విశ్వనాథ నాయుడు 'మధుర'లో నాయక రాజ్య స్థాపకుడు. తన తండ్రి నాగమనాయుని ఎదుర్కొని, ఓడించి, రాజభక్తిని, నిరూపించుకొనుట ఇందలి కథ.

కాలం మారింది. దిగంబర కవుల సంపుటాలు వెలువడ్డాయి. పైగంబర కవులూ వాటితోబాటు వచ్చారు. మరికొంత కాలానికి విప్లవ రచయితలు పరుచుకపడ్డారు. సంఘం రకరకాల సమస్యల్తో నలగ సాగింది. భగభగ మండే అన్నార్తుల కడుపు మంటలొక పక్క, జీవిత సాగరాన్ని ఈదలేక అలమటించే మధ్య తరగతి ప్రజల మానసిక మంటలొక పక్క. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పండుకొనే అన్యోన్యం గల అన్నదమ్ముల్లో పడిపోవాలన్నంత ద్వేషం పొగలు కక్కుతూ తనువంతా ఆవరించ సాగింది. దేశంలో ఎచ్చట చూసినా మంటల రూపాలే కనబడసాగాయి. ఇలాంటి వాతావరణం కవిని వుత్తేజితుణ్ణి చేసింది. 'మంటలూ మానవుడూ' లాంటి వాటి అవసరం ఏర్పరచింది.

ఒకచోట [4] మాక్సిం గోర్కీ అంటాడు — కవియైన వాడికి ప్రతిభతో బాటు పుస్తక పఠనం **కూడా** వుండాలని. కవి ప్రతిదాన్నీ స్వయంగా అనుభవించలేడు. అది సాధ్యం కాదు కూడా — తనూ ఒక వ్యక్తే కనుక. పుస్తకాలు ఆ కొరతని తీర్చుతాయి. పుస్తక పఠనం వల్ల అనేక విషయాల్ని, సొంత అనుభవం కన్నా ఎక్కువగా అనుభవించేందుకి వీలవుతుందని గోర్కీ అభిప్రాయం. దానికి వుదాహరణ ప్రాయుడు డా. సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర సాగరాన్ని మథించాడు. అన్ని రకాల పుస్తకాల్ని అర్థం చేసు కొన్నాడు. ప్రాచీన అర్వాచీన భేదం లేకుండా అనేక కవి హృదయాల్ని ఎద హత్తించు కొన్నాడు. ఆ 'ఆధునికాంధ్ర కవితా స్వరూపము వికాసము' అతని కవితాహృదయాన్ని మలుపుల్లోకి తీసుకు పోయిందని చెప్పొచ్చు.

నారాయణరెడ్డి వాడిన వుపమానాల్లో సైతం వైవిధ్యం కన్పడుతుంది. తొలి దినాల్లో రచించిన జలపాతం, నవ్వని పువ్వులకి, నారాయణరెడ్డి గేయాలు, కావ్యాలూ కాలం నాటికి ఆధునికంగా వస్తున్న వచన కవితా సంకలనాలకి భేదం కన్పడుతుంది. వుదాహరణకు **సూర్యుడు** నాడూ, నేడూ వుదయిస్తూనే వున్నాడు. అస్తమిస్తూనే వున్నాడు. సంజ కెంజాయ అలముకొంటూనే వుంది. కాని నారాయణరెడ్డికి ఆనాడు తోచిన విధం వేరు; నేటి భావన వేరు. అది కాల మహాత్మ్యం అందామా? కాదు. అది **స్వీయా**నుభవ మహాత్మ్యం.

సంధ్యా సమయం

అస్తనార్యుడు చుంబ
నాత్మక క్రియ సల్ప
సంధ్యా లతాంగి రోష
కషాయ ముఖి యయ్యె

— నారాయణరెడ్డి గేయాలు

సూర్యాస్తమయం

అస్తగిరి మాటువి
న్యస్త దిన మణి బింబ
మూర పగ్గిన పండు
తీరుగా రాలినది

— నారాయణరెడ్డి గేయాలు

సూర్యుడు :—

గుండెపైన ఆశయనే
కుంపటితో పగలంతా
ప్రయాణించి చెమటోడ్చిని
బాటసారి సూర్యుడు
తాను పడిన శ్రమకు ధరణి
తగిన ఫలిత మివ్వకున్న
ఒకనాటికి సమ్మెచేయ
ని కూలీడు సూర్యుడు

— దివ్వెల మువ్వలు

సూర్యోదయం :

ముక్తవాహినిలా ప్రసరించే రక్తోషస్సు
మత్తోన్మాదం తలకెక్కిన భీరువుల్లా
శతధా చీలిపోతున్న కారు చీకట్లు
శతఘ్నుల్లా పేలుతున్న సహస్ర సహస్ర కిరణాలు
తూర్పు పొలిమేరలో 'నాట్' విమానంలా
దూసుకొస్తున్న మార్తాండ బింబం.

— ముఖాముఖి

ఇలాంటి వర్ణనలకి కేవలం భావనా శక్తి (ఇమాజినేషన్) మాత్రమే కాదు కావాల్సింది, నిశిత పరిశీలన కూడా. ఈ వుదాహరణాల్లో 'అస్తమించే సూర్యుడు' 'అర మగ్గిన పండు' వలె వున్నాడట. సంప్రదాయ వాసన ఎక్కువగా వున్నప్పటికీ 'ఆరమగ్గిన పండు' వూహ రావాలంటే, కవికి ప్రకృతిగత పరిసరాలతో, వస్తువులతో పరిచయం వుండాలి. ఆ పరిచయం కాస్త బలమైందిగా వుండాలి. ఇలాంటి వర్ణనలే కవిత్వానికి కావాలని వర్డ్స్ వర్త్, కాలరిడ్జి "లిరికల్ బాలాడ్స్" వుపోద్ఘాతంలో చెప్పారు. మొదటి వుదాహరణలో సంప్రదాయ వాసన, రెండో దానిలో ప్రకృతి పరామర్శ, మూడో గేయంలో అభ్యుదయ కవిత్వ ప్రేరణ, 'ఋఖాముఖి'లో బంగ్లాదేశ్ విమోచనోద్యమ ప్రతిబింబం కన్పిస్తుంది.

వస్తువులో, వుపమానాల ద్వారా భావనలో మార్పు తీసుకొచ్చినట్టుగానే నారాయణరెడ్డి ఛందస్సులో కూడా మార్పు తెచ్చాడు. 'జలపాతం' లాంటి వాటిని పద్యాల్లో రచించాడు. వాటికి కాలదోషం పట్టింది. అక్షర బద్ధ నియతమైన సంస్కృత వృత్తాల్లోనో, గణబద్ధమైన జాత్యుప జాతుల్లోనో, గాక, మాత్రా నియమబద్ధమైన గేయాల్లో రాయటం ప్రయోగమైంది. స్థిరరూపం దాల్చ లేదింకా, చెదురు మదురుగా కొన్ని గేయాల్ని తామా రాసినా, గేయానికి శాశ్వత్వం కల్పించటంకోసం గేయ కావ్యాల్ని రాశాడు.

నారాయణరెడ్డి దేన్ని చేపట్టినా, తప్పని సరిగా 'పాత కొత్తల' మేలు కలయిక కన్పడుతుంది. అలాంటిది గేయాన్ని నడిపించటంలో కూడా జరిగింది. భావకవులు గేయాన్ని నడిపించటంలో 'ఆదిప్రాస'ని వాడే మార్గాన్ని అనుసరించాడు. అభ్యుదయ కవులు ఒకటీ రెండు, మూడు నాల్గు పాదాల్కి అంత్యప్రాసల్ని వాడారు. నారాయణరెడ్డి ఒకటీ రెండు, మూడు నాల్గు పాదాల్కి 'ఆదిప్రాస'ని వాడుతూ, ఒకటీ మూడు, రెండూ నాల్గు పాదాల్కి 'అంత్యప్రాస'ని వాడాడు.

ఎపుడు వీచెడి గాడ్పే కద
ఎందుకో నేడంత వాడి ?
ఎపుడు కాచెడి వెన్నెలే కద
ఎందుకో నేడంత వేడి ?

— కర్పూర వసంతరాయలు

'మంటలూ మానవుడు'తో నారాయణరెడ్డి గేయాల నించి వచన కవితల్లోకి దూకాడు. అంతకు ముందు వచ్చిన కవితా సంకలనాల్లో చెదురు మదురుగా వచన కవితలు లేకపోలేదు. కాని పూర్తిగా వచన కవితలే కల్గిన మొదటి సంకలనం 'మంటలూ మానవడు', 'జాలిరత్నం', 'గాండీయం' గేయాల్లో రాసినా, వచన కవితా సంకలనాలే ఎక్కువ. తర్వాతి కాలంలో వచన కవిత నడకలో తనదైన దారిని ఏర్పర్చుకొన్నాడు. గేయాల్లోని ఆది, అంత్య ప్రాసల సహవాసం వచన కవితలో కన్పడుతుంటుంది.

[5] 'నవ్యత ప్రీతి నాలోన సహజ ప్రవృత్తి' అన్నది అతని అనుభవం. అదే అనుభవాన్ని తన కవిత్వానికి అన్వయించుకొన్న మనీషి నారాయణరెడ్డి. ఈ నవ్యత అతను తీసుకొన్న వస్తువులో, భావనలో, చందస్సులో కన్పడుతూ వుంది. అందుకే అంటుంటారు– నారాయణరెడ్డి 'జలపాతం'ని దర్శించినా, 'కర్పూర వసంత రాయలు'ని పరామర్శించినా, 'నవ్వని పువ్వు'ని నవ్వించినా, 'అజంతా సుందరి'ని పలకరించినా, 'దివ్వెల మువ్వలు'ని పలికించినా 'మంటలూ మానవుడు'కి అభేదం కల్పించినా, 'మార్పు నా తీర్పు' అని నిర్భయంగా చాటినా—అతని కవిత్వంలో తీక్ష్ణత కన్పడుతూనే వుంటుందని, చైతన్యం ప్రసరిస్తూనే వుంటుందని. [6] 'అర్థాలను గది నిడి వాహ్యాళి వెడలు శబ్దములు'కి గాక [7] 'భావం వెంట పరుగులెత్తే శబ్దాలు'కి చోటు కల్పించాడు, నవ్యతాప్రయోక్త అయిన డా॥ సి నారాయణరెడ్డి.

అధోజ్ఞాపికలు

1 చూడుడు: ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు: ప్రయోగములు – డా॥ సి. నారాయణరెడ్డి పుట: 6

2 On poetry and poets – T. S. Eliot Page: 255

3 Ibid – Page 257

4 On Literature – Maxim Gorky Page: 48

5 ఆధునికాంధ్ర కవిత్వము — డా. సి. నారాయణరెడ్డి పుట: 27

6 అక్షరాల గవాక్షాలు

7 ఉత్తర రామ చరిత్రము – భవభూతి.

శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

సాంప్రదాయేతర విద్యా విధానము : వయోజన విద్య

నేడు మన భారతదేశములో దాదాపు ఏడు లక్షల విద్యా సంస్థలు ఉన్నవి; దాదాపు 35 లక్షల మంది ఉపాధ్యాయులు మన సాంప్రదాయ విద్యా వ్యవస్థలో పని చేయుచున్నారు. పది కోట్ల మంది విద్యార్థులు విద్య నభ్యసించుచున్నారు; సగటున సంవత్సరమునకు ప్రభుత్వము రు. 25 0 కోట్లు విద్యా వ్యవస్థపై వ్యయపరచు చున్నది. కాని ఇంకను దేశములో సుమారు 60 శాతము ప్రజలు నిరక్షరాస్యులు. వారికి మన విద్యా విధానము నుండి ఏ విధమయిన లాభము చేకూరలేదు. ఆర్థికముగా నిమ్న వర్గములకు చెందిన బాల బాలికలలో 20 శాతము ఎన్నడు పాఠశాలలకు వెళ్ళియుండలేదు. పాఠశాలలలో ప్రవేశించిన వారిలో 5వతరగతి చేరునాటికి సుమారు 50 శాతము మంది, 8వ తరగతి చేరునాటికి 75శాతము మంది, 12వ తరగతి చేరునాటికి 85 శాతము మంది విద్యా వ్యవస్థనుండి విరమించుచున్నారు. విద్యా వ్యవస్థలో ప్రవేశించిన వారిలో నూటికి ఒక్కరు కూడా కళాశాలలలో డిగ్రీ తరగతుల వరకు చేరుటలేదు.[1] విద్యార్థులు విద్యా వ్యవస్థ నుండి మధ్యలో విరమించుటవలన విద్యా వ్యవస్థపై పెట్టు పెట్టుబడులలో అధిక శాతము వ్యర్థమగు చున్నది.[2]

మన రాజ్యాంగ నిర్మాతలు 1961 నాటికి 6–14 సంవత్సరముల వయసు కలిగిన బాల బాలికలెల్లరు నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యా విధానములో నుండునట్లు చేయవలెనని ధ్యేయముగా తలపెట్టిరి. గడువుదాటి దాదాపు రెండు దశాబ్దములు కానున్నను ఈ ఆశయము త్వరలో నెరవేరు సూచనలు కన్పించుటలేదు. ప్రాథమిక విద్యా రంగములో మనము సాధించిన ప్రగతి గురించిన వివరములు పట్టిక సంఖ్య 1 లో పొందుపరుపబడినవి.

పట్టిక సంఖ్య 1

స్వతంత్ర భారతదేశములో ప్రాథమిక విద్యాభివృద్ధి

	ప్రాథమిక విద్యాస్థాయి		మాధ్యమిక విద్యాస్థాయి	
	విద్యార్థుల సంఖ్య [లక్షలలో]	6–11 సం. ల వయసుగల జనాభాలో విద్యార్థుల శాతము	విద్యార్థుల సంఖ్య [లక్షలలో]	11–14 సం ల వయసుగల జనాభాలో విద్యార్థుల శాతము
1950–51	191.5	42.6	31.2	12.7
55–56	251.7	52.9	42.9	16.5
60–61	349.9	62.4	67.0	22.5
65–66	504.7	76.7	105.3	3[illegible].9
68–69	554.9	77.3	122.7	32.3
73–74	637.5	83.9	150.3	35.6
78 79 (ధ్యేయము)	782.1	97.1	215.8	47 1

మూలము : Five Year Plans

మొత్తము 6–14 సం. ల వయసు కలిగిన జనాభాలో విద్యార్థుల శాతము 1950–51 లో 32; 1960–61 నాటికి ఈ శాతము 60 అయినది. 1973–74 నాటికి 67 అయినది. 1977 78 లో 69 శాతము విద్యాలయాలలో నమోదయి ఉన్నట్లు అంచనా. 1982–83 నాటికి ఈ సంఖ్య 90 కావలె నని సంకల్పము.[3]

పట్టిక సంఖ్య 2
ప్రణాళికలలో ప్రాథమిక విద్యారంగము

(Elementary Level)

	ప్రాథమిక విద్యారంగమునకు కేటాయించిన/ఖర్చుచేసిన నిధి (రూ. కోట్లు)	మొత్తం విద్యారంగమునకు కేటాయించిన/ఖర్చుచేసిన నిధులు (రూ. కోట్లు)	శాతము
మొదటి పంచవర్ష ప్రణాళిక	85	153	56
రెండవ ప్రణాళిక	95	273	35
మూడవ ప్రణాళిక	178	589	30
ప్రణాళికా సెలవు సం. లు	65	322	20
నాల్గవ ప్రణాళిక	235	823	29
అయిదవ ప్రణాళిక	410	1285	32
ఆరవ ప్రణాళిక	900	1985	46

మూలము : Five Year Plans.

ప్రాథమిక విద్యా రంగములో సాధించిన ప్రగతి స్వల్పము కాదు. కాని సాధించిన అభివృద్ధి సంతృప్తికరము కాదు. దీనికి ముఖ్య కారణము ప్రాథమిక విద్యారంగమునకు తగినంత ప్రాధాన్యత ఈయక పోవుటయే. ఉదాహరణకు: మొదటి పంచవర్ష ప్రణాళికలో విద్యా రంగముపై వ్యయము చేయబడిన నిధులలో 56 శాతము ప్రాథమిక విద్యపై వ్యయము చేయబడగా, ఈ శాతము క్రమ క్రమేణా తగ్గుతూ అయిదవ ప్రణాళికలో 32 శాతమయినది. పంచవర్ష ప్రణాళికలో ప్రాథమిక విద్యా రంగమున కిచ్చిన ప్రాధాన్యత పట్టిక సంఖ్య 2లో విశదమగుచున్నది[4] ఆరవ ప్రణాళికలో ప్రాథమికవిద్యలో శీఘ్రగతిని పురోగతి సాధించవలెనను సంకల్పముతో 46 శాతము నిధులు కేటాయించిరి.[5]

సాపేక్ష ప్రగతిలో ప్రాథమిక విద్యా రంగములో విద్యార్థుల సంఖ్యలో అభివృద్ధి మరొక సంకేతము. 1950–51 నుండి 1973–74 వరకు ప్రాథమిక విద్యాస్థాయి విద్యార్థుల సంఖ్య సంవత్సరమునకు 5.4 శాతము కాంపౌండు అభివృద్ధి రేటు చొప్పున అభివృద్ధి కాగా మాధ్యమిక స్థాయిలో 7 1 శాతము, ఉన్నత పాఠశాల స్థాయిలో 8. 8 శాతము, ఉన్నత విద్యాస్థాయిలో 9. 7 శాతము చొ.న అభివృద్ధి చెందెను.[6] మిగిలిన వివరములకు పట్టిక సంఖ్య 3 చూడుడు.

పట్టిక సంఖ్య 3
పంచవర్ష ప్రణాళికా కాలములో విద్యాభివృద్ధి

[విద్యార్థుల సంఖ్యలో కాంపౌండు అభివృద్ధి రేట్లు]

కాలము	ప్రాథమిక విద్య	మాధ్యమిక విద్య	ఉన్నత పాఠశాల విద్య	ఉన్నత కళాశాల విద్య
మొదటి పంచవర్ష ప్రణాళిక	5. 6	6. 6	9. 0	11. 8
ద్వితీయ ప్రణాళిక	6. 8	9. 3	10. 0	3. 2
తృతీయ ప్రణాళిక	7· 6	9· 4	11. 7	10. 9
ప్రణాళికాసెలవు సం లు	2. 9	5. 1	7. 7	10 8
నాల్గవ ప్రణాళిక	8. 3	4. 1	5. 2	12. 1
అయిదవ ప్రణాళిక	4. 2	7. 5	5 7	9. 2
1950–51 1973–74	5. 4	7. 1	8. 8	9. 7

మూలము : అర్థ్జ్ఞాపిక (6).

ప్రాథమిక విద్యారంగములో సాధించిన ప్రగతి గణనీయమైన నప్పటికిని మిగిలిన రంగములతో పోల్చిచూచిన పై విధముగా చాలా అసంతృప్తి కరముగాను, బాగుగా వెనుకబడి యున్నట్లు తెలియుచున్నది.[7]

దేశము మొత్తముమీద అభివృద్ధి ఈ విధముగా నుండగ విభిన్న రాష్ట్రములలో ప్రాథమిక విద్యారంగము సమానముగా అభివృద్ధి చెందలేదు. కొన్ని రాష్ట్రములలో అభివృద్ధి మెండుగాను, మరికొన్ని రాష్ట్రములలో చాల అసంతృప్తికరముగాను ఉన్నది. పట్టిక సంఖ్య 4 లో ప్రాంతీయ అసమానతలకు సంబంధించిన వివరము లీయబడినవి.

పట్టిక సంఖ్య 4

విభిన్న రాష్ట్రములలో ప్రాథమిక విద్యా రంగము 1976-77

	ప్రాథమిక విద్య 6–11 సం.ల వయసుగల జనాభాలో విద్యార్థుల శాతము			మాధ్యమిక విద్య 11–14 సం.ల వయసుగల జనాభాలో విద్యార్థుల శాతము		
	బాలురు	బాలికలు	మొత్తము	బాలురు	బాలికలు	మొత్తము
ఆంధ్రప్రదేశ్	88.4	54 3	70.9	34.2	16.3	25.3
అస్సాం	76.6	53.9	65.4	43.0	26·8	35 0
బీహారు	83·1	33.8	59.1	37.0	11.1	24.5
గుజరాతు	111.9	75.9	94.4	53.0	30.4	42.0
జమ్ము–కాశ్మీరు	78.0	41.5	60.4	55.8	23.3	40.1
కర్నాటక	86.6	69.3	78.2	53.7	32.4	43.1
కేరళ	111.0	100.8	105.9	92.9	83.7	88.4
మధ్యప్రదేశ్	81.9	41.2	62.2	37.0	13.6	25.7
మహారాష్ట్ర	112.4	83.2	98.0	55.8	30.6	43.3
ఒరిస్సా	98.1	58.7	78.8	31.3	12.8	22.2
పంజాబు	113.3	100.2	107.1	59.7	40.7	50.9
హర్యానా	92.0	47.7	71.7	56.7	20.9	40.0
హిమాచల్‌ప్రదేశ్	113.5	78.6	96.4	73.8	30.2	52.4
రాజస్థాన్	86.8	31.9	60.4	39.1	11.0	21.5
తమిళనాడు	110.5	92.2	101.5	59.6	35.9	47.9
ఉత్తరప్రదేశ్	111.6	70.3	91.8	51.7	15.8	34.9
పశ్చిమ బెంగాల్	104.3	62.8	83.7	44.1	21.7	32.9
భారతదేశము	97.5	63.5	80·9	48.7	24. 5	37.0

మూలము : Selected Educational Statistics : 1976-77
(Ministry of Education, New Delhi, 1977)

1977 నాటికి అనగా స్వాతంత్ర్యము సాధించిన మూడు దశాబ్దముల పిదప కూడా మన దేశములోని వయోజనుల (14 సం॥ వయసుపైగల జనాభా) లో 62 శాతము నిరక్షరాస్యులయి ఉండుట శోచనీయమయిన విషయము. వయోజనులలో నిరక్షరాస్యత గురించిన వివరములు క్రింది పట్టిక (సంఖ్య 5)లో పొందుపరుపబడినవి.

పట్టిక సంఖ్య 5

వయోజనులలో నిరక్షరాస్యత

	నిరక్షరాస్యత శాతము	నిరక్షరాస్యుల సంఖ్య [కోట్లలో]	అక్షరాస్యత శాతము
1951	80.74	17.39	19.26
1961	72.24	18.70	27.76
1971	65.92	20 95	34.08
1977 [అంచనా]	62.00	22.65	38.00

మూలము : A. Bordia : "The National Adult Education Programme" Yojana (1 Oct, 78).

1951 నాటి కంటె నేడు మన దేశములో నిరక్షరాస్యుల సంఖ్య రెట్టింపు అధికముగా ఉన్నదని తెలియుచున్నది.[9]

ఈ విధముగా దాదాపు 60 శాతము వయోజనులకు మన సాంప్రదాయ విద్యా విధానము వలన ఏ విధమయిన లాభము కలుగక పోవుట, దాదాపు 20 శాతము (6 – 14 సం.ల వయసుగల జనాభాలో) బాల బాలికలు ఈ విద్యా విధానములోనికి ప్రవేశించలేక పోవుట ప్రవేశించిన వారిలో దాదాపు 75 శాతము 8 వ తరగతి చేరక ముందుగనే విద్యా విధానము నుండి విరమించుట — మొదలయిన విషయములను పరికించి చూచినపుడు ఎవరికైనను మన విద్యా విధానముపై ఆగ్రహము రాక మానదు. శ్రీ జె. పి. నాయక్ మన ప్రస్తుత విద్యా విధానము ప్రజలను విద్యావంతులుగ చేయుటకు కాక, ప్రజలను విద్యావంతులుగా తయారుచేయకుండుటకు తోడ్పడుచున్నదని తీవ్రముగ విమర్శించిరి. ఈ విధముగా మన సాంప్రదాయ విద్యా విధానము మన రాజ్యాంగము, ప్రణాళికల ధ్యేయముల కనువుగా లేకపోవుటవలన సాంప్రదాయ విద్యా వ్యవస్థపై పలువురు విద్యావేత్తలు ధ్వజమెత్తిరి.[10] కొందరు విద్యావేత్తలు సాంప్రదాయ వ్యవస్థకు వ్యతిరేకముగా కాక, దానికి తోడుగా సాంప్రదాయేతర విద్యా పద్ధతి (Non – Formal System of Education) ఆవశ్యకత కలదని భావించిరి.[11]

సాంప్రదాయేతర విద్యా విధానంలో 'విద్యాలయాల'లో విద్యాభ్యాసం చేయనవసరం లేదు. ప్రత్యేకంగా నియమింపబడిన ఉపాధ్యాయులు, నిర్ణీతమయిన పాఠ్యాంశములు వగైరాలు కనిపించవు. ఉదా

Statement about Ownership and other particulars about newspaper

BHARATI

FORM IV (See Rule 8)

1. Place of Publication : VIJAYAWADA
2. Periodicity of its Publication : MONTHLY
3. Printer's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 8-2-322, Banjara Hills, Hyderabad 500 034.
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 8-2-322, Banjara Hills Hyderabad 500 034.
5. Editor's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 8-2-322, Banjara Hills Hyderabad-500 034.
6. Names and address of individuals who own the newspaper and partners or share holders - holding more than one percent of the total capital.
   1. Name : S. Kamakshamma
      Address : 16, Luz Avenue Mylapore, Madras-600 004.
   2. Name : S. Radhakrishna
      Address : 8-2-322 Banjara Hills, Hyderabad 500 034.
   3. Name : S. Nageswara Rao
      Address : 16, Luz Avenue, Mylapore, Madras-600 004.
   4. Name : S. Rajeswari
      Address : 8-2-322, Banjara Hills, Hyderabad-500 034.
   5. Name : S. Seshamma
      Address : 16, Luz Avenue, Mylapore, Madras 600 004.
   6. Name : S. Sreeramamurty, Trustee, Kasinadhuni Nageswara Rao, Sivalenka Sambhu Prasad Dharma Nidhi.
      Address : 14/15, Luz Church Road Mylapore, Madras-600 004.
   7. Name : Dr. P. S. N. Murthi
      Address: P O. Yellamanchili Vizag Dt.
   8. Name : S. Ramayamma
      Address : 16, Luz Avenue, Mylapore Madras-600 004.
   9. Name : P. Satyanarayana
      Address : C/o Allied Sales, 183 184, Rashtrapathi Road, Secunderabad.
   10. Name : D. Subba Rao
       Address : 16 Luz Avenue: Mylapore, Madras-600 004.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1—3—1979

S. RADHAKRISHNA,
Signature of Publisher.

హరణకు గ్రంథాలయాలు, రేడియోలు, టెలివిజన్లు, వార్తా పత్రికలు, వస్తు ప్రదర్శనలు, వస్తు సంగ్రహాలయములు మొద లయినవి సాంప్రదాయేతర విద్యా విధానంలో విద్యా వ్యాప్తికి ఉపక రించే పరికరాలు. ఒక విధంగా చెప్పాలంటే జీవనం కోసం ప్రత్యే కంగా విద్యాభ్యాసం చేయటం కాకుండా, నిత్యజీవనం ద్వారా ఎన్నో విషయాలు తెలిసికొనుటయే సాంప్రదాయేతర విద్యా విధానంయొక్క ముఖ్య లక్షణం. ఈ విధంగా చూచినపుడు సాంప్రదాయేతర విద్యా విధానం క్రొత్తది కాదని, అనాదిగా మనం అనుసరిస్తున్న విధానం అని, సాంప్రదాయ పద్ధతి దాని కంటె క్రొత్తదని తెలుస్తున్నది.

ఆర్థికంగా బాగుగా అభివృద్ధి చెందిన దేశాలలో సాంప్ర దాయేతర విద్యా విధానం గురించి ప్రజలుగాని, ప్రభుత్వంగాని అవస రశ్రమ పడనవసరంలేదు. కాని ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో సాంప్రదాయేతర పద్ధతికి విశిష్టస్థానం ఉంది.

సాంప్రదాయ విద్యా విధానంలో సగటు విద్యార్థిపై తల్లి దండ్రులకు అగు ఖర్చు చాలా ఎక్కువ; ప్రభుత్వానికి కూడా ఖర్చు ఎక్కువే! కాబట్టి ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు తమ పిల్లలను పాఠశాలలకు పంపలేక పోదురు. ప్రభుత్వము కూడా తగిన సౌకర్యా లతో కావలసినన్ని విద్యాలయాలు స్థాపించలేదు. సాంప్రదాయ విధా నంలో దాదాపు ప్రతి స్థాయిలోను పగలు అంతా విద్యాలయాలలో ఉండవలసి వస్తుంది. ఇది ఆర్థికంగా నిమ్న వర్గీయులకు సాధ్యం కాదు. పగలు ఎంతో సమయం గృహ కార్యాలతోను, కూలి పనులు వగైరాలతోను గడచిపోతుంది. అంటే విద్యార్థికి సాంప్రదాయ విద్యా విధానంలో కేవలం ప్రత్యక్ష వ్యయము (Direct cost) మాత్రమే కాక పరోక్ష వ్యయము (Opportunity cost) కూడా చాలా ఎక్కువ.

సాంప్రదాయేతర విద్యా విధానంలో ఈ బలహీనతలు కని పించవు. ఈ పద్ధతి వలన కలుగు కొన్ని ముఖ్య లాభాలు ఈక్రింది విధంగా పేర్కొనవచ్చు :

(i) సాంప్రదాయ పద్ధతిలో అగు వ్యయము కంటె సగటున విద్యార్థికి సాంప్రదాయేతర విద్యా పద్ధతిలో చాలా తక్కువ ఖర్చగును.

(ii) సాంప్రదాయేతర పద్ధతిలో విద్యార్థులు పగలు తమ గృహ కార్యక్రమములు, కూలిపనులు వగైరాలు చేసికొన వీలగును. సాయం సమయములందు, రాత్రులందు విద్యాభ్యాసము చేయవచ్చు.

(iii) 6–14 సం. ల వయసుగల పిల్లలు సాంప్రదాయ పద్ధతివలె కాక వయసు తెలివి తేటలబట్టి ఏ తరగతి నందయినను చేరవచ్చును.

(iv) సాంప్రదాయేతర పద్ధతిలో పిల్లలకు నిర్ణీతమయిన పాఠ ములే కాక ముఖ్యమయిన ఇతర విషయముల గురించి వారి పనులకు అవసరమగు విషయముల గురించి కూడా బోధించు టకు వీలగును. వారిలో సామాజిక, వైజ్ఞానిక దృక్పథము పెంపొందించుటకు సాంప్రదాయ పద్ధతిలో కంటె సాంప్ర దాయేతర పద్ధతిలో ఎంతయినా వీలు కలదని పలువురు భావించుచున్నారు.

(v) సాంప్రదాయ పద్ధతిలో విద్యాభ్యాసం దాదాపు 15 – 20 సం. లు పడుతుంది ఆ పిదప మాత్రమే అభ్యసించిన విద్య ఉపయోగించబడుతుంది. విద్యకు ప్రతిఫలం అపుడు లభి స్తుంది. కాని సాంప్రదాయేతర పద్ధతి ద్వారా విద్యాభ్యాసం చేసినపుడు ఆ విద్య వెంటనే ఉపయోగపడటం ప్రారంభ మవుతుంది.[12]

సాంప్రదాయ పద్ధతిలో సాధించలేకపోయిన ప్రణాళిక ధ్యేయాలు సాధించటం మన దేశంలో సాంప్రదాయేతర విద్యావిధానం యొక్క ప్రధానోద్దేశ్యం. ఉదాహరణకు నర్సరీ స్థాయిలో విద్యా విధానం పూర్తిగా సాంప్రదాయేతర విద్యా విధానంలో కొనసాగించ వలె. నిర్బంధ ఉచిత ప్రాథమికవిద్య, విద్యాలయాల నుండి మధ్యలో నిరమించిన బాలబాలికలు నిరక్షరాస్యులుకాకుండా చూడుట, వయో జన విద్య, అక్షరాస్యతా వ్యాప్తి. ఉన్నత పాఠశాల, విశ్వవిద్యాలయాల స్థాయిలోని బలహీనతల కారణంగా ఉన్నత విద్యాలయాలలో ప్రవే శించ లేనివారికి విద్య నొసంగుట మొదలయినవి సాంప్రదాయేతర విద్యా విధానంయొక్క ముఖ్యఆశయాలు. వీటిలో ప్రాథమికవిద్యకు, వయోజన విద్య ద్వారా నిరక్షరాస్యతా నిర్మూలనకు అధిక ప్రాధాన్యత ఈయవలెనని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ రెంటిలోను వయో జన విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చుట గమనార్హము.

కొఠారి కమీషన్ వారి నివేదిక ననుసరించి 1968 జాతీయ విద్యా విధానమునకు సంబంధించిన తీర్మానములో వయో జన విద్య ఆవశ్యకత ఎంతగానో పేర్కొనడం జరిగింది. కాని పేర్కొనదగిన కృషి మాత్రం జరుగలేదు. అయిదవ పంచవర్ష ప్రణాళిక ప్రారూపము (Draft) లో వయోజన విద్య ఆవశ్యకత గుర్తింపబడింది. 15–25 సం.ల వయసు గలిగిన నిరక్షరాస్యుల (దాదాపు 50 మిలియన్లు) లో కనీసము 2 మిలియన్ల మందిని అక్షరాస్యులుగా చేయవలెనని అయిదవ ప్రణాళిక ఆశయము. కాని పెద్ద ఎత్తున నిధులలో కేటాయింపు జరుగలేదు.

జాతీయ వయోజన విద్యాకార్యక్రమం పేరిట పూజ్యబాపూజీ జయంతి (అక్టోబరు 2, 1978) నుండి ఈ కార్యక్రమం భారీ ఎత్తున ప్రారంభమయింది. సగటున వ్యక్తికి రు. 60 – 80 లు ఖర్చగునని ప్రభుత్వము అంచనా. తదనుగుణముగా ఆరవ ప్రణాళి కలో వయోజన విద్య పేరిట రు. 200 కోట్లు కేటాయించ బడింది. అంతకు ముందెన్నడూ ఇంత పెద్ద నిధులు వయోజన విద్యకు కేటాయించబడలేదు.

పట్టిక సంఖ్య 6
వయోజన విద్యకై ప్రణాళికా నిధుల కేటాయింపు / వ్యయము

	నిధుల వ్యయము/ కేటాయింపు (రు. లు కోట్లలో)	విద్యారంగముపై వ్యయపరచిన/ కేటాయించిన నిధులలో వయోజన విద్యకై కేటాయించిన / వ్యయము చేసిన నిధుల శాతము
మొదటి పంచవర్ష ప్రణాళిక	5	3.3
రెండవ ప్రణాళిక	4	1.4
మూడవ ప్రణాళిక	2	0.3
ప్రణాళికా సెలవు సం. లు	2	1.0
నాల్గవ ప్రణాళిక	5	1.0
అయిదవ ప్రణాళిక	18	1.4
ఆరవ ప్రణాళిక	200	10.2

మూలము : Five Year Plans.

ఆరవ ప్రణాళికలో వయోజన విద్యకు జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో ప్రధాన స్థానము కల్పించబడింది.[13] 1983-84 నాటికి దేశములోని కనీసము 10 కోట్ల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చవలెనని సంకల్పము. వయోజన విద్యా వ్యాప్తిపై గురించి ప్రభుత్వము వారి అంచనాలు పట్టిక సంఖ్య 7 లో చూపబడినవి.

పట్టిక సంఖ్య 7
వయోజన విద్యా వ్యాప్తి

	వయోజనుల సంఖ్య (లక్షలలో)	పెరుగ గా కలుపబడిన మొత్తము (లక్షలలో)
1978-79	1.5	1.5
1979-80	4.5	6.0
1980-81	9.0	15.0
1981-82	18.0	33.0
1982-83	32.0	65.0
1983-84	35.0	100.0

మూలము : అధోజ్ఞాపిక (14).

ఈ జాతీయ వయోజన విద్యా కార్యక్రమముయొక్క ప్రధాన ఆశయములు మూడు :

(i) వయోజనులలో అక్షరాస్యత, కనీస అవసరమగు గణిత జ్ఞానము కల్పించుట.

(ii) వయోజనులకు వారివారి వృత్తులకు సంబంధించిన విషయముల గురించి కూలంకషముగా తెలియజేయుట.

(iii) అభివృద్ధి సమస్యలు, ఆరోగ్యము, ఉపాధి కల్పన, కుటుంబ నియంత్రణ, విద్య మొదలగు విషయములకు సంబంధించి ప్రభుత్వ విధానములు, వాటి ఆచరణ, చట్టములు, పౌర బాధ్యతలు మొదలగు వాటి గురించి తెలియచేసి వయోజనులలో సామాజిక చైతన్యము కల్గించుట.

గ్రామీణ ప్రాంతములకు, స్త్రీలకు, నిమ్న వర్గముల వారికి ఈ కార్యక్రమము బాగుగా ఉపయోగపడవలెనని ఈ విధముగా సాంప్రదాయ పద్ధతి ద్వారా విద్యాభ్యాసము చేయలేని వారికి ఈ కార్యక్రమము వలన లాభము చేకూర వలెనని ఆశయము. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామీణ యువకులు, పదవీ విరమణ చేసిన వారు, వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందినవారు, సమాజ సేవకులు వయోజన విద్యా కార్యక్రమములో ప్రధాన పాత్ర వహించెదరు. వారి కృషిపై ఈ కార్యక్రమము విజయవంతమగుట ఆధారపడియున్నది.

అధోజ్ఞాపికలు

1 Citizens for Democracy (1978) : Education for our People (New Delhi, Allied).

2 Jandhyala B. G. Tilak & S. N. Mishra (1978) : "Wastage and stagnation in Primary and Middle Level Education : A case Study of Six North Indian States" (Paper Presented in the unesco – sponsored National Training Seminar on 'Methods for Projecting School Enrolment' (New Delhi, National Staff College for Educational Planners and Administrators) చూడుడు.

3 Draft Five Year Plan 1978 – 83 (New Delhi, 1978).

4 ప్రణాళికలలో విద్యారంగమునకిచ్చిన ప్రాధాన్యత కొరకు

(i) Jandhyala B. G. Tilak (1977) : "Education in the Five Year Plans", Eastern Economist (April 15, 1977),

(ii) జంధ్యాల బాలగంగాధర తిలక్ (1978) : "స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధి". భారతి 55/2 (ఫిబ్రవరి, 1978) పు. 49 54 చూడుడు.

5 ఆరవ ప్రణాళికలో విద్యారంగమునకిచ్చిన ప్రాధాన్యత కొరకు Jandhyala B. G. Tilak (1978) : "Education in

the Sixth Plan" (unpublished manuscript) చూడుడు.

6 R. Datt (1977) : "Trends of Enrolment, Out-lays and Future Educational Policy." Paper Presented in the workshop on 'Alternative Educational Futures' (New Delhi, NCERT)

7 H. N. Pandit (1977) : "Indian Educational System : Top Heavy and Bottam Weak" (New Delhi, NCERT) లో మరికొన్ని ఆసక్తిదాయకమగు విషయములు పేర్కొనబడినవి.

8 National Adult Education Programme : An Outline (Ministry of Education, New Delhi, 1978).

9 నిరక్షరాస్యత గురించిన మరికొన్ని వివరములకు జంధ్యాల బాలగంగాధర తిలక్ (1977): "అక్షరాస్యత : అభివృద్ధి" భారతి 54/6 (జూన్,1977) పు.25–28 చూడుడు.

10 ఉదాహరణకు.
(i) Ivan Illich (1971) : Deschooling Society Penguin)
(ii) E. Reimer (1971) : School is Dead (Penguin).
(iii) I. Berg (1970) : Education and Jobs : The Great Training Robberys (Penguin).
చూడుడు.

11 J. P Naik (1977) : Some Perspectives on Non-Formal Education (Bombay, Allied).

12 పైన పేర్కొన్న గ్రంథమునే చూడుడు.

13 జంధ్యాల బాలగంగాధర తిలక్ (1978) : "ఆరవ ప్రణాళిక : కనీస వసతులు", భారతి 55 / 11 (నవంబరు, 1978) పు. 38–43లో కనీస వసతుల కార్యక్రమము గురించిన వివరములు విపులీకరించబడినవి.

14 అథోజ్ఞాపిక 8 చూడుడు.

విలయ తాండవమ్

హెచ్చార్కె

నాకు జ్ఞానోదయమైంది.
బోధి వృక్షమూ, దేవదూతా లేకుండానే
నాకు జ్ఞానోదయమైంది —
సమస్యల మంటల మధ్య తపసించి, తపించి
ప్రపంచమనే పాల సముద్రాన్ని మథించి, మథించి
కామినినీ, చందమామనూ తిరస్కరించి
జనం కోసమని హాలా హలాన్ని
నా కంఠంలో బిగించాను.
ఎవ్వరూ నాపై జాలి చూపకండి.
అయ్యయ్యో, అబ్బా మీ
గొంతుకలో విషం యిరుక్కుందాపాపం
అనకండి,
చాతనైతే, చేవ వుంటే
ఈ విషాన్ని పంచుకోండి; రండి —
నాతో కలిసి, వియద్గంగ కోసమని
విలయ తాండవానికి
అడుగులు కలపండి;
గుండెల ఢమరుకాలు మ్రోగించండి.
ఆవేశం పాలల్లో దిగులు నీళ్ళు కలపకండి
కత్తిమొనమీద రక్తపు చుక్కను డైల్యూట్ చేయకండి.
ఇప్పుడు మీరిక మ్రోగించండి డప్పులు
ఇప్పుడు చెరగండి మీ కన్నులలో నిప్పులు.

వేడిలేని నిప్పు

రామకృష్ణ కటాక్ష

శ్రీకాకుళ సాంద్ర తమా టవుల్లో
రగిలింది ఓ నిప్పు కణం;
కాల రాక్షసి పద కదన విన్యాసంతో
పండి — ఎండి — పతనమైన పత్ర సహకారంతో
ఎండిన చెట్ల గుండెలనుండి
రగిలింది మహోజ్వల భీకర దావాగ్ని;
జ్వాలారుణారుణ అయో మండల
మైంది భయంకర కీకారణ్యం;

తినమరిగిన తోడేళ్లు
దోచుకొనే సింహాలు
జిత్తులమారి నక్కలు
కాకా బాకాల కాకులు
గుండె లరచేత చిక్కబట్టుకొని
కకావికలై కాలికి బుద్ధి చెప్పాయి.

చిన్నచెట్లు తలెత్తనీని పెద్దచెట్లు
దట్టంగా బలిసిన ముళ్లచెట్లు
పరరక్తపాన మత్త చెత్త జంతుజాలాలు
అరచి — అరచి — అల్లాడి
కాలి ... కాలి ...
మసి — మసిగా ... మాడి ... మాడి
బూడిదైనాయి;

వానితోపాటు ...
సుమయుత లతా మంటపాలు
సుమధుర రసభరిత వృక్షాలు
మండి — మాడి — మసి అయినాయి;

అలా ... ఆ దావాగ్ని
అన్ని పర్వతాలకు వ్యాపించి
క్రూరమృగ జంత నాశంచేసి

ఆ యటవీ సామ్రాజ్యాన్ని నిష్కంటకం చేయాలని,
ఆ తరువాతి కొత్త తరంలో
తుపాను తర్వాత వచ్చే ఆ ప్రశాంతలో
మహోజ్వల భవిష్యత్తుకు బంగరు బాట వేయాలని
ఆ యటవి సమతాఫల వృక్ష మయం కావాలని,
గాలి, నీరు, వెలుతురు అన్నిటికి హక్కు కావాలని,
అటవీ సౌభాగ్యం దశ దిశల వెలుగొందాలని
ఆశించాను ... ఆకాంక్షించాను.

కాని ... కాని

నీరస అల్ప జంతు మాంస ఖాదులైన బెబ్బులులు
మద మాతంగ మాంస రక్త ఘుక్కులైన సింహాలు
టక్కు టమారాల జిత్తుల నక్కలు
వలపన్ని ఆ దావాగ్నిని అరికట్టాయి.
ఏ అకిలునికి అనలుడు బంధువో
ఆ గాలి ఆ యగ్ని వెన్ను పొడిచింది;
దశ దిశల తన్నుదాను ఉపసంహరించుకొని
భీకర జ్వాలా జిహ్వల నరికేసింది;

ఏనీరు ఆ దావాగ్నికి జన్మబంధువో
ఆ నీరే ఆ దవానల కీలల రూపుమాపింది.
వడగళ్ల గుళ్ల వర్షం కురిపించి
ఆ యగ్ని గుండెల తుత్తునియలుగా
చీల్చి ... చీల్చి ... చెండాడింది.
ఆ దావాగ్నికి బెదరి — చెదరి ఊళ పెట్టిన నక్కలు
మీసాలు మెలిపెట్టినవి.

తలవంచి తోకముడిచిన సింహాలు జూలు విదల్చ
కొత్త కొత్త గర్జనా నినాదాలతో ముందుకొచ్చినవి
భీరువులై వెరచి పరచిన బెబ్బులులు
ఓంప్రడింత గాండ్రింపులతో తిరిగివచ్చినవి.

తిరిగి ... అవే ... వేర్వేరు పేర్లతో
వేర్వేరు గద్దె లెక్కినవి.

ఆ యరణ్యంలో ప్రజాస్వామ్యంపేర తిరిగి ప్రభుత్వం వెలిసింది.
మళ్లీ పరిశ్రమకు ఫలితం
మేధకు ఆదరణ లభించనికాలం ప్రారంభమైంది.
పాత చరిత్రే పునరావృతమైంది.

అందుకే ఆనాడు ఆశీర్వదించిన నేను
కాలనుగుణంగా మారి
కణ కణ లాడుతున్న
వేడిమిని పోగొట్టుకున్న
ఆ దావాగ్ని నిప్పు కణికలకేసి
ఈనాడు
నిర్వేదంతో
నిస్తేజంగా
నిర్వీర్యంగా
చూస్తూ
నిలబడిపోయాను.

అశ్రుధార

మళయాళ మూలం :

భక్తకవి పి. కుఞ్ఞిరామన్ నాయర్

తెలుగుసేత :

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
శ్రీ సి. అమ్మినికుట్టి

[తన 72 వ ఏట మే నెల చివరి వారంలో పరమపదించిన భక్తకవి పి. కుఞ్ఞిరామన్ నాయర్ (1906-1978) శ్రీ జి. శంకర కురూప్ తరువాత చెప్పుకోదగ్గ సుప్రసిద్ధ ఆధునిక మళయాళ కవి. 'పూక్కళమ్', (పూలతివాచి), 'అనంతన్ కాట్టిల్' (అనంతన్ అడవిలో), 'అంతిత్తిరి' (చివరి వత్తి), 'కళియచ్ఛన్' (నట బృంద నాయకుడు) మొదలైన ఆయన ఖండ కావ్య సంపుటులు బహుళ ప్రజాదరణ పొందినయి. 'ఒరు కవియుటె కాల్ పాటుకళ్' (ఒక కవి అడుగు జాడలు) అనే ఆత్మకథ కూడా ఆయన వ్రాశారు.

మళయాళ కవిత్రయంలో ఒకడుగా ప్రసిద్ధి పొందిన మహాకవి ఉళ్ళూర్ (1872-1949) చనిపోయినప్పుడు ఆయనమీద శ్రీ కుఞ్ఞిరామన్ నాయర్ కరుణరస భరితమైన ఒక చరమగీతం (elegy) వ్రాశారు. 124 పంక్తులు గల ఆ చరమ గీతంలోని అవతారికా భాగానికి తెలుగు ప్రతిధ్వని ఇది. ఏ మహాకవి పరమ పదించి నప్పుడయినా స్మరించదగినవి ఈ పంక్తులు.]

క్షణములో త్రుళ్ళి తునియలై మునిగిపోయె
సవిత నడిపెడు పెను నౌక జలధిలోన -
పంకమున బుంగి మరుగయ్యె పంటకాల్వ
నుడుపతి సరంగయిన వెండి పడవ త్రుటిని!

వారి గర్భాన మలగె నంబరపు హ్రదము
దరియ నీదులాడెడు లసత్తార కాళి
భూమి కుంగిన దింకె నంభోధులెల్ల —
ఒరిగి కంపించి పోయె భూధరములెల్ల!

ఏదొ ఐంద్రజాలికమా సూత్రమింత కదల
మారిపోవును రంగ నిర్మాణ మెల్ల —

ఆన లేదుగదా సుంత మానవులకు
రంగ భూమి నే పథ్యమ్ము తొంగిచూడ!

నిభృత వాసంత గానమ్ము నిలిచి పోవ
చైత్ర యామినుల సొబంగు సన్నగిలగ
ఒలికిపోవు నాశాపాత్ర ఒడ్డగిల్లి
అదరి అసురుసురౌను సింహాసనమ్మె!

మారిపోవు మెల్లగ 'ప్రాత'-మరొక కుంచె
చేత విశ్వమహాకవి స్వీకరించు!

శ్రీ కుంటిముక్కల లక్ష్మీనారాయణశర్మ

మరో 'లా' ఉందా?

నిత్యజీవితంలో మానవుడు వ్యవహార పరిస్థితులను ఎదుర్కోవడానికి భాషాసామగ్రిని పలురకాలుగా ఉపయోగించుకుంటాడు. అవసరాలకు అనుగుణంగా ఒక్కోసారి ఒకే అర్థం (లేదా సమానార్థాన్ని) నాలుగయిదు పదాంశాలద్వారా వ్యక్తపరిస్తే మరొకమారు ఒకే పదాంశాన్ని భిన్నార్థాలకు ఆలవాలంగా ప్రయోగిస్తాడు. రెండవ విధానాన్ని భాషాశాస్త్రంలో సారూప్యతగా గుర్తిస్తూ పదాంశాల్ని సారూప్యపదాంశాలుగా వ్యవహరిస్తారు. ఉదాహరణకి: 'వాడు' పదాంశం సందర్భాన్నిబట్టి ఒకే అర్థం సూచించినా, సాధారణంగా రెండర్థాలు మనముందు మెదలుతాయి: ఒకటి ఉత్తమ పురుష ఏకవచనం–సర్వనామార్థకం, రెండు క్రియార్థకం 'ఉపయోగించు.' (పదాంశాలకు సారూప్యత రావడానికి గల కారణాలు చారిత్రక భాషాశాస్త్రం వివరిస్తుంది.) ఇక మొదటి విధానాన్ని వివరించడానికి తులనార్థక పదాంశాల్ని ఉదాహరణగా తీసుకొనవచ్చును. ఆధునిక తెలుగు భాష వ్యవహారంలో తారతమ్యతలు తెలియజేయడానికి 'లా'లాగ, లాంటి పదాంశాలు ఉపయోగపడుతాయి. ఇవి మూడు భిన్నరూప పదాంశాలయినా ఒకే (తులన) అర్థాన్ని సూచిస్తూ తులనార్థకాలు (Particles of Comparision)గా స్థిరపడుతున్నాయి. క్రింది వాక్యోదహరణలు గమనించండి.

1) మీరు మా అన్నయ్యలాగ ఉన్నారు.

2) రాజు పులిలాంటి వాడు

3) ఆవు గుర్రంలా పరిగెత్తలేదు.

వీటిలో తులనార్థకాలు ఒకే సీమితార్థాన్ని బోధిస్తాయి. 'లా' ప్రయోగం వ్యవహారంలో కొద్ది భిన్నంగా తోస్తుంది. భిన్నతను గుర్తించాలంటే కొన్ని ఉదాహరణలు అవసరం. వీటిని పరిశీలించండి:

4) ఎవరికీ జీవితం సినిమాలా ఉండదు.

5) కోతులు మనుష్యుల్లా గంతులు వేస్తున్నాయి.

6) నేను రామచంద్రరావులా పని చెయ్యలేను.

7) పెళ్ళి కూతురికి పాట వచ్చునులా ఉంది.

8) వాడు వస్తాడులా ఉంది.

9) ప్రజల్ని సంతోషపెట్టడానికి నాయకులు వాగ్దానాలు చేస్తున్నారులా ఉంది.

10) అందరూ కలుసుకోవడానికే సెమినార్లు ఏర్పాటు చేస్తున్నారులా ఉంది.

ఈ వాక్యాలన్నింటిలోను 'లా' ఉన్నప్పటికీ అర్థందృష్ట్యా (4–6, 7–10) భిన్నత ఉంది. భేదాన్ని స్పష్టంగా వివరించాలంటే నిర్మాణం గురించి తెలుసుకోవాలి. భాషా నిర్మాణం గురించి తెలుసుకోవడం అంటే వ్యవహారమనే తరగని గనినుంచి (మనకు) కావలసిన విషయాన్ని ఎన్నుకొని తెలుసుకొనడమే. చాలాసార్లు ఎన్నుకొన్న విషయాన్ని శాస్త్రీయదృష్టితో క్రమబద్ధంగా రుజువు చేయాల్సి ఉంటుంది. నిర్మాణ వివరాలు తెలుసుకోనేముందు భిన్న పరిసరాల్లో 'లా' ప్రవర్తన ఎలా ఉందో పరిశీలించటం అవసరం.

పై వాక్యాల లా ప్రయోగం ఒకే సమూహానికి చెందినవయితే ఏకసందర్భంలో ఏకరీతిగా ప్రవర్తిస్తాయి. కాని ప్రస్తుతం రెండు సమూహాలు (4-6, 7–10) ఎన్నుకొన్న సందర్భాలలో భిన్నంగా ప్రవర్తించాయి. ఇక్కడ కొన్ని సందర్భాల ప్రసక్తి అవసరం.

సామాన్య వ్యతిరేకార్థ ప్రయోగం ఫలితాల్ని ఉత్సాహకరంగా ప్రదర్శిస్తుంది. అంగీకృతార్థాన్ని బోధిస్తున్న క్రియని వ్యతిరేకార్థంగా మార్చాలి. ఉదాహరణకి:

11) కోతులు మనుషుల్లా గంతులు వేయడంలేదు.

12) * పెళ్లికూతురికి పాటవచ్చునులాలేదు.

(* గుర్తు వ్యాకరణ విరుద్ధతను తెలియజేస్తుంది.)

(12)వ వాక్యంలో రెండుక్రియలు ఉన్నాయి. లా పూర్వ క్రియను వ్యతిరేకార్థంతో ప్రయోగించి వ్యవహార ప్రయోగసిద్ధి పొందవచ్చును.

13) పెళ్లికూతురికి పాట రాదులా ఉంది.

ఇదేరకంగా ప్రశ్నార్థకాలను 'లా' వాక్యాలకు తగిలించటం వలన భేదాన్ని మరింత స్పష్టం చేయవచ్చును. క్రియకు చివరగా 'ఆ' (ప్రశ్నార్థక పదాంశం)ను చేర్చాలి.

14) ఎవరికీ జీవితం సినిమాలా ఉండదా?

15) a) * ప్రజల్ని సంతోషపెట్టడానికి నాయకులు వాగ్దానాలు చేస్తున్నారులా ఉందా?

b) * ప్రజల్ని సంతోష పెట్టడానికి నాయకులు వాగ్దానాలు చేస్తున్నారా?లా ఉంది.

ఈ సందర్భంలో (12)లో సాధించిన వ్యవహార ప్రయోగాలను సిద్ధింపచేసుకోలేం. ఆ ప్రయత్నం చేస్తే 15 (b) ఉత్పన్నమవుతుంది.

పై సందర్భాలు మరో 'లా'ను గుర్తించే అవసరాన్ని ప్రకటిస్తున్నప్పటికీ, సారూప్య పదాంశాల కలయికని ఉపసర్జనత్వం (Substistution) సహాయంతో నిరూపించవచ్చును. ఈ ప్రక్రియలో 'లా'కు బదులుగా భిన్న ఉపసర్జకాల ప్రయోగం జరుగుతుంది. సామాన్యంగా 'లా' సూచించే అర్థాన్ని వలె, పోలె శబ్దాలు సూచిస్తాయి. కనుక ఇవి ఉప సర్జకాలుగా ఉపయోగపడుతాయి. ఉదాహరణకి :

16) నేను రామచంద్రావువలె పనిచెయ్యలేను.

17) నేను రామచంద్రావు(ను) పోలె పని చెయ్యలేను.

18) *వాడు వస్తాడు వలె ఉంది.

* 19) వాడు వస్తాడు పోలె ఉంది

వాక్యపరీక్షలు 'లా' ప్రయోజనం రెండురకాలు ఉన్నాయని స్పష్టంగా గుర్తిస్తున్నది. ఒక పదాంశం తులనార్థకతను బోధిస్తున్నది. మరొక పదాంశ వ్యాకరణ ప్రయోజనం ఏమిటి ? భిన్న ప్రయోజనాలు గా కెలా సిద్ధిస్తున్నాయి ? అనే ప్రశ్నలకు 'లా' పూర్వ ప్రయోగాలు, 'లా'పదరూప సిద్ధత,నిర్మాణాల పరిశీలన(లు) సమాధానం చెపుతాయి.

భిన్న ప్రయోజనాలకు కారణం చారిత్రకంగా ఏర్పడిన పరిణామాల దృష్ట్యా సిద్ధించిన ఏక పదాంశ రూపం కావచ్చును. ఇందుకు వ్యాస ప్రారంభంలో ఉదహరించిన తులనార్థక పదాలను చారిత్రకంగా పేర్చుకొని వర్తమాన రూపాల్ని సిద్ధింపచేసుకోవాలి. దీనికి మూలాధార రూపాలు, వర్ణసమీకరణం[1] వంటి శాస్త్ర కార్యాలు అవసరం అవుతాయి.

వర్తమాన రూపాల సాధనలో నిర్దేశక, ప్రశ్నార్థక రూపాలు ప్రతిపాదకాలుగా ఉంటాయి.

రూ ప ని ష్ప త్తి సూ చి క

		I	II (a)	II (b)	III (a)	III (b)	III (c)	IV (a)	IV (b)
A	(i)	అట్లా(గు)	అట్టా(గు)	అల్లా(గు)	అట్టా(గ)	అలా(గ)	అట్లా(గ)	* ట్టా(గ)	లా(గ)
	(ii)	ఇట్లా(గు)	ఇట్టా(గు)	ఇల్లా(గు)	ఇట్టా(గ)	ఇలా(గ)	ఇట్లా(గ)		
	(iii)	ఎట్లా(గు)	ఎట్టా(గు)	ఎల్లా(గు)	ఎట్టా(గ)	ఎలా(గ)	ఎట్లా(గ)	* ఎల్టా(గ)	ఎలా(గ)

		I (a)	I (b)	II (a)	II (b)	III (a)	III (b)	IV (a)	IV (b)
B	(i)	** అట్లువంటి >	అట్లాంటి	అట్టాంటి	అల్లాంటి	* ట్టాంటి	** ల్లాంటి	* టాంటి	లాంటి > లాటి
	(ii)	** ఇట్లువంటి >	ఇట్లాంటి	ఇట్లాంటి	ఇల్లాంటి	* ట్టాంటి	** ల్లాంటి	* టాంటి	లాంటి > లాటి
	(iii)	** ఎట్లువంటి >	ఎట్లాంటి	ఎట్టాంటి	ఎల్లాంటి	ఎట్టాంటి	ఎల్లాంటి	ఎటాంటి	ఎలాంటి > ఎలాటి

సూచనలు : **మూలాధార రూపానికి గుర్తు, *వ్యాకరణ, వ్యవహార విరుద్ధమైన రూపానికి గుర్తు. ( ) ఐచ్ఛికాంశాన్ని సూచిస్తాయి. > కుడిప్రక్కన ఇవ్వబడిన రూపం ఎడమ నివ్వబడిన రూపంనుంచి ఏర్పడిందని తెలియజేస్తుంది.

ఈ సూచికలో I రూపాలు మూలాధారాలు గాను, IV వి వ్యవహార రూపాలుగాను వ్యవహరిస్తాయి. రూప నిష్పన్నంలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇమిడిఉన్నాయి : నిష్పన్న విధానంలో నిర్దేశాకార్థకాలు ఒకరకంగాను, ప్రశ్నార్థకాలు మరొక విధంగాను ప్రవర్తించడం, భిన్నమైన వివరణల్ని కోరుతుంది. AI మూలాధార రూపాలను పూర్వచరిత్ర సూచక రూపాలుగా (అట్లు+అగు, ఇట్లు+అగు,ఎట్లు+అగు) ప్రతిపాదించవచ్చును. ఈరూపాల్నించి నిష్పన్నమైన రూపాలకు దీర్ఘం ఎలా వచ్చిందన్నది సమస్యగా పరిణమిస్తుంది. అన్నింటికి వ్యంజన సమీకరణం సర్వసాధారణం కాని AIII రూపాల్లో స్వరసమీకరణం గమనించవచ్చును. B రూపాలు మొదట లోపదీర్ఘత,[2] తదుపరి వర్ణసమీకరణ సూత్రాల్ని వర్తింపజేసుకుంటాయి ఈ క్రమాన్ని (Order) భంగం చేస్తే వ్యవహార విరుద్ధమైన రూపాలు జనిస్తాయి. B మూలాధార రూపాల సంగ్రహణం భిన్నంగా (అటువంటి, ఇటువంటి, ఎటువంటి) గ్రహించవచ్చును. అవి సిద్ధ 'ల' వర్ణ రూపాల్ని వివరించలేవు. సంక్షిప్తంగా వివరించాలంటే రూపనిష్పత్తిలో లోప దీర్ఘత, వర్ణ సమీకరణ సూత్రాలతోపాటు ద్విత్వలోప సూత్రమూ అవసరం. ఈ వ్యాసం రాయడానికి బీజరూపమైన 'ల' నిష్పన్నంలో గ వర్ణాంతరూపాల్ని తీసుకొని గ వర్ణాన్ని ఐచ్ఛికాంశంగా పరిగణించాలి. నిష్పన్నంలో మిగిలిపోయిన మరొక విషయం అ/ఇ ల లోపం. ఈ

లోపానికి సరియైన కారణం వివరించలేం. సమాన సందర్భాన్ని ఉదహరించి దీన్ని సామాన్య ప్రక్రియగా సమర్థించవచ్చును. (అది, ఇది, ఏది) సర్వనామాల ఔపవిభక్తిక రూపాలు ఏర్పడేముందు వర్ణ వ్యత్యయం జరిగి అ, ఇ లు అదృశ్యమయి (దా, దీ, దే) పోవడం సహజం. ఇవి విశేషణార్థకాలుగా పనిచేస్తాయి. ప్రస్తుతం చర్చిస్తున్న తుల్యార్థకాల్లోను ఈ అర్థం అంతర్హితం.

కొంతమంది భాషావేత్తలు తమిళభాష పదాలే (తుల్యార్థంలో వాడబడుతున్న పదాలనుండి) 'లా'ను దిగుమతి చేసిందని అభిప్రాయ పడుతున్నారు.[3]

ఇంతవరకు జరిపిన చర్చ 'లా' చారిత్రక ఉపనిష్పత్తిని తెలుపుతున్నది కాని భిన్నార్థాల బోధన దీనికెలా వచ్చిందో తెల్పడం లేదు. దీన్ని గుర్తించడానికి చారిత్రకంగా 'లా' పూర్వరూపాలకుగల ప్రయోగాల వైవిధ్యం గమనించాలి. (అనుబంధం I లో భిన్న యుగలకు చెందిన విభిన్న కవుల ప్రయోగాలు ఇవ్వడం జరిగింది.)

సారూప్య పదాంశాల నిష్పత్తి స్పష్టంగా ఉన్నప్పటికీ భిన్నార్థ సూచనను చారిత్రక ప్రయోగాలు నిరూపించలేకపోయాయి. దీనికి కారణం భాషకు సారూప్య పదాంశాల ప్రయోగ శూనతే కాదు. ఆధునిక తెలుగు భాషలో ప్రయోగ వైవిధ్యం గూడ ఒక ముఖ్యమైన కారణం. ఏకకాలికంగా వ్యాకరించే సందర్భంలో పరివర్తన వ్యాకరణం మూలంగా భిన్నకాలికంగా స్పష్టంగా గుర్తింపలేని భేదాల్ని సమర్థవంతంగా వివరించవచ్చును.

వ్యవహరించే వాక్యాలు (వ్యక్తనిర్మాణాలు) అన్నింటికీ ఒక్కొక్క గుప్తనిర్మాణం ఉంటుందని, భిన్నార్థాలను ఒకే వ్యక్తనిర్మాణం వ్యక్తీకరిస్తే దానికి మూలంగా భిన్నమైన గుప్త నిర్మాణాలుంటాయని వీటిని పరివర్తన సూత్రాల సహాయంతో సంబంధ పరుచవచ్చునన్నది పరివర్తన వ్యాకర్తల ప్రాథమిక సిద్ధాంతం. (పరివర్తన సిద్ధాంతంపై పూర్తి వివరణ రామారావు(?)లో చూడవచ్చును.)

పై ప్రాథమిక సిద్ధాంతాన్ని అమూర్తంగాను, ఉదాహరణ పూర్వకంగాను గమనించవచ్చును.

గుప్తనిర్మాణం	A_1	B_1 B_2
	↓	↓ ↓
వ్యక్తనిర్మాణం	A	B
	(a)	(b)

20) a) కిలరి ముంజెలు తిన్నాడు

b) కిలారి ముంజెలు తిన్నాడు.

21) a) సుశీల సుమతి సినిమాకి వెళ్ళారు.

b) సుమతి సుశీల కలసి సినిమాకి వెళ్ళారు.

c) సుమతి సుశీల విడివిడిగా సినిమాకి వెళ్ళారు.

22) a) జయ జ్యోతి మార్కెట్‌నుంచి సరుకులూ మానెలు తెచ్చారు.

b) i) జయ మార్కెట్‌నుంచి సరుకులు తెచ్చింది.

ii) జ్యోతి మార్కెట్‌నుంచి నూనెలు తెచ్చింది.

c) జయ మార్కెట్‌నుంచి సరుకులూ, నూనెలు తెచ్చింది.

d) జ్యోతి మార్కెట్‌నుంచి సరుకులూ, నూనెలు తెచ్చింది.

ఉదాహృత వాక్యాలలో 20 (a) కు 20 (b) గుప్తనిర్మాణ వాక్యంగా వ్యవహరిస్తుంది. (వ్యక్త నిర్మాణంతో పోల్చి చూస్తే ఏ మార్పు లేదు.) 21 (a), 22 (b) లకు వరుసగా 21 (b),(c); 22 (b), (c), (d) గుప్త నిర్మాణాలనుంచి ఉదయిస్తాయి. వాక్యాలకు పూర్వం ఇచ్చిన (a) (b) లు ఆమూర్త నిర్మాణాన్ని, 20 మొదటిదాన్ని 21, 22 (b) ని సూచిస్తున్నాయి.

'లా' ప్రయోజనాలను సూచించాలంటే భిన్నంగా కన్పిస్తున్న వాక్యాల గుప్తనిర్మాణం బహిర్గతం చేయాలి. సూక్ష్మంగా పరిశీలిస్తే 4—6, 7—10 వాక్యాలమధ్య (వ్యక్తనిర్మాణదృష్ట్యా) రెండు భేదాలున్నాయి. 7—10 వాక్యాలలో 'లా' పూర్వం ఒక క్రియ 'లా' అనంతరం మరొక క్రియ ఉన్నాయి, ('లా' అనంతర క్రియ సర్వదా 'ఉంది' [ఉత్తమపురుష మహద్భిన్నం] గా కన్పిస్తోంది.) 7—10 వాక్యాలు ఇదివరలో నిర్వహించిన వాక్యగత పరీక్షలకు భిన్నంగా ప్రవర్తించడమేకాక 'లా' పూర్వక్రియ కొన్ని మార్పుల వ్యవహారరూపం నిష్పన్నం చేస్తే మరొకమారు వ్యాకరణ విరుద్ధరూపాన్ని జనింపజేసింది.

ఈ భేదాలు 4—6, 7—10 వాక్యాలకు భిన్న గుప్త నిర్మాణాలు ప్రతిపాదించటానికి మరింత దోహదం చేస్తాయి. ఒక్కొక్క విభాగంనుంచి ఒక్కొక్క వాక్యం ఉదాహరణగా తీసుకొని చర్చిస్తే మిగిలిన వాటికి ఇవే లక్షణాల్ని సాధారణీకరణం చెయవచ్చును.

(5) వాక్యం గుప్తనిర్మాణానికి ప్రతిపాదనలుగా క్రింది వాక్యాలు పేర్కొనవచ్చును:

5 a) కోతులు గంతులు వేస్తాయి

b) మనుషులు గంతులు వేస్తారు.

దీన్నే వృక్షసూచికతో సూచిస్తే



(5) వాక్యాన్ని గర్భి(లేదా ప్రధాన) వాక్యంగా వ్యవహరిస్తూ 5 (a) (b) లను గర్భ (అనుస్యూత) వాక్యాలుగా ఉదహరిస్తూ వాటి వ్యాకరణాంశాల్ని క్రిందివిధంగా విడదీయవచ్చును. (△ గుర్తు గర్భవాక్యాలను తెలియజేస్తుంది)

24) $\triangle_1$ కోతులు గంతులు వేస్తున్నాయి.
నామం$_1$ నామం$_2$ క్రియ$_1$
$\triangle_2$ · మనుషులు గంతులు వేస్తున్నారు
నామం$_3$ నామం$_4$ క్రియ$_2$

సామ్యార్థాలుగల (24) వాక్యాలపై 'లా' ప్రయోగ సూత్రం అనువర్తితమవుతుంది. దీనికిముందు గర్భవాక్యాలు రెండు ఏకం అవుతాయి. అవి ఏకం కావటానికి క్రింది స్థితి (Context) అవసరం.

25) 1) నామం$_1$ ≠ నామం$_3$
2) నామం$_2$ = నామం$_4$
3) క్రియ$_1$ = క్రియ$_2$

[గర్భవాక్యాల రెంటిలోను మొదటినామం సమాన లక్షణాలు ఉంటే 'లా' ప్రయోగసూత్రం జరుగదు. మిగిలిన లక్షణాలు రెండు వాక్యాలలోను సమానంగా ఉంటాయి]

పైస్థితిలో గర్భవాక్యాలకు సనామ క్రియాలోప సూత్రం ప్రవర్తితమవుతుంది. ఫలితంగా గర్భివాక్యంలో ఒక నామం ఒక క్రియ నిలుస్తాయి. 'లా' ప్రయోగసూత్రం అనువర్తితమవుతే రెండవనామం (భిన్ననామం : నామం$_3$) తరువాత 'లా'వస్తుంది. ఈ దశలో క్రియాసంధానం జరుగుతుంది. (కర్తృస్థానంలో ఉన్న నామానికిగల పురుష, వచన, ప్రత్యయాదులు క్రియకు కల్పించడం) తత్ఫలితంగా (5) గర్భివాక్యం ఉత్పన్నమవుతుంది.

7–10 వాక్యసమూహంలో (7) ను ఉదాహరణగా తీసుకొని గుప్తనిర్మాణాన్ని క్రింది విధంగా ప్రతిపాదించవచ్చును:

7 a) అది △ ఉంది.
b) △ పెళ్లికూతురికి పాట వచ్చును.

వీటి గుప్త నిర్మాణం వృక్షసూచికతో

26)


క్రియా సంధానాన్ని ప్రవర్తించి వ్యక్తనిర్మాణాన్ని స్వీకరిస్తే వ్యవహార విరుద్ధమైన రూపం జనిస్తుంది.

27) * అది పెళ్లికూతురికి పాట వచ్చును ఉంది. వ్యవహృత రూప నిష్పన్నతకు (26) పై మరికొన్ని సూత్రాలు వర్తింపచేయాలి. అవి :

1) క్రియా సంధానం
2) (అది) సర్వనామ లోపం
3) కర్త్రుద్ధరణం (Subject raising)
4) దళార్థకం (Complementizer)

(7)కు పోలిన వాక్యాల గుప్త నిర్మాణాల్లో 'అది'ని ప్రతిపాదించటం దాన్ని మరొక సూత్రాన్ని కల్పించి లోపింపజేయడం కృత్రిమంగా తోచవచ్చును. వ్యక్తనిర్మాణంలో గర్భివాక్యంలోకల్పించే క్రియను సంధానించటానికి, ప్రధాన వాక్యపుకర్తను నిర్ణయించడానికి ఈ అవయవం గుప్త నిర్మాణంలోఅవసరం[4]

క్రియాసంధాన, సర్వనామ లోపానంతరం గుప్తనిర్మాణం ఇలా ఉంటుంది.

28


వృక్షచ్ఛేదనమనే[5] అనుసరణం (convention) (శూన్య శాఖకు నిర్మాణస్థానంలోనుంచి తొలగించడం) వలన నామబంధం కింద ఉన్న శూన్య నామశాఖకు లోపం వస్తుంది. నామబంధంలో మిగిలిఉన్న గర్భవాక్యం కర్తగా కర్త్రుద్ధరణ సూత్రం[6] ద్వారా మారుతుంది.

29


30


(30) దళార్థకసూత్రం వర్తించటంవలన గర్భవాక్యానంతరం లా చేరి (7) వాక్యం సిద్ధిస్తుంది.

చారిత్రకంగా విడదీసి చూపలేని 'లా' ప్రయోగ భిన్నతల్ని గుప్తనిర్మాణందృష్ట్యా చూపవచ్చును.

31) i)



ii)



'లా' సూత్ర పరివర్తన మొదటి సమూహంలో సనామ క్రియాలోపం తరువాత జరుగుతే రెండవ వాక్య సమూహంలో కర్తృద్ధరణం తరువాత వస్తోంది. మొదటి 'లా' తులనార్థతను బోధిస్తే మరో'లా' రెండో సమూహంలో ప్రధాన వాక్యాన్ని బంధించే దళార్థకంగా మాత్రమే ఉపయోగపడుతోంది.

సుదీర్ఘ పర్యాలోచనానంతరం ఈ వ్యాసంలో ప్రతిపాదింపబడిన అంశాల్ని సంగ్రహంగా ప్రస్తావిస్తే ముఖ్యంగా ఇవి కనబడుతాయి. ఆధునిక తెలుగుభాషలో తులనార్థక బోధకమైన 'లా'కాక మరో 'ల' ఉంది. చారిత్రకంగా రెండు 'లా'ల ఉత్పత్తి భిన్నంగా సూచించలేము. కవిప్రయోగాలను గ్రహించినా ఆదిలో 'లా'తుల నార్థకంగానే ప్రయోగించినట్టు తెలుతుంది. శ్రీనాథయుగంనుంచి ప్రయోగాలలో వైవిధ్యం స్పష్టంగా కన్పిస్తుంది. ఆధునిక తెలుగు భాషలో అవతరించిన మరో 'లా'ను గర్భవాక్యాన్ని ప్రధాన వాక్యంతో సంధానించే దళార్థకంగా గుర్తించి భిన్న పరివర్తన సూత్రాల ద్వారా వివరించగలమని చెప్పవచ్చును.

అనుబంధం - 1

నన్నయ : [పద ప్రయోగ కోశం నుంచి.
ఎడిటర్స్ : అబ్బూరి రామకృష్ణారావు
దివాకర్ల వేంకటావధాని

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

/ స్థాపితం 1908 /

గాంధీనగరం, విజయవాడ-3

ఇంట్లో అందరికీ ఆనందాన్ని ఇచ్చే శీర్షికలు! కథలు!! బొమ్మలు!!!

★ సాహిత్య విలువలున్న సీరియల్ కథలు

★ వైవిధ్యం వున్న కథానికలు

★ అన్ని తరాలవారినీ అలరించే "ప్రశ్నావళి" "ధర్మపథం" కార్టూన్‌లు మొదలైన వాటితో ఏవారానికి ఆ వారమే కొత్తదనాన్ని పుణికిపుచ్చుకుని మీకు అందుతుంది!

విడి ప్రతి వెల 75 పైసలు
సంవత్సర చందా (పోస్టుద్వారా) రు. 41-60 పై.

ఆరు మాసాలకు రు. 20-80 పై.
మీ స్థానిక ఏజంటుద్వారా తెప్పించుకుంటే ప్రతీవారం తెల్లారేసరికల్లా మీముందు వుంటుంది

రచనలు పంపే చిరునామా!
ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

ఇతర వివరాలకు:
మేనేజరు, ఆంధ్రపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ (APSA) హైదరాబాద్.]

అట్టుల : అట్టుల బల్కినపల్కు దప్పగాదని 3.3.170.

అట్టులగున్ : వంశంబు నట్టులగు నను గ్రహింపు మనినన్ 1.1.111.

అట్లు : సత్రయాగము సేసెనట్లు శ్వేతకి చేసిన 1.8.247.

ఇట్టుల : సూర్య నిభు నిట్టులడించి 1.5.29.

ఇట్లు : అమ్మ నులితని కిట్లనిరి 1.1.29.

ఇట్ల : నీకిట్ల చేయగా దొరకొనియన్ 1.4.189.

తిక్కన : ['తిక్కన పద ప్రయోగ కోశం' నుంచి.

ఎడిటర్స్ : అబ్బూరి రామకృష్ణారావు, భద్రిరాజు కృష్ణమూర్తి, దివాకర్ల వేంకటావధాని, (APSA), హైదరాబాద్. (1971)].

ఇట్టుల : వేయు నిట్టుల యెల్ల భంగులన్ ఉ. 1.97

ఇట్టులు : అరడాతని కిట్టులనియె వి. 3.94.

ఇట్ల : ఇవి యిట్ల కదా యని పలికి ఉ. 3.130

ఇట్లపోలె : ఇమ్మెరి వరుఁడిట్ల పోలెఁ గృప మొక్కలమై శాం. 3.95.

ఇట్లపోలెన్ : అనుభవించు చున్న యెడనిట్ల పోలె నడిగిన నారదునకు ఆ 1.318.

ఇట్లు : రఘువంశ నాథుడిట్లనియె వి. 2.50.

అట్టుల : తా నెఱుఁగని యట్టుల తడవుగాగ నిల్చి ని 4.95.

అట్టుల కైవడి : అతని మేను కందియట్టుల కైవడి యరయ నేను జూచి శాం. 1.12.

అట్టులన్ : అనఘ నీవు నాచార్యు నట్టుల నేడు గడయుగాన హితము సెప్పదగు శ 1.77.

అట్టుల పోలెన్ : అదిలేని యట్టుల పోలెన్.

అట్టులు : ఎట్టి తుంగలో ప్రవేశదినట్టులు పలుచెడిదె. ఉ 1.344.

అట్ల : ఇది యట్లకాక యొండు దగునే వి. 5.314.

అట్లపోలె : అట్లపోలె నాక నరకం బనుభవించి స్వ 1.67.

అట్లపోలెన్ : అట్ల పోలెనవి నీతులైన నీ కొడుకులు ఉ. 2.279.

అట్లు : అట్లయినను గడు లెస్సగదా ఉ. 1.361.

నన్నెచోడుడు : [నన్నె చోడుని పద ప్రయోగ సూచిక.

ఎడిటర్స్ : అబ్బూరి రామకృష్ణారావు, దివాకర్ల వేంకటావధాని, (APSA), హైదరాబాదు, 1962.

అట్టుల్ : ఈతన్విడన్ గల్వ గానట్టుల్ మెచ్చుకయున్న 7.20.

అట్టుల : కప్పినట్టుల పోలెన్ 9–65.

అట్టులు : కన్నులు విచ్చి చూచినట్టులు 6.113.

అట్ల : నేత్రంపుబడగినట్ల 8.74.

అట్లు : మధ్యమ వారిన్నగునట్లు 6.118.

ఇట్టులు : నర భోజనుండ నీ స్నెఱిగి యెఱిగి యిట్టులీవు 12.86

ఇట్ల : ఇట్లయ్యెన 4 62.

ఇట్లు : మహోత్సాహంబున ఇట్లనియె 4.40.

శ్రీనాథుడు : శ్రీనాథ పద ప్రయోగ సూచిక.

ఖండవల్లి లక్ష్మీరంజనం, Seconded, 1971, APSA, Hyderabad.

లాగు : ఏలాగు పోదుమ నేడ్చెడువారు ప. వీ 110.
ఇతండు బాలుండని ఏలాగుపలుక – 112.

లాగునఁ : ఎలా యీలాగునఁ జింత నొందెదవు శృ. 4.107.

లాగునన్ : గుఱుఁడగాఁ అటఁ బొందినయట్టి లాగున శృ. 7–36.
అనప్పటంబ సంరంభ మేలయ్య మీలాగునన్ కాశీ. 7.74.

లాగున : ఈలాగుంటిమే కాలగతుల శృ. 4–74.
ప్రమాగన్ను లెట్టి లగున దైవ మీలాగున ప. వీ. 75.

రిపరెన్సులు

Jakobs, R & Rosenbaum, P. S. 1968, English Transformational Grammar, John Wiley & Sons, Inc, New York.

లక్ష్మీనారాయణ శర్మ, కె. 1978 'కర్తృవిషయ మీమాంస' తెలుగు [త్రైమాసిక] (అచ్చులో), హైదరాబాద్.

Postal. P. M. 1968, Aspects of Phonological Theory, Harper & Rao, New York.

రామారావు, చేకూరి, 1975 (a), 'తెలుగులో స్వర సమీకరణ' భారతి 52 : 9. 5–10, 10. 11–15, మద్రాసు.

,, 1975 (b) తెలుగు వాక్యం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాదు.

,, [?], 'భాషా శాస్త్రంలో పరివర్తన సిద్ధాంతం', శారదా మంజీరం గోలి ఈశ్వరయ్య & సన్స్, సికింద్రాబాద్.

రామచంద్రరావు. సి, 1975 'తెలుగు బహువచనం' తెలుగు 4.74–51, తెలుగు అకాడమీ హైదరాబాదు.

రెడ్డి, జి.ఎన్.1974, 'ఆంధ్రం, తెనుగు, తెలుగు,' తెలుగు భాషా చరిత్రలో [ఎడి., భద్రిరాజు కృష్ణమూర్తి], ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాద్.

కృతజ్ఞతలు : ఈ వ్యాసాన్ని లిఖిత దశలో చదివి తగు సలహాల నిచ్చిన చేకూరి రామారావు, పరమశివం, పి. ఎస్. సుబ్రహ్మణ్యంగార్లకు రచయిత కృతజ్ఞుడు. ఏది ఏమైనా వ్యాసంలో ఉన్న విషయ లోపానికి రచయితే బాధ్యుడు.

అధోజ్ఞాపికలు

1 బహువచన రూప నిష్పత్తి సందర్భంలో రామచంద్రరావు (1975 : 74–51) కొన్ని మూలాధార రూపాలను ప్రస్తావించారు. ఆంగ్లంలో మూలాధార రూపాల ప్రాముఖ్యత గుర్తించింది పోస్టల్ (1968). మూలాధార రూపం ఇదివరలో వ్యవహారంలో ఉండి ఉండవచ్చును. వర్తమానానికిది తార్కికరూపం (Logical Form). ఉక్త రూపం ఉండదు. ఉక్తరూపానికి దగ్గరగా ఉంటుంది. (కొన్ని సందర్భాల్లో ఉండకపోయినా ఆశ్చర్యం లేదు.) వర్ణసమీకరణం భాషలో ప్రదర్శించబడే సామాన్యవ్యాకరణ ప్రక్రియ. విపులంగా రామారావు (భారతి;52:9.5–10, 10. 11–15) చర్చించారు.

వర్ణంకాని, వర్ణ సముదాయంగాని పొరుగునఉన్న వర్ణంతో కాని, వర్ణ సమూహంతో కనీసం ఒక అంశంలో అయినా సమమైతే (సమతపొందితే) దాన్ని సమీకరణఅంటారు.

2 ఉన్న వర్ణాల్లో ఒకానొక వర్ణం పోయి ప్రక్కదానికి దీర్ఘం రావడం. ఉదా : పెండ, పేడ – దంక, దాక (రెంటిలోను అనుస్వారలోపం జరిగి ప్రక్కనున్న వర్ణం దీర్ఘం అయింది).

3 డా॥ పరమశివం (మధురై) ఈ వ్యాసాన్ని లిఖిత దశలో చదువుతూ తమిళ (సమానార్థక) పదాలైన 'అన్న', 'ఇన్న' 'ఎన్న'లనుంచి తెలుగు 'అలా', 'ఇలా', 'ఎలా' వచ్చాయని భావించారు. తమిళపదం తెలుగు కావాలంటే లోపదీర్ఘ, వర్ణసమీకరణ సూత్రాలు ప్రవర్తించాల్సి ఉంటుంది. ద్విరుక్త వర్ణ సమీకరణకు తెలుగు ఉదాహరణలు కల్పించుకోలేదు కాని న-ల సమీకరణకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఉదా : మునె? మనె? నీల్లు–లీలు, తెనుగు–తెలుగు (వివరాలకు: జి. ఎన్. రెడ్డి (1974:8 పేజీ) పూర్వాంధ్రపు వ్యవహారంలో ''ఇల్లిక్కడ, ఎల్లిక్కడ'' అనే ప్రయోగాలు పై సిద్ధాంతానికి పాక్షికంగా బలాన్ని చేకూరుస్తోంది.

4 తెలుగులో మరొకచోట వాక్యభేదాన్ని సూచించటానికి ఈ వ్యాసరచయితే (1978) సర్వనామాన్ని ప్రతిపాదించాడు. ఆంగ్లంలో రోజన్‌బామ్ & జాకబ్స్ (1968) కొన్ని ఉదాహరణలు సూచించారు.

5 ఈ అనుసరణానికి మరికొన్ని ఉదాహరణలు వేరొకచోట (1978) చూడవచ్చును.

6 ఇదివరలో అనుకరణను వివరిస్తూ రామారావు (1975: 82) ఈ సూత్రాన్ని ప్రయోగించారు.

అక్షర కుక్షి పక్షి

శ్రీ కోడూరి శ్రీధర్

ఆకాశవీధుల
  అంతరంతరాల
స్వేచ్ఛాస్వారాజ్యాలు
విశృంఖల విహార హారాలు
హాయి హాయి తిరిగే
వెన్నెల పిట్టల
వెలుగులు తోడి
నేలనుకూల్చి
రెక్కలు కోసి
వెన్నెల ముద్దల
వెల్లదనానికి
కాటుక రేకల సింగారం
కలికి రాగాల సిందూరం
భావాల మడిలో గుడి
పూల జల్లులు
కీర్తి మల్లెలు
అక్షర కుక్షికి
రుద్రాక్షమాలలు
ధ్యాన ముద్రల
తపసి కంటికి
దూర దూరం
పక్షి రక్తం
జ్ఞాన రక్తికి
భక్తి ముక్తికి
భారం భారం
పక్షి ఆ కోశం

~~~~~~~~

రా!

శ్రీ మల్లాప్రగడ రామారావు

వల్లమాలిన కోపంతో
  వెళ్ళిపోతూ ముసలి సూర్యుడు
పాపం పశ్చిమాకాశాన్ని
తూట్లు, తూట్లుగా పొడిచి
కుంకంలాంటి రక్తాన్ని
అంచులనిండా నింపాడు.

తల్లడిల్లిన తల్లిరాత్రి
ఆకాశపు పాపాయిని అక్కున చేర్చి
చీకటి చేతులు చాచి
ఒళ్ళంతా నిమురుతోంది.

రా!
చందమామా!
పూర్ణసోమా!
నీ వెన్నెల 'పెయిన్‌బామ్‌' వి
కిరణాల కరాలతో పూసి
ఆకాశపు గాయాలను నయంచేసి
అమృత కరుడ వనిపించుకుందువుగాని.
~~~~~~~~

కొలకలూరి

దిక్కులేనోడు

పాత్రలు :

1 కోటేసు : యువకుడు
2 ఏకోనారాయణ }
3 సాంబడు } మధ్యవయస్కులు
4 బెమ్మం }
5 పుల్లయ్య : వృద్ధుడు

*

స్థలం :

పల్లె, నాలుగు వీధులు కలిసేచోటు. చెట్టు, చుట్టూ, అరుగు.

సమయం :

మధ్యాహ్నంనుంచి సాయంకాలందాకా:

[కథ, సన్నివేశం, పాత్రలు కల్పితాలు. నిరాధారాలు]

(తెర తీసేసరికి చెట్టుకు కట్టేసిన కోటేసు, అరుగుమీద రెండుపక్కలా నిలబడ్డ సాంబడు, బెమ్మం, క్రింద ఏకోనారాయణ)

కోటేసు : బెమ్మన్నా నన్నొదిలి పెట్టండి—నన్నుపోనీయండి.

సాంబడు : అరిస్తే గొంతులో పొడుస్తా. ముయ్ నోరు!

బెమ్మం : ఒరే తిక్కోడా పొరపాటయిందావటాని తప్పొప్పుకోరా—ఎల్లొచ్చు.

ఏకోనారాయణ : శ్రీ శ్రీ శ్రీ కోటేసులవారిని కొప్పడకండిరా — మహారాజావారు చెప్పినట్టు ఇంటారంటరా — చెప్పదెబ్బలు తింటారు !

కోటేసు : అన్యాయంగా నన్నెందుకొట్టడతారు—నన్ను పోనీయండి.

ఏ : అన్నేయంగా ఎందుకురా—నేయంగా దన్నండి. యాడకి పోతావురా కోటేసులవారూ! వల్లకాట్లోకా? దెయ్యాలుంటాయిరా పిల్ల సన్నాసి. చెట్టేనయం—

కో : మీకంటే ఇంకేం దెయ్యాలు. నేనెల్లాలి. నన్ను బోనియ్యండి.

ఏ : పోతావేం?— పో! ఎట్టా బోతావో సూత్తా—ఊఁ—పోరా!— కోడిపెట్ట నీడబెట్టిపో !

కో : కోడిపెట్టా ? ఏం కోడిపెట్ట ?

ఏ : గుడ్లు పెట్టే కోడిపెట్ట—చూళ్ళా—చెప్పరా సాంబా !

సాం : దొంకోళ్ళ నా కొడకా (కడుపులో పొడిచాడు)

కో : అమ్మా

సాం : అరిత్తే సంపుతా! తిన్నప్పు డెట్టుందిరా !

కో : నాకేం దెలియదు. నిజం.

సా : అబద్ధాల నా కొడకా! అరిత్తే నరుకుతా! తిన్నాది అరిగిందంటరా !

కో : ఒట్టు! అమ్మతోడు—నాకేం తెలియదు.

ఏ : ఊరకనే ఆణ్ణిజం జెప్పటానికి ఎర్రోడా ఏమన్నానా? — ఉతకరా—నాలుగుతుకు !

సా : (డొక్కలో పోటు)

కో : అమ్మా !

బె : చెప్పరోరేయ్! ఊరకే తన్నులెందుకు దింటావ్ — చెప్పరా కోటిగా.

సా : (డొక్కలో పోటు)

కో : అమ్మా !

బె : ఒరె నిజమొప్పుకోరా !

ఏ : నీ పిచ్చిగానీ— బెమ్మం — ఆణ్ణిజం జెప్పటానికి అంతపనికిమాలిన వాడనుకొన్నవంటరా— శా శా — కోటేసులవారు నిజం ఊరకే చెప్పర్రేయ్ నాలుగు వాయిత్తేనే !

కో : నే న్నిజం చెబుతున్నా — నిజం — నాకేం తెలియదు. ఎంత ఒట్టు అయినాసరే!

ఏ : ఎంతొట్టన్నా పెట్టుకొంటా వంటావేందిరా — అది సరే— మీ జండామీద ఒట్టేసుకొంటావంటరా కోటేసులవారూ!

సా : (పోటు)

కో : అమ్మా !

ఏ : అమ్మా అని ఏడుత్తా వేదిరా పిల్ల సన్నాసి — ఓసి అమ్మాయో — నీ మూలంగా ఎంత మూడిందే అని ఏడి

చ్చావు—ముచ్చటగా వుంటుంది. బెమ్మం సూత్తా వేందిరా— ఎయ్!

బె : బులపాటం అయి పుట్టిన్నా కొడుక్కి! (జుట్టు పట్టుకొని తల వెనక్కు విసిరి చెట్టుక్కొట్టాడు)

కో : అమ్మా!

ఏ : అమ్మాయికాదా!

కో : అమ్మా!

బె : నోరు ముయ్‌రా!

ఏ : ఆడు నోరు మూత్తే పల్లెందుకింతగా బరిలెగిచ్చి పోద్దరా! ఊరెందుకిట్టా నాసినం అయిపోద్దరా! ఈణ్ణి గౌరంగా బిలవాలంట. ఏరా, ఓరే అనరాదంట. ఇన్నారు గదండిరా! ఏరా కోటేసులవారూ ఇంటన్నావా?

కో : ఎవర్ని గూడా తేలికగా లెక్కలేకుండా పిలవొద్దన్నానే కానీ—

ఏ : చూశావా—ఆణ్ణోరు ముయ్‌లేదు!

బె : ముయ్‌రా నోరు (తల చెట్టుక్కొట్టాడు)

కో : అమ్మా!

ఏ : అంతేరా! ఆణ్ణోరు ముయ్యడు. మీరు మూయిచ్చలేరు.

బె : ముయ్ (చెట్టుక్కొట్టాడు) ముయ్‌నోరు!

కో : (అరవలేదు)

ఏ : (ఆశ్చర్యంగా) వీణ్ణోరు మూశేడురోయ్-ఏది మళ్ళీ—

బె : (కొట్టాడు)

కో : (అరవలేదు)

ఏ : (పెద్దగా నవ్వి) ఇంక భూకంపం వచ్చుద్దిరా! ఈణ్ణోరెత్త లేదంటే దేశానికేదో మూడిందిరా! ఒరే కోటేసుల వారూ! వంతెన మీదెక్కి ఆళ్ళు జావాలి, ఈళ్ళు జావాలిఅని, అది నసిచ్చాలి ఇది నసిచ్చాలి అని అంత గొంతు గాంపోను రికాడ్డులు మళ్లే కుంయ్ కంయ్‌మని పిచ్చేవోడివే!—ఇప్ప దేవయిందా నోరు!-ఊ సూత్తారేంరా!

బె : (ఒకేసారి కడుపులో పొడవటం—చెట్టుక్కొట్టటం)

సా :

కో : (పెద్దగా) అమ్మా!

ఏ : ఫరవాలేదు లెండిరా! ఈ డరిశేడంటే దేశానికి పెమాదం దప్పింది. లేకపోతే గొప్ప చిక్కే! అయ్యా మహారాజశ్రీ కోటేసులవారూ—ఆ అమ్మాయి జొన్నచేలో అమ్మా అందా, అయ్యా అందా! చెప్పరా సొద్దెం ఇందాం!

బె :
సా : చెప్పు! (కొట్టారు)

కో : నాకేం దెలియదు.

ఏ : ఏమీ తెలియదా? నిజ్జంగా.

సా : కోడ్!

బె : పిల్లో!

ఏ : కొడిపిల్లో

కో : నేను మీకే అపకారమూ చేయలేదు. నన్నెందుకు ఇంతగా హింస పెడతారు. మీకు పుణ్యం ఉంటుంది. నన్ను పోనీయండి.

ఏ : యాడకి? జొన్న చేలోకా! ముళ్ళు గుచ్చుకొంటాయిగందరా!

బె : పిల్ల ఏడుసుద్దా?

సా : కోడి కూరుందా ?

కో : మా పల్లెలోకి నన్ను బోనీయండి

ఏ : ఏం జనాన్ని ఎంటేసుకొచ్చి — తలగొట్టి మొలేత్తావా ?

కో : ఇదేం చెయ్యను నన్ను బోనీయండి—బతకనియ్యండి.

ఏ : మరి మా కోడిపెట్ట మాటేంది? అది రోజుకు ఇరవై గుడ్లు పెట్టేది. ఏవై పిల్లల్ని చేసేది — అదేమన్నా అల్లాటప్పా పెట్టా?—దేవతా కోడిపెట్ట — నీ పొట్టన పెట్టుకొన్నావ్—పొట్ట బగిలి సత్తావ్—పగల బొడవరా! (సాంబడు, బెమ్మం కొట్టటం—కోటేసు అరవటం)

కో : ఏకోనారాయణగారూ—ఇదన్యాయం—ఆ కోణ్ణాకు దెలియదు.

ఏ : ఆచారి కూతురో! అదీ తెలియదంటరా కోటేసులవారూ!

కో : ఏకోనారాయణగారూ! మీ కోడిపెట్టకీ — ఆ అమ్మాయికీ ఏంటి సంబంధం?

ఏ : ఆహాహాహా! పుంజా కూత కొచ్చిందే! కోసురు తింటే రుచి! ఏందిరా కూశావ్—

కో : కూయలేదండీ! చెబుతున్నాను. నేనూ ఆచారి కూతురు ఏ గంగలో కలిస్తే మీకేం? మీ కొంపేం మునిగింది?

ఏ : గంగ — ఎంత పయిత్రం—అంతగా మురిగ్గాటం దేశానికి మంచిదిగాదు కోటేసులవారూ — ఊరుకొంటే కొంపలు మునగటమేంది—కొట్టుకుపోతాయి.

కో : మీరున్నారుగా కాపాడటానికి — ఆచారి కూతురు సంగతి మీ కనవసరం. మీ కోడి సంగతి నాకు తెలియదు.

సా : కోణ్ణి నువ్ బట్టుకొన్నావ్.

బె : నేన్జూశా!

కో : అబద్ధం—అంతా అబద్ధం—

సా : కోసుకు తిన్నావ్—

బె : నేన్జూశా!—

ఏ : సెబాష్—వాసన కూడా వచ్చింది.

కో : అబద్ధం—అన్యాయం—మోసం - మీకిది తగదు. మీకు నాశనం మూడుతుంది.

ఏ : కోటేసులవారు పెద్దపెద్ద మాటలు సెలవిత్తున్నాడురోయ్—ఆడే నిజం చెబుతాడు—నాలుగంటితే సరి!—ఊ!

(బెమ్మం, సాంబడు కొట్టటం—కోటేసు అరవటం)

కో : ఆగండి. నన్ను చంపకండి.

ఏ : కోటేసులవారు ఏదో ఉపదేసిత్తున్నారు. ఏందేంది? చంపొద్దా? నిన్ను జంపితే ఏం లాభం? కోణ్ణి జంపితే కాల్చుకోవచ్చు, కోసుకోవచ్చు. అయినా నిన్ను జంపటం, కాల్చటం, కోసుకు తింటం వేరువేరుగా ఎందుకు?

కో : ఏందండీ ఆ మాటలు- మీ కోణ్ణి నేను కోసుకు తిన్నా -

ఏ : ముత్తెం—ముత్తెంలాంటిమాట—అచ్చర లచ్చలు చేసేమాట—

కో : మీక్కావలసిన మాట చెప్పానుగా—నన్నొదలండి· పోనీయండి. నన్నింక చంపొద్దు.

ఏ : చచ్చిపోదువులే! అయ్యా కోటేసులవారూ — నేరం ఊరికే పోదు. జరిమానా—జరిమానాపడుద్ది. కోడిరేటుఏడొందలు. తిన్నట్టు కాదు. డబ్బు కక్కు. ఇక్కణ్ణుంచి కదులు. అర్థమయిందా?

కో : కోడా? ఏడొందలా?

ఏ : ఆ! ఏమనుకొంటున్నా, అది దేవలాకోడి.

కో : ఏడొందలా?

ఏ : మళ్ళీ మాట్లాడితే ఎయ్యి! ఏదో పోనియ్యాలే అని ఏడొంద లనేశా! మాటదప్పే మనిషిని కాన్లేను. ఆరు నూరయినా ఇంకోమాట లేదు. ఏడొందలే ఏడున్!

కో : ఏకోనారాయణగారూ మీకిది న్యాయం గాదు. కోడి ఏడొంద లంటే ఎవరయినా నవ్వుతారు.

సా :
బె : (కొట్టటం)

కో : (ఏడవటం)

ఏ : ఎవరయినా నవ్వుతారా? ఏడుస్తారా?

కో : ఏడుస్తారు.

సా :
బె : (కొట్టటం)

కో : (ఏడవటం)

ఏ : ఇప్పుడు జెప్పు! ఏడుత్తారా? నవ్వుతారా?

కో : ఏడుస్తారు నవ్వుతారు, ఏడిస్తే ఏడుస్తారు. నవ్వితే నవ్వుతారు. ఏడ్చినా నవ్వినా నన్ను చంపొద్దు. మీకు డబ్బిస్తా!—నేను కోణ్ణి చంపాననికాదు, తిన్నాననీ కాదు. చావలేక, మీ దెబ్బలు తినలేక, మీకు డబ్బు కడతాను. నన్ను బోనీయండి.

ఏ : ఏడదెచ్చి కడతా డబ్బు? నీకు చిల్లి గవ్వలేదు. నెత్తిన రూపాయిపెట్టి వేలంవేస్తే పైసాకి కూడా కొనరునిన్ను—కొంటే నీకు పెట్టే తిండి దండగని భయం.

కో : నిజమేనేమో! అయినా మీ దృష్టిలో మనుషుల విలువ అంతే! ఇల్లు అమ్మి—

ఏ : ముండమోపిల్లు—అమ్మితే ఎంతొచ్చుద్ది—ఎవుడు గొంటాడు.

కో : పోనీ పొలం—

ఏ : ఏం పొలం? ఎంత పొలం? అమ్మటం కొంటం అదెప్పుడో—నాకిప్పుడే కావాలి డబ్బు!

కో : నన్ను పోనిస్తే—

సా : పారిపోదామనా?

కో : ఏడకి పారిపోతాను. ఈ ఊరు మా పాలిటి పెద్ద గోడస్తేని జ లు — మీరంతా ఉద్యోగం లేని పోలీసులు — నేనేడకి పోగల్ను—ఒప్పువేసి మీకు డబ్బు—

బె : నీ కన్నెవడిత్తాడిప్పుడు?

ఏ : మహారాజ రాజశ్రీ కోటేసులవారూ— నీ కెందుకీ తిప్పలు— ఆ పుచ్చు ఇల్లు—ఆ గొడ్డు పొలం ఏడొందలకింద గసుం డిందులో ఏం జరుగుతాదులే ఒక సంతకం ఈడబాయ్! పీడా వదులుద్ది! గాలలెస పని.

కో : నన్నొదలండి—సంతకం చేస్తా—

ఏ : ఎందుకింత వాత్తానికి నిన్నొదలటం — బలే ఆశ్చర్యమాడ తావురా కోటేసులవారూ! కట్టేసింది కాళ్ళని గని చేతిని కాదుగా-సంతకం చేసే సందుంచలే' చెయ్' ఎంగిలిముక్కలు నాలుగు పీకినందుకు—సదువు ఎంతుపయోగమో చూడు—సక్కగా సంతకం గీకొచ్చు-చెయ్ చెయ్!

కో : నన్నొదలందే చెయ్యను.

ఏ : నువ్ జేసేదేంది? నీ తల్లో జేజెమ్మ జేసుద్ది. నీ చెయ్ నరికి పట్టుకొని సంతకం పెట్టిత్తా — అంతదూరం ఎందుకు—లేచిపోని అలుపు !

సా, బె : (కాగితం తీసుకొని కోటేసును పట్టుకొని సంతకం చేయించారు.)

ఏ : ఒరే కోటేసు—నీ చేతి రాతలో ఏముందో గానొరే మూడు ముక్కల్లో—నీ యిల్లూ పొలం వాయా! ఎంత మాత్మ్యంరా నీది.

కో : మీరు వేసిన జరిమానా చెల్లించాను· నన్నొదలండి.

బె : వదిలేత్తాముండు !

ఏ : (కోపంగా బెమ్మంతో) నోరుముయ్ ! (మామూలుగా కోటేసుతో) కోటేసూ దేవుడికి దయకలిగితే ఎంతసేపు—తొందరేముంది — కాస్త ఆగు — (చుట్ట బొడ్లోంచి తీసి నలుపుతూ) ఆఁ! ఏఁవన్నా?

కో : కట్లిప్పి—నన్ను పోనిస్తే—

సా : వదిలేత్తే ఈడేం జేత్తాడోనే!

బె : ఏడిసేడు! పిల్లనాయాలేం జేత్తాడీడు !

ఏ : ఏం జేత్తావురా కోటిగా!

కో : ఇంటికి పోతా!

ఏ : ఇంటికా? ఏ ఇంటికి! ఓహో అదా! అది నా యిల్లుకదరా!

కో : వెళ్ళిపోతా! మా అమ్మను తీసుకొని, ఇల్లొదిలి, పల్లెవదిలి వెళ్ళిపోతా !

ఏ : ఆచారి కూతురో !

కో : నేరం అన్నారు. జరిమానావేశారు. ఇల్లు, పొలం రాయించుకొన్నారు. నన్ను పోనియ్యండి.

సా : పిల్లమాట తప్పిత్తావేం ?

బె : వదిలేసి పోతాళ్ళేరా పిల్లని !

కో : నన్ను పోనీయండి.

ఏ : పోదువులేద్దూ—ఇంకాపొద్దుపోలేదు—సాంబాఅగ్గిపెట్టేదిరా?

సా : (ఇచ్చాడు)

ఏ : (చుట్ట ముట్టించుకొని అగ్గిపుల్ల కోటేసుమీదికి విసిరాడు)

బె : పిల్లనా కొడుక్కాలి సచ్చేను.

ఏ : ఆడారికే వత్తాడా? పెట్రోలు పోత్తేగాని అంటుకోడు. గట్టిపేణం. (చుట్టకొరికి ఉమ్మివేసి, పొగవదిలి) సాంబా బెమ్మాన్ని తీసుకుపో! పెట్రోలు టిన్ను ఇచ్చిపంపు - సావిట్లో పెట్టేవే అది - విన్నావా?

సా : ఊఁ!

ఏ : వత్తా వత్తా ఆచారి దగ్గరకుపోయి సొమ్ము అడిగి తీసుకురా! మహానుభావులు కోటేసుగాణ్ణి చెట్టుక్కట్టాం కొట్టాం కాల్చబోతున్నాం అని చెప్పు! ఎడ్మాన్సు పోను మిగిలిం సొమ్ము అంతా తీసుకో! వాయిదాల పద్ధతి లేదని చెప్పు! కంతులవారీగా కట్టటం లేదన్నానను. నాతో మాట్టాడతానంటాడేమో ఈళ్లేదని చెప్పు! సొమ్మిఁంచి ఇల్లు గదలమను—ఎంటనే సొమ్మియ్యందే ఆ యిల్లే ఇంటిలపాదికి వల్లకాదని మనివి చెయ్!

సా, బె : (బయలుదేరారు)

ఏ : ఒరే సాంబా — కోటిగాడు గాలుతుంటే ఆచారి ఇనోదం చూత్తాడేమో రమ్మను — ఈ సినిమాకి కూతురు కూడా వస్తే తీసుకురమ్మను. కరిగించే మిండగాడు మండిపోవటం కళ్ళారా తనివితీరా చూస్తుంది — ఏంరా కోటిగా అంతగా ఆనందపడిపోతున్నావ్ — అదిరా గొప్పోళ్ళ లచ్చణం — (బొడ్లో తాళాల గుత్తి తడుంకొని) ఒరే సాంబా! (బదులు లేదు) ధూ. (లేచి వెళ్ళాడు.)

(పుల్లయ్య ప్రవేశం)

పుల్లయ్య : కోటిగా! కోటిగా! యేందిరిది ?

కో : పుల్లయ్యమామా కట్లిప్పు !

పు : ఏఁవయిందిరా?

కో : కట్లిప్పు!

పు : ఎవురు గట్టేశార్రా ?

కో : కట్లిప్పు!

పు : ఎందుగ్గట్టేశార్రా ?

కో : కట్లిప్పు !

పు : ఏం జేసేవురా? ఏమయిందిరా కోటిగా—సెప్పరా !

కో : చంపేస్తారు మామా కట్లిప్పు—నన్ను కాల్చి చంపేస్తారు—దేవుళ్ళా వచ్చావు కట్లిప్పు!

పు : ఎవుర్రా? ఎవుర్రానిన్ను గాల్చేది?

కో : ఏకోనారాయణోళ్ళు — పెట్రోలుతో నన్ను కాలుస్తారు — తేబోయారు. వాళ్ళొస్తే నన్ను ఎవరూ రక్షించలేరు. తొందరగా—మామా తొందరగా.

పు : ఆళ్ళు ఎందుగ్గాలుత్తా్రరా నిన్ను!

కో : ఆచారి కూతుర్ని నేను రమ్మనలేదు· వస్తే పొమ్మనలేదు. కోడీ కొంపా పొలం పుట్రా పెద్ద నాటకం—దెబ్బలు తినలేక కోణ్ణి తిన్నానని అబద్ధమాడాను. నిజం చెప్పి బతకలేక అబద్ధం చెప్పి బతుకుదామని ఆశపడ్డాను. బతకటంకోసం ఇల్లు పోగొట్టుకొన్నా, కూడు పెట్టే పొలం వదులుకొన్నా, పుట్టి పెరిగిన ఊరే విడిచి పెడతానన్నా—విన్లేదు మామా వాళ్ళు విన్లేదు. వాళ్ళు దెయ్యాలు — ఇంకాసేపట్లో కాల్చి పారేసే కొరివి దెయ్యాలు. కట్లిప్పు!

పు : అట్టాగా—నేనాళ్ళకి సెబుతాలేరా! నువ్ మరీ ఇది గాఁవాక!

కో : ఏం చెబుతావు — కసాయివాళ్ళతో, నీ పిచ్చిగానీ నీ మాట వింటారా వాళ్ళు - నన్ను విడిపించు.

పు : ఏడకి బోతా!

కో : ఎటన్నా—

పు : ఊరొదిలి ఎట్టాబతుకుతా!

కో : అడుక్కుతిని.

పు : నిన్నొదిలితే—నన్నొదులుతా రంటరా వాళ్ళు!

కో : వాళ్ళకెట్లా తెలుస్తుంది మామా—తెలియదు.

పు : ఇయ్యాల కాకపోతే రేపన్నా తెలవదా?

కో : నువ్వు వదిలేయకపోతే నన్ను చంపేస్తారు. వదిలినట్లు తెలిస్తే నిన్ను తిడతారు, పోనీ కొడతారు, కానీ చంపరు. నేను బతకటంకోసం ఆ మాత్రం బాధ భరించలేవామామా!

పు : నన్ను ఆళ్ళు సంపినా సంపొచ్చురా!

కో : నేను బతికుంటే మాత్రం నువ్వు చావవు. వాళ్ళను చంపయినా సరే నీ ప్రాణం కాపాడుతా!

పు : ఎందుకు వచ్చిన సావుర్రా ఇయ్యి! - మనం బతికి సచ్చేదెట్లా? ఈ వూరొదిరి పోలేం గందా? ఏ సెర్లో సేప ఆ సెర్లో బతకాలి కదరా!

కో : అయితే నేను చచ్చిపోవాలనే అంటావు—అంతేగా! —కానీలే—

పు : ఆళ్ళకి నేను సెబుతాగా—రానీ—

కో : ఏం చెబుతావు — పెట్రోలు అగ్గిపెట్టె — అంతా మంటే వాళ్ళొచ్చారే—నేను చచ్చానే

పు : సంపర్లేరా—నీకెందుకూ నేనుండగా — నువ్వట్టా సూత్తా వుండు. ఎట్టా సెప్పి అంతా సరిచేసేత్తానో!

కో : నీ ధైర్యానికీ ఆశకీ నేను ఏడవాలో నవ్వాలో తెలియటం లేదు—ఇవాళ నన్ను, రేపు నిన్ను, ఎల్లుండి నీ కొడుకును, ఏడాది తిరిగే సరికల్లా పల్లెంతా వల్లకాడు కాకపోతే —

పు : అట్టా కాదులేరా —

కో : అయితే ఇట్లాగే నీచంగా పస్తూ బ్రతుకుతూ —

పు : ఇప్పుడేఁవయిందిరిగా కోటిగా నువ్ మరీ ఇదవటమేగానీ —

కో : ఇప్పుడేమయిందంటున్నావామామా. కుక్కలకన్నా హీనంగా, పశువులకన్నా లొచ్చుగా, పురుగులకన్నా కనాకష్టంగా బతకటం బాగుందా — కొట్టినా ఉలక్క, తిట్టినా పలక్క, పెళ్ళాల కూతుళ్ళ అమ్మల అక్కల శీలం గంగపాలో, రైలు పట్టాలపాలో, నేలపాలో అవుతుంటే బాగానే వుందా — రోజంతా పనిచేసి, పొలమంతా పండించి ఏడాది పొడుగునా తిండి లేక అడుక్కుంటు దిక్కుమొక్కు లేకుండా పడి వుండటం హాయిగా వుందా — నీ పొలం, నీ యిల్లు, నీ వాళ్ళు నీవి కాకుండా పోతుంటే ఇంకేం కావాలి. తినేహక్కు, తిరిగేహక్కు, బతికేహక్కు, మనిషిననేహక్కు లేకుండా పోతుంటే ఇంకా ఏం కావాలి. మామా ఇప్పటికే చాలా అయింది. ఊరకుంటే ఇంకా చాలా అవుతుంది నువ్విలా ఊరకే వుంటావా? ఇలాగ్గా — ఇట్లా - చూస్తుండు, పెట్రోలు తెస్తారు, కాలుస్తారు. కళ్ళెదట — ఒకేఒక్క మంట—ఆరనిమంట. శాశ్వతంగా మంట నువ్వూ నీబిడ్డలు మునుపటలా కాళ్ళకింఁదయినా పడి చావాలి లేకపోతే కాలి చావాలి. అందాకా నీకు వి శాంతి లేదు. అందరిలాగ ఉంటావని ఎవడన్నా అంటే వాడి అంతు నీ కళ్ళెదుటే - చూస్తుండగానే—మామా నాశనం—కాలి, మాడి,బూడిదై, గాలిలో, నీ కళ్ళలో, నోట్లో, కూట్లో దుమ్ము — పో మామా నన్నొదిలేసి పో —

పు : నువ్ జెప్పేది మాబాగా వుంఁగాని ఒరే సూత్తా సూత్తా తప్పెట్టా జేసేదిరా -

కో : తప్పా? ఏది తప్పు మామా! నాదా? వాళ్ళదా? ఈ బతుకులదా? ఏది తప్పు! నేను పుట్టటం తప్పా! బతకటం తప్పా? చావటం తప్పుకాదా?

పు : ఆళ్ళ కట్టేత్తే—సెప్పకుండా-ఇడిపించటంతప్పుకాదంటరా?

కో : తప్పుకాదని ఎట్టామామా అనటం తప్పు! పెద్ద తప్పు! విశ్వాసంలేని పని. కుక్క విశ్వాసం గొప్పది. మామా నువ్వు పెద్ద కుక్కవి. విశ్వాసం పెంచుకో, పంచుకో. సొంతవాళ్ళని చంపుకో! ధర్మం, నీతి, న్యాయం పేరిట పిచ్చిఎక్కి నీ వాళ్ళందరినీ కలిసి పిచ్చెక్కించి చావు, చంపు, పో.

పు : ఆళ్ళమీద ఆధారపడ్డానోళ్ళం గందా — ఆళ్ళ కిట్టంలేని పనెట్టారా చేయటం?

కో : కుక్కకు కూడు విసిరివేసినట్టు నీకు పడేస్తారు. బతుకుతావు. బాగా బతుకుతావు. కుక్కను కొట్టినట్టు కొడతారు. చస్తావు విశ్వాసంగా చస్తావు.

పు : నిన్ను వదిలితే నిజమేరా కుక్కను గొట్టినట్టే — నన్నూ — ఆఁ! అంతే!

కో : నీకు దెబ్బలు తగలరాదు మామా — వద్దు - నేను చచ్చినా ఫరవాలేదు. నీలాంటివాళ్ళు బ్రతకాలి. కూటికోసం — కుక్కల్లా — కరుసుకొంటూ, అరుసుకొంటూ, నిజంగా పిచ్చికుక్కల్లా పుచ్చెలు పగిలి ఏడుస్తూ చస్తూ బతకండి—

పు : నాకేందో బాదగా వుందరా!

కో : బాధా? నీకా? మనస్కోకబాధా? ఇంకా నయం మరీ మనిషల్లే మాట్లాడకు మామా! - బాధే వుంటే — రా! మగాడిలా రా! విప్పు! నీ ప్రాణానికి నా ప్రాణం. మనం కలిసి బతుకుదాం. కలకాలం మన జనం సుఖంగా, సంతోషంగా, మనుషుల్లాగా బ్రతకటం చూద్దాం. నన్నొదులు — రా. అరుగెక్కు.

పు : ఆళ్ళక్కడ కూచుంటార్రా — నేనెట్టా ఈ కాళ్ళతో ఆడ కెక్కేదిరా?

కో : వాళ్ళు కూర్చునేచోటే నాకాళ్ళు వాళ్ళే కట్టేసి వుంచారు. ఫరవాలేదు మామా - ఎక్కు. విప్పు!

పు : (భయం భయంగా ముందుకు వచ్చాడు)

కో : తొందరగా రా మామా—తొందర—వాళ్ళొస్తున్నారు.

పు : ఆఁ! (అడుగు వెనక్కువేశాడు) వత్తున్నారా? (అటూ ఇటూ చూశాడు)

కో : తొందరగా - మామా—గబగబా-వాళ్ళు వచ్చేలోగా నన్ను వదిలెయ్—రా-తొందరగా —

పు : వచ్చేశార్రా! నిన్ను నేను వొదిలిపెట్టలేనురా—ఏమనుకోకు!

కో : అమ్మా! వాళ్ళు నన్ను చంపుతారు — పెట్రోలు టిన్ను తెచ్చేశారు

పు : లేదులేరా కోటిగా! నేను ఆళ్ళతో చెబుతాగా ఆళ్ళు నా మాటింటార్లే — నిన్నొదిలేత్తారు — నేను చెబుతాగా — నువ్వట్టుండు!

కో : (నవ్వు) నువ్వా?

పు : నీకెందుకు ఆ పూచీ నాకొదిలెయ్! సరేనా? (ఏకోనారాయణ, సాంబడు, బెమ్మం పెట్రోలు టిన్నుతో ప్రవేశం)

ఏ : ఎవ్వడదీ పుల్లిగాడా! ఏరా పుల్లిగా, ఏందిట్టావచ్చా?

పు : దొరగోరూ! మీతో చిన్న మనివి చేసుకుందారని —

ఏ : ఏందిరది?

పు : మా బుడ్డోడికేం తెలవదండి—ఎర్రోడు- ఆణ్ణొదిలేయండి— నా చర్మం వొలిచి చెప్పలు కుట్టిత్తాను.

ఏ : వొద్దురా పుల్లిగా—మీవాళ్ళు పొగరెక్కిందిరా! ఆ పొగరు చెప్పలు కాళ్ళకొత్తుకొంటాయి.

పు : అదిగాద్దొరా?

ఏ : నోరు ముయ్యిరా — ఈడుజేసింది జూశా! ఇయాల కోడి పెట్టయింది — రేపు కోడెదూడవుద్ది ఎల్లుండి — ఇంకేమన్నావుందా? సవుంటా?

పు : ఆడట్టాటోడు కాడులెండి

ఏ : మరేనా?

పు : నోరు పడిపోదూ! మిమ్మల్నెంటా అంటానుండి! ఆణ్ణొదిలేయండి!

ఏ : శానా తప్పరా పుల్లిగా-నువ్వు వొట్టి పిచ్చోడివి. ఈణ్ణొదిలేత్తే అడువుల్లోకి పోయి ముఠాగట్టుకొని నిన్నూ, నన్నూ మనల్నందర్నీ జంపటానికొత్తాడు—ఇన్నా—ఇప్పుడే సంపేత్తే పీడా ఇరగడవుద్ది—

సా : (ఏకోనారాయణతో) ఈడతో ఏంది లేనిపోంది — (పుల్లయ్యతో) పుల్లిగా — మా పనికడ్డం — పో అవతలకి.

ఏ : సాంబా — ఉప్పు జూశావా? అది తిన్నోడి ఇసాసమే ఇసాసం! మన ఉప్పు — పుల్లిగాడింటో — ఇంకా ఒక బస్తా వుంది.

సా : రేపు ఏడన్నా కూత్తే.

ఏ : పేణాలు పోతాయి. ఆడు అబద్దవాడ్డు. సత్తెఅరిచ్చంద్రుడు. ఈడి ముత్తాతకి ముత్తాతకి ముత్తాత. వొంశ గౌరం పోగొట్టుకొంటాడా?

సా : లేనిపోని తలనొప్పి! ఎందుకు ఆడు ఈడ

ఏ : మనం జెప్పినపని చేయకుండా పోయేంత తెలివి తక్కువ దద్దమ్మగాడు పుల్లిగాడు. అయినా అల్లుడికి తలకొరివి ఆడుండగా ఇంకోడు బెట్టటం ఏం న్యాయం?

కో : విన్నావా? బాగా విను చెబుతాలే వింటారులే అన్నావే! చూడు — ఏం చెప్పేవ్ — ఏం విన్నారు? మామా — ఇదింతే!

ఏ : ఈ కోటిగాడి కట్టెకి చివరి పనులు ఎవడి కులానికి తగ్గట్టుగా ఆడికి జరగాలి. నీతీ, న్యాయమూ, ధర్మమూ, ఏం కావాలి? మనం దప్పుసేత్తే దేవుడు మెచ్చొద్దూ! రేపు సొర్గంలో ఏం సంజాయిసీ చెబుతాం —

కో : ఏంమామా ? ఉలకవు పలకవు — నాకంటే ముందుగా చచ్చావా ఏం? నా తలకొరివి పెట్టటానికి కూడా ఉండవా?

ఏ : (బెమ్మంతో) పుల్లిగాడికి అగ్గిపెట్టి ఇచ్చెయ్ !

పు : అగ్గిపెట్టా ? నాకెందుకు — వొద్దు వొద్దు — దొరగోరూ నాతో ఈ పనిచేయించొద్దు. మీకు పుణ్ణెం వుంటుంది.

ఏ : నా పుణ్ణెం నువ్‌గూడా కొంచెం పంచుకోరా పుల్లిగా — తీసుకో (కోపంగా) తీసుకో.

పు : (భయంగా తీసుకొంటాడు)

కో : మామా మీ బతుకులకు విలువలు లేవనీ, నువ్వొక మర బొమ్మవనీ, ఎటు కీలుదిప్పితే అటు తిరుగుతారనీ ఇప్పటి కయినా తెలిసిందా - వ్యక్తిత్వం, నమ్మకం, బతుకు, ప్రాణం, మీదంటూ మీకేది లేదని నీకిప్పటికయినా — ఛీఛీ !

పు : అట్టా అనమాకరా ! అంతా పయోడి దయ ! మనచేతుల్లో ఏముందిరా !

కో : ఈ మెట్ట వేదాంతం కట్టిపెట్టు — నీచేతుల్లో అగ్గిపెట్టె వుంది. అది మండుతుంది. కాలుస్తుంది -

పు : అంటే ఏందిరా !

కో . పక్కనే పెట్రోలుంది. వాళ్ళముఖాన కొట్టు. ముట్టించు. మండి చస్తే, మనం బతుకుతాం.

పు : నేయం మనల్ని బతకనియ్యదురా !

కో : (ఎగతాళిగా) న్యాయం !

ఏ : సాంబా ! సంగతు సరీగ్గా ఇనరో ! కోటిగాణ్ణి పెట్రోలుతో స్నానం చేయించు.

సా : (కోటీసు వొళ్ళంతా పెట్రోలుతో తడుపుతున్నాడు)

ఏ : నీ సోకు మండిపోను ! బట్టలు తీయకుండా పెట్రోలు స్నానం చేత్తన్నావుగందరా !

కో : సాంబిగా ఇక్కడ — ఇదిగో ఇక్కడ తడవలేదు తడపరా !

సా : ఏందిరా (కోపంగా)

ఏ : సుబ్బరంగా తడపరా ! ఆడ గాలకుండా మిగిలిపోతే అన్నేయం. సుకంగా సద్దామని ఆడి ఆసె ! తడుపు !

పు : ఆణ్ణొదిలేసి పుణ్ణెం గట్టుకోండి దొరగారూ !

ఏ : (పుల్లయ్యతో) నీముకం మండ ! నాకు పుణ్ణెం ఎక్కువయి పోయిందిరా ! ఇంతపుణ్ణెం ఏం జేసుకోనూ ? (కోటేసుతో) ఏదీ ఎవుడికీ ఎక్కువుగా ఉండరాదు గదరా ! మా ఆస్తులు పంచేత్తానన్నావే ! ఈ పుణ్ణెం పల్లెంతా పంచేత్తావేంది ?

కో : ఏకోనారాయణా !

ఏ : ఏంవన్నావురా ? (కోపంగా)

కో : ఏకోనారాయణా ! — ఏకో నారాయణా అన్నాను.

పు : దొరగోరినట్టా అనొద్దురా !

కో : (ఎగతాళిగా) దొరగోరు ! వీడు ఎవడికి దొర నీకు ఏరా ఏకోనారాయణా నువ్వెవడికి దొరవి — ఏరా —

ఏ : చమించేనురా - సావబోయేముందు సరదా బాగా తీర్చుకోరా!

కో : నీ ఆస్తి మారెక్కల కష్టం - నీ ఆస్తేకాదు — నీ పుణ్యం నీ పాపం — నీ తలకాయ పంచేరోజు ఎంతో దూరంలో లేదురా ఏకోనారాయణా !

ఏ : అది సరేగానీ — నీళ్ళే సరీగ్గా దొరకని రోజుల్లో పెట్రోలు స్నానం నోచుకొన్న పుణ్ణెత్ముడివిరా! నువ్వు కారు తారు రోడ్డుమీద పోయినట్లే నీ ప్రాణం —

కో : ఏకోనారాయణా నువ్వేం చేసినా చెల్లుతుందనుకోకు నువ్వు నన్ను కాల్చలేవు — చంపలేవు.

ఏం : ఏం నీ వొళ్ళు ఇనుమా ?

కో : ఉక్కురా ఉక్కు ! నువ్వేకాదు, నీలాంటివాళ్ళు కోటిమంది మమ్మల్నేం చేయలేరు. ఇవాళ నేనొక్కణ్ణే కావచ్చు. రేపు వందలు, వేలు. నా కొడుకులు, ఉచారిమనవళ్ళు, పుల్లయ్య కొడుకులు వేలు లక్షలు. నీ కొడుకే నీకు గోరీ కడతాడు. ఇది తప్పదు.

ఏ : (కోటేసుతో) అరిసి అరిసి అలిసిపోతే సుకంగా సావలేవు - నోరు మూసుకో — (బెమ్మంతో) వాడి నోరుముయ్. గుడ్డ కుక్క. చస్తూ గావుకేకలు పెట్టొచ్చు.

బె : ఆణ్ణొదిలేత్తే పోలా !

ఏ : ఆణ్ణా ! నీకు పేణం మీద ఆసెల్లేవా ?— నాకెంతనట్టం—

బె : ఆడి ముకం ! ఆడేంజేత్తాడు ?

ఏ : పగబట్టిన తాచుపామును వదిలేత్తే ఏడంతస్తుల మేడెక్కి కాటేసుద్ది !

బె : కోరలు తీత్తే సరిపోలా ! పేణం -

ఏ : ముయ్‌నోరు - సాంతోక గొంతుకురి !కుక్క గుడ్డ.

బె : (కోటీసు దగ్గరకు పోయాడు)

కో : బెమ్మన్నా — నేను చావటం నీ కిష్టం లేదు. మామా అంతే ! మీరు చేతగాని వాళ్ళు - మీరే నన్ను చంపుతారు.

బె : ఏం జెయ్యంరా !

కో : మీశక్తి మీకు తెలియటం లేదు. అదే తెలిస్తే ఏంజేయాలో వెంటనే తెలుస్తుంది.

సా : నోరు ముయ్యరా !

ఏ : అణ్ణారవనీయరా ! చచ్చేముందు ఆయిగా అరిచ్చాననీ –

కో : సాంబిగా ! నామీద నీకు పగలేదు. నేను చచ్చినా బతికినా నీకు లాభమూలేదు, నష్టమూ లేదు. నీ కూటికోసం నా గొంతుకోస్తావు –

సా : ఏడిశేవులేరా !

ఏ : నీ గొంతుకోయాడ రా ! కాలుతుంటే చూస్తాడు.

కో : వాడొక్కడు – ఎక్కడయినా – ఏ వూళ్ళో అయినా ఏకో నారాయణ ఒక్కడే ! మనం నలుగురిమి. వాడు ఆడిస్తున్నాడు. మీరు ముగ్గురూ వెర్రిగా ఆడుతున్నారు. మీరే తిరగబడితే వాడి నీడ కూడా బతికుండదు. మీరు వాడితో కలిస్తే మీ భవిష్యత్తుకు ఆశగా బతికే నన్ను నామ రూపాలు లేకుండా చేస్తాడు. మీతో చేయిస్తాడు. చూస్తున్నారుగా, (సాంబడుతో) నీకు తెలియక, (బెమ్మంతో) నీకు తెలిసినా తప్పక, (పుల్లయ్యతో) నీకు తెలివిలేక నన్ను కాల్చుకు తింటున్నారు. మీకు తెలివెప్పడొస్తుందో – ఈలోగా ఎంత మంది చావాలో –

పు : ఊరుకోరా ఆళ్ళేం జేత్తారోను !

కో : చంపటంకంటే ఎవడైనా చేయగిలిగిందేముంది ?

ఏ : నువ్ బతికుంటే ఊరికి కట్టం – దేవుడికి పెమాదం – తొందర్లో సస్తే నీకు సుకం – (బెమ్మంతో) ఊఁ !

బె : (ఎటీక దగ్గరకు పోయాడు)

కో : నేను చస్తానని భయంలేదు. మీకోసం బతుకుదామని ఆశ పడ్డాను. నేను చావటం ఖాయం - కానీ మీరెట్లా చస్తారు. ఇవాళ నేను, రేపో మాపో మీరు ముగ్గురూ చావటమో, తొంగి చావటమో, మీ ముఖాలమిద వచ్చింది.

ఏ : ముయ్ నోరు – కుక్ గుడ్డ.

బె : అణ్ణో లేద్దామండి !

ఏ : ఏడిసెవు ! (మెడబట్టి తోశాడు)

కో : ఏకోనారాయణ మీ చివరి గడియలు ఎంతో దూరంలో లేవు.

బె : (అరుగు ఎక్కాడు)

కో : నా వొళ్ళంతా కాలకముందు కట్లు కాలి తెగిపోయాయా– ఏకోనారాయణా – నువ్వు చచ్చావే !

బె : (కోటేసు నోట్లో గుడ్డ కుక్కుతున్నాడు)

కో : నా నోరు నొక్కలేరు. నా మాట ఆపలేరు. వచ్చేసి మా కాలం – మా కాలం – కాలం – కాల –

ఏ : ఇక కాలు. (వీధిలోకి చూస్తూ జనంతో) చూసేరుగా మిడత విసురుదు. ఎట్టా కాయిద్దో సూడండి. వళ్ళూపయి గానకుండా మిడిసిపడితే పేణాలకే ముప్పు ! ఎపుడన్నా ఎవ్రేసా లేత్తే సచ్చేరే. ఇయాల నేను, రేపింకొకడు, ఏకో నారాయణలు ఊరికొక్కడు ఎల్లకాలం ఉండాలి. తొర్రిమొర్రిగా తిక్కోళ్ళని తప్పుదోవ పట్టించి పెమాదాలు తేచ్చే ఎవ్రెదవ అంతా మిడతల్లా కాలి బూడిదై మాడిపోతారు జాగర్త.

పు : (ఏకోనారాయణ కాళ్ళు పట్టుకొని) దొరగోరూ – అణ్ణివదిలి పెట్టండి (ఏడ్పు) మీకు పుణ్ణెం ఉంటుంది. దొరగోరూ !

ఏ : ఎందుకురా పుల్లిగా ఆడదానిలా ఏడుత్తావు – ముయ్ నోరు. ఈ మాట ఎక్కడన్నా, ఎప్పడన్నా, నోరెత్తావో, ఈడికి బట్టినగతే నీకు – వళ్ళు దగ్గిరుంచుకో –

పు : ఆణ్ణొదలండి. అణ్ణి బతకనియ్యండి. పోనీయండి.

ఏ : లెగవరా పైకి. అగ్గిపుల్ల గియ్. వాడికి ముట్టించు.

పు : నావల్లకాదు దొరగోరు !

ఏ : గియ్ (మెడపట్టుకొని పైకెత్తాడు)

ఏ : చుట్ట ముట్టించుకొన్నట్టేరా – ఊఁ ! ఏదీ అంటించు !

పు : దొరగోరూ ఆడు పిల్లోడు – లేతోడు – ఎర్రోడు, వదిలేత్తే మీ పేరు చెప్పకొని బతుక్కుంటాడు. కాలిత్తే అన్నేయంగా సత్తాడు.

ఏ : ఆడసలు సచ్చేడురా – నీతి తప్పేడు – అంటే సచ్చినట్టే గందా ! శవాన్ని ఎంతకాలం ఇంటో ఉంచుకొంటావురా ! తలకొరివి పెట్టొద్దా – అంతే - అంటించు !

పు : వద్దు దొరగోరూ – మీలాంటి పుణ్ణెత్ములు చెయ్యాల్సిన పని కాదిది –

ఏ : నోర్ముయ్‌రా ! గియ్.

పు : వద్దు !

ఏ : గియ్ !

పు : గియ్యలేను దొరగోరూ !

ఏ : గియ్ !

పు : గియ్‌ను.

ఏ : గియ్‌వా ?

పు : గియ్‌ను !

ఏ : అంతేనా !

పు : అంతే దొరగోరూ !

ఏ : (పుల్లయ్య మెడ గట్టిగా నొక్కుతూ) అంతేనంటావా (నొక్కి నొక్కి అడగాడు)

పు : అమ్మా !

ఏ : అంతేగదూ !

పు : అమ్మా !

ఏ : గియ్ !

పు : నన్నొదలండి దొరగోరూ — మీకు పుణ్ణెం —

ఏ : గియ్ !

పు : దొరా !

ఏ : ముయ్‌నోరు ! గియ్.

పు : నన్ను సంపొద్దు — గీతా !

ఏ : అలా రా దారికి గియ్‌రా ! ఒక దుర్మార్గుణ్ణి చంపి ఊళ్ళో వాళ్ళకి మేలు చేసేవని జనం కతలు కతలు సెప్పుకొంటారు !

పు : అల్లుణ్ణి సేజేతులా సంపుకొన్నానని ఊరంతా ఉరేస్తే పల్లె పాతేత్తదిలే —

ఏ : (పుల్లయ్య చేతులు పట్టుకొని అగ్గిపుల్ల తీయించాడు)

పు : కోటిగా ! నువ్ చెప్పినట్టింటే ఎంత బాగుండేదిరా ! నాకు తెలివి లేదురా ! దద్దమ్మని రా ! సన్నాసిని — చవటని ముద్దుని — నువ్వన్నట్టు కుక్కనిరా — తండ్రీ కుక్కని ! — నిన్నెవురు రచ్చిత్తార్రా ఎట్టారా నిన్ను కాపాడటం —

ఏ : గియ్ —

పు : ఏకోనారాయణా ! నువ్వెంతో కాలం బతకవ్ ! నీకునాసనం—

ఏ : (పుల్లయ్య చేతులు పట్టుకొని) గియ్ — (ముందుకు నడిపి) మా బాగా గీసేవురా — (ముందుకు తోస్తూ) నీ అల్లుడికి నువ్వే తలకొరివి పెట్టే పుణ్ణెం యెంత అదృట్టం. (పుల్లయ్యను ముందుకు తోశాడు)

పు : (కోటేసుమీద పడ్డాడు.) (రంగస్థల మంతా ఎర్రటి వెలుతురు) [తెర పడింది]

[తెరలో]

(గావుకేక) కోటిగా — కోటిగా - తండ్రీ కోటిగా

నిశ్శబ్దం

మాటలు

శ్రీ గజ్జెల దక్షిణామూర్తి

వీలయితే నేనే ఈ సాయంత్రం వస్తానన్న మొన్న
 నిన్ను రావద్దన్న
వీలయితే నువే వస్తున్నట్టు
నన్ను రావద్దన్నట్టు వార్త అందింది యిప్పుడే.

నీతో ఏదో మాట్లాడాలని నా ఆశ, ఆరాటం
నన్ను వినాలనో నా కింకేదో చెప్పాలనో నీ ఆత్రుత, ఆనందం.

ఈ సాయంత్రం అటుపోకుండా యిటు రాను
నీకు వీలవుతుందో లేదో ?
వీలయి నువొస్తే ఎటూ పోకుండా యిక్కడే వుండ
నాకు వీలవుతుందో కాదో ?
హృదయాలు విప్పి మాట్లాడుకోను
తీరిక లేదు, నేస్తం ! మనకు.

మొన్న కలుసుకున్న మనం
ఇవాళ మళ్ళా కలుస్తామో లేదో !
అటువంటి పనుల్లో, కష్టాల్లో వున్నాం.

అసలు, మళ్ళా కలిసి మాట్లాడుకుంటామో లేదో ఎన్నడైనా!
మొన్నటి మాటలయితే మనలో పదిలపరుద్దాం.

అయినా —
ఎప్పటికీ ఏం మాటలు, నేస్తం !
కలిసినప్పుడల్లా
కొత్త కొత్త కబుర్లే కావచ్చు మనం చెప్పుకునేది —
రంగు రంగుల మాటల మూటలే కావచ్చు మనం విప్పుకునేది—
ఎప్పటికి ఏం మాటలు, నేస్తం !

మన మాట లెన్నడో కోటలు దాటినయ్
మన కాళ్ళు గడప దాటే దెన్నడో ?
బతుకు యిట్లా వుండాలనీ, అట్లావుండాలనీ — యింకా —
 మాటలే మనకు !
బతుకు బాటల్లో నిజంగా నడిచే దెన్నడో మనం ?

శ్రీ కాసల నాగభూషణం

శిల్పంలో శ్రీరాముడు

మనిషి తనని సృష్టించిం దగ్గర్నుంచీ అతని అవసరాలను తీర్చి తీర్చి, ఆపదలను పాపి పాపి ఆఖరికి తను నిలవడానికి నీడ కూడా లేనివాడయ్యేడు దేవుడు సీతారామపురంలో.

ఆ వూళ్ళో దేవుడి పేరు పట్టాభిరాముడు.

ఎకరం కొబ్బరితోట, అర ఎకరం పంటపొలం, మరీ అంత పెద్దది కాకున్నా చుట్టూ ప్రహరీ, ఓ గిలక బావి, నడుమన పరిచిన నల్లబండల చప్టా, చెక్కలో చెక్కి నిలిపిన రెండు నిలువుల ధ్వజస్తంభం, తులసికోట, శిఖరం అర్ధవృత్తాకారంలో వున్న గర్భగుడి—ఇవీ ఆ దేవుడి మడిమాన్యాలు, గుడిగోపురాలు అన్నీ, ఈ మాత్రమయినా ఆస్తిపాస్తుల్ని అతనికి ఏర్పరచిన ఉదారత్వం ఆ వూరి మునసబు సీతారామయ్యగారిది. ఆ వూరూ ఆయన పేరుమీదుగానే స్థిరపడింది. పట్టాభిరాముణ్ణి నెలకొల్పిన కారణంగా అతని ఇంటిపేరూ 'పట్టాభి'గానే మారిపోయింది.

పట్టాభి సీతారామయ్యగారి మాటంటే ఇక తిరుగులేని రామబాణమే అతని హయాంలో. తన రోజులు చెల్లినంతకాలమూ సీతారామయ్య ఓ వెలుగు వెలిగించేడు దేవుణ్ణి. నవమి ఉత్సవాలు, దసరా వేడుకలు, ఏకాదశి వ్రతాలు, శివరాత్రి జాగరణలు - అన్నిటినీ ఏ ఒక్కదాన్నీ విడవకుండా, ఎవరికీ ఎల్లాంటి భేదభావమూ రాకుండా జరిపించేడు సీతారామయ్య ఆ రామాలయంలోనే. అయినా కాలం మారి, ఆయువు తీరి ఆయనటు వెళ్ళిపోవడంతోటే ఆ ప్రాభవమూ తగ్గింది పట్టాభిరాముడికి.

ముందు నిలిచి నడిపించే మొదటివాడు లేనందున ఆలయం ఆలనా పాలనా చూడడానికి ఓ కమిటీ కావలసొచ్చింది. అందులో చేరిన ఆ నలుగురూ నా దారి ఇటంటే నా దారి ఇటంటూ తగూలాడుకోవడం హెచ్చింది. అదే అదనని "దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే" అన్నట్టే "దేవుడి ఆస్తికి అందరూ వారసులే" అనుకుని ఎవరికి వారే చేతికి చిక్కినంతా స్వాహాచేసేసేరు. ఈ సంగతి వూళ్ళో నలుగురికీ తెలిసి ఇదేమిటని అడిగితే "ముందు వాడిదగ్గర రాబట్టండి. ఆపైన నాదేం అట్టే ఆలస్యంలేదు" అంటూ ఒకరి మీదొకరు చాటుకుంటూ కాలాన్ని నెట్టుకొచ్చేరు. పైవాళ్ళ దయాదాక్షిణ్యాలనీ, వాళ్ళ మోచేతికింది నీళ్ళనీ తిని తాగి బతికే అలపరి మూక ఆ విషయమై మరెవ్వరినీ నోరెత్తి అడగలేకపోయింది. దాంతో అటు దేవుని దారి దేవునిదీ, మనిషి దారి మనిషిదీ అయిపోయింది.

కాకుంటే ఆ మధ్యన ఓ రెండు మూడేళ్ళపాటూ ఆ గుడినంటి పెట్టుకున్న పూజారే ఏదో వున్నంతలో పూజా పునస్కారాలని జరిపించేవాడు దేవుడికి. ఉన్న తన ఒక్క ప్రాణాన్నీ ఆ రాముని సేవలోనే తరింపజేసుకోవాలనుకున్నాడు. తొందర్లోనే ఆ పూజారి కోరికా తీరింది. లేక లేక పట్టుకున్న గాలివానల్లో ఈదురుగాలికి తట్టుకోలేని ఆ ముసలి బక్కప్రాణం ఆలయం వెనక పూరిగుడిసెలో తనువుని చాలించి తనుమాత్రం అచ్యుత రామునిలో ఐక్యమైంది.

సరిగా ఆ సమయంలోనే ఆలయం పక్క ఏపుగా ఎదిగిన గంగిరావిచెట్టూ మొదలంటా నరికిం దానికిమల్లే ఫెళ ఫెళా విరిగిపడింది. పొడవైన దానికొమ్మలు తగిలి ప్రహరీ గోడంతా పూర్తిగా పడిపోయింది. ఆ వైపున ఇటుకలు రాలి గుడిగోపురమూ సగానికి సగం కూలిపోయింది. గర్భగుళ్ళో దీపంపెట్టే దిక్కులేక చీకట్లోనే చిక్కుకుపోయిన పట్టాభిరాముడికి మిట్టమధ్యాహ్నం "దిగుల్లేదు నేనున్నా"నంటూ దివ్వెటీ పట్టేడు సూర్యుడు. "ఎప్పుడో దండకారణ్యంలో వుండగా చేసేవు వెన్నెల స్నానాలు సీతమ్మవారితో. ఇదిగో అల్లాంటి అవకాశమే ఇప్పుడూ వచ్చింది. చెయ్యి" అంటూ నడినింగిని కాసేపాగి వెన్నెల్ని కురిపించేవాడు చంద్రుడు. విరామం లేక నూనె జారి జారి జిడ్డోడుతోన్న శరీరానికి నుడి తిరిగి తిరిగి హాయిగా వీచేది చల్లగాలి.

అయినా దేవుడికేది సుఖాన్నిస్తుందో, కష్టాన్ని కలిగిస్తుందో నిక్కచ్చిగా అంచనాకట్టి తెలుసుకోలేని ఆ వూరి జనం అది చూసి హడిలిపోయేరు. అంతా ఓచోట పోగయ్యేరు. ఆ రాముడి గుళ్ళో నిత్యం దీపారాధన జరక్కపోవడమే తమ బతుకుల్లో పేరుకున్న అంతటి చీకటికీ కారణమన్నారు. పడిపోయిన గుడిగోపురాన్ని బాగుచేయిస్తేనే తమకి నిలవడానికింత నీడ దొరుకుతుందనుకున్నారు. ఒక్కుమ్మడిగా అందరూ వెళ్ళి ఆ పట్టాభి సీతారామయ్యగారి సంతానం—ఆయనగారి జ్యేష్ఠపుత్రుడు-పట్టాభి పరంధామయ్యగారి కాళ్ళావేళ్ళాపడ్డారు. పాడయిపోయిన పట్టాభిరాముడి గుడినిబాగుచేసి గతించిన తండ్రిగారి యశస్సుని నిలపమన్నారు. పోయింది పోను మిగిలిన ఆ దేవుని ఆస్తిని ఇకనుంచయినా రక్షించమన్నారు. అందుక్కావలసిన పైకం ఆ తిన్న పెద్దమనుషులు ఎటూ ఇంక ఇవ్వరు గనక ఏదో తమకి కలిగినంతలో తృణమూ, పణమూ కూడబెట్టి ఇస్తామన్నారు. చివరగా "అల్లాంటి మంచి బుద్ధిని ఇంక మీకు ఆ పట్టాభిరాముడే పుట్టించాలి" అని ఆ భారాన్ని అసలు వానిమీద కూడా కొంతలో కొంతగా వుంచేరు.

గతించిన తండ్రిసీ, మీరుతప్ప వేరే గతిలేదని తన కాళ్ళు పట్టుకున్న జనాన్నీ చూసి, కానీ ఖర్చులేకుండా కొద్దిపాటి శ్రమతోనే తన తండ్రిగారి పేరుప్రతిష్ఠల్ని తిరిగి తనూ పొందవచ్చుననీ తలపోసి "మీ భరోసాతో దిగుతున్నా నిందులోకి. మీరంతా ఇచ్చిన మాటని ఎల్లా నిలబెట్టుకుంటారో చూస్తా"నంటూ ఆ భారం కాస్తా తన భుజస్కంధాలమీదికి ఎత్తుకున్నాడు పరంధామయ్య.

"పదిమంది మాట. పైగా దేవుని కార్యం. ఇవ్వాల్సిందే ఎల్లాగయినా" అని తమలో తామే అనుకుని పదో, పాతికో తమకు వీలయినంతా చందాగా కట్టేరు జనం అతని దగ్గర.

"నాగరికింత ఇచ్చుకోవాలి" అంటూ వసూలు చేసేరు కూలీల దగ్గర.

"పెదబాబులు. ఊళ్ళోకల్లా తమదే పైచేయి. వెయ్యి న్నూటపదార్లయినా ఇచ్చుకోవాలి తమరు" అంటూ ఆకాశానికెత్తి మరీ అందుకున్నారు కాపుల్నుంచి.

కరణం కామయ్యా, బడిపంతులు గోపాలయ్యా బొత్తిగా ఇవ్వకపోతే బావుండదు గనక కొంత సర్దిచెప్పుకుని తమచేత గలిగింది ఇచ్చేరు చెరో పాతికా.

ఊళ్ళో అందరి దగ్గరా కానిచ్చి చాలందానికి పొరుగూళ్ళలోనూ పేరుమోసిన కామందుల దగ్గర వసూలు చేసేరు చందాలని.

అల్లా తాము వసూళ్ళు చేస్తోన్న సందర్భంలోనే చలపతి ప్రసక్తి తెచ్చేడు వెంకటాద్రి.

"అవును పరంధామయ్యా! పద్దులో అందరి పేర్లూ వున్నాయి గాని ఆ చలపతిరావు పేరు కనబడదే" తెలిసి తెలిసీ ఓ నూటపదార్లు నిష్కారణంగా జారిపోతున్నాయే అనే బాధ వినిపించిందతని మాటల్లో.

చలపతి పేరు చెప్పగానే చిత్రంగా చూసేడు పరంధామయ్య వెంకటాద్రిని.

'చలపతి సంగతి తెలిసీ అంటున్నావా ఈ మాట? వాడిస్తాడా ఇల్లాంటి వాటికి? అడిగీ లేదనిపించుకోవడంకంటె అసలు అడక్కపోడమే మంచిది" పద్దులో చలపతి పేరుని చేర్చకపోవడానికీ, తను అతని దగ్గరికెళ్ళి అడక్కపోవడానికీ వున్న కారణాన్ని వివరించేడు.

వెంకటాద్రి కొంత ముందుకి జరిగేడు. "అదికాదయ్యా! చలపతి పిసినారి కాడు అనుకుంటే ఏదో కొంత ఇవ్వనూ ఇవ్వగలడు. కాకుంటే అతనికీ దేవుడూ, గీవుడూ అంటే గిట్టవనుకో. కానీ ఆ అడగడం మనమే వెళ్ళి అడిగితే, అందులోనూ నువ్వయితే కాదు పొమ్మని చెప్పలేడని నా అభిప్రాయం. ఆలోచించు."

"ఎమా తం గాలి వీస్తున్నా తూర్పార పట్టాల్సిందే అనే సిద్ధాంతం వెంకటాద్రిది. వీలుందని తెలియాలే గాని మొసలి నోటి నుంచయినా పెకలించుకు రాగలడు మాణిక్యాన్ని.

అతని మాటలూ కొంత పనిచేసేయి పరంధామయ్యమీద. కాసేపు ఆలోచనలో కాలాన్ని వ్యయంచేసి అన్నాడు అరుగు దిగుతూ. "అల్లాగే వెంకటాద్రీ! నీ మాటమాత్రం ఎందుకు కాదనాలి? అడుగుతాను చలపతిని. ఇచ్చేడా అది ఆ పట్టాభి రాముడి సంకల్పం. లేదా ఆ చలపతిగాడి దౌర్భాగ్యం. వెళ్ళొస్తా. నువ్వుండు...ఇక్కడే" పొగాకుకాడ ఒకటి వెంకటాద్రిముందు పడేసి తను బయలుదేరేడు కాళ్ళకు చెప్పులు తగిలించుకుని.

చలపతీ పరంధామయ్యా చిన్నప్పుడెప్పుడో కలిసి చదువుకున్నారు వీధి బళ్ళో. ఆపైన బేసిక్ స్కూల్లోనూ రెండేళ్ళు కలిసి చదివేరు.

పరంధామయ్యమాత్రం మధ్యలోనే భరతవాక్యం పలికేసేడు చదువులకి. ఇంటిపట్టున్నే వుండి పొలం పనులు చూసుకోసాగేడు. అతను పొలంపనులు చూసుకోడమంటే ఇంట్లో వాలుకుర్చీలో పడుకునే పాలేర్లని పురమాయించడం—ఇంటికి చేరిన ధాన్యాన్ని ఎప్పుడు ఎక్కడ ఎల్లా అమ్ముకోవాలో తెలిసి అమ్ముకోవడం!

మరి చలపతి పరంధామయ్యలా అంతటితో ఆగిపోక ఇ. ఎస్సెస్సెల్సీ పాస్ చేసేడు. టీచర్ ట్రెయినింగూ అయ్యేడు. అప్లికేషన్ పెట్టుకోవడమూ, అపాయింట్ కావడమూ ఒక్కమారే జరిగి ఓ మేనేజిమెంటు స్కూల్లో సెకెండరీ గ్రేడ్ టీచర్అయ్యేడు మేష్టారు గిరీని ఓ అయిదేళ్ళపాటూ వెలగబెట్టి ఆ తర్వాత ఎవరో ఆ స్కూల్ కమిటీ మెంబర్ అబ్బాయికి వాళ్ళడిగినట్టు మార్కులేసి పాస్ చేయించక మేనేజిమెంటుతో తగూ తెచ్చుకుని చిలికి చిలికి గాలివానలా తయారయిన ఆ తగువులో రాజీ కుదుర్చుకుని ఆ చోటే వుండలేక ఓ రాజీనామా గిరికి పడేసి చేస్తోన్న వుద్యోగానికి తిలోదకాలిచ్చేసేడు. వొస్తూ వొస్తూ ఇంటికి ఎవరో ఓ మొగుడు చచ్చిన పడుచు పిల్లని వెంటబెట్టుకొచ్చి, దాని విషయమై అమ్మా నాన్నలతో, అన్నదమ్ములతో పేచీపడి ఆస్తిలో తనకి రావలసిన వాటా కేటాయించుకుని, వాళ్ళతో తెగతెంపులు చేసుకుని వొచ్చేసేడు సీతారామపురానికి.

అక్కడ పాతమిత్రుడు పరంధామయ్య పలుకుబడితో వూరికి దూరంగా స్థలం కొంత కొనుక్కుని ఇల్లొకటి కట్టించుకున్నాడు. ఆ పిల్లతో అక్కడే కాపురం పెట్టేడు. తండ్రి చేస్తూ వొచ్చిన ఆయుర్వేద వైద్యంతో వున్న పరిచయంకొద్దీ తన ఇంటినే ఓ చిన్న ఆస్పత్రిగా మార్చేసేడు. ఆ ఆరెంపి సర్టిఫికెట్టొకటి తెచ్చుకుని అటు నాటు మందులతో బాటు ఇటు ఈ కాలం ఇంగ్లీషు మందుల్నీ వాడడం మొదలెట్టేడు. అదేం కలిసిరావడమోగాని అతని హస్తవాసి మంచిదనో, మనసే వెన్నపూస లాంటిదనో, చేతగలిగి ఇచ్చిందానితో సరిపుచ్చుకుంటాడనో జనం ఏ కడుపు నొచ్చినా, కాలునొచ్చినా అతని దగ్గరికే వెళ్ళేవాళ్ళు. వైద్యం చేయించుకునేవాళ్ళు.

రాత్రిళ్ళు తాగొచ్చి, చెవులు చిల్లులు పడేలా బూతులు తిట్టి, చితగ్గొట్టి అది చాలదన్నట్టు ఆకలి కడుపుల శరీరాల్ని నానా హైరానం చేసే మొగుళ్ళున్న ఆడపడుచులు.

పొలంగట్ల దెబ్బలాటల్లో అసలు కామందుల్ని అల్లావుంచి కూలికొచ్చిన జనంమీద చేతనున్న పలుగులూ పారల్తో అత్యాచారం సాగించే రైతులకింది జీతగాళ్ళా "చలపతయ్యా! ఆ పట్టాభిరాముడు మరెక్కడో లేడయ్యా! నీలోనే వున్నా"డన్నారంటే, ఇంకా అల్లాగే అంటూ వుంటారంటే అది ఆ అలగాజనం అజ్ఞానం!

అల్లాంటి చలపతింటికి అడపా దడపాగానైనా, కనీసం ఆస్పత్రి మందులకైనా వెళ్లిరావడం ఇష్టంలేని తను ఇప్పుడు పనిగట్టుకుని వెళ్లడం బావుండలేదు పరంధామయ్యకి. అయినా తప్పలేదు. ససేమిరా వాడింటికి నే వెళ్లనంటే దాన్ని మరోలా అనుకోగలడు వెంకటాద్రి.

గుడివీధి మలుపు తిరిగి చింతచెట్లు దాటుకున్న పరంధామయ్యకి దూరంగా కనిపించింది చలపతి ఇల్లు.

పొలాలమధ్య రాళ్లమిట్ట పక్కన పర్ణకుటీరంలా వుంది అది. చుట్టూ పెట్టించిన కొబ్బరిచెట్లు మనిషెత్తు ఏపుగా ఎదిగి ప్రహరీలా వుంది ఇంటికి. పైకి త్రికోణాల్లా కనిపించేట్టు నేలనుపాతిన ఇటుక రాళ్లమధ్య నడిచేడు పరంధామయ్య.

ఇంటికి కుడివేపు గోడకి చేర్చి దించిన వసారాకింద కూచుని వున్నాడు చలపతి ఎవరితోనో మాట్లాడుతూ.

తనని చూడగనే లేచి, ఎదురొచ్చి "ఏమిటో విశేషం! ఇటు మళ్లింది గాలి" అన్నాడు. చేతులు సాచి ఆహ్వానించేడు.

అతన్నీ, అతని వాలకాన్నీ గమనిస్తూ సైన్యసహాయం కోరి కృష్ణుడింటికి వెళ్లిన దుర్యోధనుడిలా అభిమానంతో అతనున్న బెస్ట్ కండిషన్‌ని అంగీకరించలేక వేగిపోతూ నడిచేడు లోపలికి.

"రోజులు మారుతా యనడానికి నిదర్శనం నువ్వివాళ మా ఇంటికి రావడమే. రా! కూర్చో" టేబుల్‌కి అటువేపుగా వున్న కుర్చీ చూపించేడు చలపతి.

దానిమీద కూచుంటూ తనకెదురుగా వున్నతన్ని చూసేడు పరంధామయ్య. పాంటూ షర్టులో వున్నాడు మనిషి. రంగు కాస్త తక్కువయినా కళవుంది మొహంలో. పై చదువులుతెచ్చిన హుందా వుంది.

అతనికేసి చూసీ చూడనట్టుచూస్తూ అనుకున్నాడు తనలో "ఎక్కడో చూసినట్టుందే ఇతన్ని" అని.

అప్పుడే అన్నాడు చలపతి "ఎవరనుకున్నావ్? మనం థర్డ్ ఫాం చదువుతోన్నపుడు మనకి క్లాస్‌మేట్. గుర్తులేదూ కృష్ణశాస్త్రి."

"ఓహో! ఆ కృష్ణశాస్త్రా! చాలా మారిపోయేడే!" అన్నాడు పరంధామయ్య.

అతన్నీ గుర్తుచేసేడు చలపతి కృష్ణశాస్త్రికి.

"ఎవరూ పరంధామయ్యా!" తనకి మరో బాల్యస్నేహితుడు కనిపించేడన్న ఆనందంతో "గ్లాడ్ టు సీ యూ" అంటూ అందుకోబోయేడు అతని చేతిని.

ఉన్నఫళంగా తన చేతిని వెనక్కి లాక్కుని "నమస్కారం" అన్నాడు పరంధామయ్య. ఏదో తెలియని కంపరం పుట్టుకొచ్చిందతనిలో. కారణం ఆ కృష్ణశాస్త్రి ఊరిచేత వెలి వేయబడినవాడు కావడం!

"ఊర్నే వెలి వేసినవాడు మనవాడు" అనేవాడు చలపతి అప్పట్లో అతన్ని చూపి.

చలపతి నిలుమన్నవాడు అట్టే లోపలికెళ్లి మళ్లీ వొచ్చి కూచున్నాడు వాళ్లమధ్య టేబుల్ వెనక కుర్చీలో.

"ఏం చేస్తున్నావు నువ్విప్పుడు?" అడిగేడు పరంధామయ్య కృష్ణశాస్త్రిని లాంఛనంగా.

"మెడిసిన్ చదివేను. డాక్టర్‌గా వున్నాను మదనపల్లి శానిటోరియమ్‌లో. ఎవరో పేషెంట్‌ని తీసుకుని అక్కడికొచ్చి అనుకోకుండా కలిసేడు చలపతి. లేదంటే ఈ ప్రాంతాలకే వొచ్చేవాణ్ని కానేమో నేను" చెప్పుకున్నాడు కృష్ణశాస్త్రి.

"అల్లాగా? సంతోషం!" అన్నాడు పరంధామయ్య.

"ఇంతకీ అసలు సంగతి చెప్పేవు కావు" చలపతి అడిగేడు పరంధామయ్యని.

ఇటూ అటూ ఇద్దర్నీ చూసి, చెబుదామావొద్దా అని సంకోచించి ఎల్లాగో చెప్పేడు పరంధామయ్య "పడిపోయిన పట్టాభిరాముడి గుడిని బాగుచేయిద్దామని అనుకుంటున్నాం.

అందుకేవో వూళ్లో చందాలు వసూలుచేస్తూ..." నసిగేడు తర్వాత చెప్పక.

"అయితే నా దగ్గరికీ చందాకోసమే నన్నమాట రావడం" తనే అందుకుని అన్నాడు చలపతి. చివరగా నవ్వేడు.

ఆ నవ్వుతో దేవుడి పేర చందా చలపతి యివ్వడన్న అనుమానమే బలపడింది పరంధామయ్యకి.

"అది కాదు. ఊళ్లో నలుగురికీ వుపయోగం వున్నపని. అందుకని..." అని ఇంకా ఏదో అతనబోతోన్నంతలో లోపల్నుంచి వొచ్చింది ఒకావిడ.

కాఫీగ్లాసులు టేబుల్ మీదుంచి ట్రేతో వెళ్ళిపోయింది మళ్లీ లోపలికి.

"ఇంత బావుంది గనకే లేపుకొచ్చేడు వీడీ పిల్లని" అనుకున్నాడు పరంధామయ్య. ఆమెని చూసి.

చలపతి ఓ గ్లాసుని కృష్ణశాస్త్రి కిచ్చి అదే చేత్తో మరో గ్లాసుని ఇచ్చేడు పరంధామయ్యకి.

పరంధామయ్య అందుకున్నాడు కాఫీ గ్లాసుని. చూసేడు కృష్ణశాస్త్రి వంక, చలపతి వంక. గ్లాసుని పెదాల దగ్గరికి తీసి కెళ్లేడు. కృష్ణశాస్త్రి తాగుతోన్న గ్లాసే చేతులుమారి తన దగ్గరి కొచ్చిందనిపించింది అతనికి. కడుపులో చెయ్యుంచి దేవినట్టయింది.

''మరేం అనుకోకు చలపతీ! కాఫీ తాగడం మంచిది కాదని మానుకుంటున్నా నీమధ్య. ఏం చేద్దాం? చూస్తే మాత్రం తాగా లనిపిస్తుంది. అయినా వొద్దులే. చెరుపు చేస్తుందని తెలిసీ చెయ్యడం ఎందుకు కాని పని?'' అంటూ అల్లాగే పెట్టేసేడు కింద.

''కాఫీ, టీలు మంచివి కావని మా డాక్టర్లే అనుకోడంలేదే'' తిన్నగా నవ్వుతూ చెప్పేడు కృష్ణశాస్త్రి.

కాఫీ తాగడం ముగించి ఇద్దరూ గ్లాసులుంచేరు పక్కన.

చలపతి టేబుల్ సొరుగు లాగి, సిగరెట్ పేకేట్ బయటికి తీసి చూసి ''అయ్యో అయిపోయేయే'' అంటూ పడేసేడు టేబుల్ కింది బాస్కెట్‌లో.

''నా దగ్గరున్నయ్'' పాంటు జేబులో చెయ్యిదిరి కొత్త పేకెట్ తీసేడు కృష్ణశాస్త్రి. అందులోంచి తనొకటి తీసుకుని, చలపతి కొకటిచ్చి పరంధామయ్య ముందుంచేడు కవర్ తెరిచి.

''చెడ్డదేనట దీన్ని తాగడమూ. మానేసేవా కొంపదీసి – దివాలా తియ్యగలవ్ సిగరెట్ కంపెనీయి'' నవ్వుతూనే అని సిగరెట్ అంటించుకున్నాడు చలపతి అగ్గిపుల్ల గీసి. కృష్ణశాస్త్రి వుంచుకున్న సిగరెట్‌నీ అంటించేడు తనే.

చేసేదిలేక తనూ ఓ సిగరెట్ అందుకుని వెలిగించుకున్నాడు పరంధామయ్య. అంటీ అంటనట్టు పీల్చేడు దాన్ని. ఎప్పుడూలేనిది అతని కళ్ళవెంట నీళ్లని తెప్పిస్తోంది ఆ పొగ.

''మరి అవతల చాలా పనులున్నయ్ చలపతీ! నే వెళతా' అంటూ లేవబోయేడు పైకి.

''అప్పుడేనా? వొచ్చిన పని కాకుండానే'' అన్నాడు చలపతి.

''అంటే...'' అనుమానంగా చూసేడు పరంధామయ్య.

''ఏదో చందా అన్నావుగా. ఇస్తా తీసికెళ్ళ'' లాల్చీ జేబులు తడిమి తీసేడు నోట్లు వెలుపలికి.

''ఎంతిమ్మంటావ్?'' అడిగేడు నవ్వుతూనే.

చలపతిని నమ్మడం అటుంచి తన కళ్లని తనే నమ్మలేక పోయేడు పరంధామయ్య.

''ఏ మాటా అనకుండా ఇస్తానంటున్నా డేమిటి వీడు?'' అనుకున్నాడు. జేబులోంచి ఓచిన్నపాటి పుస్తకాన్ని తీసేడు. పేజీలు కొన్ని తిరగేసి ఓచోట చూసేడు.

భక్తాగ్రేసరుల అడ్రెసులతో బాటుగా విరాళాల వివరాలూ వున్నాయి అందులో. వాళ్ల వాళ్ల అంతస్తుకి తగ్గట్టు ఉన్నంతలో ఉడుతాభక్తి ముడుపులు చెల్లించేరు వాళ్లంతా.

''ఇదిగో లెక్కెట్టుకో నూట పదార్లున్నాయి'' అంటూ డబ్బులిచ్చేడు చలపతి.

''ఇందులోరాయ్ నీ చేత్తోకే'' డబ్బు లందుకుని ఆ పుస్తకాన్ని ముందుకి జరిపేడు పరంధామయ్య.

''ఉండనీ...నా చెయ్యెందుకులే మధ్యలో'' అని దాన్నల్లాగే వుంచేడు చలపతి.

డబ్బుల్నీ, పుస్తకాన్నీ ఒకేమారే జేబులో వుంచుకుని ''మరి నే వెళ్ళిరానా?'' అని లేచేడు పరంధామయ్య.

''అయితే ఒక్కమాట'' తనూ లేచి అన్నాడు చలపతి ''ఇల్లాగా నేనివ్వడం నాకెక్కువైకాదు. పుణ్యం మూటగట్టుకుండా మనీ కాదు. కేవలం స్నేహితుడివి ... ఇంతదూరం వెదుక్కుంటూ వొచ్చావే అనే ...'' ఆప్యాయంగా వీపు చరిచి సాగనంపేడు చలపతి.

మాట వరసగానైనా కృష్ణశాస్త్రితో వెళ్లొస్తానని చెప్పకుండా అదేదో నరకాన్నుంచి బయటపడ్డవానిలా ఫీలవుతూ చకచక నడిచేడు పరంధామయ్య.

నడుస్తూ సాయంత్రం అయి ఇంటివారి పట్టిన కూలీలని చూసేడు. వాళ్లలో మగాళ్లని మినహాయించి, ముసలోళ్లనీ, కుర్రాళ్లనీ తప్పించి వయసులోవున్న ఓ పిల్లపైనే తన కన్నని నిలిపేడు. ఆ ఒంటి ఒడుపులతోనే తన చూపుల్ని నడుపుతోన్న పరంధామయ్యకి ఠక్కున గుర్తొచ్చింది మధ్యాహ్నం సీతాలు చెప్పి పంపిన మాట.

ఈ ఏడాది ఎల్లాగయినా చిరువాళ్లకి రంగమెళ్లాలంది అది. ఎల్లా లేదన్నా ఓ వంద రూపాయలవుతుంది ఇద్దరికీ. ఉన్నట్టుండీ అల్లా ఇబ్బందిపెట్టి అడిగితే ఎక్కడి నుంచి తేగలడు తను డబ్బుల్లేని సమయంలో.

''ఛీ వెధవముండ! ఎప్పుడడగాలో తెలీదు'' గొణుక్కున్నాడు పరంధామయ్య. ఊరు చేరుకున్నాడు.

''ఏదోలాసర్ది దాని ముచ్చట తీర్చాల్సిందే. లేదంటే దగ్గరికి చేరనివ్వదు సానిముండ'' అనుకుని అంతలోనే ఏదో ఉపాయం తట్టినట్టు చలపతి ఇచ్చిన ఆ నూటపదార్లూతీసి రొండిన పంచెకట్టులో దోపుకున్నాడు. వీధిమలుపు తిరిగేడు.

అక్కడే ఎదురయ్యేడు వెంకటాద్రి ''ఏం పరంధామయ్యా! ఏమన్నాడు చలపతి? ఇచ్చేడు కదూ'' అడిగేడు ఇచ్చివుంటాడన్న నమ్మకంతోనే.

సమాధానంగా ముందుగానే ఓ నవ్వు రువ్వుతూ అన్నాడు పరంధామయ్య — "నే చెప్పలా అప్పుడే ... ఆదర్శాల మనిషని! ఇల్లాంటి మంచి పనులంటే గిట్టవు అతగాడికి."

వెంకటాద్రి విస్తుపోయేడు.

"పోనీలే పరంధామయ్యా! వాని పెడసరంబుద్ధులు వానివి. మధ్యలో మనమేం చేస్తాం? అంతా ఆ రాముడే చూసుకుంటాడు" వీధి మొగనవున్న పట్టాభిరాముడి గుడికేసి చూపుతూ అన్నాడు వెంకటాద్రి.

పరంధామయ్య బొండిని ఓమారు తడిమి చూసుకున్నాడు.

ఏ శిల్పి మలిచేడోగాని అతన్ని అంత పనీ తన కళ్లెదుటే జరుగుతోన్నా ఆ చిరునవ్వు మొహంతోనే వున్నాడు శ్రీరాముడు!

ఒంటరి ఆకాశం

శ్రీ రామచంద్రమౌళి

కోనిఫర్ చెట్లు
యీ నేల పర్వతాల పిడికిలితో ఆకాశంలోకి విసురుతున్న
యినుప బాణాల్లా కనిపిస్తాయి నాకు
పిడుగులనూ, సముద్రాలనూ వర్షించిన యీ ఒంటరి
ఆకాశం
ఎంత నిర్మలంగా నవ్వుతూంటుంది యీ ఎండాకాలపు
సాయంకాలాల్లో
అప్పుడు
కొండల్లో కష్టించే యీ దేశపు నా అమాయక జనమే నా
నిండా నిండిపోతారు—తీయని స్మృతులై
వాళ్ళ నీలాల కళ్ళు
ఒట్టి నవ్వే తెల్ల గన్నేరు పూలు
మట్టిలోనుంచి పుట్టిన వాళ్ళ శరీరాలు
బండల్లా మెరుస్తూ
వెన్న గుండెలో ఓ మండే నిప్పును కాపాడుకుంటూంటాయి
భద్రంగా —
పిల్లి పంజా విప్పినపుడు ఎంత భయంకరంగా వుంటుందో
కుర్చీలో కూర్చుని నవ్వేవాళ్ళకు తెలిసేవుంటుంది —
హహ్హాహ్హా ... పిచ్చివాళ్ళు...!
దేశాన్ని నగరాల్లోకి తరుముకొస్తున్నారు
బందెల దొడ్లోకి పశువులను తోలుకొస్తున్నట్టు —
మళ్ళించండి యీ దారిని పల్లెల వనాల్లోకి,
గ్రామాల గవాక్షాల్లోకి —
లేకుంటే నీ గతి
పసివాడు పాలకోసం స్తనాన్ని విడిచి బొటన వేలును
చీకుతున్నట్లుంటుంది—

అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
అముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది.

మూడు
సైజులలో
లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి

అమృతాంజన్ ఆముదము

OBM 3270/3 TGIRIR

శ్రీ ఎ. భూమయ్య

వేదనా వాసుదేవము

'వేదనా వాసుదేవము'ను నాయని సుబ్బారావుగారు తమ ఉద్యోగ విరమణానంతరం [1] 1958లో వ్రాయటాని కుపక్రమించి 1962లో ముగించారు. 'సౌందర్యలహరి' రచనానంతరం దాదాపు ముప్పదియైదు సంవత్సరాల తర్వాత ఈ వేదనా వాసుదేవ రచన సాగింది. ఈ కాలంలో ఉద్యోగంలో ప్రవేశించటం, జీవితాన్ననుభవించటం, ఉద్యోగ విరమణం జరిగాయి. ఈ మధ్యకాలంలో కవి చెప్పకోదగిన కవిత్వం వ్రాయలేదు. కవి ఇదివరకు ప్రణయరూప దేవతారాధనం చేశాడు, మాతృరూపదేవత నర్చించాడు. సౌందర్య, సౌజన్య, వాత్సల్యమూర్తియైన జగన్మాతను స్తోత్రం చేశాడు. ఇక జీవితానుభవ ఫలంగా కలిగిన ఆవేదన వాసుదేవాత్మకమైన దేవతాన్వేషణంగా రూపుకట్టింది. జగత్తునంత వ్యాపించి యున్నవాడు,[2] తనలో సమస్తమైన జగత్తు కలవాడే వాసుదేవుడు.[3] ఈయన విరాణ్మూర్తి. ఇట్టి వాసుదేవుని భూతాధికాల్లో కవి దర్శింప నారంభించాడు. పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుడు సృష్టి సమస్తంలోను భగవంతుని చూడగలిగినవాడు.[4]

> "బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
> వాసుదేవః సర్వమితి సమహాత్మా సుదుర్లభః"
> (భగవద్గీత.7–19)

అని వాసుదేవుడు చెప్పినట్టి సుదుర్లభుడు ప్రహ్లాదుడు. వాసుదేవుడిచ్చిన దివ్యచక్షువు చేత అర్జునుడు ఆయన విరాట్స్వరూపాన్ని చూడగలిగాడు. అనేక విధాలుగానున్న జగత్తును వాసుదేవుని శరీరమందొక చోటనే చూశాడు.[5] శ్రీ అరవిందులును వాసుదేవుడిచ్చిన లోతైన దృష్టి(Deeper vision) చేతనే సృష్టిలోని ప్రతి వస్తువులోను వా సు దే వు ని దర్శింపగలిగారు.[6] శ్రీ అరవిందుల కిట్టి దివ్యదర్శనం మొదట జైలులో కలిగింది. జైలు గోడల్లోను, అక్కడి వృక్షాల్లోను, ఖైదీల్లోను, తనపై కప్పబడిన వస్త్రంలోను శ్రీ అరవిందులు వాసుదేవున్నే చూడగలిగారు.[7] చరాచర లోకంలోని సమస్త భూతజాలమునందును వాసుదేవునే దర్శింపగల్గటం నిరంతరం వాసుదేవుని స్మరించటంవల్ల కలుగుతుంది.[8] కవి ఈ మార్గాన్నే వాసుదేవుని నిరంతరం భావన చేశారు.[9] ఈ భావన ఆయనలో బీజభూతంగా చిన్ననాటినుండి యే కలదు కావలెను తల్లిదండ్రుల గూర్చి ఆయన పేర్కొన్న పద్యాల్లో (వేదనా. 11–5,6) వారి ముద్ర ఆయన బాల్యమందే యెట్లు పడిందో స్పష్టం చేయబడింది. ఈ బీజభూత భావన క్రమంగా వికసించి ఒక విచిత్రవేళలో ఆయనలో ఈ కావ్యంగా రూపొందింది.

వాసుదేవతత్త్వం పురుషసూక్తము'లో వైదిక ఋషి ప్రోక్తమై యుంది. దీని విస్తరణ భగవద్గీతలోను, 'శ్రీవిష్ణు సహస్ర నామము'లలోను ఉంది. కావ్యంలో ఒకచోట (6-3) 'గీతారహస్యాకృతీ' అను సంబోధన ఉంది. వాసుదేవతత్త్వమే గీతా రహస్యము. అట్టి వాసుదేవ తత్త్వాకృతి కవికి దర్శనమైంది.

విశిష్టాద్వైత సంప్రదాయంలో సాధకుడికి అర్థపంచక జ్ఞానముండవలె. అవి - 1. స్వస్వరూపజ్ఞానం, 2.పరస్వరూపజ్ఞానం 3. పురుషార్థ స్వరూపజ్ఞానం, 4. ఉపాయ స్వరూపజ్ఞానం 5. విరోధి స్వరూపజ్ఞానం. ఈ గ్రంథంలోని భావపద్ధతిని నిశితంగా పరిశీలిస్తే ఈ అర్థపంచకా లిందు చెప్పబడియున్నట్లు కనిపిస్తాయి.

1. స్వస్వరూప జ్ఞానం :

మానవున కేదైన ఆపద కలిగినపుడు దానికి కారకులైన వారిపై కోపించటం లోకంలో సాధారణంగా కనిపిస్తుంది. కవి పక్షమున నిట్లు జరుగలేదు. కవికి ఒక వేదన [10] కలిగింది. తన వేదన కంతటికి కారణమైన వాసుదేవునకు తన వేదనను నివేదించుకొంటున్నాడు. కవి పుట్టిన గ్రామాన్ని విడిచి విద్యాభ్యాస కాలంలోను, ఉద్యోగంచేసే కాలంలోను పెక్కు గ్రామాలు తిరుగవలసివచ్చింది [11] పిదప హైద్రాబాదులో స్థిరపడినాడు. హైదరాబాదులోని తన నివాస కాలాన్ని అజ్ఞాతవాసంగా పేర్కొన్నాడు. "నన్నజ్ఞాత వాసమ్ము సేమ్మన్నావెందుకు" (1-2) ఇట్లు పలు గ్రామాలు, పట్టణాలు తాను తిరుగవలసి వచ్చినందుకు కవి వేదన పడినాడు.

> "పుట్టిన గ్రామమున్ విడిచి పొమ్మని మిత్రుని సాకతమ్ముననన్
> మెట్టిన యూరు కాదని సమీకృత సంకర సర్వ సభ్యతా
> ఘట్టము సర్వసంస్కృతి వికార నికార ఘరట్టమైన యూ
> కొట్టములోన తెచ్చి పడగూర్చితి వెంత దయాపరుండవో"(5–3)

అని వాసుదేవుని నిర్దయను కవి పేర్కొన్నాడు. ఈ విషయమే కావ్యంలో మరికొన్ని చోట్ల తెలుపబడింది. "నను నిర్వాసితుఁజేసి సేతు హిమవన్మధ్య స్థలిన్ దైన్య భాజన తన్ త్రిప్పెదవయ్య." (3-5) "అరవిప్పెనీ కటాక్షాంతసంజాతాజ్ఞావధిలోని బొంగరనులుంగాసర్వగోళమ్ముళీ నీత్రిప్పుడు దిక్కుమాలితిరుగున్నికిన్నకుంబాత్రమై '(5–2).వాసుదేవుడు శ్వేత ద్వీపవాసి. ఆయన "హిరణ్య స్కంధ రమ్యాష్ట చక్రసిరూథావృత తీవ్రవేగ శకటాంకస్థాయియై క్షీర తోయనిధి ప్రాంత వినోద సంతత విహారాఢ్యుడౌ స్వామి." ఆయనట్లుండి కవికి "పాదద్వయ భూప్రదక్షిణము నిశ్శ్రేకీడగా కూర్చి"నాడు. ఇందుకు కోపించి కవి తనలోనుండి వాసుదేవుని

మద్వాసితునిగా జేసి తన గుండె గుడి తలుపులు మూసికొనినాడు. అట్లు చేసినప్పటికి వాసుదేవుడు తలుపు త్రోసికొని తన యెదలోనికి వచ్చి గిల్గింత పెట్టి తనను ''కోరకిత మందార ద్రుమసంకాశు''నిగా చేశాడు. కవికి తన తప్పు తెలిసి వచ్చింది. పిపీలికాది బ్రహ్మ పర్యంతం వ్యాపించియున్న వాసుదేవుడు ఒక తన యెదలోనే లేకుండు టేమి? ఆయన సర్వజీవ హృదయస్థుడు. ''తప్పవచ్చెన్ బిగించనులే తల్పిక'' అని వాసుదేవుని శరణాగతి కోరినాడు కవి. కోపంతో భగవంతుని కాదనటం పిదప తప్పు తెలిసి ఆయననే శరణు కోరటం ఇక్కడ జరిగింది.

వాసుదేవుని చేరకుండ ఇంద్రియాలు తన నడ్డగిస్తున్నాయని గుర్తించి కవి తన అధీనంలో లేని ఆ ఇంద్రియాలను మర్దింపుమని వాసుదేవుని హృషీకేశత్వాన్ని గుర్తుచేస్తున్నాడు. భగవంతుని చేరటానికి యమ నియమాదులు సాధనాలు. అవి కవికి సాధ్యమవటం లేదు. 'సేంద్రియ చిత్తవృత్తి మోక్షసహిత బోధవల్లరులు సాగక' పోయినప్పటికి వాసుదేవ స్వరూపాన్ని పొందడానికే కవి ప్రాణాలు పొరలాడుతున్నాయి. అయినా తన కాయన చిక్కటంలేదు. 'నను నెట్లుం గడతేర్పజాలని భవన్నాథత్వ మేపాటి! నా మనసిట్లూరక దుఃఖవహ్ని మరగింపన్ సేమమా నీకు!'' అని ప్రశ్నించి తన కెదీ చేతకాదనుకో గూడదని కవి ''పేను — పెసరచేను'' కథను భగవంతునికి గుర్తు చేస్తున్నాడు. ఒకప్పుడు భూమ్యాకాశాలు పట్టని రూపంతోను, మరొకప్పుడు పొడగానరాకుండ అణూదర మం దడగి ఉండటంవల్ల వాసుదేవుని తాను చిక్కించుకోజాలనన్న అశక్తతను వెల్లడించి తాను పట్టుకోవడానికి వీలుగా దయతో సుస్థిరంగా నిలిచి ఉండుమని వాసుదేవుని కవి వేడుకొంటున్నాడు. సంసారంలో కొట్టుమిట్టాడుతున్న వారికి భగవంతుని సాక్షాత్కారం కాదు. విషయ వాసన లందుకు కారణం. దివ్యచింతనవల్ల అవి నశిస్తాయి. 'నే'దన్నదేది లేకుంటే ఆ దివ్యచింత కలుగుతుంది. తన కిట్టి దివ్యచింతనను ప్రసాదింపుమని కవి వాసుదేవుని శరణాగతి కోరుతున్నాడు.

కవికి ఒక్కగా నొక్క కొడుకు. అతడు పెండ్లి చేసుకోవడానికి కిష్టపడటంలేదు. శాఖోపశాఖలై పెరల వలసిన వంశవృక్షం తెగిపోనుంది. ఇది కవికి వేదన కలిగించింది. కారకుడైన వాసుదేవుని కోపిస్తున్నాడు—

''ప్రాంశుప్రోద్ధ విన్రమూర్ధ చలన ప్రస్తార సౌభాగ్యముల్
వంశాంకూరములెల్ల పిదు విటయ వ్యాపార సంరంభని
స్త్రింశో ద్గ్రత ముక్కముక్కలుగ విచ్ఛేదమ్ములై గాని నీ
వంశీగాన నిరంతర వ్యసనముల్ వర్షింపవా భూమిపై''.(12–2)

ఆవేశంలో ఇట్లా వాసుదేవుని నిందించాడే కాని అది అవివేకమని కవి తెలుసుకున్నాడు. వాసుదేవుని ప్రపంచ ఘటనా కార్యక్రమమ్మందు తన భవితవ్యార్థములెల్ల భద్రములని కవి మొదట భావింపలేదు. ఇట్లు భావింపక వాసుదేవుని నిందించిన తన అవివేకాన్ని సహించి రక్షింపుమని కవి వేడుకుంటున్నాడు. తనలోని ఆర్తివల్ల తానా వాసుదేవుని నిందిస్తున్నాడు. నిజానికి వాసుదేవుని నిందిస్తుంది తాను కాదని, వాసుదేవుడే తన నోట ఇట్టి నిందా స్ఫురదార్త వాక్యాలు పలికిస్తున్నాడని కవి భావించాడు. తన జీవితంలో అనిశ్చలత ఏర్పడి వేదన కలిగి ఆవేశంలో వాసుదేవుని నిందిస్తున్నాడు కాని అది వాసుదేవుని తప్పుకూడ కాదంటున్నాడు కవి. తన బ్రతుకట్లవడానికి కారణాలు తన పూర్వజన్మ కర్మానీకములు. తన అదృష్టము మాత్రమేనట.

కవి సంతుష్టాంతరంగుడు. తన జీవితము నెడల తనకు తృప్తి.

''నా పత్నీ రమణీ సుధా ప్రణయితా నందమ్ములం దేలితిన్
నా పుత్రీ విదుషీ యశో విసర విన్యాసమ్ములం బొంగితిన్
నా పుత్త్రుల్లను పండె నీదు చలువన్ మానాథ! సంసార సౌ
ఖ్యా పూర్ణమ్ముగ నేమి కావలయునయ్యా యింక నాకిచ్చటన్''
[12-8.]

తనకు కావలసింది, మోక్షమే. ''ఎన్ శీఘ్ర ప్రక్రియ నిన్ను చేర్చు కొను మంతే మోక్ష లక్ష్మీశ్వరా.''

ఏదో వేదన పుట్టి వాసుదేవుని నిందించియు అది తన అవివేకమని తెలిసి తన ఆ తప్పును క్షమింపుమని వేడుకొని ఆయనను చేరకుండ అడ్డగిస్తున్న ఇంద్రియాల నెటిగి వాటిని మర్దింపుమని వేడుకొని ఆయన తనకు సంసార సౌఖ్యాపూర్ణమైన జీవితాన్ని ప్రసాదించినందులకు భగవంతుని దయను కొనియాడి తనకు మోక్షమును ప్రసాదింపుమని కవి వాసుదేవుని శరణాగతి కోరుతున్నాడు.

2. పర స్వరూప జ్ఞానం :-

వాసుదేవుడు పరమ పదానికి అధిష్ఠాత. అది అగమ్యగోచరమైంది.

''నీవు వాసుదేవ భావ విస్మృతి నొక్క
కొండ కొమ్ము నెక్కి కూరుచుండి'' [1.1]

అని కావ్యాదిలో పరమ పదస్థుడైన వాసుదేవుడు పేర్కొబడ్డాడు. వాసుదేవుడు శ్రీయుతుడు. ''శ్రీమంతుడవేగా''అని కవి వర్ణించాడు. వాసుదేవుడు శ్రీయుతుడని ద్వయ మంత్రం చెప్పుతుంది. ''శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయనమః''. శ్రీ లక్ష్మీదేవి వల్లనే వాసుదేవు డట్టి మహోన్నత పదాన్ని అలంకరించాడు. ఆమె శక్తి స్వరూపిణి. ఆమె వల్లనే వాసుదేవుడు స్పందన శక్తిని పొందుతున్నాడు.

భగవద్భక్తుల్లో కొందరు విష్ణు భక్తులు, కొందరు శివ భక్తులు. ఆయా భక్తులకు ఆరాధ్యులైన హరిని, హరుని వేర్వేరుగా పేర్కొన్నాడు కవి. లోకంలో హరిహరనాథ తత్త్వమొకటుంది. దాన్ని పేర్కొని కవి పిదప వేదాంత ప్రతిపాదితుడైన వాసుదేవుని

పేర్కొనటాన్నిబట్టి చూడ కవి దృష్టిలో మోక్షప్రదాతయైన వాసుదేవుడే పరతత్వమని కవి సూచించినట్లుగా భావింపవలయును.

పురుష సూక్తంలో పరమ పదస్థుడైన భగవంతుని వర్ణన ఇట్లు కావింపబడింది. "సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్." ఆయన సహస్రశీర్షములతోను, సహస్రాక్ష, సహస్ర పాదములతోను, ఉండి ప్రకృతిని ప్రవర్తింపచేయునట్టి విరాణ్మూర్తి. ఇట్టి పరతత్వ నిరూపణయే "వేదనా వాసుదేవము"న కావింపబడింది.

"కరములు పాదము లక్షులు
శిరములు వేయేసియైన చెలువము." [2.1]

3. పురుషార్థ స్వరూప జ్ఞానం :-

ఇది ఫల స్వరూపం. వాసుదేవుడు మోక్ష ఫల ప్రదాత. మోక్షమును పొందిన వారికి పునర్జన్మ ఉండదు. ఆ ప్రాణి జన్మ చరితార్థమౌతుంది.[12] మోక్షాన్ని పొందగోరే సాధకుడు రాగ మూలచ్ఛేదం చేయవలె. దానిని తనకు తానై తొలగించుకోజాలని వాడనని తన హృదంతర "రాగమూల నిర్మూలనముగా భవమ్ము చరితార్థము సేయుదె" అని కవి వాసుదేవుని వేడుకొంటున్నాడు. తన 'ఆస్తికతా వీధిని నిరంతరోజ్జ్వలము'గా ప్రకాశింపజేయుమని కోరుతున్నాడు.

నవ విధ భక్తి మార్గాల్లో చింతన ఒకటి. నిరంతర దివ్య చింతనవల్ల వాసనలు నశించి హృదయంలో భగవన్మూర్తి ప్రకాశిస్తుంది. లౌకికములైన ధనాదికములయెడమమకారాన్నుజ్జగించినగాని భగవంతునిగూర్చిన దివ్యచింతన కలుగదు. కవి ఇట్టి దివ్యచింతనను కోరి "నా సర్వమ్ము భవత్పదార్పితముగా నందింతు"నని వాసుదేవుని శరణాగతి కోరుతున్నాడు.

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అను నలుగురిలో జ్ఞానియే భగవంతునకు ప్రియమైన భక్తుడు[13] నిరంతరం వాసుదేవునియందే మనసు లగ్నంచేసి సేవించినవారికి ఆయనయే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.[14] ఇట్టి తత్వజ్ఞానం వలన అజ్ఞానం నశించి అంతఃకరణం జ్ఞాన దీపంతో ప్రకాశిస్తుంటుంది.[15] ఇట్టి జ్ఞానాన్నితనకు ప్రసాదింపుమని కవి వాసుదేవుని కోరుతున్నాడు – "నాకు దివ్య రూపధరణమ్ముల నిక్కపు తెల్పినీయవే." [10.4]

ఇంద్రియాలను మనోబుద్ధులను జయించినవాడే మోక్ష పరాయణుడు.[16] తన అధీనంలోలేని ఇంద్రియాల కుపసంహారాన్ని శాసించి వాసుదేవుని తనకు మోక్షాన్ని ప్రసాదించుమని కవి వేడుకొంటున్నాడు. "నిత్యతృష్ణా ప్రఘాతోన్మది తేంద్రియాళి కుప సంహారమ్ము శాసించినన్ శీఘ్రప్రక్రియ నిన్ను చేర్చుకొనుమంటే మోక్షలక్ష్మీశ్వరా."

భగవంతుడు భక్తసులభుడు.[17] "సులభుడవంట భక్తులకు" [11.2] అని కవి భగవంతుని పేర్కొన్నాడు. పత్ర పుష్ప ఫల తోయముల దేనిచేనైనా భగవంతుని అర్చించిన మాత్రాన ఆయన సంతోషంతో స్వీకరిస్తాడు.[18] దీనికి కుచేలుడు దృష్టాంతం. ఇట్లీ కావ్యంలో వాసుదేవుడు జ్ఞాన ప్రధాతగా, భక్తసులభుడుగా, మోక్ష ప్రదాతగా వర్ణింపబడినాడు.

4. ఉపాయ స్వరూప జ్ఞానం :-

శ్రీమన్నారాయణుని శరణు కోరటం శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ప్రధానమైంది. "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే..." అని ద్వయ మంత్రం. ఈ మంత్రాన్ని శ్రీమన్నారాయణుడు శ్రీ మహాలక్ష్మికి ఉపదేశించెనని శ్రీ వైష్ణవము. ప్రపత్తి అంతటి ప్రధానమైంది.

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయి ష్యామి మా శుచః"

అని వాసుదేవుడు భగవద్గీతలో శరణాగతిని ప్రధానంగా పేర్కొన్నాడు. ఇది శ్రీవైష్ణవ సంప్రదాయంలో చెప్పబడిన చరమశ్లోకం. ఈ విధంగా వాసుదేవుని శరణు కోరటమే శ్రీ వైష్ణవ సంప్రదాయంలో అత్యంత ప్రధానమైంది. భగవంతుని శరణు కోరటంలో ఎట్టి సందేహ ముండరాదు. "సంశయాత్మా వినశ్యతి" యని గీత. "నీవే తప్ప నితః పరం బెరుగ" అన్నప్పుడేగాని "కలడు కలండనెడివాడు కలడో లేడో" అను సంశయాత్ముని భగవంతుడు రక్షింపజాలడని గజేంద్రమోక్షం చెబుతుంది. ఇట్లు మహా విశ్వాసంతో భగవంతుని భజించటమే ప్రపత్తి. 'అనన్య సాధ్యే స్వాభీష్టే మహా విశ్వాస పూర్వకం... శరణాగతిః'.[19] సర్వ ధర్మాలను పరిత్యజించి భగవంతునే శరణు కోరుట యనునది సులభమని తోచునే కాని అతి క్లిష్టమైంది. సాధకున కెంతయో మనః పరిపాకమున్ననే తప్ప ఇది సాధ్యం కాదు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో నిట్లు అత్యంత ప్రధానమైందిగా చెప్పబడిన శరణాగతి ఈ కావ్యంలో తెలుపబడింది.

వాసుదేవుడు తనను నిర్వాసితుని చేసి సేతు హిమవన్మధ్య స్థలిలో ఎఱుగని త్రోవల తన నాయన త్రిప్పుటంలోని పను పెట్టిదో ఎఱుగకయే ఆయన త్రిప్పినట్లు కవి తిరుగుతున్నాడు. తన నెటు ఎట్లు త్రిప్పినా భారం ఆయనదే అని కవి విశ్వసించి ఉన్నాడు. తానెటు త్రిప్పబడినా వాసుదేవుడు తన వెంట నంటియే వస్తాడని కవి విశ్వాసం. "సంగాతమ్మై వెనువెంట వత్తువనియున్నాకొక్కటే ధైర్యమై."

ప్రపత్తి కలిగిన భక్తునకు 'నాది' అనునది ఏదీ ఉండరాదు. అది మమకారాన్ని ఎంతోగానో పెంచి సంసారబద్ధునిచేసి మోక్ష విదూరునిగా చేస్తుంది. కావుననే "నా సర్వమ్ము భవత్పదార్థముగా నందింతు"నంటున్నాడు కవి. తనదైన సమస్తాన్ని భగవత్పదార్థంగా అందించటమే కాదు తన జన్మ ఆయన పాదసేవార్థమే అని భావించి తనను తాను భగవంతునకు సమర్పించుకుంటున్నాడు కవి. "ఈ జని విచ్చె భవ్య భవదీయ పదార్చన కొక్క పూవుగాన్."

5. విరోధి స్వరూప జ్ఞానం :-

స్వ స్వరూప జ్ఞానం కలిగి పర స్వరూపాన్నెరిగి ఫల ప్రదాతయైన భగవంతుని చేరనున్న సాధకునకా మార్గంలో విరోధులు కొందరెదురై భగవద్రూప ఫలాన్ని అందకుండ అడ్డగిస్తారు సాధకుడట్టి విరోధుల నెరిగి వారిని జయింపవలెను. మోక్షఫలమును కోరి కవి వాసుదేవుని శరణాగతి కోరినాడు. ఈ మోక్ష ఫలాన్ని అందకుండ మొదటి నుండి అడ్డు తగులుతున్నవి ఇంద్రియాలు. మోక్షమునంద వలెనన్న ఈ ఇంద్రియాలను జయించవలె. "హరి భజనంబున మోక్షంబు సిద్ధించు." "విషయంబుల జిక్కు వడిన రక్కసులకు హరిభజనంబు గాదు" అని భాగవతం (7–213, 217) చెబుతుంది. "యతేంద్రియ మనోబుద్ధిర్ముని ర్మోక్ష పరాయణః" అని గీత చెబుతుంది. మోక్షమును పొంద గోరిన వాడు జితేంద్రియుడగుట ముఖ్యం. ఇంద్రియాలు మోక్ష పద మార్గాన్ని చెఱుపుటకే వేచి ఉంటాయి. వీని నధీనంలో పెట్టడం కష్టం.

"నా మాట వినవు నాలో
నీ మార్గము నెపుడు చెఱుపనే వేచు వృథా
కామనము లింద్రియములు" (వేదనా 2.3)

ఈ ఇంద్రియాలు మిక్కిలి క్రూరమైనవి. సాధకుని పలు విధాలుగా బాధిస్తుంటాయి. ప్రక్కజేబులో పెట్టిన డబ్బును నేర్పుగా కొట్టివేసెడి దొంగలవలె సాధకుడు సమకూర్చుకొనిన అల్పమైన పరమ జ్ఞానాన్ని దొంగిలింపనే వేచి చూస్తుంటాయి. "కట్టిడి ఇంద్రియార్థముల కాటియలెంతని..." (వేదనా. 5–7)

తురీయ వర్గమైన మోక్షప్రాప్తిని గూర్చి పరిషత్తులలో పండితులు తెల్పిన ఆ పరమ జ్ఞానాన్ని ఇంద్రియాలు ఎప్పటికప్పుడు హరించి వేస్తుంటాయి. చిత్తంలోనికి మోక్షప్రాప్తి కరములైన మహిత బోధనలు ప్రవేశింపకుండ ఇంద్రియాలడ్డగిస్తున్నాయి. "సేంద్రియ చిత్తవృత్తి మోక్షమహిత బోధవల్లరులు సాగ వొకం గుళ మేని .." (వేదనా 4–5) ఇంద్రియాల విషయమిట్లుండ ధాత్రీ విషయ లోలత్వం, దర్పావేశం, అనిశ్చలత, అజ్ఞానం, నిర్భావత, మోహరాగాంధత, దర్పవికటత్వం, వక్రమార్గత, శీర్ణచిత్తములును (వేదనా. 9.1–9.9) సాధకుని మోక్షప్రాప్తినుండి దూరం చేస్తున్నాయి.

శ్రీవైష్ణవ సంప్రదాయంలో చెప్పబడిన పంచవా నిరూపితమైన భగవత్తత్త్వ మీ కావ్యంలో తెలుపబడినట్లు నిశిత పరిశీలన వలన తెలుస్తుంది. అవి–1. పర, 2. వ్యూహ, 3. విభవ, 4. అంతర్యామి, 5. అర్చామూర్తి.

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకు ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరిచే ఇతర శీర్షికలు ఎన్నో
మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు!

★ మన సినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ బైస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు ★ మా ఊరి సమస్య ★ షరా జా
★ ఇది నారీదృక్పథం ★ అయోధ్యాకాండ ★ వింత యదార్థం

★ ఇంకా — దేవీభాగవతం, వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము!

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి! మేనేజరు, ఆంధ్రపత్రిక

I పరవాసు దేవుడు :

పరవాసుదేవతత్వాన్ని గూర్చి ఇదివరకు అర్థపంచకాల్లోని 'పరస్వరూపజ్ఞానం'లో తెలుపబడింది. ఈ పరవాసుదేవతత్వం జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజస్సు అను షాడ్గుణ్య పరిపూర్ణమైనట్టిది. ఈయన సృష్టి స్థితి లయ కారుడు. త్రివిధములైన ఈ కార్యములను నిర్వహింప సంకల్పించిన ఈయన తానే నాలుగు విధాలైన రూపాలుగా అవుతాడు.[20]

II వ్యూహము :

సృష్టి స్థితి లయ కార్యాలను నిర్వహింపదలచి పరవాసు దేవుడే నాలుగు విధాలైన రూపాలుగా అవుతాడని పైన చెప్ప బడింది. వీనినే వ్యూహము లంటారు. ఇవి-- 1. వాసుదేవ 2. సంకర్షణ, 3. ప్రద్యుమ్న, 4. అనిరుద్ధములు.

1. వాసుదేవ వ్యూహము :

"ఈ స్వరూపము మరకతగిరివలె శ్యామలమై యుండును. క్షీరసాగర మీ వ్యూహమునకు నివాసస్థానము"[21]. "శ్వేతద్వీప నివాస సుస్థిర పద శ్రీనాథ"!(వేద. 5-2)యని "క్షీరతోయనిధి ప్రాంత వినోద సంతత విహారాఢ్యుండవౌస్వామి" (5-1) అనియు కావ్యంలో వాసుదేవ వ్యూహవర్ణన ఉంది. పరవాసు దేవునివలె నీ వ్యూహం షాడ్గుణ్య పరిపూర్ణంగా ఉంటుంది. "షడ్గుణతుంగాచ్ఛతరంగ రంగి విలసత్కూలంకషా!" (4-2) అని కావ్యంలో తెలుపబడింది. "కరములు, పాదములతులు శిరములు వేయేసియైన చెలువము" అని వాసుదేవ వర్ణన చేయబడింది. పురుష సూక్తంలో ప్రతిపా దింపబడినట్లు సహస్ర శీర్షాక్షపాదములతోనుండి సృష్టినంతనూ వ్యాపించియున్న విరాడ్రూప వర్ణన ఇది. మత్స్యాద్యవతారములకీ విరాడ్రూపమే అద్యవతారం.[22] విష్ణువు వేయి తలలుకలవాడుగా చక్ర సంహితలోను,[23] శ్రీవిష్ణు సహస్ర నామాల్లోను వర్ణింపబడినాడు. "...సహస్రమూర్ధా,విశ్వాత్మా, సహస్రాక్షః,సహస్రపాత్"(శ్రీవిష్ణు సహస్ర నామములు. శ్లో 37) వేయి తలలు, ముఖాలు, కనులు, పాదాలు వాసుదేవుని విజ్ఞానము క్రీడలయొక్క అవయవాలనుగూర్చి చెప్పేవి. ఆ మహాపురుషుడు అన్నివైపుల కనులు, తలలు కలవాడు. ప్రతిచోట కరములు పాదములు కలవాడు.[24] "మమమాయాదుర త్యయా" అని శ్రీకృష్ణుడు గీతలో చెప్పినట్లు ఆయన చేటులేని మాయకలవాడు. అట్టి "మాయానిరవధిక మహాధ్యమున" ఆయన నిర్దేశింపరాని వపువు కలవాడు. రజస్తమస్సుల స్పర్శలేని శుద్ధ, సత్వగుణ శరీరము కలవాడాయన"[25]. వాసుదేవుడు జీవాత్మ ప్రకృతియొక్క సమ్మేళన రూపశరీరుడని విశిష్టాద్వైతం చెబు తుంది.[26] ఇట్లు నిర్దేశింపరాని శరీరము కలవాడీ వాసుదేవుడు.

2. సంకర్షణ వ్యూహము :

మొదటిదైన వాసుదేవ వ్యూహమునుండి ఈ సంకర్షణ వ్యూహ మేర్పడింది. విజ్ఞానాది షడ్గుణాల్లో విజ్ఞానము, శక్తియను రెండు గుణములీ వ్యూహమున ప్రధానంగా ఉంటాయి. తెల్లని దేహము, నల్లని వస్త్రము కలిగి హలమును ధరించి ఉంటుంది. జీవులను సంకర్షించటంవలన నీ వ్యూహము సంకర్షణ మనబడింది. "సకల జీవులకును ఇతడధిష్ఠాత. ఈతని యధిష్ఠానము అహం కారము. ఈతడు భూతేంద్రియ మానసమయుడు. కర్తృత్వము, కారణత్వము, కార్యత్వము, శాంతత్వము, ఘోరత్వము, మూఢ త్వము మొదలగు లక్షణము లితనికి గలవు. నివాస మితనికి పాతా ళము." ఈ మహనీయునకీ లోకములను సంహరింప దలంపు కల్గినపుడు అదివరలో మహాశాంతుడుగా నున్నను ఇతడపుడు మహా ఘోరమగు క్రోధముతో ఏకాదశ రుద్రులను -- మహారౌద్రము కలవారిని,మూడు కనుల వారిని త్రిశూలముల జేత పట్టిన వారిని సృజించును.[27] సంహార సమయంలో జీవుల నాకర్షించటం వలన సంకర్షణు డందురని శంకరభాష్యము[28]. సంకర్షణుడు చిదచిత్తుల ఆత్మలను సృష్టిలో ఒకే పద్ధతిలో నడుపుతుంటాడని పరాశర భట్టార్యులు.[29] సంహార మీతని లక్షణముగా చెప్పబడుటను బట్టి "పరపగు వేయి బాహువుల పంచమహా యుధ లబ్ధ దుష్ట సంహ రణముచాలు" (వేద. 2.4) అను పద్యంలో సంకర్షణవ్యూహం సూచింపబడినట్లు తెలియవస్తుంది.

3. ప్రద్యుమ్న వ్యూహము

ఈ వ్యూహము సంకర్షణ వ్యూహంనుండి ఏర్పడింది. "తాపింఛము (చీకటి చెట్టు పువ్వు)వంటి శరీరచ్ఛాయ. కనుకనే అట్టి శ్యామల సుందరుడగు శ్రీకృష్ణకుమారుడు ప్రద్యుమ్నుడు ఈ వ్యూహమని గుర్తింపబడినది.[30] "తాపింఛచ్ఛవి వేటగావలయు నంతా చీకటేలోన" (వేద. 2.1) అని కావ్యంలో ప్రద్యుమ్న వ్యూహం చెప్పబడింది. ఈ వ్యూహం త్రివిక్రమ, వామన, శ్రీధర ములను మూడు ఉపవ్యూహాలను కలిగి ఉంటుంది. (వాసుదేవాది చతుర్వ్యూహాలును మూడేసి ఉపవ్యూహాలను కలిగిఉంటాయి.)

"బలి యీయంగని మూడుపాదములు నీ భక్తుండు నీ పాదమున్
తలపై బూని నిమేష మాత్రమున పాతాళమ్ము ప్రాపించె కే
వల మొక్కంగుళమైన నీ గనని నిర్భాగ్యుండ నేమౌదు నా
తలపై నీదు సహస్ర పాదములతో త్రైవిక్రమ శ్రీనిధీ".

(వేద. 2.5)

ఈ పద్యంలో వామన, త్రివిక్రమ, శ్రీధరము (శ్రీనిధీ) లను ఉపవ్యూహాలు చెప్పబడ్డాయి. షడ్గుణాల్లోనివైన బల ఐశ్వ ర్యాలు ఈతనికి ప్రధానాలు. ఇతడు సర్వజీవ హృదయస్థుడు. "సర్వజీవ హృదయస్థా" (వేద. 3-4) "ప్రద్యుమ్నుడు ఆత్మను ప్రకాశింపజేస్తాడు. పురుషోత్తముడే ప్రద్యుమ్న"డని పరాశర భట్టార్యులు.[31]

4. అనిరుద్ధ వ్యూహము

నాల్గవదియైన ఈ వ్యూహం ప్రద్యుమ్నవ్యూహంనుండి ఏర్పడింది. ఇతనికి షడ్గుణముల లోనివైన వీర్య, తేజస్సులు ప్రధా

నాలు. శత్రువులచేత నెప్పుడును నిరోధింపబడని వాడగుటచే ఈయన అనిరుద్ధుడవబడెనని శంకరభాష్యము[32]. ఇంద్రియాలను తన అదుపు ఆజ్ఞల్లో ఉంచుకొనువాడవటంచేత అనిరుద్ధుడు హృషీకేశుడనబడెను.[33] హృషీకము ఇతని అధిష్ఠానమగుటచే నితడు హృషీకేశుడనబడెను.

"నామాట వినవు నాలో
నీమార్గము నెపుడు చేఱుపనే వేచు వ్యథా
కామనము లింద్రియము లి
స్సీ! మర్దింపవు బలే హృషీకేశుడవే." (వేద. 2·3.)

ఇంద్రియాధిపతియైన అనిరుద్ధ వ్యూహ మీ పద్యంలో తెలుపబడింది.

III విభవము

పంచధానిరూపితమైన భగవత్తత్వంలో విభవము రామకృష్ణాద్యవతార రూపమైంది. 'అవతార'మనగా పరమ పదస్థుడైన వాసుదేవుడు భూలోకానికి దిగటమని అర్థం "జ్ఞానేచ్ఛా క్రియాశక్తులెట పరాకాష్ఠ నొందునో అది యవతారమందు"రని శ్రీ తిరువేంగళాచార్యులు తెలిపిరి.[34] ధర్మానికి గ్లాని కలిగినపుడెల్ల దాని నుద్ధరించు కొఱకును, ధర్మ సంస్థాపనకై దుష్టులనుశిక్షించి శిష్టులను రక్షించుటకును తానైక్షే అవతరిస్తానని శ్రీ కృష్ణుడు తన అవతార తత్వాన్ని భగవద్గీత (4–7. 8) లో తెలియజేశాడు.

అసంఖ్యాకాలైన వాసుదేవుని అవతారాలు లోకరక్షా మహాద్వ్యవసాయాలు. అవతార వ్యవహార నిత్య రచనా వ్యాసంగం కలవాడాయన. (వేద. 8.4)

అంశావతారాలు, కలావతారాలు, పూర్ణావతారాలని భగవంతుని అవతారాలు మూడు విధాలు. మత్స్యాద్యవతారాలు అంశావతారాలు. పరశురామాద్యవతారాలు, శ్రీకృష్ణావతారము పూర్ణావతరాలు. ఈ విధాలైన భగవంతుని అవతారాలు దశావతారాలని, ఏకవింశత్యవతారాలని, మన్వంతరావతారాలని భాగవతమున వర్ణించ బడినాయి. కృష్ణ, వామన, మత్స్య, కూర్మ, వరహ, కల్కి వతారాలీ కావ్యంలో వర్ణింప బడినాయి. "పుట్టిన కొట్టు కన్నొఱగి..." (5.4) అను పద్యంలో శ్రీకృష్ణావతార వర్ణన, "బలి యూఱుంగని మూడు పాదము య .." (2.5) "వెనుకంజే అయు తందనాల్ పలుకుటే వేడ్కొనచో నెట్టు..." (3.7) అను పద్యాల్లోను వామనావతార వర్ణన కావింపబడింది.

"చదువులు తెచ్చి యమ్మునరి జందెపు పోగున కిచ్చి చేపవై
మదవతివై సుధన్ కనులు ... లని దయ్యను లాన పంచి మ
ట్టి దినుసుబుట్టబొమ్మనొక శీవిగకొమ్మునెత్తి దంష్ట్రివై
విదిత మహానుభావములు వేషము లిమ్మెయి నెన్నితాల్పవో." (8.5)

ఈ పద్యంలో అంశావతారాలైన మత్స్య, కూర్మ, వరాహావతారాలు వర్ణింపబడినాయి. మత్స్యావతారమున వేదాలను, కూర్మావతారమున అమృత ప్రాప్తి కారకుడై దేవతలను, వరాహావతారమున సమస్త ప్రాణికోటి నిలయమైన భూమిని వాసుదేవుడుద్ధరించాడు. ఇకకాక భవిష్యదవతారమైన కల్క్యవతారమును ఇందు వర్ణింపబడినది.
"ఘన ఖడ్గమ్ము ధరించి యుత్తమ తురంగంబెక్కి కల్క్యాత్మతా
ఎని కృపాళు కుంభినీ భరముగా వేంచేసె దోయయ్య." (8. 6)

"నిజమునకీ యవతారము లన్నింటికిని గూడ మొదటి యవతారము పురుష సూక్తమున ప్రతిపాదింపబడినట్లు వేయి తలలతో నుండి ప్రకృతిని ప్రవర్తింపచేయునట్టి ఆది పురుష రూపము."[35] భగవంతుడెత్తిన్ని అవతారా లెత్తినా ధర్మోద్ధరణార్థమే.

IV అంతర్యామి :-

వాసుదేవుడు సర్వాంతర్యామి. సర్వాంతర్యామి అగుట వలన ఈయన 'విష్ణువు' అని పిలువబడును. "మయా తతమిదం సర్వం జగదవ్యక్త మూర్తినా"యని గీతలో శ్రీకృష్ణుడు చెప్పియుండెను. జీవుడు, ప్రకృతి వాసుదేవుని శరీరము. ఆయన లేకుండ జీవుడు, ప్రకృతి లేదని విశిష్టాద్వైతము చెప్పుచున్నది.[36] వాసుదేవుడు పిపీలికాది బ్రహ్మ పర్యంతము వ్యాపించియున్నవాడుగా (వేద. 3.4) ఆది మధ్యాంతము లెఱుగరాని రూపమున విశ్వ జగత్ప్రభాణముల నాపూర్ణముగా నిక్కియున్నవాడుగా (వేద. 6.1) ఈ కావ్యమున వర్ణింపబడినాడు. "నీవున్నావుగదయ్య విశ్వ జగతీ నిర్వాహకానంద ధారా విర్భూతసమస్త వస్తు హృదయాధ్యంక్షుండవై "అని యిట్లు కావ్యమున పలుచోట్లవాసుదేవుడు సర్వాంతర్యామిగా వర్ణింపబడినాడు.

V అర్చ :-

వాసుదేవుని దివ్యమంగళ సేవ ముక్తి కంటె గరిష్ఠమైనదనియు అమలిన భక్తులు కొందరు ముక్తిని కోరిక వాసుదేవుని దివ్యమంగళ మూర్తినే అర్చింతురనియు భాగవతమున తెలుపబడినది. (3. 878) "నైసర్గికంబైన నిర్హేతుకమగు భగవత్సేవ మిగుల ముక్తి కంటె గరిష్ఠంబు" (భాగ. 3. 877) మోక్షము నపేక్షింపక వాసుదేవుని దివ్య మూర్తి నర్చించెడి భక్తులే పిదప "సర్వ లక్షణ యుక్తంబును నైన మోక్ష పదంబు గైకొందురు" (భాగ. 3. 880) అని భాగవతము.

అర్జునుడు వాసుదేవుని విశ్వరూపమును చూడ వెఱచి శంఖ చక్రాదులు ధరించిన చతుర్భుజ రూపమునే చూడ నిచ్చగించెను.[37] అప్పుడు భగవంతుడైన వాసుదేవుడు చతుర్భుజ రూపము దాల్చి కడు దుర్లభమైన ఈ నా చతుర్భుజ రూపమును దేవతలు కూడ దర్శింప కాంక్షించెదరని తెలిపెను. (గీత. 11.52)

"...భక్తవరదాభయ దాయక శోభన ప్రభాకరము కరమ్ము" (వేద.2.4)అని ఈ కావ్యమున వాసుదేవుని వరదహస్తము, అభయహస్తముగల మూర్తి వర్ణింపబడియున్నది.[38]

భగవంతునికి చేయు షోడశోపచారములలో పుష్పము ఒకటి. కవి తనను ఒక పూజా కుసుమంగా వాసుదేవుని పదార్చనకు సమర్పించుకున్నాడు.

"ఈ జని విచ్చెభవ్య భవదీయ పదార్చన కొక్క పూవుగాన్". (11.6).

తాను సమర్పించెడి ఇట్టి పూవును స్వీకరింపుమని "ఇది తమ మేన క్రొవ్వలపు లీనునులే యిది విష్ణుకాంతమై" యని వాసుదేవుని దివ్య మంగళ రూపము వర్ణింపబడినది. వాసుదేవుని పదములు, కరములు, కనులు, నాభి దివ్య పద్మములుగా వర్ణింపబడినవి — "పదములు నాభియున్ కనులు బాహు ముఖమ్ములు దివ్య పద్మముల్ .." (11.7) ఇట్లు వాసుదేవుని పాద పద్మములు కావ్యమున నట నట వర్ణింపబడినవి. "నా సర్వమ్ము భవత్పదార్పిత ముగా నందింతు."

తనలో ఏదో ఒక వేదన పుట్టి వాసుదేవుని దివ్య గుణ కీర్తనము చేయుటయే ఈ కావ్యంలోని ముఖ్య విషయమని తెలిపెడి నీపద్యములోను భగవంతుని రూపము వర్ణింపబడినది—

"ఏదో వేదన పుట్టి యెందు కొఅకో హృద్గర్భ మందార్తర క్తా దకు నిన్ను చుట్టి పట్టుకొని తీగల్ సాగి నీ దివ్య సం వ దా శంసన పద్య పుష్పచయమై భాసిల్లె..." [12.6].

ఇట్లీ కావ్యమున పంచధా నిరూపితమైన భగవత్తత్త్వం వర్ణింపబడి ఉంది.

నామ విచారణ:-

ఈ గ్రంథము యొక్క పేరు 'వేదనా వాసుదేవము'. వేదన యనగా నొప్పి యని ఒక అర్థము. ఈ అర్థమున వేదనా వాసుదేవ మనగా తనలోని భాధను, ఆర్తిని వాసుదేవునకు నివేదించుకొనుట అని చెప్పవలయును. కవియొక్క వేదన వాసుదేవునకు నివేదింప బడుట ఈ కావ్యమున వర్ణింపబడియున్నట్లు తెలుపబడింది.

వేదన యనగా తెలిసికొనుట యని మరొక అర్థము. ఈ అర్థమున వాసుదేవతత్త్వం తెలిసికొనుట యని కావ్య నామమునకు అర్థం చెప్పనగును. పంచధా నిరూపితమైన భగవత్తత్త్వమును, భగవంతుని చేరుటకు సాధకుడు తెలిసికొని యుండవలసిన పర స్వరూపాది అర్థపంచకములు నీ కావ్యంలో తెలుపబడియున్నట్లు వెనుక తెలుపబడింది.

'వేదన' యనగా ఉపాసన యని శ్రీభాష్యము. వాక్యకారేణ ఏ తత్పర్యం ప్రపంచితమ్. "వేదన ముపాసనం స్యాత్ తద్విషయే శ్రవణాత్" "ఇతి సర్వా సూప నిషత్సు మోక్ష సాధన తయా విహితమ్. వేదన ముపాసన మిత్యుక్తమ్.' 39 వేదన యనగా ఉపాసన. ఉపాసనయనగా ధ్రువానుస్మృతి. ధ్రువానుస్మృతియనగా భక్తి.

"వసతి వాసయతి ఆచ్ఛాదయతి సర్వమితి వావసుః, దీవ్యతి, క్రీడతే, విజిగీషతే, వ్యవహరతి ద్యోతతే, స్తూయతే, గచ్ఛతీతి వాదేవః, వాసుశ్చాసౌ దేవశ్చేతి వాసుదేవః" అని శంకరాచార్యులు వాసుదేవునకు చెప్పిన అర్థం.[40]

"సర్వత్రా సౌసమస్తంచ వసత్యత్రేతి వై యతః
తతః సవాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే" 9–7–97
"సర్వాణి తత్రభూతాని వసంతి పరమాత్మని
భూతేషుచ స సర్వాత్మా వాసుదేవస్తతః స్మృతః"
6–5–80

ఇతిచ విష్ణుపురాణే[41] . ఈ విధంగా విష్ణుపురాణంలో చెప్పబడినట్లు వాసుదేవుడు సర్వత్రా వ్యాపించి సర్వజీవ హృదయాలలో ఉన్నాడని తెలుస్తుంది. చరాచర భూతము లేవి నేను లేనివి లేవు. నేను సర్వత్ర ఉన్నానని శ్రీకృష్ణుడే గీతలో (10–39) చెప్పి ఉన్నాడు.

"వసతి, దీవ్యతి"యని "వాసయతి, దీవ్యతి,"యని వాసుదేవ శబ్దమునకు రెండు వ్యుత్పత్తులు. "సర్వత్రాసౌవసతి", "సమస్తంచ వసత్యత్రచ" అని యీ రెండు వ్యుత్పత్తులకును క్రమముగా సంస్కృతములో నర్థము తెలుపబడినది. అంతటను నందువాడు, అంతయు నితని యందాధారపడియుండును అని వాని యర్థము. ఈ యర్థము లింతకు "వాసు" అన్నంతవరకే. మిగిలిన 'దేవ'పదము "వెలుగొందువాడు," అను నర్థముతోబాటు ననేకార్థములు సమర్పించును. దివుధాతువునకు — క్రీడ, విజిగీష, వ్యవహారము, వృత్తి, స్తుతి, మోదము, ముదము, స్వప్నము, కాన్తి, గతియునునియు నర్థములు. కనుక నంతటను నిండియుండి ఇన్ని పనులను జేయుచుండునినియు, చతుర్వ్యూహములు, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను నాల్గు వ్యూహములును ఇచట స్పష్టముగా నిరూపించబడిన"వని "వాసుదేవ" నామమునకు శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు అర్థము చెప్పిరి. 4· ఇట్టి గుణ విశిష్టుడైన వాసుదేవుని యందలి భక్తియని "వేదనా వాసుదేవము" యొక్క పరమార్థము.

భక్తిని వర్ణించుటకు పెక్కుమంది కవులవలెనే ఈ గ్రంథ కర్తయు శతకాన్నె ఎన్నుకొన్నాడు. 'మకుట నియమములేని శతక ప్రాయమైన కృతి యిది'[43] యని 'భారతి' ఈ గ్రంథాన్ని సమీక్షించింది. మకుట నియమం లేనందున ఈ గ్రంథము శతకమని పించదు. కానిమకుటనియమంలేని శతకాలు సంస్కృతంలోను,తెలుగులోను కలవు. తెలుగున భర్తృహరిశతకము,శ్రీ కోవెల సు ప్రసన్నాచార్యులుగారి "తేజశ్శతకము' మకుట నియమంలేని శతకాలు. ఇట్టి వింకను కలవు. శతకాల్లో పాటింపబడే సంఖ్యా నియమ మీ గ్రంథంలో కలదు ఇందు ఒక వంద ఎనిమిది పద్యములుండుటచేత నిది అష్టోత్తర శతకం. శతకాల్లో ప్రధానంగా పాటింపబడే మకుట నియమిందు పాటింపబడలేదు. "బాహ్యనిర్మాణ (Surface structure) అంతర్నిర్మాణము (Deep structure) లలో బాహ్య

నిర్మాణమును త్రుటీకరించిన శతకముగా వేదనా వాసుదేవమును భావింపవచ్చుననియు, బాహ్యనిర్మాణ నియమములను పాటించక పోవుటవలన ఛందోవైవిధ్యము సాధ్యమై దాని ననుసరించి వ్యక్తీకరణ వైవిధ్యమున కవకాశ మేర్పడిన''దని డా. చేకూరి రామారావు గారు తమ వ్యాసంలో (అముద్రితము) పేర్కొన్నారు ఇందులో ఆటవెలది, తేటగీతి, కందము, ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభము అను పద్యములు కలవు. ఛందోనియమంతో శతకములును తెలుగు సాహిత్యమున కలవు.[44] 'ఆంధ్రశతక సాహిత్యము''న డా. కె. గోపాలకృష్ణారావుగారు పేర్కొన్న 'రసనియమము' అను భక్తిభావమీ గ్రంథమున కలదు.(పుట: 16.)''అమృత పదార్థ తుందిలం భక్తిజ్ఞాన రసకందరం'' అని పేర్కొని యీ చిరుకృతి ఆంధ్రమహా భాగవత బృహత్కృతిని మరపించు చున్నదని 'ఆంధ్రప్రదేశ్' సమీక్షించింది.[5] శతకానికి చెప్పబడిన ప్రధాన లక్షణాలల్లో కొన్ని ఈ గ్రంథమున పాటింపబడుటనుబట్టి వేదనా వాసుదేవమును శతకమని పేర్కొనదగును. 108 పద్యములుగల ఈ శతకాన్ని తొమ్మిదేసి పద్యముల చొప్పున పండ్రెండు సమవిభాగములుగా చేయుట క్రొత్త పద్ధతి. శతకాన్నిట్లు కొన్ని సమవిభాగములుగా చేయుపద్ధతి పూర్వశతకములందు కానరాదు. ఈ విభజనలోని సారస్యాన్నిట్లు భావింపనగును.

''ఓం నమోభగవతే వాసుదేవాయ''యను వాసుదేవ ద్వాదశాక్షరి మంత్రములోని మొత్తము అక్షరములు పండ్రెండింటి విభజింపబడిన పండ్రెండు సంఖ్య వ్యంజకముగా కలదు.[4] ఒక్కొక్క విభాగములోని తొమ్మిది సంఖ్య భాగవతమున తెలుపబడిన నవవిధ భక్తిమార్గములకు వ్యంజకమగుచున్నది. భక్తిచేతనే తాను పొందదగియున్నానని వాసుదేవుడు గీతలో (8–22) చెప్పియున్నాడు. భక్తిభావ ప్రధానమైన ఈ గ్రంథంలోని పండ్రెండు సమవిభాగములు భక్తిరస ప్రధానమైన భాగవతములోని ద్వాదశ స్కంధములకు వ్యంజకమగుచున్నవి.

భగవత్ప్రాప్తికి సాధనమైన అర్చిరాది పండ్రెండు అంచెలు కలది.

1. అర్చి, 2 దిన, 3. శుక్లపక్ష, 4. ఉత్తరాయణ. 5. సంవత్సర 6. వాయు. 7 సూర్య, 8. చంద్ర 9. విద్యుత్, 10. వరుణ, 11. ఇంద్ర, 12. బ్రహ్మలోకములు, బ్రహ్మరంధ్ర భేదనానంతరం జీవుడు అర్చిరాది మార్గంలో పరమపదాన్ని చేరుకుంటాడు. జీవుని ఇట్టి ప్రయాణంలోని అర్చిరాదిని సూచించుట కవి ఉద్దేశ్యము.

లోకమంతయు కర్మాధీనము. వాసుదేవుని వ్యవహారమంతయు భూత, వర్తమాన, భవిష్యత్కాలాల్లో పరచబడిఉంది. ''కాలోస్మి'' అని గీతలో చెప్పియున్నట్లు వాసుదేవుడే కాలమై ఉన్నాడు. కాలమునందు జీవిస్తుంది జీవుడు. కాలమును నియమించువాడు వాసుదేవుడు. కాలమునందు ఈశ్వరుని తాదాత్మ్యం చేసికొన్నట్లయితే కాలాన్ని దాటగలిగిన స్థితి జీవునకు కలుగుతుంది. వాసుదేవునకు తల్పము ఆదిశేషుడు. ఈయనకు అనంతుడనియు పేరు. అంతము లేనిది–అనగా అనంతమైనది కాలం. ఇట్టి అనంతమైన కాలానికి ప్రతీక అనంతుడు. ఇట్టి అనంతునిపై వాసుదేవుడు శయనించి ఉంటాడు. అనగా వాసుదేవుడు కాలాన్ని నియమించువాడనిభావము. కాలము సూర్యాది గ్రహసంచారంచేత వ్యక్తమౌతుంది. కాలంయొక్క ఇట్టి స్వరూపాన్ని వ్యక్తం చేయడానికై కవి ఇట్టి కావ్య నిర్మాణాన్ని ఎన్నుకున్నాడు.

'భ' చక్రంలో మేషాది పండ్రెండు రాశులు కలవు. ఒక్కొక్క రాశిలో తొమ్మిదేసి పాదములుంటాయి. పండ్రెండు రాశులలో మొత్తం పాదములు 108 అవుతున్నాయి. అశ్విన్యాది నక్షత్రాలు ఇరవది ఏడు ఒక్కొక్క నక్షత్రం నాలుగేసి పాదములు కలిగి ఉంటుంది. ఇట్లా అశ్విన్యాది నక్షత్రాల్లో మొత్తంపాదములు 108 అవుతున్నాయి. విభాగమునకు తొమ్మిదేసి పద్యాల చొప్పున పన్నెండు విభాగాల్లో మొత్తం 108 పద్యాలున్న ఈ శతక నిర్మాణం 'భ' చక్రాన్ని అభివ్యక్తీకరిస్తుంది.

పురుషసూక్తంలోను, భగవద్గీతలోను, శ్రీ విష్ణుసహస్ర నామాల్లోను విశదీకరింపబడిన వాసుదేవ తత్త్వమీ గ్రంథంలో వర్ణింపబడి ఉంది. పద్మ పురాణంలో 'వాసుదేవ సహస్ర స్తోత్రము' ప్రత్యేకంగా ఉంది. కాని దీని ప్రభావ మీ గ్రంథంలో లేదు శ్రీ విష్ణుసహస్రనామ ప్రభావమే వేదనా వాసుదేవమున కలదు.[6] ఈ గ్రంథమున గల ''ఓ వేయినామాల దొడ్డదొరా!'' (3. 8) యను సంబోధన శ్రీ విష్ణు సహస్ర నామములకే వర్తిస్తుంది. శ్రీ విష్ణు సహస్ర నామములలో చెప్పబడియున్న నామములు కొన్ని యథాతథములుగను, కొన్ని కొలది మార్పులతోడను, మరి కొన్ని భావ స్ఫోరకములుగను ఈ గ్రంథంలో ఉన్నాయి.

పురుష సూక్తము, భగవద్గీత, శ్రీ విష్ణు సహస్రనామాల్లో ప్రతిపాదితమైన వాసుదేవ తత్త్వ మీ వేదనా వాసుదేవమున వర్ణింపబడి ఉంది. ఇందు వర్ణింపబడిన వాసుదేవుని నామములను రూప, గుణ వర్ణకములని రెండు విభాగములు చేయవచ్చును.

I రూప వర్ణకములు

1. సహస్రాక్ష, శిర, కర, పదములు :-

భగవంతుడైన శ్రీ వాసుదేవుడు సహస్రాక్ష, సహస్ర శిర, సహస్ర కర, సహస్ర పాదములు కలవాడని పురుష సూక్తమున వర్ణింపబడి ఉంది.

''సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష స్సహస్ర పాత్.''
ఇట్టి విరాడ్రూపమున వాసుదేవుడు ప్రపంచము నంతను వ్యాపించి ఉన్నాడు.

'అనేక వక్త్రనయనమ్' (11. 10) 'అనేక బాహూదర వక్త్రనేత్రమ్' (11. 16) 'అనంత బాహుం' (11 19.)

'రూపం మహత్తే బహు వక్త్రనేత్రమ్, మహా బాహో! బహు బాహూరు పాదం'' (11.23) సహస్ర బాహో (11.46) అని వాసుదేవుడు భగవద్గీతలో వర్ణింపబడియున్నాడు.

''సహస్ర మూర్ధా, విశ్వాత్మా, సహస్రాక్ష : సహస్ర పాత్'' (శ్లో. 37) అని శ్రీ విష్ణు సహస్ర నామములలో వర్ణన. వేయి తలలు, ముఖములు, కనులు, పాదములు వాసుదేవుని యొక్క విజ్ఞానము, లీలలయొక్క అవయవాలను గూర్చి చెప్పనవి. ఇట్లు పురుష సూక్తంలోను, గీతలోను, విష్ణు సహస్ర నామాల్లోను సహస్రాక్ష, సహస్ర మూర్ధ, సహస్ర పాదములు కలవాడుగా వర్ణింపబడిన ఆ విరాట్పురుషుని వర్ణన వేదనా వాసుదేవమున చేయబడింది.

''కరములు పాదము లకులు
శిరములు వేయేసియైన చెలువము.'' (2.1)

2. అనిర్దేశ్య వపువు :-

''ఇదం తదిత నిర్దేష్టుం యన్న శక్యతే పరస్మై స్వసం వేద్య త్వాత్ తచ్చ నిర్దేశ్యం వపుర స్యేతి అనిర్దేశ్య వపుః'' అని శంకర భాష్యం.[48] షడ్గుణముల శరీర రూపమే వాసుదేవుడు. ఆయన నిర్వచింపరాని శరీరం కలవాడు.[49] వాసుదేవు డుపమింపరాని శరీరమును విజ్ఞానమును కలవాడని విష్ణు పురాణం చెప్పుతుంది.[50] భగవద్గీతలోని విశ్వరూప వర్ణన ఆయన అనిర్దేశ్య వపువునే చెప్పుతుంది. (అధ్యా. 11. శ్లో. 10–48.) వాసుదేవుడు ప్రకృతి, జీవాత్మల యొక్క సమ్మేళన రూప శరీరం కలవాడని విశిష్టాద్వైతం చెప్పుతుంది.[51]

3. శశి సూర్య నేత్రుడు :-

శ్రీ మహావిష్ణువునకు సూర్య చంద్రులే కన్నులు. వాని కాంతిచేత ఆయన లోకాలను కాంతిమంతం చేస్తుంటాడు. ''శశి సూర్య నేత్రం'' అని గీత. అర్చరాది మార్గంలో సూర్య చంద్రులు వరుసగా ఏడవ, ఎనిమిద మెట్లు. వీని ద్వారా జీవుడు పరమ పదాన్ని చేరుకుంటాడు. సూర్య కిరణాలు చంద్రుని వెలిగించడానికి, మేఘాలు వర్షించడానికి, కారణాలౌతున్నాయి. చంద్ర, విద్యుత్, వరుణ లోకాలకు సూర్యు డధిపతి [52] ''అగ్ని ర్మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ'' అని శ్రుతి[53] విరాట్పురుషుని కన్నుల నుండి సూర్యుడు పుట్టినట్లు పురుష సూక్తమున తెలుపబడింది.

''చక్షో సూర్యో అజాయత.'' (6.)

4. పుష్పదరహాసుడు :-

శ్రీ మహావిష్ణువు 'పుష్ప దరహాసు'డని సహస్ర నామాల్లో తెలుపబడింది. ''ముకులాత్మానా స్థితా నాం పుష్పాణాం హాసవత్ ప్రపంచ రూపేణ వికాసో ఽస్యేతి పుష్ప హాసః'' అని శంకర భాష్యము.[54] ఆత్మీయమైన సంతోషము, శక్తి వలన కలిగిన పుష్పము వంటి హాసము కలవాడని పరాశర భట్టార్యులు.[55]

5. సూక్ష్మరూపుడు :-

గీతలో వర్ణింపబడినట్లుగా వాసుదేవుడు భూమ్యాకాశములు పట్టని రూపము కలవాడుగా నుండి ఒక్కొక్కప్పుడు సూక్ష్మ రూపమున నుండును. ''శబ్దాది స్థూల కారణ రహిత్వాత్ – శబ్దాదయో హ్యాకాశ దీనా ముత్తరోత్తర స్థూల కారణాని, తద భావాత్ – సూక్ష్మః'' అని శంకర భాష్యము.[56] అణువునందణీయుడనని గీతలో వాసుదేవుడు చెప్పియున్నాడు. (8–9)

6. ఆది మధ్యాంత రహితుడు :-

''నాన్తం న మధ్యం న పునస్త వాదిం'' అని గీతలో (11.16) చెప్పబడినట్లు వాసుదేవుడు ఆది మధ్యాంతములు లేని వాడు. ఇట్టి విశ్వ రూపాన్ని వాసుదేవుడు అర్జునునకు చూపాడు.

7. రమ్యమూర్తి :-

భగవంతుడు సుందరమూర్తిగా సహస్ర నామాల్లో వర్ణింప బడినాడు. ''విశ్వాతి శాయి సౌభాగ్యశాలి త్వాత్ సుందరః'' అని శంకర భాష్యము.[57] చతుర్భుజుడైన వాసుదేవుని దివ్య మంగళ రూపాన్ని దర్శింప దేవతలు కూడ వేడుక పడుతుంటారని గీతలో చెప్పబడింది.

''సుదుర్దర్శ మిదం రూపం దృష్టవానసి యన్మమ
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణః''
(11.52).

8. అచింత్యరూపుడు :-

''ప్రమాణాది సాక్షి త్వేన సర్వ ప్రమాణ గోచరత్వాత్ అచింత్యః, అయమీ దృశ ఇతి విశ్వ ప్రపంచ విలక్షణ త్వేన చింత యితుమశక్య త్వాద్ వా అచింత్యః'' భగవంతుడిట్లుండునని చింతించుట శక్యమైన వాడగుటచేత ఆయన అచింత్యు డనబడెనని శంకరుల భాష్యము[58] శరీర విముక్తమైన జీవాత్మలతో పోల్చినను వర్ణింపనలవికాని వాడగుటచేత భగవంతుడు చింత్యుడని పరాశర భట్టార్యులు.[59]

9 పంచ మహాయుధుడు :-

శ్రీ వాసుదేవుడు పాంచజన్య, సుదర్శన, కౌమోదకి, శార్ఙ్గ, నందకములను పేర్లుగల శంఖము, చక్రము, గద, ధనుస్సు, ఖడ్గములను పంచాయుధములు కలవాడు.

''శంఖ భృన్నందకీ చక్రీ శార్ఙ్గ ధన్వా గదాధరః
రథాంగ పాణి రక్షోభ్యః సర్వ ప్రహరణాయుధః''

అని విష్ణు సహస్రనామాల్లో చివరి శ్లోకము. భగవంతుని ఈపంచ మహాయుధములకు శంకరాచార్యులిట్లు భాష్యము చెప్పిరి–

''పాంచజన్యాఖ్యం భూతాద్య హంకారాత్మకం శంఖం బిభ్రత్ శంఖభృత్''

''విద్యా మయోనందకా ఖ్యోఽసి రస్యే తి నందకీ.''

''మనస్తత్వాత్మకం సుదర్శ నా ఖ్యం చక్రమస్యా స్తిత; సంసార చక్ర మస్యాభ్నయా పరివర్తత ఇతి వా చక్రీ.''

''ఇంద్రియాద్య హంకారాత్మకం శార్జ్గనామ ధనురస్యాస్తీత శార్జ్గ దన్వా.''

''బుద్ధితత్వాత్మకం కౌమోదకీం నామ గదాం వహన్ గదా ధరః.''[60]

అహంకారము, విద్య, మనస్సు, ఇంద్రియములు, బుద్ధి అను అయిదింటికి శంఖము, ఖడ్గము, చక్రము, ధనుస్సు, గద ప్రతీకలు. భగవంతుని పంచాయుధములు వాసుదేవాది చతుర్వ్యూహములను స్ఫురింపజేయునవిగా ఉన్నవి —.

ఆయుధము	అధిష్ఠానము	వ్యూహము
నందకము	విద్య	వాసుదేవము
పాంచజన్యము	అహంకారము	సంకర్షణము
కౌమోదకి	బుద్ధి	ప్రద్యుమ్నము
సుదర్శనము	మనస్సు	అనిరుద్ధము
శార్ఙ్గము	ఇంద్రియము	

10. పద్మనాభుడు :

''సర్వజగత్కారణం పద్మంనాభౌయస్య స పద్మనాభః'' అని శంకర భాష్యము.[61] శ్రీమహావిష్ణువు నాభియందు మొదట పద్మం పుట్టింది. ఆ పద్మంనుండి బ్రహ్మ పుట్టాడు. బ్రహ్మ సకల సృష్టిని చేశాడు. ఈ విధంగా సృష్టి సమస్తానికి పద్మం మూల భూతమౌతుంది.[62]

II గుణవర్ధకములు

1. హృషీకేశుడు :

హృషీకమనగా ఇంద్రియము. ఇంద్రియాల కధిపతి కావున వాసుదేవుడు హృషీకేశుడనబడెను. ''ఇంద్రియాణాం మనశ్చాస్మి'' అని గీతలో (10–22) వాసుదేవుడు చెప్పియున్నాడు. వాసుదేవుడు ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకొను వాడగుటచేత హృషీకేశుడని తెలుపబడినట్లు హరివంశం చెప్పుతుంది[63] సూర్యచంద్ర కిరణములచేత లోకులను ప్రహృష్ట చిత్తులనుగా చేయువాడు కావున హృషీకేశుడని శంకరభాష్యము[64].

2. సర్వవిజ్జయీ :

రాగాది అంతశ్శత్రువులను, హిరణ్యాక్షాది బహిశ్శత్రువులను జయించినవాడు కావున వాసుదేవుడు సర్వవిజ్జయి అనబడెనని

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావఝ్ఝల కోదండరామయ్యగారువ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగావుంది. వెల రు 15-00 (పోస్టేజి అదనం)

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల రు. 7-50 (పోస్టేజి అదనం)

భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండుచేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల రు 7 50 (పోస్టేజి అదనం)

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

....ప్రతులకు...

మేనేజరు

ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ 3

శంకరభాష్యము[65]. ప్రతివాదులందరిని తన వాక్చాతుర్యంచేత జయించిన వాడగుటచేత వాసుదేవుడు సర్వవిజ్జయి అనబడెనని పంశర భట్టార్యులు వ్యాఖ్యానించిరి.[66]

3. త్రివిక్రముడు :

'యస్యోరుషు త్రిషు విక్రమణేషు అధిక్షియన్తి భువనానివిశ్వా" అని ఋగ్వేదము, "ఇదం విష్ణుర్విచక్రమే త్రేధాని వధేపదం" అని యజుర్వేదము త్రివిక్రమావతారాన్ని కీర్తిస్తున్నాయి.[67] ముల్లోకాలను వ్యాపించినవాడు కావున త్రివిక్రముడని శంకరభాష్యము[68]. మూడు వేదములలోను వర్ణింపబడినవాడు కావున త్రివిక్రముడని పరాశరభట్టార్యుల వ్యాఖ్యానము.[69]

4 అనిరుద్ధుడు :

"నకేనాపి ప్రాదుర్భావేషు నిరుద్ధ ఇతి అనిరుద్ధః" అని శంకరభాష్యము[70]. ప్రాణికోటిని రక్షించటానికి అనేకములైన భగవల్లీలా కృత్యములను ఎట్టి ఆటంకములకు గురి కాకుండ చేసినవాడు కావున వాసుదేవుడు అనిరుద్ధుడనబడెను[71].

5 వ్యాపి :

"ఆకాశవత్ సర్వజగత్వాత్ వ్యాపీ", "ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః" "ఇతి శ్రుతేః; కారణత్వేన సర్వకార్యాణాం వ్యాపనాద్ వా వ్యాపీ" అని శంకరుల భాష్యము[72]. "మయా తతమిదం సర్వం జగదవ్యక్త మూర్తినా" అని గీత. (9.4)

"ఆదిత్యా నామహం విష్ణుర్జ్యోతిషాం రవి రంశుమాన్
మరీ చిర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ"
(గీత. 10.21)

ఇట్లు వేదాల్లో సామవేదము, దేవతల్లో ఇంద్రుడు, ఇంద్రియాల్లో మనస్సు, స్థావరాల్లో హిమాలయం, వృక్షాల్లో అశ్వత్థం, ఆయుధాల్లో వజ్రం, మృగాల్లో సింహము, మరీచుల్లో వాయుదేవుడు, నదుల్లో గంగ—ఇట్లు అనంత రూపాలుగా సృష్టిలోని చరాచరాల్లో వ్యాపించియున్నవాడు వాసుదేవుడే అని గీత (అధ్యా. 10) చెప్పుతుంది. "న తదస్తి వినా యత్స్యాన్మయాభూతం చరాచరమ్" (గీత. 10.39)తాను లేనిదేదియును లేదని వాసుదేవుడు చెప్పెను.

"సభూమిం విశ్వతోవృత్వా అత్యతిష్ఠ దశాంగులమ్" అని పురుషసూక్తంలో చెప్పబడినట్లు సహస్రాక్ష, సహస్రపాద, సహస్ర శిరములతో వాసుదేవుడు బ్రహ్మాండము లోపలను, వెలుపలను వ్యాపించి ఉన్నాడు.

6. వాసుదేవుడు : [73]

"ఛాదయామి జగత్సర్వం భూత్వా సూర్య ఇవాంశుభిః
సర్వభూతాధి వాసశ్చ వాసుదేవస్తతః స్మృతః

అని మహాభారతములో 'వాసుదేవ' శబ్దమును గూర్చి చెప్పబడింది[74]

7. గోపతి :

"గవాం పాలనాద్ గోప వేషధరో గోపతిః" అని శంకర భాష్యము[75]. వాసుదేవుడు గోకులమున జన్మించి గోపాలనము చేసెను కావున అతడు గోపతి యనబడెను, "వృష్ణీనాం వాసుదేవోఽస్మి" అని గీత. (10.37)

8. మాధవుడు :

"మాయా విద్యాయాః పతః మాధవః" అనియు "మధుకురే జాతత్వాత్ మాధవః"[76] అని శంకరభాష్యము 'మాధవము' అనగా వసంత ఋతువు. అది కలవాడు మాధవుడు. "ఋతూనాం కుసుమాకరః" అని గీత. (10.35)

9. సులభుడు :[77]

"అనన్య చేతా స్సతతం యోమాంస్మ రతి నిత్యశః

తస్యాహం సులభః" (8.14) అని గీతలో తాను భక్త సులభుడనని వాసుదేవుడు చెప్పియున్నాడు.

10 మోక్షలక్ష్మీశ్వరుడు :

"ముక్తిం దదాతీతి ముకుందః" అని శంకరభాష్యము[78]. వాసుదేవుడు మోక్షప్రదాత. వైకుంఠ మీయన నివాసస్థానము. ఈయనను చేరిన వారికి పునర్జన్మ ఉండదు. ఎవరే మార్గమున సేవించినను వారు తననే చేరెదరని భగవంతుడు చెప్పియుండెను.

ఈ విధంగా ఈ కాలంలో వచ్చిన శతకాల్లో అంతర, బాహిర వైలక్షణ్యం కలిగి వేదనా వాసుదేవం కౌస్తుభ మణిలాగా ప్రకాశిస్తుంది.

అనుబంధము :

శ్రీ విష్ణు సహస్రనామాల్లో చెప్పబడిన నామాలు కొన్ని యథాతథములుగా, కొన్ని కొద్ది మార్పులతోడను, తాత్పర్య సూచకములు మరికొన్ని ఈ వేదనా వాసుదేవమున కలవని ఇదివరకు చెప్పబడింది. అట్టి నామము లిట కొన్ని అనుబంధముగా చూపబడుచున్నవి. వేదనా వాసుదేవములోని నామమున కెదురుగా కుండలీకరణములో నీయబడిన సంఖ్య 'శ్రీ విష్ణు సహస్రనామముల'లోని నామ సంఖ్యను సూచించుచున్నది. ఇందుకుగాను తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆంగ్లంలో వ్రాయబడిన వ్యాఖ్యాన గ్రంథం (1965) ఉపయోగింపబడింది.

యథాతథములు :

వాసుదేవ (334, 714), అనిర్దేశ్యవపు (179,662) హృషీకేశుడు (47); సర్వవిజ్జయి (805) పుష్పదరహాస

(952) ప్రభూ (35); అనిరుద్ధుడు. (644) ఈశ్వర(36) సుసూక్ష్మ (458) పరమేశ్వర (379) గోపతి (497,599) మనోహరా (462) మాధవా (169) నైకరూప (272) కవీ (134) అవ్యయాకార (13) సులభుడు (823) సహస్ర పాదములు (229) శ్రీమంతుడు (12.180.222) అచింత్య రూపా (836) త్రివిక్రమ (533) శ్రీమన్నారాయణ (246)

కొద్ది మార్పులవి :

సకలేశ (97); మహాత్మా (103) మహావివేక మహితాత్మా (175) అనంతలక్ష్మీధామ (933) శ్రీనాథ (610) జగత్పతీ (537) కమలిన చంద్రబింబములు (888); నానారూపాంతర భూమి (932) భక్తవరదాభయ దాయక (742); సౌఖ్య కారణ (460)

తాత్పర్య సూచకములు :-

శబ్దగతవేధవు (218) కూటస్థుండవు (205); విశ్వ భూభువనముల్ వ్యాపించి నీవు (468) పాదము లకులు శిరములు వేయేసి (226, 228, 229); కరుణా కటాక్షము (395); శ్వేతద్వీప నివాస (406) సోమకళాల వాంకురితమూర్తి (507) మోక్ష లక్ష్మీశ్వరా (518) దంష్ట్రిపై (542) అణువునం దణీయుడు (839).

అధస్సూచికలు :-

1 నరసారావు పేటలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులుగా 1955లో పదవీ విరమణముపొంది పిదప తిమ్మసముద్రము లోని ఒక ప్రైవేటు స్కూలులో 1955–57 వరకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి విరమించుకున్నారు.

2 భగవద్గీత (గీత.) అధ్యా. 11. శ్లో. 38.

3 గీత. 11.15.

4 కలడంభోధి.. భాగవతము. 7–274 (1962).

5 గీత. 11.13.

6 The Liberator. Page. 135.

7 The Liberator. Pages 134, 135.

8 గీత. 8.14.

9 "మా నాన్నగారు ఇక్కడకు (హైదరాబాదు) వచ్చిన నుండి ప్రతిరోజూ ఉదయం 10–30 గంటల నుండి 11–30 గంటల వరకు వాలుకుర్చీలో కూర్చుండి శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని చదువుకునేవా"రని డా. కృష్ణకుమారి గారు నాకు చెప్పారు.

10 నాయని సుబ్బారావుగారు ఉద్యోగవిరమణానంతరం, ఉద్యోగం చేస్తూ హైదరాబాదులోనున్న తమ పెద్ద కూతురు డా. నాయని కృష్ణకుమారి దగ్గరకు కుటుంబ సమేతంగా 1958లో వచ్చారు. హైదరాబాదులో తనకేదైన చిన్న ఉద్యోగం దొరుకుతుందని ఆశించారు. కాని దొరుక లేదు. 1952 జూన్ నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం – హైదరాబాదులో డా. కృష్ణకుమారిగారు ఉపన్యాసకు రాలుగా పని చేస్తుండిరి. 1954లో వివాహమైనారు. భర్త కనకపల్లి మధుసూధనరావుగారు 'అడ్వకేటు'గా 'ప్రాక్టీసు' పెట్టుకున్నారు. కాని ఆయన సంపాదన అంతగా లేదు. డా. కృష్ణకుమారిగారొక్కరే తన కుటుంబాన్ని, తండ్రి కుటుంబాన్ని పోషించవలసివచ్చింది. నాయని ఇద్దరు కుమార్తెలు – రమ, కోటేశ్వరిగార్లు హైదరాబాదులో బి. ఏ. చదువుతున్నారు. కుమారుడు ఇంటర్మీడియట్ చదివాడు. ఉద్యోగమేం లేదు. ఉద్యోగాన్నాశించి హైదరా బాదుకు వచ్చిన తనకే ఉద్యోగం దొరక్కపోవటం, తానొక్కడే కాక తన భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు– పెద్దకూతురుపై ఆధారపడి ఉండటమనే ఈ క్లిష్ట పరిస్థితులు నాయనిలో వేదనను కలిగించాయి.

11 'ప్రైమరీస్కూలు' చదువు జన్మభూమి పొదిలెలో చదివి, 'హైస్కూలు' చదువు ఒంగోలులో ముగించుకొని, ఇంటర్, బి. ఏ, బందరులో పూర్తిచేశారు. 1930లో మొదట 'సబ్ రిజిస్ట్రార్' ఉద్యోగం నెల్లూరులో రెన్నెల్లుమాత్రం చేశారు. ఆ ఉద్యోగం తన కిష్టంలేకపోవడం వలన మానేసి 1930 ప్రాంతాన నరసారావుపేట' మున్సిపల్ హైస్కూలు'లో ఉపాధ్యాయునిగా చేరారు. ప్రధానోపాధ్యాయునిగా 'ప్రమోషన్' వచ్చి 1942 నుండి 1945వరకు చికాకో (శ్రీకాకుళం)లో ఉన్నారు. నరసా రావుపేటకు ప్రధానోపాధ్యాయునిగా 1945లో పోయి పదవీ విరమణ కాలంవరకు (1955) అక్కడే ఉన్నారు. 1955–57వరకు ఒక ప్రైవేటు స్కూలులో ప్రధానో పాధ్యాయునిగా పనిచేస్తూ తిమ్మసముద్రంలో ఉన్నారు. ఆ గ్రామానికి వాహన సౌకర్యాలు సరిగా లేకపోవటంవల్ల, అక్కడి వాతావరణం సరిపడక ఆ ఉద్యోగాన్ని మాను కున్నారు. పిదప 1957లో కుటుంబ సమేతంగా హైదరా బాదుకు వచ్చారు. కొడుకు ఉద్యోగం చేస్తున్నప్పుడు 1958లో ఢిల్లీకి సతీసమేతంగా వెళ్ళి ఎనిమిది నెలలక్కడ ఉండి 1959లో హైదరాబాదు వచ్చారు.

12 గీత. 8.15.

13 గీత, 7.17.

14 గీత 10–10.

15 గీత. 10–11.

16 గీత. 5.28.

17 గీత· 8.14.

18 గీత. 9.26.

19 ఆంధ్రమహాభాగవతోపన్యాసములు. పుట. 371. (1968)

20 ఆంధ్రమహాభాగవతోపన్యాసములు. (ఆంధ్ర. భాగ ఉప.) పుట. 346; 347.

21 ఆంధ్ర. భాగ. ఉప. పుట. 347.

22 ఆంధ్ర. భాగ. ఉప. పుట. 357.

23 SriVishnu Sahasranama Bhashyam (S. V. S. B.) T. T. D. Page. 5. (1965

24 S. V. S. B. Page. 96

25 S. V. S. B. Page. 91

26 Life of Ramanuja. Page-253. (1965)

27 ఆంధ్ర. భాగ. ఉప. పుట. 348, 349.

28 శ్రీవిష్ణు సహస్రనామ–శంకరభాష్య. (శ్రీవిష్ణు శంకర) పుట 181. (సప్తమ) గీతా ప్రెస్.

29 S. V. S. B. Page (143)

30 ఆంధ్ర. భాగ. ఉప–349.

31 S. V. S. B. 157

32 శ్రీవిష్ణు – శంకర–195

33 S. V. S. B. 58, 59.

34 ఆంధ్ర. భాగ. ఉప. - 351

35 ఆంధ్ర. భాగ. ఉప–357·

36 Life of Ramanuja–252.

37 గీత· 11.46.

38 నాయని సుబ్బారావుగారు తమ గదిలో పడక ప్రక్క గోడకు చతుర్భుజరూపమునున్న వాసుదేవుని బొమ్మ ఒకటి కలదు. అది తన కెప్పుడును కన్పించునట్లు వ్రేలాడదీయబడిఉంది. "దాని నా స్థానంనుండి ఎంతమాత్రం నానకదిలించనీయ" రని డా. నాయని కృష్ణకుమారిగారు నాకు చెప్పారు.

39 శ్రీవిష్ణు –శంకర–59.

40 శ్రీవిష్ణు–శంకర- 141.

41 శ్రీవిష్ణు–శంకర – 142.

42 ఆంధ్ర. భాగ. ఉప –345, 346.

43 భారతి. ఏప్రిల్. 1964.

44 ఆంధ్రశతక సాహిత్య వికాసము–7· (1976)

45 ఆంధ్రప్రదేశ్. జూన్ 1964.

46 "మా నాన్న సహజంగా పిఱికివారు· చాలా భయపడతారు. అనారోగ్యంగా ఉండి విచారిస్తుంటే "ఏంటి నాన్న అంత భయపడతారు. అదే తగ్గుతుందిలే" అని నేనంటే "పిచ్చి దానా! నాకేం భయమే. నా పెదాలమీద ఏమాడుతుందో తెలుసా! "ఓం నమోభగవతే వాసుదేవాయ" ఈ మంత్ర ముండగా నన్నేదేం చేస్తుందే అని అనేవారు – అని డా. నాయని కృష్ణకుమారిగారు నాతో చెప్పారు.

47 శ్రీవిష్ణు సహస్ర నామములను నాయని అనుదినం పారాయణ చేస్తుండేవారు.

48 శ్రీవిష్ణు : శంకర–114.

49 S.V. S. B.-90.

50 S. V. S. B. - 91

51 Life of Ramanuja-253.

52 S. V. S. B -191.

53 శ్రీవిష్ణు–శంకర – 242.

54 శ్రీవిష్ణు–శంకర 256.

55 S. V. S. B. 198.

56 శ్రీవిష్ణు–శంకర – 165.

57 శ్రీవిష్ణు –శంకర–223.

58 శ్రీవిష్ణు–శంకర – 232.

59 S. V. S.B.- 183.

60 శ్రీవిష్ణు–శంకర–265, 266.

61 శ్రీవిష్ణు–శంకర–88.

62 S. V. S. B.–59.

63 S. V. S. B. – 58.

64 శ్రీవిష్ణు–శంకర-87.

65 శ్రీవిష్ణు– శంకర· 224.

66 S. V. S. B. - 178

67 ఆంధ్ర. భాగ. ఉప – 356.
68 శ్రీవిష్ణు–శంకర–177.
69 S. V. S. B. – 140.
70 శ్రీవిష్ణు – శంకర – 115
71 S. V. S. B. – 91.
72 శ్రీవిష్ణు–శంకర–166.
73 ఈ శబ్దమునుగూర్చి ఇదివరకు సవివరముగా తెలుపబడింది.
74 శ్రీవిష్ణు-శంకర–141.
75 శ్రీవిష్ణు–శంకర–171.
76 శ్రీవిష్ణు–శంకర–112, 213.
77 ఈ పదమును గూర్చి ఇదివరకు వివరంగా తెలుపబడింది.
78 శ్రీవిష్ణు శంకర–174.

కవిత

శ్రీ గుడిహాళం రఘునాథం

ఈ తలుపులు
 ఇప్పుడే తెరవ బడవ్.
లోపలో అమ్మాయి
స్నానం చేస్తుంది. —

రైల్వే స్టేషన్‌లో
క్రరసాయంతో చుట్టూ తిరుగుతూ
అడుక్కుంటున్న ముసలి అవ్వలా
సెకండ్లముల్లు. –

అదేపనిగా వీస్తూ
తలుపులపై చెయ్యి చేసుకుంటున్న
వెలుతురు. —

ఎదురు తిరిగి
అరుస్తున్న వాకిళ్ళు —
లోపల
మెత్తగా జారుతున్న నీటి శబ్దం
విషాద గీతంలా —
పాట ఆగిపోయింది.

నా కళ్ళలో, కన్నీళ్ళలో
స్నానం చేసి
పదార్ని కప్పుకొని
రెప్పల్ని తెరచుకొని
కాగితం డ్రాయింగ్ రూమ్‌లో
నిలబడిందా అమ్మాయి
గుండెల్తో మాట్లాడటానికి !

శ్రీ పీటర్ న్యూహవుసర్

జర్మన్ టెర్రరిస్టుతో ఇంటర్వ్యూ

జర్మన్ పోలీసులు ఇప్పుడు కూడా గాలిస్తున్న ముప్పై మంది టెర్రరిస్టులలో మైఖేల్ బౌమన్ ఒకరు. "స్పైరన్" పత్రిక విలేకరి ఒకరు ఆయనను అజ్ఞాతవాసంలో యిటీవల కలుసుకొన్నాడు. ఆ విలేకరి పీటర్ న్యూహవుసర్. ఆయన జరిపిన ఇంటర్వ్యూ అనువాదాన్ని 1978 సెప్టెంబరులో 'ఎన్‌కౌంటర్' పత్రిక ప్రచురించింది. ఆ ఇంటర్వ్యూ తెలుగు అనువాదం యిలా ఉన్నది :

ప్రశ్న : మీ పూర్వపు సహచరులు న్యాయస్థానాలలో అభియోగాల విచారణతో సతమతమవుతూండగా, అజ్ఞాతవాసంలో వుంటున్న మీకు ఎలా అనిపించుతున్నది?

బౌమన్ : వారికి మంచిరోజులు రావాలని కోరుకొంటున్నను.

ప్రశ్న : అంతేనా ?

బౌమన్ : నాకున్న చిక్కులువాలు· వెనక్కిపోతే గొయ్యి, ముందుకు పోతే నుయ్యిగా వున్నది నా పని. ప్రజలు నాకు వ్యతిరేకంగా న్నారు· మరొక వైపు పోలీసులూ, నా కామ్రేడ్స్ నన్ను వ్యతిరేకించుతున్నారు. నన్ను చంపించాలని వారు కోరుతున్నట్టు వదంతి.

ప్రశ్న : వారు అలా ఎందుకని అభిలషించాలి ?

బౌమన్ : ఎవరికీ నమ్మకద్రోహం చేయకపోయినా, బయటకు వెళ్ళిపోవడాన్ని వారు 'నమ్మకద్రోహం'గా పరిగణించుతారు.

ప్రశ్న : విఫలం అయినప్పటికీ, సాయుధపోరాటం ప్రయోగం ప్రయోజనకరమయినదని, సందేహం లేదని మీరు వ్రాసిన ఒక పుస్తకంలో మీరు అన్నారు. ష్లైలర్, మోరోల తర్వాత కూడా మీరు అలాగే భావించుతున్నారా?

బౌమన్ : తప్పులు చేయకుండా యేమీ నేర్చుకొనలేము. కనుక విఫలం అయినప్పటికీ పట్టణ గెరిల్లా ప్రయోగం ప్రయోజనకరమయినదే. అయితే ఇప్పుడు పోరాటం జరుగుతున్న తీరు "వెర్రి" అని నా అభిప్రాయం. మొగదిషూ-పిల్లల జీవితాలకంటే, సెలవులలో కాలక్షేపం చేసేవారి జీవితాలకంటే నా ప్రాణం విలువయినదని అనడం సమంజసం కాదు. ఫాసిజంతో సమానమయిన, కొందరికంటే మరికొందరు అధికులనిభావించే వెర్రితనమవుతుంది అది.

ప్రశ్న : లేడు యేమి టండీ; మీ విమర్శ ష్లైలర్, మోరోలు హత్యచేసిన కాపలావారికీ వారు ఎత్తుకుపోయిన ఇరువురు రాజకీయవాదుల–సంఘటనకు మాత్రం వర్తించదా ?

బౌమన్ : గెరిల్లాల దృష్టిలో అవి సైనిక చర్యలు. వాటిని మరొక విధంగా చేయడానికి వీలుకాదు. ష్లైలర్‌ను బంధించడం లక్ష్యం. మరి ఆయనకు అంగరక్షకులున్నారు. మేము మా పని పూర్తిచేసుకొని వెళ్ళేదాకా "అలా చేతులు కట్టుకుని కూర్చోండి" అని వారికి చెప్పే అవకాశం లేదుగదా. వారి వద్ద తుపాకులున్నాయి. వాటిని వారు ఉపయోగిస్తారు.

ప్రశ్న : మీ అభిప్రాయంలో రాజకీయంగా అది ముందుకు తీసుకుపోతుందా?

బౌమన్ : లేదండీ. వెనుకకు తీసుకుపోతుంది. అంతదూరం పోయినవారు అయోమయంలో పడ్డారన్న మాట. నియమ నిబంధనలను రూపొందించే అధికారాన్ని చాలా కాలం క్రితమే వారు కోల్పోయినారు. అయినా అలాంటి నిబంధనల ప్రకారమే వారు వ్యవహరించుతున్నారు. తొలుత నిర్ణయించుకొన్న కార్యాచరణ పద్ధతినుంచి వారు పూర్తిగా దారి తప్పారు.

ప్రశ్న : "2 జూన్ ఉద్యమం" ఆ సందర్భంగా రూపొందించిన "అసలు కార్యాచరణ" పద్ధతి ఏమిటి?

బౌమన్ : మా దృష్టిలో పశ్చిమ జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్‌లో ఫాసిజాన్ని ఓడించడం జరగలేదు. మా దృష్టిలో 1960 తరువాతి సంవత్సరాలలో ఫాసిజమ్ మళ్ళీ పెరుగుతున్నది, 1933లోని ప్రజలవలే మేము నిస్సహాయంగా చూస్తూ ఊరుకొనదలచలేదు.

ప్రశ్న : పది సంవత్సరాల తర్వాత పరిశీలించి ఆ సంఘటనను అలా విశ్లేషించడం ఒప్పవుతుందా ?

బౌమన్ : తప్పే, ఏమయినప్పటికీ అది జరిగిన సమయానికి సంబంధించినంతవరకూ అది తప్పే. మేము గ్రహించిన మరొక గుణపాఠం కూడా వున్నది. పోరాటం రూపంలో పట్టణాలలో గెరిల్లాయుద్ధం ప్రపంచమంతటా విఫలమయింది. ఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐనా పోరాటం జరుగుతుందో ఆ ప్రభుత్వం ప్రజాస్వామిక చట్టాలకు కొంతవరకూ కట్టుబడి వుంటేనే అది విజయవంతం అవుతుంది. అలా కాకుండా ప్రభుత్వం బలప్రయోగానికీ, హింసించడానికి దిగినప్పుడు గెరిల్లా ఉద్యమం విఫలంకాక తప్పదు.

ప్రశ్న : సైనిక బలం ప్రాధాన్యకని ఆలోచించే ప్రభుత్వం పట్టణాలలో గెరిల్లా పోరాటాలను అణచివేయడానికి చర్యలు గైకొంటే, అది విజయాన్ని సాధించే అవకాశం వుందని మీ అభిప్రాయమా?

బౌమన్ : అది వాస్తవమని అనుభవం విదితం చేస్తున్నది. షెలార్ ఉదంతానికి సంబంధించిన పథకాలను తయారుచేసిన వారు ఈ వాస్తవాన్ని గణనలోకి తీసుకొనలేదు.

ప్రశ్న : "2 జూన్ ఉద్యమం" సాయుధపోరాటం గురించి మాట్లాడడం ఎప్పుడు ప్రారంభించింది?

బౌమన్ : 1968లో ఈస్టర్‌లో రూడీ డూట్స్‌చ్కి మీద దాడి జరిగిన తరువాత. మొట్టమొదట పిస్టల్సును ఉపయోగించడం గురించికాక శక్తివంతంగా పోరాటం జరిపే పద్ధతులను గురించి ఎక్కువగా చర్చ జరిగింది.

ప్రశ్న : మొదటి పిస్టల్ లభించినప్పుడు మీ వయస్సు ఎంత?

బౌమన్ : ఇరువది నాలుగు.

ప్రశ్న : అది ఎప్పుడు జరిగింది?

బౌమన్ : 18 నెలలు కారాగారంలో వుండి 1971 వేసవిలో విడుదలయిన తర్వాత. అప్పటికే మా తరఫున పిస్టల్స్‌ను ఉపయోగించడం ప్రారంభమయింది.

ప్రశ్న : బెల్టులో పిస్టల్ పెట్టుకుంటే మీకు ఎలా అనిపించింది?

బౌమన్ : నేను గొప్పవాణ్ణి అనే అనుభూతి కలుగుతుంది. పిస్టల్ ఉంటే పారిపోతుంది భయం. బలహీనులు కూడా పిస్టల్స్ వారివద్ద వుంటే, చాలా బలవంతులమని అనుకొంటారు. అలాంటి వారు చేయవలసిన పనల్లా పిస్టల్‌ను పేల్చడం ఒక్కటే. ఈ పని ఎవరయినా చేయగలరు. అలా చేయాలని చాలామందికి అనిపించుతూంటుంది,

ప్రశ్న : మీవద్ద ఇప్పుడు ఆయుధం ఉన్నదా?

బౌమన్ : లేదు. చాలా కాలంగా ఆ పద్ధతి మానివేశాను. నిటారుగా నిలబడి పోరాడితే ప్రయోజనం ఉంటుందని రూడ్ డూట్స్‌చ్కి అంటూండేవాడు. పిస్టలుంటే నిటారుగా నిలబడడానికి వీలుండదు తల ఎప్పుడూ వంగి పిస్టల్ కేసే చూస్తూంటుంది.

ప్రశ్న : మీరు పిస్టల్ ఎలా సంపాదించారు?

బౌమన్ : పోలీసులద్వారా. పీటర్ అర్‌బాచ్ అనే నిరుద్యోగి మా బృందంలో చాలా సంవత్సరాలు సభ్యుడుగా వున్నాడు. అతనిద్వారా పిస్టల్ సంపాదించాను.

ప్రశ్న : మరి మీరు అతను సప్లయ్ చేసిన పిస్టల్స్‌కు డబ్బు ఎలా చెల్లించగలిగారు?

బౌమన్ : డబ్బు సంగతి ఎవరూ చెప్పలేరు.

ప్రశ్న : మరి మీలో ఎవరికీ ఆ మాటయే స్ఫురించలేదా?

బౌమన్ : లేదు. ఆయుధాలు ఎక్కడ లభించేదీ తెలిసిన సభ్యుడొకడున్నందుకు మాకు సంతోషం కలిగింది. అధికార పర్యటనకు వెడుతూ రిచర్డ్ నిక్సన్ పశ్చిమ బెర్లిన్‌కు వచ్చినప్పుడు 1969లో బాంబు పేల్చాలని మేము నిశ్చయించాము. శాయశక్తులా ప్రయత్నించి ఎవరికీ గాయాలు తగులకుండా చూడాలని అనుకొన్నాము. బాంబులను తాను సంపాదించగలనని అర్‌బాచ్ చెప్పాడు.

ప్రశ్న : సంపాదించి ఇచ్చాడా?

బౌమన్ : ఆ.. ఇచ్చాడు. నిక్సన్ పర్యటనకు ముందు ఒకచోట అతన్ని నేను కలుసుకొన్నాను. ఒయిదారు బాంబులున్న ప్లాస్టిక్ సంచీ అతను నాకు ఇచ్చాడు. నిక్సన్ రాక సందర్భంలో ఆ భవనంలో మేము పెట్టిన బాంబులు పనిచేయలేదు కానీ ఆ తర్వాత చాలా సందర్భాలలో మేము పెట్టిన బాంబులు పేలాయి.

ప్రశ్న : అంటే మీ జట్టులో ఆయుధాలను సంపాదించే మొనగాడు అర్‌బాచ్ అన్నమాట.

బౌమన్ : చాలా కాలం అలాగే పనిచేశాడు. కానీ అతనేదో కుట్ర చేస్తున్నట్లు ఆ తర్వాత కనుగొన్నాము. గ్రీకులో ప్రతిఘటన పోరాటం సాగించుతున్నవారికోసం అతను ఆయుధాలను సంపాదించవలసి వున్నది. దాన్ని గురించి చాలా అబద్ధాలు చెప్పాడు. దానిమీదట అతని కార్యకలాపాలను మేము పరిశీలించాము. బెర్లిన్‌లోని "రీచ్‌బాన్" తరఫున కమ్యూనిస్టులను గురించిన వివరాలు అతను సేకరించవలసి వున్నదని తేలింది.

ప్రశ్న : ఆ తర్వాత యేమి జరిగింది?

బౌమన్ : 1969లో రెడ్ ఆర్మీ ఫ్రాక్షన్ ఏర్పాటయింది. ఆండ్రియస్ బాడర్‌కు వెంటనే ఆయుధాలుఅవసరమయ్యాయి. బాడర్‌కు ఆయుధాల పిచ్చి ఎక్కువ. ఆ తర్వాత వాటితో అతనికి 'సెక్స్' సంబంధం వంటిది ఉండేది. ఫ్రాంక్‌ఫర్ట్ డిపార్ట్‌మెంట్ స్టోర్ దహనం అభియోగంతో సంబంధం ఉన్న కారణాన మరికొంతకాలం అతను అజ్ఞాతవాసంలో ఉండవలసి వచ్చింది. ఇంకా చేస్తే అర్‌బాబ్ తప్పితే ఆయుధాలను సరఫరా చేయగల మరొకరు అతనికీ కనిపించలేదు. అర్‌బాబ్‌తో తెగతెంపులు చేసుకోవలసినదిగా జార్జ్ నాన్ రాబ్, నేనూ అతన్ని హెచ్చరించాము. అయినా అర్‌బాబ్‌వద్దకే అతను వెళ్ళాడు. అర్‌బాబ్ ఆయుధాలు ఇచ్చాడు అతనికి.

ప్రశ్న : ఏయే ఆయుధాలు సప్లయ్ చేశాడు?

బౌమన్ : మూడు నాలుగు బెల్జియన్ 7.65 తుపాకులూ, సబ్ మెషిన్ గన్ ఒకటీ ఇంకా ఎక్కువ ఆయుధాలను సప్లయ్ చేయడానికి ఆ సమావేశంలో ఒప్పందం కుదిరింది. అయితే వాటికి డబ్బు కావాలని అర్‌బాబ్ అన్నాడు. అవి సప్లయ్ అయితే బ్యాంకుమీద దాడి చేయడం సులభం కాగలదని అతను అన్నాడు.

ప్రశ్న : రెండవ వాయిదా ఆయుధాలు సప్లయ్ అయినయ్యా?

బౌమన్ : లేదు. బెర్లిన్ క్రుయిజ్‌బర్గ్‌లో 1970లో జరిగిన ఆ రెండవ సమావేశంలో బాడర్ అరెస్టయినాడు. పోలీసులు ఎదురు చూస్తున్నారు. అద్భుతంలాగా అర్‌బాబ్ తప్పించుకు పోయినా . మొదటి సమావేశంలో సప్లయి అయిన ఆయుధాలను దాదాపు పద్దెనిమిది నెలలు గుప్తస్థలంలో దాచాము. 1971 జూలైలో మాలో నలుగురు జైలునుంచి విడుదలయినప్పుడు ఆర్. ఎ. ఎఫ్. సప్లయి చేసింది వాటినిమాకు. అవి అర్‌బాబ్‌నుంచి వచ్చాయని తెలుసు మాకు.

ప్రశ్న : ఇంకా కొంచెం స్పష్టంగా చెప్పుకుందాము. జర్మన్ టెర్రరిస్టులకు మొదటి వాయిదా ఆయుధాలు పోలీసుల నుంచి లేదా రహస్య గూఢచారుల వ్యతిరేక అధికారుల నుంచి వచ్చాయని మీరు చెప్పారు. అయినా విప్లవకారులు వాటిని స్వీకరించారా?

బౌమన్ : అవును పరిస్థితి ఎలా అదుపు తప్పిపోయిందో దానివల్ల విదితమవుతుంది. ఆ ఆయుధాల సంగతి పోలీసులకు తెలుసునని మాకు స్పష్టంగా తెలుసు. ఏమయినా ఎక్కడనుంచి సప్లయి అయినా ఆయుధం ఆయుధమే. నేను విడుదలయిన రెండు రోజుల తర్వాత నా స్నేహితురాలు (గరల్ కామ్రేడ్) పెటా షెర్మను హాంబర్గ్‌లో పోలీసులు కాల్చేశారు. అంటే ఖైదీలుగా మమ్మల్ని బంధించడం పోలీసులు మానేశారన్నమాట. ప్రతిఘటించకుండా కాల్పులకు గురికావడానికి మేము ఇష్టపడలేదు.

ప్రశ్న : ఒక బ్యాంకిమీద దాడి జరిగిన తర్వాత కుట్రదారుల కేంద్రంలో యేమి జరుగుతుంది?

బౌమన్ : విజయం సాధించినందుకు తొలుత కొంత సంభ్రమం కలుగుతుంది. ఆ తర్వాత కొల్లగొట్టిన ధనాన్ని లెక్కపెడ్తారు. అటు తరువాత పోలీసుల రేడియోవింటారు. దాడి సంగతి వారికేమీ తెలియలేదని విదితమవుతుంది.

ప్రశ్న : ఆ తర్వాత ?

బౌమన్ : బెర్లిన్‌లో సాయంత్రం ప్రసారమయ్యే టెలివిజన్ బులెటిన్ మాస్తాము. మళ్ళీ సంతోషం కలుగుతుంది. మరునటిరోజు ఎవరో ఒకరు బజారుకు వెళ్ళి, ఎవరికీ అనుమానం కలుగకుండా వార్తాపత్రికలన్నీ కొనితెస్తారు. ముఠాలోని ప్రతి ఒక్కరూ వాటిలోని ప్రతి వాక్యమూ చదువుతారు.

ప్రశ్న : ఇలాంటి దాడులలో పత్రికలవంటి వాటి ప్రాముఖ్యం యేమిటి? ఇలాంటి వార్తా ప్రసార సౌకర్యాలు లేకపోతే పట్టణాలలో గెరిల్లాదాడులు జరిగే అవకాశం వున్నదా ?

బౌమన్ : అంతగా ఉండదు. ఇంతకూ పత్రికలేగదా మమ్మల్ని సృష్టించింది !

ప్రశ్న : టెర్రరిజమ్‌కు వ్యతిరేకంగా మీరు పోరాడవలసివస్తే పత్రికలవంటి వాటితో యెలా వ్యవహరిస్తారు ?

బౌమన్ : వార్తానివేదికలను వ్రాయడాన్ని నిషేధిస్తాను.

ప్రశ్న : అంటే పత్రికలలో ఏమి వ్రాశారు అనే అంశంకంటే దేన్నిగురించి వ్రాశారు అనే అంశానికి మీ బృందం అధిక ప్రాముఖ్యం ఇస్తుందన్నమాట.

బౌమన్ : ఖచ్చితంగా:"జూతల కమ్యూనిటీ సెంటర్‌లో బాంబు." "'క్రిస్టల్‌నైట్' వార్షికోత్సవంనాడు బాంబు"వంటి వార్తలను తయారుచేసి, ప్రసారం చేస్తాను.

ప్రశ్న : ఎప్పుడూ యేదో ఒకదాడి జరుపుతూండరుగదా . పని లేనప్పుడు మీ బృందం వారి భావాలు ఎలా వుండేవి? నిత్యజీవితం ఎలా వుండేది?

బౌమన్ : పని వున్నప్పుడే హాయిగా వుంటుంది. చిక్కంతా యేపనీ లేనప్పుడే. చుట్టూ అందరూ తెలిసినవారే వుంటారు. వ్యక్తిగత సమస్యలలో మార్పుండదు పయిగా కూర్చునే చోటులో కూడా మార్పుండదు. వ్యక్తిగత సమస్యలు ఎన్నడూ పరిష్కారం కావు. ఇలాంటి జీవితం చాలు ఉద్రిక్తత పెరగడానికి.

ప్రశ్న : ఏదో ఒక దాడివంటి వాటివల్ల హాయి కలిగించే రకం ఉద్రిక్తత ఇలాంటి బృందాలలో పుట్టుకొస్తుందనే మాట నిజమా?

బౌమన్ : అవును, బయటనుంచి వచ్చే వత్తిడి కారణంగా మేమందరం సమయిక్యమవుతాము. దాడివంటి వాటిని జరపడం లక్ష్యం కనుక అందరం సమయిక్యంగా వుంటాము. కాని, అలాంటి పనేమీ లేనప్పుడే సహించడానికి సాధ్యం కానంతటి ఉద్రేకాలు పుట్టుకొస్తాయి. ఉదయ భోజనానికి ఎక్కడకు వెళ్ళాలనే అంశం గురించి ఒకసారి మేము దెబ్బలాడుకొనడం జరిగింది.

ప్రశ్న : మీ బెల్టులో వుండే ఆయుధాలకోసం ?

బౌమన్ : ఆయుధాల సంగతి ఎప్పుడూ వుంటుంది.

ప్రశ్న : మీలో మీరు ఎన్నడయినా ఒకరిపై ఒకరు ఆయుధాలను గురిపెట్టుకొనడం జరిగిందా?

బౌమన్ : మా బృందంలో అలా జరగలేదుగాని ఇతర బృందాలలో జరిగింది. మా బృందంలో ఒకే ఒకసారి ఒక విషయం గురించిన తగాదా అలాంటి సంఘటనకు ద్రోవతీసింది. ఒక రాత్రి యాండ్రియస్ బాడర్, జార్జి వాన్ రాబ్ అకస్మాత్తుగా పిస్టల్స్ ఒకరికొకరు గురిపెట్టుకుని నుంచొన్నారు. వారిని చూచిన నేను బిత్తరపోయి చేతిలోని ఎర్రసారా సీసాను జారవిడిచాను. దానితో అందరూ నాకేసి చూచారు. అంతే ఉద్రేకాలు తగ్గిపోయాయి.

ప్రశ్న : ఒక ద్రోహిని ఏమిచేయాలనే అంశం గురించి మీ బృందంలో ఎన్నడయినా చర్చలు జరిగాయా?

బౌమన్ : ద్రోహిని చంపివేయాలనుకోండి చర్చలు జరిగేవే

ప్రశ్న : బృందంనుంచి విడిపోవాలని ఎవరన్నా అనుకొంటే?

బౌమన్ : ప్రవేశించడానికయితే రుసుమేమీ లేదు బయటకు వెళ్ళడం సాధ్యమయ్యే సంగతి కాదు కొత్త సభ్యులలో ప్రతి ఒక్కరికీ యీ విషయం స్పష్టం చేస్తాము. బయటకు దారి స్మశానం మీదుగానె

ప్రశ్న : మిగతా జీవితంతో ఎన్నడూ మార్చుకొనడానికి వీలులేని నిర్ణయం చేసుకోవాలంటె బాధగా వుండదా ?

బౌమన్ : కృతనిశ్చయం. దాడులవంటి వాటిపట్ల శ్రద్ధ అంత బలంగ వుంటాయి ఏమయినా ప్రారంభంలో ఇలాంటి వన్నీ అంత ముఖ్యం కాదని తోసేస్తారు. ప్రతిఒక్కరూ 'సరే అలాగే' అంటారు

ప్రశ్న : ఇలాంటి బృందం సమయిక్యంగా నిలబడడం సాధ్యమా?

బౌమన్ : వీలుకాదు. బయటి వత్తిడుల కారణంగానె సమయిక్యంగా నిలబడుతుంది. దాడివంటి పనిని జరపాలనే లక్ష్యాన్ని ప్రశ్నించడానికి వీలులేదు. లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగించే సాధనం గురించే మీమాంస, ఇలాంటి బృందంలో వ్యక్తి సంకల్పానికి తావుండదు. బృందంయొక్క సంకల్పశక్తి మాత్రమే నిలుస్తుంది.

ప్రశ్న : టెర్రరిస్టులను గురించి చెప్పేప్పుడు పోలీసులు మనుషులందరూ కలసిచేసే అఘాయిత్యంగా వర్ణిస్తారు. టెర్రరిస్టులు కూడా అలాగే వర్ణిస్తారా ?

బౌమన్ : అలా కాదు. బ్యాంకిల మీద దాడులు జరిగిన తర్వాత పోలీసులను నేను చూచాను. వారిస్థితి జాలి కలిగించింది నాకు. వారందరు యువకులు. నాకంటే కూడా చిన్నవారు. సబ్‌మెషిన్‌గన్స్‌లో కార్లలో నుంచి బయటకు దూకారు. వారి వంక చూచాను నేను. నాకంటే కూడా ఎక్కువ భయపడ్డారు వారు. ఒకసారి నేను లొంగిపోదాం అనుకొన్నాను. పిస్టల్‌తీసి ఒక పోలీసు జేబులోకి పడేద్దామనుకొన్నాను. అందుకని బెల్టుమీద చెయ్యి వేశాను. నేను కాల్చేయబోతున్నానని అతననుకొని పరుగు లంకించుకొన్నాడు భయంతో.

ప్రశ్న : సాయుధ దళంలో అజ్ఞాతవాసంలోకి వెళ్ళిన తర్వాత ఎలాంటి పరిస్థితులలో మీరు భయపడినారు ?

బౌమన్ : తనకు అసలు భయమే వేయలేదని ఎవరు చెప్పినా అతను అబద్ధం చెపుతున్నాడన్నమాట అయితే భయం కలిగించె సంఘటనలు మళ్ళీ మళ్ళీ సంభవించినప్పుడు అంత భయం వెయ్యదు. సంవత్సరాలపాటు జైలులో వుండాలనే ఆలోచన చావు కంటే ఎక్కువ భయం కలిగించుతుంది.

ప్రశ్న : పోలీసులు అసమర్థులని మీరు అంటారా ?

బౌమన్ : వారి సామర్థ్యం చాలా పెరిగింది. జి ఎస్ జి–9 దళం మాత్రమే కాల్పులలో ఆరితేరింది. ఆ దళం ఏర్పడక ముందు ఇజ్రాయెల్ రహస్య దళం అంటేనే నిజంగా భయంగా ఉండేది మాకు.

ప్రశ్న : మరి మీ సిద్ధాంతం సవ్య అయితే కౌంటర్ ఇంటలిజెన్స్ దళం వారు ఎందుకు మీ బృందంలోకి పంపించారు. మనుషులు కూడా గూఢచారి అయివుండరా ?

బౌమన్ : అది నిజమే. ఆ తర్వాత వారి పద్ధతులు మెరుగుపడలేదు. కౌంటర్ ఇంటలిజెన్స్ దళం ఇప్పటికీ మా సానుభూతి పరులను బంధించుతున్నది. అయితే నిజమైన సానుభూతి పరులు వారికి చిక్కకుండా తప్పించుకుపోతున్నారు ఇటీవలి రోజులలో.

ప్రశ్న : ఆర్. ఎ. ఎఫ్ ఇప్పటికీ సమర్థవంతంగా ఉన్నద ?

బౌమన్ : చాలా సమర్థవంతమయినది. హృదయ విదారకమైన సంఘటనలు జరుగవచ్చు.

ప్రశ్న : అంటే...ఒక ఉదాహరణ చెప్పండి ?

బౌమన్ : మనం అణువుబాంబు యుగంలో ఉన్నాము — అణుశక్తి ఉత్పత్తి కేంద్రాలున్నాయి.

ప్రశ్న : అంటే వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తారంటారా ?

బౌమన్ ప్రస్తుతానికి అలాంటి పథకాలున్నాయని నేను అనడంలేదు. ప్రస్తుత కాలాన్నిబట్టి అలాంటిది జరిగే అవకాశం లేక పోలేదంటాను. ఇటీవల సంభవించిన మూడు మరణాల అర్థం, ఫాసిజమ్ తిరిగి తల ఎత్తిందని వారు అంటున్నారు. కాబట్టి ఏమయినా సంభవించవచ్చు.

ప్రశ్న : ఇలాంటి పథకం వారు వేసినట్టు మీకు తెలిస్తే, నేరుగా మీరు పోలీసుల వద్దకు వెళ్ళి చెపుతారా ?

బౌమన్ : పోలీసులకు నేను ఏమీ చెప్పరాదు.

ప్రశ్న : అయితే మరేమి చేస్తారు ?

బౌమన్ : నేనే నేరుగా వారి దగ్గరకువెళ్ళి వ్యవహారం సరిచేస్తాను. ఎందుకనంటే పోలీసులు కలిపించుకొంటే అణువుబాంబు ప్రయోగం జరుగుతుందనడంలో నాకు సందేహం లేదు.

ప్రశ్న : అజ్ఞాతవాసంలో జీవితం ఎలా వున్నది ?

బౌమన్ : చాలా గడ్డుగా వున్నది. ఉద్యోగం లేదు. కుటుంబం లేదు. ఇల్లులేదు. ఏమీలేదు.

ప్రశ్న : మరి రాత్రి ఎక్కడ నిద్రిస్తారు ?

బౌమన్ : హాయిగా నిద్రపోతాను.

ప్రశ్న : మీ పూర్వపు సహచరులు కాల్చివేసే ప్రమాదం ఉన్నా కూడానా ?

భౌమన్ : ఆ సంగతి ఖచ్చితంగా యింతవరకూ తెలియదు. జరిగే అవకాశం ఉన్నవాటన్నింటినీ గణనలోకి తీసుకొనగలిగితే హాయిగా బ్రతకవచ్చు.

[జర్మన్ పత్రిక "స్టెర్న్", బ్రిటిషు పత్రిక "ఎన్ కవుంటర్" లలో పడిన ఇంటర్వ్యూ ఆధారంగా]

శ్రీ వి. యస్. అవధాని

విలాసం

శ్రీ మెతుకు మనోహర్‌రెడ్డి

మళ్ళీ సారి నన్నీ ప్రశ్న అడుగకు
నీ విలాసమేదని, నీ నివాసమేదని.
అనంత పథ గమ్యుడనేను
నిశాచరుడనేను, ఆశావాదిని నేను. ... మనిషిని.

రాకాసి లోయలుదాటి, ఆకాశపు టంచులుదాటి
పాలపుంతల్లో విహరిస్తాను
నెబ్యులలా నధిగమిస్తాను. ... చూపును

ఘాడ శుషుప్తిలో నుంటాను
అనంతంలోకి చూస్తాను ... భవిష్యత్తును

నీలి సముద్రపు తీరాన, నత్తగుల్లలు ప్రోగుజేసి
గత జీవిత సంఘటనల స్మృతి చిహ్నాంగా గుచ్చుతాను
... చరిత్రను

నీడలేదు, నిలకడలేదు, నాదిలేదు.

అంతులేని తృప్తికోసం ప్రయాణానికి అంతులేదు
... కాలాన్ని

నా తృష్ణ తీరనిది, నా వేదన ఆరనిది

ఇంద్ర ధనుషు రంగుల్ని నేను

ప్రవహించే వేగాన్ని నేను

సూర్యుని కాంతిని నేను

పూవుల ఘుమ — ఘుమని నేను

భాధార్తుల కన్నీటిని నేను ... ప్రకృతిని

మరుభూమిలో మళ్లీ వసంతం

గత ఏడాది కోస్తా జిల్లాలపై దాడిచేసిన తుఫాను రాక్షసి పచ్చని జీవితాల్లో చిచ్చు రగిలించింది. వేలాది జీవితాలు నాశనం చేసింది. కోట్ల రూపాయలు విలువచేసే ఆస్తిని సర్వ నాశనం చేసింది.

మోడు వారిన బతుకుల్లో విశ్వాసాన్ని పాదుగొల్పి, దీర్ఘ కాలంపాటు ఫలితాలనిచ్చే పునరావాస కార్యక్రమాల నెన్నింటినో ప్రభుత్వం చేపట్టింది. ప్రధానంగా వ్యవసాయదారులను ఆదుకోవడానికి రు. **7.34** కోట్ల మేరకు భూమి శిస్తును మినహాయించారు.

తుఫాను ప్రమాదంలో సుమారు **41,800** మంది మత్స్యకారుల పడవలు, వలలు, నాశనమయ్యాయి. **41,000** మంది చేనేతపని వారి మగ్గాలు విరిగిపోయాయి.

కేవలం మత్స్యకారుల పునరావాసం కోసమే రు. **161.23** లక్షలు ఖర్చు చేశారు. చేనేత పనివారి పునరుజ్జీవనం కోసం రు. **225** లక్షలు వెచ్చించారు. చర్మకారులు, గీతపనివారు, వడ్రంగులు, కమ్మరులు వంటి వివిధ చేతివృత్తులవారి కోసం రు. **68.5** లక్షలు వరకూ ఖర్చు చేశారు. వారి జీవితాల్లో మళ్లీ వసంతం చిగురించింది.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు

36/78-79

కలగూరగంప

గాహారతణకోసో

(గాథా రత్న కోశః)

ప్రకృతము మనకు లభించు ప్రాకృత సంకలన గ్రన్థములలో మూడవకృతి జినేశ్వరసూరి సంపుటీకరించిన "గాహారతణ కోసం." మొదటిది, ప్రముఖమయినది హాల సంచితమయిన "గాహాకోసం" (గాథాసప్తశతి). రెండవ చక్కని సంకలన గ్రంధము "జయవల్లభము". జయవల్లభుడు అను శ్వేతాంబర జైనముని సంగ్రహితము. వజ్జాలగ్గం అని వాడుక.

జినేశ్వరసూరి సంకలనకృతిని శ్రీ అమృతలాల్ భోజక్ మరియు శ్రీ నగీన్ షా గారులు "లాలభాయి దలపతభాయి భారతీయ సంస్కృతి విద్యామన్దిరము" పక్షాన–ఏబది రెండవ గ్రంధముగా 1975 అక్టోబరులో వెలువరించిరి. ఈ సంకలన కృతి ప్రాకృత వాఙ్మయమునకు మరింత తుష్టిని, పుష్టిని చేకూర్చింది.

మనకు "గాహారతణకోసం" ఒకే ఒక వ్రాత ప్రతి (కాగితము) లభించుచున్నది. విక్రమ సంవత్ ౧౬౭౦–౧౭౪౦ మధ్య ఉన్న ఉపాసక శ్రీ వినయ విజయచే వ్రాయబడినట్టిది. అట నట మూలమును సరిచేసిన పాడ అగుపించుచున్నది. కాబట్టి వ్రాతప్రతి క్రీస్తుశకం పదునేడవ శతకమునకు చెందినదిగ ధ్రువపడుచున్నది.

సంకలనకర్త జినేశ్వరసూరి విక్రమ సంవత్ 1251 సం. లో "గాహారతణకోసం"ను నిర్మించినట్లు కృతి అంతమున చెప్పెను.

"ససి–బాణ–సూర (౧౨౫౧) వరిసో
అట్ఠావణ్ణ అ పక్కమా అత్త!
గాహాణం అట్ఠ సదా
రవిదో సహసో పిలోగాణం॥

ఆన్ధ్రరాజకవి, సుకవి జనవత్సలుడు అగు హాలనిర్మిత 'గాహాకోసం'ను ఆదర్శముగ కైకొనక, జయవల్లభుని "జయవల్లభము"ను దృష్టియందుంచుకొని ఏబది ఎనిమిది ప్రక్రమము (పద్ధతి)లలో జినేశ్వరసూరి "గాహారతణకోసం"ను సంతరించినాడు. తన కాలమునాటికి సువిఖ్యాతమయిన – అభ్యరాజ నిర్మిత 'మారిచవధ', కుతూహల ప్రణీత 'లీలావదీ', పాదలిప్తాచార్యకృత 'తరంగవతీ', వాక్పతిరాజుని 'గౌడవహో', ప్రవరసేనుని 'దసముహవహో', ఉద్యోతనసూరి వ్రాసిన 'కువలయమాలా' అజ్ఞాతకవికృత 'ఉపదేశమాలా', మున్నగు అలభ్య, లభ్య ప్రాకృత గ్రంధములనుండి, తనకు ఇష్టమయిన గాథారత్నములను ఏరి, ప్రక్రమములనెడి సూత్రముతో నిబద్ధించి, మనకు అందిచ్చినాడు జినేశ్వరసూరి.

జినస్తుతితో ప్రారంభమయిన గాహారతణకోసం శాన్తరస వర్ణనతో అంతమవుతుంది. మధ్యలో వాగ్దేవీస్తుతి, నగరవర్ణనం, దారిద్ర్యం. సర్వాఙ్గ స్త్రీ వర్ణన, సముద్రము, ఋతు, శృఙ్గార ప్రసంగములు-సరస గాధలతో రసికజన మనోరంజకముగా గ్రధితము చేయబడినది.

లచ్ఛీ దుహిదా, జామాదో
హరీ, తధ అ పణయిణీ గంగా!
అమయ మియంక సుఅత్తో
హంహో! కుదుంబం మహో దహిణో॥

సముద్ర ప్రక్రమము లోనిది పయిగాధ. ఆల్బ్రెక్ట్ వీబరు 1881లో ప్రకటించిన 'గాహాకోసం' (గాథాసప్తశతి)లో ఉన్నది. మూల తెనుగు దేశపు గాధలలో చోటు చేసికొన్నది కాబోలు. ముద్రిత కావ్యమాలా, చౌఖాంబా ప్రతులలో మూలగాధలలో ఇది లేదు. కాని తెనుగుదేశపు 'గాహాకోసం' ప్రతులలో ఉన్నదనుటకు శ్రీనాధ కవిరాజు ఆన్ధ్రీకరణమే సాక్ష్యము. కవి సార్వభౌముని తెనిగింపు ఇది—

ఆరయ జీవనం, బమృత
మల్లుడు విష్ణుఁడు, సొమ్ములన్నియున్
సారపు రత్నముల్, కొడుకు
చంద్రుడు, కూతురు లక్ష్మి, యాలు భా
గీరథి. తా సముద్రుడు అని
కీర్తన సేయుదురెల్లవారు నా
క్షీరపయోధి నన్యులకు
జెల్లునె యిట్లు సమస్త భాగ్యముల్.
—ప్రబన్ధ రత్నావళి–౪౫౭ పద్యం.

ఇందు కవిసార్వభౌముని నైసర్గిక విస్తరింపు విధానము సహృదయులకు తోపకపోదు.

దీహరఫణింద నాళే
మహిధర కేసర దిసాముహదలిల్లే!
అవపిఅఇ కాల భమరో
జణమకరందం పుహవిపఉమే॥

శాన్తరస ప్రక్రమములో ఉన్న గాధ. జైన సంకలన పుస్తకము "పురాతన ప్రబన్ధ సంగ్రహః"లో పాదలిప్తాచార్యునిదిగా పేర్కొనబడినది శార్ఙ్గదేవ ప్రణీత సంగీత రత్నాకరమున షడ్జకైశిక రాగమునకు లక్ష్యముగా పైగాధ సస్వరముగా ఇయ్యబడినది. ఈ గాధకు రసికవతంసులగు శ్రీ అనన్తకృష్ణశర్మగారి తెనిగింపు దిగువ ఇవ్వబడును.

ఉరగపతి నిడ నాళమై, గిరులు కేస
రంబులై దిఙ్ముఖములు దలంబులైన
పుడమి తామర పూవునఁ గడఁగి క్రోలు

మనుజ మకరందమును కాలమనెడి తేటి.

స్థాలీపులాక న్యాయంగా, పాఠకులకొఱకు 'గాహారతణకోసం' నుండి కొన్ని గాథలు ఉదహరించబడును.

వంకేహిం పిఓ, సరలే హిం
సజ్జణో, వరగుణేహిం మజ్ఝత్థో।
రోసారుణే హిం పిసుణో
ణయణాణ చదువ్విహో భంగో॥

(నయన ప్రక్రమం)

అథపిమ్మం కో విరహో
అథ విరహో కోదు జీవిఅ।
వడ్ఢఇ కాలాహిం అహికం
మిథుణాణం మాణక సవత్తే॥

(ప్రేమ ప్రక్రమం)

విపరిదరవి లచ్ఛీ
బంభం దట్ఠూణ నాభికమలత్థం।
హరిణో దక్ఖిణనయణం
రసాకులా ఝత్తి ఢక్కేఇ।

(హియాలీ ప్రకరమం)

ఇందలి భాష గురించి ఒక్కమాట. ఒక్కరి చేతిమీదుగా ఒకే కాలంలో వ్రాయబడిందికాదు. కాబట్టి భిన్న భిన్న రూపములు గమనించవచ్చు. ఎక్కువభాగం శౌరసేనిలో వ్రాయబడింది. మాగధి, మహారాష్ట్రి రూపములు గమనించవచ్చు. మచ్చుకు—

సంస్కృతం	శౌరసేని	మహారాష్ట్రి
ఆత్మ	అత్త	అప్ప
ఇతి	ఇది	ఇఅ
ఖలు	హు	ఖు, ఖ
అహం	హం	అహం, హగే
దక్షిణః	దక్ఖిణో	దహిణో
ఆర్య	అయ్య	అజ్జ
మృగాంకః	మఅంక	మిఅంక
భవతు	భోదు	హోదు -

ఈవిధమగు వ రూపములు కానవచ్చుచున్నవి. శౌరసేని యందు 'యశ్రుతి' అలవేలము. మహారాష్ట్రిలో అశ్రుతి ఇనుమిక్కిలి. ప్రకృత గాహారతణకోసం పరిష్కర్తలు సర్వశ్రీ అమృతలాల్ మఱియు నగీన గారలు తమ పరిష్కరణలో వ్రాతప్రతిలో 'య' ఉన్న చోట్ల 'అ' చేర్చిరి కాబట్టి, విమర్శకులు దీనిని గమనించవలెను.

అనుబంధముగా రెండు సుభాషిత గాథాకోశములను ఇచ్చిరి. మొదటి దానియందు ౧౫౮ గాథలు, రెండవ దానిలో ౯౦ గాథలు ఉన్నవి. ఆచార్య ఆదినాథ ఉపాధ్యేగారు 1970లో పరిష్కరించి, ప్రకటించిన వేమభూపాల సంచిత "గాహాసారము"నకు అనుబంధముగా మఱియొక సుభాషిత గాథాకోశమును ప్రకటించిరి. అందు ౧౬౮ గాథలున్నవి.

ఇంతవఱకు మనకు ప్రాకృతమున మూడు ముఖ్య సంకలన గ్రంథములు, మూడు సుభాషిత సంగ్రహకోశములు లభించినవన్న మాట. హాలకృతిని ఆన్ధ్రీకరించిరి కాని, జయవల్లభమును, గాథారత్నకోశమును తెనిగించలేదు. వీటి తెనిగింపు జరిగిన మన భాషాభ్యుదయమునకు శ్రేయము. ప్రాకృతములపట్ల ఇకనైనను తెనుగులు శ్రద్ధవహింతురని నా ఆశ.

అనుశీలించిన పుస్తకములు

1. "గాథారత్నకోశం"
   జినేశ్వరసూరి కృతం
   సం॥లు అమృతలాల్ భోజక్,
   నగీన షా
   అహమ్మదాబాదు–1975.

2. "సత్త సఈ సారం"
   వేమభూపాల ప్రణీతం
   సం॥ ఆదినాథ ఉపాధ్యే
   కొల్హాపురం–1970.

3. "జయవల్లభం"
   (వజ్జాలగ్గం)
   జయవల్లభసూరి నిర్మితం
   సం॥ మాధవ పట్వర్ధన్
   అహమ్మదాబాదు–1969

4. శాలివాహన గాథాసప్తశతీసారం
   తెనిగింపు: అనన్తకృష్ణశర్మ
   భాగ్యనగరం–1964.

5. ప్రబన్ధ రత్నావళి
   కూర్పరి – వేటూరు ప్రభాకరశాస్త్రి
   భాగ్యనగరం-1976.

6. ప్రాకృత వ్యాకరణం (జర్మను)
   రిచర్డ్ పిషెల్
   స్ట్రాస్ బర్గ్–1900.

శ్రీ ఇ. సాయిబాబా

"ఇంటి పేర్లు" కొన్ని అనుమానాలు

శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రిగారి "తెలుగువారి ఇంత పేర్లు" అనే వ్యాసాన్ని ఫిబ్రవరి79 'భారతి'లో శ్రద్ధగా చదివాను.

శాసనాలు పరిశీలించడం, చరిత్రను అల్లడం ఒకపాండిత్యం. శాసనాల్లోని విషయాలను భాషా పరంగా అన్వయించడం, వాటి అర్థాలు తెలుసుకోవడం ప్రాకృత సంస్కృత పండితాధీనం.

అలవోకగా రాసినా శ్రీ శాస్త్రిగారు ఆలోచనలు రేకెత్తించే వ్యాసమే రాశారు. అయినా "బయ్యన విజయాదిత్యుడు, విజయ, బిజ్జ–బిజ్జ–బెజ్జ (విజయాదిత్యుడు–బెజయిత) బయ్య–బయ్యా వారు కలరు" అని తమ వ్యాసంలో పేర్కొన్నారు.

భైరవుడు తెలుగులో బయ్యన అవుతాడని, విజయ శబ్దం తెలుగులో 'బెజ'గా మారుతుందని విజయాదిత్య శబ్దం బెజయిత అవుతుందని ఎన్నిసార్లో వ్రాయడం జరిగింది. వాటికి ప్రయోగాలు ఉన్నాయి.

బెజయిత బేతగా తిరిగి హ్రస్వీకరణం చెంది ఉండవచ్చు. దీని కోసం నూతుల్ త్రవ్వి భేతాళాలను బయటికి లాగనక్కరలేదు. రుద్రట రుద్రభట్టుకు హ్రస్వరూపంఅని మానవల్లివారు చూపారు. వెంకయ్య శబ్దం వినాయక శబ్ద తద్భవం. వెనుకయ్య→వెంకయ్య. (వెంకయ్య చోదుడు) పంప శబ్దం పద్మప→పమ్మప→పంప అని 'నాడోజ పంప' అనే కన్నడ గ్రంథంలో తీర్మానించారు. నన్నయ–నారాయణ శబ్ద భవం అయితే 'నారన' ఏమవుతాడు? (కొరవి సత్యనారన) 'నన్ని నారాయణ'అనే శబ్దం శాస్త్రిగారికి పరిచయమే. 'నన్న' కన్నడంలో మనోహరం, అందం అని అర్థాలు. శాస్త్రిగారు సూచించిన ఇతర పదాలను గూర్చి చర్చించడం అవసరమే.

ఓ. వి.

శ్రీనాథుని జన్మస్థలము

'భారతి' జూలై–డిశంబరు 1978 సంచికలలోని కలగూర గంప లందు శ్రీనాథుని జన్మస్థలము గురించి వాదోపవాదములు వెలువడినవి. అందు గమనించి శ్రీనాథునిమీద పరిశోధన చేసినవారు మౌనము వహించుట భావ్యము కాదని ఈ నివేదనము – మొదటి నుండి శ్రీనాథుని జన్మస్థలము వివాదగ్రస్థ విషయము. అందు ప్రాంతీయాభిమానము అంతర్లీనముగ లేకపోలేదు. అందువలన ఆయా ప్రాంతములకు ఒరుగు ప్రయోజనము లేదుగాని, సత్య సాక్షాత్కారమునకు ప్రతిబంధకము కలదు. పరిశోధన సాహిత్యమునకు రాగద్వేష రాహిత్యము ప్రాథమిక ధర్మము.

శ్రీనాథుని జన్మస్థలమును పట్టియిచ్చుటకు ప్రకృష్ట సాధనములు రెండు మాత్రమే కలవు ఆ రెండును శ్రీనాథుని స్పష్ట ప్రతిపాదనములే. ఒకటి, భీమ ఖండ కృతిభర్త బెండపూడి అన్నయామాత్యుని ముఖతః శ్రీనాథుడు ప్రకటించినది: అది ప్రథమతః అవశ్య గమనార్హము. ఆ పద్యమిది:

"పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమడ వమల మతివి
నాకుఁ గృపసేయు మొక ప్రబంధంబు నీవు
కవిత గుణగణ్య! శ్రీనాథ కవివరేణ్య!" 23 ప. 1 ఆ.

ఇందు శ్రీనాథుడు "పాకనాటింటివాడు" అని ఇదమిత్థముగకలదు. కాని, "పాకనాటింటివాడు" అనగా మఱి అభిప్రాయ భేదములు కలవు. "పాకనాటి నియోగి బ్రాహ్మణుడు, పాకనాటివాడు" అని కందుకూరి వీరేశలింగము, "పాకనాటి నియోగి బ్రాహ్మణుడు"అని చిలుకూరి వీరభద్రరావు, "పాకనాటి నియోగి బ్రాహ్మణ వంశము వాడు" అని వేటూరి ప్రభాకరశాస్త్రి, "పాకనాడు శ్రీనాథుని జన్మదేశము"అని బండారు తమ్మయ్య, "పాకనాడు గృహనామము" అని పేకుచుళ్ల అచ్యుతరావు, "పాకనాటి నియోగి శాఖా బ్రాహ్మణుడు" అని చాగంటి శేషయ్యగార్ల అభిప్రాయములు. అవియెల్ల స్థూలారుంధతీ న్యాయమునకు అనుగుణములు. అందు "పాకనాటి వాడు" అను కందుకూరి వీరేశలింగము, "పాకనాడు శ్రీనాథుని జన్మ దేశము" అను బండారు తమ్మయ్యగార్ల అభిప్రాయములు సమంజసము. "పాకనాటింటివాడు" అను పద సంఘటనమునకు "పాకనా(డు) టి+ఇంటివాడు" అని పదచ్ఛేదము. ఇంటివాడు అనగా గృహస్థు అని మాత్రమే అర్థము. ఇది 1957 - 63 సంవత్సరములనాటి నా పరిశోధన గ్రంథమున నిరూపితము. అది ఆంధ్ర విశ్వ కళా పరిషత్ – గ్రంథాలయమున కలదు. 1972వ సంవత్సరమున ప్రకటించిన "శ్రీనాథుడు" అను ముద్రిత గ్రంథమున అనేక ప్రకరణములతో పాటు"శ్రీనాథుని జన్మస్థలము" అను ప్రకరణమును విస్తరభీతిని పరిత్యక్తము. ఇంటివాడు అనగా గృహస్థు అని మాత్రమే అర్థమనుటకుగల ఆధారము లివి:

ఇంటివాడు అను పదము ఏకవచనము. ఇంటివారు అను పదము ఒక బహువచనము. ఇండ్లవారు అను పదము మఱొక బహువచనము. ఇందు ఒక్క పదమును బ్రౌను తెలుగు – ఇంగ్లీషు నిఘంటువున లేదు. బహుజనపల్లి వారి శబ్ద రత్నాకరమునందును లేదు. ఇందువలన ఎవరి ఇష్టము వచ్చిన అర్థములను వారు చెప్పుటకు అవకాశము కలిగినది. అయినను శ్రీనాథుని ప్రయోగాంతరములు కలవు. అవి చూడకుండ అర్థ నిర్ణయము చేయుట అవి మృశ్యకారిత్వము. ఇంతకు, శ్రీనాథుని ప్రయోగాంతరము లివి:

1 "పదియు నెనుబది వేలును బంచ శతియు
నేబదియునైదు సంఖ్యల యిండ్లవార
మాశ్రితులు కాశికాపురి కన్నదీయు
లీశ! పన్నెరు దుడిచి పాటెక్కినారు."
155 ప 6 ఆ కా. ఖం.

ఇందు కాశికాపురికి ఆశ్రితులైన 18, 555 మంది ఇండ్లవారు గృహస్థులని స్పష్టము.

2 "ఎలనాఁగ పుట్టిన యింటివారలు తన్ను
నరయ కుపేక్షించి నపుడు బెగడు"
165 ప. 6 ఆ. కా. ఖం.

ఇందు పుట్టిన యింటివారలు అనగా ఇప్పటి 'పుట్టినింటివారు' లేక 'పుట్టింటివారు.' వారు గృహస్థులు కానిది ఎలనాగకు పుట్టుకలేదు.

3 "అనవిని పారువం బడరి యౌవన గర్వమునం బడంతి కి
ట్లను నిదియేమి? నా బలపరాక్రమ సంపద యంత మా తమే?
తన సరివారికి న్వెఱచి ధామముఁ జొడరఁజేసి దాఁగఁ బో
యిన సరియిండ్లవారు నగరే? ఖగమో యదియేమి దయ్యమో?"
295 ప. 6 ఆ కా. ఖం.

ఇందు సరియిండ్లవారు అనగా సాటి గృహస్థులని స్పష్టము.

4 "ఎట్టు కనుఁ బ్రామి వచ్చునో యింటి వారి
నెట్టు (వెరవ దొయొం) టిమ్మై నిక్క కరుగ
నతివ పగలైన మాపైన నతనితోడ
నిచ్చనొకసారి సాగించు నిధువనంబు."
144 ప. 3 ఆ. శి. రా. మా.

ఇందు అతివ మోసగించు ఇంటివారును గృహస్థులు. ఇట్లు 'ఇండ్లవారు', 'ఇంటివారు' అను బహువచన రూపములకు గృహస్థులు అని శ్రీనాథుని ఆంతర్యము కనుక, 'ఇంటివాఁడు' అను ఏకవచన రూపమునకును గృహస్థు అనియే శ్రీనాథుని ఆంతర్యముగ కరతలామలకము. అంతేకాదు. 'ఇంటివాఁడు' అను శబ్ద సంపుటికి అర్థము గృహస్థు అనియే కస్తూరి రంగకవి రచించిన సాంబ నిఘంటువునందు కలదు. ఆ విషయ మిది :

"................................. గేస్తు
మనికి తేఁ డింటివాఁడన గృహస్థునకగు." 7 ప మా. వ.

ఇది సూర్యరాయాంధ్ర నిఘంటువునందు, వావిళ్ల నిఘంటువునందును ఇట్లే కలదు. ఉపరి, వావిళ్ల నిఘంటువునందు "పాకనాటింటి వాఁడవు బాంధవుఁడవు" అను శ్రీనాథుని ప్రయోగమే ఉదాహృతము. "పాకనాటింటివాఁడు" అనగా పాకనాటి గృహస్థు అని మాత్రమే అర్థము. అనగా శ్రీనాథుని గృహము పాకనాడున కలదని తాత్పర్యము. కనుక శ్రీనాథుని జన్మస్థలము పాకనాటిసీమ అని ఫలితార్థము. ఇది ప్రాచీన నిఘంట్వర్థమునుబట్టి మాత్రమే కాక, శ్రీనాథుని ప్రయోగాంతరములనుబట్టి సహేతము నిర్ధారకము. ప్రస్తుతము నెల్లూరు మండలము, ఒంగోలు మండలము కలిసి స్థూలముగ శ్రీనాథుని కాలమున పాకనాటిసీమ. శ్రీనాథుని జన్మస్థలమును పాకనాటి సీమను దాటించుట ప్రకృష్ట సాధనమునకు వక్రీకరణము. ప్రాంతీయాభిమానమునకు లక్ష్యభూతము.

ఇక రెండవ ప్రకృష్ట సాధనము శ్రీనాథుడు స్వయముగ ప్రతిపాదించిన కమలనాభామాత్యుని కాల్పట్టణాధీశ్వరత్వము. ఆ పద్య మిది :

"కనకక్ష్మాధర ధీరు వారిధి తటీ కాల్పట్టణా ధీశ్వరున్
ఘనునిన్ బద్మ పురాణ సంగ్రహ కథా కావ్య ప్రబంధాధిపున్
వినమత్కాకిత సార్వభౌముఁ గవితా విద్యా ధరుంగొల్తు మా
యనుఁగుం దాతఁ బ్రదాత శ్రీ కమలనాభామాత్య చూడా
మణిన్." 10 ప. 1 ఆ. భీ. ఖం

ఇందు శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు కాల్పట్టణాధీశ్వరుడని కలదు. ఇట్లు 1919వ సంవత్సరమునుండి ముద్రితములైన శ్రీనాథుని భీమఖండము ముద్రిత ప్రతులందు మాత్రమేగాక, ఉన్మూలమగు తాళపత్ర గ్రంథములందును, తదనుసారి కాగితపు ప్రతియందును కలదు. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోని వ్రాతప్రతిలోని పద్య మిది :

"మ కనకక్ష్మాధర ధీరు వారిధితటీ కాల్పర్ధనా [ట్టణా?]ధీశ్వరున్
ఘనునిన్ బద్మపురాణసంగ్రహ క[థా]కావ్యప్రబంధాధిపున్
వినమత్కాకిత[కత?]సార్వభౌముఁగవితావిద్యాధరుఁగొల్తుమా
యనుఁగుందాతఁబ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్."

ఇందు "కాల్పర్ధనా' కంటె "కాల్పట్టణా", "కథాకావ్య" కంటె 'కథాకావ్య" "కాకత" కంటె "కాకిత' సుష్ఠురూపములు. "కాకిత" ప్రాచీన రూపము. "కాకతి" నవీన రూపము. ఇక "పిఠాపురము శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయములో నుండిన తాటియాకు ప్రతిని" సంప్రదించిన, సరస్వతీ పవర్ ప్రెస్ రాజమండ్రి వారి ముద్రణము నందును "కాల్పట్టణా" అనియే కలదు. పాఠాంతరము లేదు. కాని, వాసా లక్ష్మీనారాయణ రెడ్డి గారి "కవి సార్వభౌముడగు శ్రీనాథుని జన్మస్థలం – పాకల" అను గ్రంథము నందు, "కనక క్ష్మాధర ధీరు వా...త...కల్పట్టణాధీశ్వరున్" అను ఒకానొక వ్రాత ప్రతిలోని శిథిల పంక్తికి 'కనక క్ష్మాధర ధీరు వార్ధితట పాకల్పట్టణాధీశ్వరున్" అను కల్పిత పూరణము కలదు. ఇది ఇటీవల శ్రీనాథుని జన్మస్థలము గురించి ఇటీవలి వాక్షేప వాదములకు ఆస్పద మిచ్చినది. అసలు రెడ్డిగారి పూరణము అనావశ్యకము. అంతేకాదు. పరిష్కరణ పద్ధతికి పరమ విరుద్ధము. ఒక ప్రతిలోని కొన్ని అక్షరములు క్రిమిదష్టమైనపుడు, ప్రత్యంతరములనుబట్టి పాఠనిర్ణయము చేయుట పరిష్కరణ పద్ధతి. ప్రత్యంతరము లేనప్పుడు ప్రకరణోచితముగ కల్పించుట అగతికము. శ్రీనాథుని భీమఖండమునకు ఆరు ప్రత్యంతరములు ఉండగా, మూడు భిన్నముద్రిత గ్రంథములును ఉండగా, అన్నిట "వారిధితటీ" అను పాఠమును ఉండగా, "పాకల"ను పట్టించుటకు "వార్ధితట" అని కిట్టించుట మహాసాహసము. అంతేకాదు. పదాంతమందలి లకారములోని లత్వమునకు లోపము అనవకాశము. "పలివెల" అను గ్రామనామమును "పల్వెలపురి" అని శ్రీనాథుడు ప్రయోగించెను గాని (78 ప. 1 ఆ. భీ. 210), "పలివెల్పురి'

అని శ్రీనాథుడు ప్రయోగింపలేదు. కనుక అప్రమాణము. ఒకానొక ప్రతిలో "కల్పట్టణాధీశ్వరున్" అని కలదేని, శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు అధీశ్వరుడైనది కల్పట్టణమా? కాల్పట్టణమా? అన్నది మాత్రమే ఆలోచనీయాంశము.

ఇంతవఱకు కాల్పట్టణము కలదనుటకు ఇదమిత్థమైన నిదర్శనము ఉపలబ్ధము కాలేదు. కాని "కల్పట్టణము" కలగనుటకు శాసన ప్రమాణము కలదు. ఆ శాసన విషయమిది:

> "Randuballi grant of Vishnuvardhana IV, (764-799)
>
> 1–20 గుద్రహార విషయ నివాసినః
>
> 1–26 రణ్డుబల్లి నామ గ్రామః
>
> 1 27 పూర్వకతః కల్పట్టణబు అవధీత్. దక్షిణతః తాఙ్కటూరు అవధీత్. పశ్చిమతః నిడుగాడు అవధీత్. ఉత్తరతః జక్కన చెఱువు అవధీత్."

ఇది బహుశః ఇంకను అముద్రిత శాసనము. శాసనప్రతి ఆచార్యశ్రీ గంటి జోగి సోమయాజిగారియొద్ద కలదు. వారి "ఆంధ్రభాషా వికాసము" అను ప్రసిద్ధ గ్రంథమున "కల్పట్టనబు" అను పదము ఉట్టంకితము. (పుట 98. పి. పి. నెం. 2–1914, 15.8 శ.) శాసనమునందలి కల్పట్టణబు అనగా కల్పట్టణము. ము విభక్తి ప్రత్యయమునకు "బు" వర్ణకము ప్రాచీన రూపము. పయి శాసనమునందు గుద్ర హార విషయ నివాసికి రండుబల్లి అను గ్రామమును దానమిచ్చినట్లు, ఆ రండుబల్లికి తూర్పున కల్పట్టణము, దక్షిణమున తాంకటూరు, పడమట నిడుగాడు, ఉత్తరమున జక్కన చెఱువు కలవని స్పష్టముగ కలదు. ప్రతిగ్రహీత నివాసమునుబట్టి కల్పట్టణము గుద్రహార విషయములోనిదిగ ప్రతీయమానము· అనగా కృష్ణామండలములోనిది. ఇప్పటి "కలపటము" అప్పటి "కల్పట్టణము" కావచ్చును. కనుక ఒకానొక వ్రాతప్రతిలోని "కల్పట్టణాధీశ్వరున్" అను పాఠమునుబట్టి శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు కృష్ణామండల సముద్ర తీరమున అధీశ్వరుడు కావలయును. కాని బహుప్రతులందు "కాల్పట్టణాధీశ్వరున్" అను పాఠము కలదు. కాల్పట్టణము కలదనుటకు ఇదమిత్థమైన నిదర్శనము లేదుగాని, సంభావ్యమైన సమన్వయము కలదు అది వావిలాల సోమయాజులగారి అన్వేషణఫలము. 1937–38వ సంవత్సరమునందలి ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికయందు ప్రకటితము. వ్యాసకర్త పేరు "ఎ. వి. ఆర్. సోమయాజులు" అని కలదు. అది "వి. వి. ఆర్ సోమయాజులు" అనుటకు బదులు అచ్చు తప్పు ఇది వావిలాల సోమయాజులుగారు స్వయముగ నాకు తెలిపిన సంగతి· ఇంతకు సోమయాజులుగారి సమన్వయమిది:

"—ఒంగోలు తాలూకాయందు సముద్రపు టొడ్డున కాల్స్తనకోట అను గ్రామమొకటి కనుపించినది. అందు ఎత్తయిన భాగమున కోట యొకటి శిథిలముగా కనబడుటవలన దానికి దిగువ భాగమున పట్టణ శిథిలములవలె కన్పించు దిబ్బలుగల భాగమే పూర్వము కాల్పట్టణమని పిలువబడియుండును—"

సమన్వయమిది సమంజసము "కాల్స్తనకోట" అను పదబంధములోని "స్తన" శబ్దము స్థానశబ్దవికారము కావచ్చును. సముద్రతట గ్రామము పట్టణ శబ్ద వాచ్యము. కనుక కాల్స్థానము కాల్పట్టణము కావచ్చును. అంతేకాదు. ఒంగోలు తాలూకాలోని కాల్స్తనకోట అను గ్రామము పాకనాటిసీమకు చెందునది. పాకనాటి గృహస్థు అయిన శ్రీనాథుని "అనుంగుందాత" కమలనాభామాత్యుడు అధీశ్వరుడైన కాల్పట్టణము పాకనాటిసీమలోనిదగుట సుసంగతము. కాబట్టి శ్రీనాథుని జన్మస్థలము పాకనాటి సీమలోని కాల్పట్టణము అనగా ఒంగోలు తాలూకాలోని కాల్స్తనకోట అగుట సాధకము.

శ్రీనాథుని జన్మస్థలము ఒంగోలు తాలూకాలోని కాల్స్తనకోట అయినను, శ్రీనాథుడు అక్కడున్నది బాల్యమునందు మాత్రమే. నూనూగు మీసాల నూత్నయౌవనము అనగా, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యములోని లెక్కప్రకారమే, ఇంచుమించు పదారు సంవత్సరముల ప్రాయము వచ్చుసరికి కొండవీడు చేరినట్లు ద్యోతకము. కొండవీటి సామ్రాజ్యాధిపతి అనవేమారెడ్డి కొలువులో శ్రీనాథుడు అడుగుపెట్టినట్లు కొండవీటి దండకవిలయందు కలదు. అనవేమారెడ్డి అనంతరము కొండవీటి సామ్రాజ్యాధిపతి కుమారగిరిరెడ్డి, అనవేమారెడ్డికి ఆత్మీయుడు, కుమారగిరిరెడ్డికి ప్రత్యర్థి అయిన పెదకోమటి వేమారెడ్డి ఆ కాలమున చందవోలు రాజ్యాధిపతి అని, వామనభట్టబాణుని వేమభూపాలచరితమునుబట్టి మూలగూరమ్మ శాసనమునుబట్టి అవగాహకము, ఆ మంత్రులు మామిడి వంశీయులు, తత్సంబంధి శ్రీనాథుడు చందవోలువాసుడు కాకపోవడు. అప్పుడు శ్రీనాథుడు అచటి దగ్గుబల్లివారికి అల్లుడగుట, పినపాదు శాసనములోని దక్షిణ భాగమునకు అధిపతి అగుట సంభవము. కుమారగిరిరెడ్డి అనంతరము కొండవీటి సామ్రాజ్యాధిపతి పెదకోమటి వేమారెడ్డి. అప్పుడు శ్రీనాథుడు మరల కొండవీటి నివాసి. కొండవీటి సామ్రాజ్యపతనము తర్వాత రాజమండ్రి నివాసి. అచటి బెండపూడి అన్నయామాత్యుడను శ్రీనాథుని బంధువు. అన్నయామాత్యునిది గోదావరీ మండలము అని చెప్పి, శ్రీనాథుని జన్మస్థలము గోదావరీ మండలముకాదు, అగునను వాదములేకపోలేదు. అది బహువిషయ బాధకము. నా పరిశోధనగ్రంథమునందు పరాస్తము ఆంధ్రప్రభ సారస్వతానుబంధమున అప్రకటితపూర్వము. అట్లు శ్రీనాథునిజన్మస్థలము చందవోలు ప్రాంతమును కాదు. అవసాన కాలమున శ్రీనాథుడు కృష్ణామండలములోని బొడ్డుపల్లె నివాసి. కాబట్టి పాకనాటి గృహస్థు అయిన శ్రీనాథుని జన్మస్థలము ఒంగోలు తాలూకాలోని కాల్స్తనకోట అగుట నిర్బాధకము.

అసలు పాకనాటి గృహస్థు అయినను, పదారు సంవత్సరముల ప్రాయమునందే పాకనాటిసీమను వదలి, రమారమి ఏబది

సంవత్సరములు గుంటూరు మండలమున, సుమారు పాతిక సంవత్సరములు గోదావరీ మండలమున, బహుశః నాలుగైదు సంవత్సరములు కృష్ణామండలమున నివసించిన శ్రీనాథుని జన్మస్థలము గురించి ఆయా మండలములవారు ఊహాగానములు చేయుటకంటె, యావదాంధ్రదేశాభిమానము మూర్తీభవించిన, కవిసార్వభౌముడు శ్రీనాథుని కవితారసగంగలో తలమున్కలుగ మంగళస్నానములు చేయుట శ్రేయము.

డా కొర్లపాటి శ్రీరామమూర్తి

పద్యవిద్య-నన్నయ భారతావతారిక

వాల్మీకి పద్యవిద్య కాద్యుడని నన్నయ తీర్పు. దీంతో తెనుగు బాసకు తానంతేనని తర్వాతి మనతీర్పు.

విద్య ఏమిటి? దానికి రెండర్థాలు. 1. కళ, 2. శాస్త్రం. అది ప్రతి భాజన్యం. అది హృదయం. ఇది మేధ. అది అనుభవం. ఇది విచారణ. అది స్ఫురణారూపం. (ఇన్‌ట్యూషన్ అనిరోచే) ఇది దాన్ని ఆలోచించి ఒక క్రమంలో బంధిం చేసూత్రం. ఇదొక పరిమాణం. ప్రమాణం. భౌతికం కానిది ఆలోచనమాత్రం అందేవి. ఇదే ఛందమంటే (వచన కవిత్వానికి అడుగున సంగీతముందన్న ఇలియట్ వాక్యానికర్థం ఇదే) అందుచేత ప్రతిభాజన్యమైన భావం మనస్సుద్వారా, ఛందస్సుద్వారా అభివ్యక్తమైతే అది పద్యం. లక్షణానికి సరిపడిందేకాదు. అది శాసనపద్యం. నన్నయపద్యం విద్యాసనాథం.

భావముంది. అది అనేకవా భిన్నంగా వుంటుంది. దాన్ని వ్యక్తీకరించటం ఛందో ప్రజ్ఞావిషయం. ఇది దాన్ని అనుభవ జనకంగా-అపూర్వింప చేస్తున్నది. ప్రతిభావంతుడంటే కవి. మనిషి అంటే ప్రజ్ఞావంతుడు. ప్రతిభా ధర్మంచేత. దాని లక్షణం చూడటమే మనిషి లక్షణం ఆలోచన. తప్పొప్పుల నిర్ణయం బుద్ధిపరుచుకోవటం. ఇదంతా లౌకికం. అనగా లోకాధారంగా శాస్త్రాధారంగా నిర్ణయించుకోవటం. ఇది తార్కికం. ఇదీ పద్యమంటే. ఇందుకని నన్నయ ఆద్యకవి. శాసనకర్త కాదు. అందులోనిది పద్యం కాదు. లక్షణోపేతమంతే ప్రతిభ అలగే వ్యక్తమైతే మంత్రం. ప్రజ్ఞద్వారా వ్యక్తమైతే శ్లోకం పద్యం. అది తత్త్వం. ఇది రసతత్త్వం అందుకని కావ్యపద్యం మంత్రంనుండి, శాసనపద్యంనుండి వేరవుతున్నది. నన్నయ అవతారిక సంపూర్ణమైనట్టిది. అంటే నిర్దుష్టం. దానంతటదొక కావ్యం.

కవి తననుగూర్చి తాను చెప్పుకొన్న పద్యం తన కుల బ్రాహ్మణు-అన్నది. ఆ పద్యం తననుగూర్చితాను చెప్పుకొన్నా అది లోకదృష్టిలో తానెట్టివాడో జనవాక్యంగా చెప్పుకొన్నదేతప్ప ఉత్తమపురుషలో చెప్పుకోలేదు.

వ్యక్తిత్వం బాహ్యాభ్యంతరభేదాలుగా రెండురకాలు. బాహ్యవ్యక్తిత్వంలో తన ఊర్తూ-పేరూ ఉద్యోగాదులు. దీనికి సంబంధించిన మాటలివి (కులబ్రాహ్మణుడు ముద్గలగోత్రజాతుడు – ఆపస్తంబసూత్రుడు).

శీలవిషయక శబ్దాలు : సద్వినుతా వదాతచరితుడు, సుజనుడు, పాత్రుడు

పాండిత్య విషయకాలు : బ్రహ్మాండ పురాణాదివేత్త – విపుల శబ్దశాసనుడు. ప్రతిభావంతుడు. ఉభయ భాషాకావ్యరచనాభిశోభితుడు.

లోకజ్ఞత :

ఋషిత్వ సంబంధాలైన మాటలు – అవిరళ జపహోమ తత్పరత్వము- సంహితాభ్యాసి నిత్యసత్యవచనుడు.

ఇందులో నన్నయ కవితా వ్యక్తిత్వముంది. పాండిత్య-లోకజ్ఞత-విపుల శబ్దశాసనత్వము బాహ్యాకారణాలు కాగా ప్రతిభ బీజకారణభూతమౌతున్నది. అతని శీలము-వైదికత (సంహితాభ్యాసాదులు) ప్రతిభా పాండిత్యాల కాధారమైన అంశం. స్వచ్ఛమైన మనస్సు-హృదయమూ కావ్యభావ ప్రతిబింబయోగ్యాలు. భారత రచనకు యోగ్యతాప్రదాయకాలు ఇది చూచి రాజరాజియన కాపని నప్పగించాడు. రాజరాజు ధర్మవిదుడు. పైదంతా నన్నయధర్మం-గుణం-వ్యక్తిత్వం. అదిచూచి, భారతం పవిత్రగ్రంథం. బహుముగ ఫలప్రదాయకం కనుక – (15–16 పద్యాలు–పీఠిక) అదీ రెంటికున్న సంబంధాన్నిచూచి ఆపని కీయన అర్హుడని భావించటం ధర్మవిదుత్వం. అతనికే ధర్మవేత్తృత ఎలా వచ్చిందంటే 'తన కుల బ్రాహ్మణు –అన్న పద్యంక్రింది పద్యం చెబుతున్నది. 'విమలమతిం బురాణములవింటే' నన్నదే ఆ పద్యం రాజరాజు కావ్యనాటకాదులు చదివి-శాస్త్రాలుచూచి పూజ్య శివాగమలపై హృదయం లగ్నం చేసాడట. తత్ఫలితం ధర్మవేత్తృత. పైగా నన్నయ కులబ్రాహ్మణుడు- గురువు. పురోహితుడు రాజునకు హితవర్గంలోని వాడని రాయల రాజనీతి. (ఆముక్త. 4 273). తదనురక్తుడు-రాజు నందు నన్నయ కనురక్తి. మంత్రాంగదక్షుడు. మత్యమరాధిపాచార్య శబ్దంతో అది వ్యక్తమౌతున్నది. కాగా నన్నయ లోకజ్ఞుడు – వేద వేదాంగవేత్త – శాస్త్రవేత్త – మంత్రాంగవేత్త కవి. ఇది అతని ఆంతరవ్యక్తిత్వం. అది ధర్మం. అది తెలిసినవా రాజు.

భారత మెలాంటిది. వ్యాస స్వరూప స్వభావాలు ఏలాంటివి? యాగఫలము–గోశతదానఫలము భారత శ్రవణంచేత లభిస్తాయన్న పద్యాలు భారత పవిత్రతను చెప్పేవి. అమలిన తారకా సముదంబుల నెన్నను–అన్న పద్యం దాని అగాధత్వాన్ని చెప్పేది. 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబు' అన్న పద్యం. దాని బహుముఖీదృష్టిని చెప్పేది. ఇది ఐతిహాసిక వైశాల్యం.

"ఏయిది హృద్యమపూర్వం బేయది ఏద్దాని వినిన ఏఅుక సమ్యగంబెయ్యుండు నఘనిబర్హణ మేయది-(10)

అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదార్థామలచ్ఛాయమై
సుమహోవర్గ చతుష్క పుష్ప వితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణకర్తనార్థఫలమై — ద్వైపాయనోద్యాన జా
తమహో భారత పారిజాత మమరున్ ధాత్రి సురపార్థ్యమై
(66)

ఇవి భారతంలోని మహాకావ్య దృష్టిని చెప్పేవి. కావ్యము హృద్యము. ఎప్పుడు అపూర్వతచేత. ఇది అనుభవాంశ. ఏటుక — జ్ఞానాంశ. శాస్త్రీయాంశ. అఘనిబర్హణ—ధర్మదృష్టి. ఇది సాంఘిక సమన్వయాంశ. మహాకావ్యంలో ఈ మూడంశాలూ వుంటాయి. భారత మొక కల్పవృక్షం. ఇది భూలోకంలో. అది స్వర్లోకంలో. దాన్ని అనుభవించేవారు దేవతలు. దీన్ని పండితులు. దీనికి కథలే శాఖలు అనటంచేత ఇది కావ్యనిర్మాణ విషయాన్ని సూచిస్తున్నది. వృక్షం నిర్మాణ సంకేతం. ఇందుకే వైదిక వాఙ్మయంలో అది సృష్టి ప్రతీకగా చెప్పబడటం తటస్థించింది. బోద—కాండం—కొమ్మా—రెమ్మా-పువ్వూ—ఫలం—ఇది క్రమ నిర్మాణం. కావ్యంలోనూ బీజం మొదట వుండి పోను పోను విస్తరిల్లి ఫలంగా పర్యవసిస్తుంది. ఇదే పంచ సంధిగతవిషయంగా నాటక విషయంలో నాట్యశాస్త్రంచెప్పింది. కాబట్టి ఇది నిర్మాణాంశం. నీడ భారతానికి వేదార్థం-తత్త్వబోధ. దీనిచే సంక్రమించేది చతుర్విధ పురుషార్థాలు. అవే పూలు. ఫలం కృష్ణార్జున ద్వంద్వం. కృష్ణుడు ఈశ్వరుడు — దైవము. అర్జునుడు నరుడు — జీవుడు. వీరి సమన్వయ కథ భారతం. ఇది ఇహికాముష్మిక సమన్వయ రూపమైన అర్థ నాటకతా సారం. చెట్టు నీటి ఒడ్డున — సమీపంలో — ద్వీపంలో జన్మిస్తుంది కాబట్టి ద్వైపాయన శబ్దం ద్వీప విషయాన్నే సూచిస్తున్నది. [ద్వీపమంటే దేశం—విశ్వం—సృష్టి పదార్థజగత్తు] ఇలా భారతంపట్టి కొమ్మలూ నీడా—పూలూ పండ్లూ కల స్వర్లోక కల్పవృక్షాన్ని అధిగమించింది దీనిచేత వ్యతిరేకాలంకారం ధ్వనించి భారతాధిక్యాన్ని వ్యంగ్య రమణీయంగా చిత్రీకరిస్తున్నది.

వ్యాసుడంటే జ్ఞాన భాస్కరుడని 'భారత భారతీ శుభగభస్తి చయము' అన్న 22 వ పద్యం చెబుతున్నది. రవి చీకట్లను విదలిస్తే - కవి అజ్ఞానాంధ తమస్సును చీలుస్తున్నాడు. అందుచే ఇద్దరూ జ్ఞానప్రతీకలే. వెలుగునిచ్చేవారే.

సాత్యవతేయ విష్ణు పద సంభవమై [73] — పద్యం వ్యాసుడు సాక్షాన్నారాయణుడని చెబుతున్నది. ఆయన పదం నుండి శబ్దంనుండి విష్ణుపాదంనుండి గంగలాగా భారతం ప్రవించింది. గంగకు ధ్యేయం సముద్రంకాగా భారతధ్యేయం విబుధేశ్వరు సంగతి. విబుధేశ్వరుడు లక్షణయాకృష్ణుడనాలి. కృష్ణార్జునోత్తమ ఫలమన్నమాట బట్టి. భారత వస్తువుబట్టి. లేదు సహృదయులైన పండితులు 'ధాత్రీసురపార్థ్యమై' అన్న మాటనుబట్టి. అలా చెప్పటం తత్త్వ దృష్ట్యా. ఇలా అనటం కావ్యతత్త్వ దృష్ట్యా. అది కావ్యవస్తు దృష్టి. ఇది కావ్యానుభావదృష్టి.

ఇలా రాజరాజు — నన్నయ — వ్యాసుడు - భారతం — అంటే ఏమిటో కవి పూర్ణంగా చిత్రించాడు. సారమతిన్ — పద్యం తన కవితా లక్షణాలు చెప్పేది. 1. "ప్రసన్న కథా కలితార్థయుక్తి—అర్థయుక్తి—అర్థాలంటే పద్యంలో, ఘట్టంలో, కావ్యంలో వాచ్యార్థం దగ్గర నుండి రసతత్త్వందాకా అభివ్యాపించేవి. అంటే వాచ్యార్థం —ఘట్టం—సన్నివేశం—సందర్భం—ఏదికాదు అర్థమంటే. అన్నీ. వాటి మధ్యవున్న కూర్పు. ఈ సుసంఘటితాలైన ఘట్టాలతో కూడుకొన్న కథ. దాని పరమార్థం ప్రత్యక్షం కావటం ప్రసన్నత. అంటే ఒక కథ వుంది. దానికొక అర్థం. దాన్ననుసరించిన పరమార్థం. అర్థం బాహ్యం కాగా పరమార్థం అంతర మౌతున్నది. ఈ రెంటికి ఒక చక్కని కూడిక — బంధం కావ్యం. కథలో అనేకార్థాలు యాథాతథ్యతః సుసంఘటితాలు కావటం అర్థయుక్తి. అసంఘటితాలుగా కన్పిస్తూ ప్రజ్ఞచేత విచారిస్తే సుసంఘటితాలు కావటం యుక్తి. ఇది పాఠకవిషయం. వ్రాసే కవి విషయమున్నూ. అలాంటి దూరదూరతః విభిన్నతః విన్యస్తాలైన అర్థాలు విమర్శకుడైన పాఠకునిలో—కవీంద్రుడులో — సుసంఘటితాలై తర్వాత వాటి వెనుకవున్న పరమార్థం బోధిస్తున్నవి. ఈ రెంటికీ సంబంధం కలితత్వం. ఈ రెంటినీ కలిపికట్టే బంధన సూత్రం అది. ప్రసన్నత అంటే శబ్దార్థాలు చాటునవున్న రహస్యార్థాన్ని సుస్పష్టం చేయటం. కావ్యం సర్వతీ స్వరూపమన్న భావం వున్నయిుంది. ఇందుకే భారత భరతి అని పలుమార్లు చెప్పటం. కాబట్టి బిన్నార్థాలు వాటిమధ్య యుక్తి ఇవొక అంచె. దీని వెనుక కథ X అంటే వస్తువు [థీమ్] తప్ప ఇతివృత్తం కాదు. కాబట్టి ఇవ్యా శరీర విషయంకాదు. ఆ వస్తువు ప్రసన్నం కావటం కావ్యతాత్పర్యబోధ కాబట్టి ఒక కథ—తత్పరమార్థం—స్పష్టంకావటాని కనుగుణమైన అర్థయుక్తి కవి నిక్షేపిస్తున్నాడు. పాఠకుడు భావించి ఆనంద పారవశ్యం చెందుతున్నాడు. కవి కథా పరమార్థం నుండి యుక్తిద్వారా అర్థనిక్షేపణ చేస్తున్నాడు [పద్యవిద్య] పాఠకుడు యుక్తి సూత్రాను సారంగా అర్థాలను ఒక క్రమంలో అన్వయించుకొంటూ కథాప్రసన్నత నాస్వాదిస్తున్నాడు. కవిఅవరోహణపథంగాఅవతరిస్తే పాఠకుడరోహణ పథంగా పోతున్నాడు. అందుకని ఆ సమాసానికి వెనుక నుండి అర్థవివరణం చేసుకోవాలి ఇక్కడకొంతమంది ప్రసన్నత అంటే స్పష్టంగా కథచెప్పటం—ఒకసారి విన్నంతనే అర్థమయ్యేది—అన్నట్లు వ్రాసారు. అప్పుడు కవీంద్రులు—లోనారసి—శబ్దాలు బరువులేనివి. ఆ శబ్దాలను దృష్టిలో పెట్టుకొని ఆ పద్యార్థాన్ని చూడాలి. ఆ శబ్దాలు ఏం చెబుతున్నాయో తర్వాత చూద్దాం. పైగా ప్రసన్నశబ్దం ప్రసాదగుణాన్ని చెబుతున్నదని వారిమాట. అప్పుడు కవి ప్రసాద శబ్దాన్నే వాడేవాడు. కాక ప్రసాదగుణభరితంగ కథ చెప్పటం మహావిషయమని ఏ అలంకారికుడన్నాడు గనుక. ఆ విషయం ఇక్కడ కన్వయించటం. ఇందుకే ఈ వాదం అపారమౌతున్నది. (ఇంద్రగంటి వారి వాదాన్నిబట్టి ప్రసన్న కథ, ప్రసన్నకవిత — అర్థం ప్రయోజనం యుక్తికూడియుండటం ఇలా చెప్పి వారు విశ్వనాథ చూపిన ఆయా కథలను విమర్శించినారు. దానికి ప్రోద్బలకంగా పంపకవిమాట 'లలితపదం, ప్రసన్న కవితా గుణమిల్లదె ఉదాహరించుకొన్నారు. ఇంకా కథాకవిత — అన్నదొక ప్రత్యేక విషయంగా ఎవరూ స్వీకరించలేదు కాబట్టి దాన్ని త్రోసిపుచ్చారు.

కథాప్రసన్నత–కవితా ప్రసన్నత — అంటే మూలంలోవున్న కొంకిబికిలనాన్ని తీసివేసి కథకు అడ్డంకులు కల్పించే వాటిని తీసివేసి–సూటిగా చెప్పటం. దీనివల్ల కథలో క్లిష్టత తొలగి ప్రసన్నత వచ్చింది. ఇదే నన్నయగారి భావమని చెప్పారు.

ఇది సారమతులైన కవులు లోనారసిమేలునా — దగిన విషయమూ అని ప్రశ్న. ఎందుకంటే అదంత మహావిషయంకాదు కాబట్టి. మరీ మూలభారతం దగ్గర పెట్టుకొని చూస్తేగాని తెలియదనీ అనటం నన్నయ స్వతంత్రతను భంగించటమే తప్ప వేరేమీ కాదు. ఇలాంటి చిన్న విషయాలు ప్రతికవీ చేసిందే కాబట్టి. అదీ ఒక అంశంగా మనం గుర్తించార్సిందే కాని, అదే మహావిషయమనటం సారమతిత్వాన్ని భంగించటమే తప్ప వేరేమీకాదు. శ్రీనాథాదులు చేసిన పనులవే కాబట్టి నన్నయగారి ప్రత్యేకత అందులో ఏమీలేదు. అదే అయితే పాపం నన్నయ అంత సాగదీసుకోనక్కర్లేదు. సారమతిం–అన్నట్లుగా. అందుచేత ఈ వాదంలో బరువు లేదు. అంతేకాదు అది వ్యాసగౌరవానికి భంగకరమే. నన్నయకీ దృష్టినంటగట్టటం — ఆయన కాయనమీదున్న గౌరవాన్ని సూచించే తో రుబిరాబ్జ బోధనరతుండు. ధర్మశాస్త్రజ్ఞులు–ఇత్యాది వ్యర్థమౌతుంది కాబట్టిన్నీ. ఈ వాదంలో సారంలేదు.

పైగా ప్రసన్నత అంటే 'వినీవినగానే అరటేతిలో రేగుపండులాగా స్పష్టమయ్యే రచన' అన్న రసగంగాధరోక్తినిచ్చి — అర్థం చెప్పారు. ఐతే లోనారయవలసిన పనియెక్కడ. ఆ చూచేవాడెవడు. కవీంద్రులు. వారు ఎలాంటివారు? సారమతులు — అంత సాగలాగిన పద్యమంతా ఆ నిర్వచనంచేత వ్యర్థమౌతున్నది. ఇందుచేలా అసమంజసమే. విశ్వనాథ ఇచ్చిన ప్రసన్న శబ్దానికర్థమేమిటో విచారించనూలేదు వారు. విశ్వనాథ చెప్పిన సుద్యూమ్నుల కథను వివరించి చివరవారు వ్రాసిన మాటవిని — భావ్యర్థ సూచనను గ్రహించుట ఎవ్వరికైనను క్లిష్టత అని తోచును గాని ప్రసన్నత అనిపించదు. (చూ. 53 పుట) క్లిష్టతకు వ్యతిరేకంగా ప్రసన్నతను తీసుకోవటం విశ్వనాథ దృష్టికాదు. ఇంద్రగంటివారి దృష్టి. 'దేవుడు ప్రసన్నుడైనాడు' అన్నచోట ప్రసన్నత. ఆలోచనచే లభించే ఉస్వాసం ప్రసన్నత. ఇది కవీంద్రుల భావనా విషయం. కాబట్టి ప్రసన్నత అంటే అరటి పండొలిచి చేతిలో పెట్టటంలాగా కథ చెప్పట కాదు. గాంధారీ వివాహ కథలో విశ్వనాథ చెప్పిన విమర్శ కుదరదనటం చాలా సాహసం. ఏది కుదురుతుంది గనక? ఆ కథకు మూలాన్నిచ్చి విశ్వనాథవాదం కుదరదనటం ఏలాగో తెలియటంలేదు. మూలకథ ధృతరాష్ట్రుని కులాదులు చూచి కళ్లులేనివాడని తెలిసీ సుబలుడు కూతుర్నిచ్చాడు (ద దా) గాంధారి కూడా వరుడు కబోదని తెలిసీ అంగీకరించింది. దీన్ని నన్నయ్యగారు మరొకరీతిగా చెప్పారు. ఆ చెప్పినతీరే విశ్వనాథ వివరించింది. నన్నయ్యగారి లోకజ్ఞతను బట్టి మూలకథను సమన్వయయుతంగా చిత్రించి తత్పరిష్కారార్థం సుబలుని తీవ్రప్రకృతిగా చిత్రించటం జరిగింది. అంతేకాని మూలంలో వుందా లేదా అన్నది సమస్యకాదు. అక్కడ సమన్వయ లేకపోవచ్చు. అనువాదకుడు సృష్టించుకోగూడదని శాసన మెక్కడుందో మరి తెలియదు. ఇందుచేత ఇంద్రగంటివారి వాదంలో సారంలేదు.)

ఒక పద్యమొకవృత్తం. అందులో ప్రతిశబ్దమూ ఒకచుక్క ప్రతిదాన్నీ చూడవలసిందే. పరిగణనలోకి తీసుకోవలసిందే. లేకపోతే పద్యం విద్యకాదు. నన్నయ ఆద్యుడూకాడు. పెద్దకథ వ్రాసినంత మాత్రాన ఎవడూ మహాకవికాడు. దీన్నే ధ్వన్యాలోకం నిరసించింది. కథామాత్ర నిర్వహణచేత ఎవడూ కవికాడు అని. కాబట్టి ఎలా చూచినా ప్రసన్నత ప్రసాదంకాదు.

ఇది అర్థసంబంధగుణం. కావ్యాంతర్యం. దాన్ని లోపలకు చొచ్చి చూచి మేలని దగ్గవారు కవీంద్రులు.

2. అక్షర రమ్యత. ఇది బాహ్యమైన శబ్దస్వరూపం. పైది అర్థయుక్తి. ఇది అక్షరయుక్తి. ఇది ఆకర్షణీయాంశం. అది తాదాత్మ్య విషయం. అక్షరయుక్త్యా ఏర్పడే నాదసౌందర్యం అక్షర రమ్యత. కాగా అర్థయుక్త్యా వస్తున్న శాంతసౌందర్యం ప్రసన్నత. ఇందుచేత శబ్దార్థ విషయాలుగా వీటిని చూడాలి. శబ్దం బాహ్యం. అది ఇతరుల కన్వయించేది. అర్థం ఆంతరం. అది కవీంద్రులకు విషయం (అక్షర రమ్యత విషయాన్ని ఫిబ్రవరి 76 'భారతి'లో చూడగలరు).

నన్నయ తన వ్యక్తిత్వాన్ని గూర్చి చెప్పిన మాటలు యథార్థాలే అని అవగాహనకే వస్తుంది. అతని సౌజన్యం నారాయణ బట్టుని స్మరించటంలోనే వుంది. వేంగీ పరిషత్తులకు నమస్కరించటంలోనూ వుంది. భారత సముద్రం ఈదటం కష్టమనడంలో వినయమూ సౌజన్యమే. అలాగే మొదటి శ్లోకంలోనూ.

[మే 78 'భారతి'లో నన్నయగారిమీద శ్రీ కె. వి. రమణారెడ్డి ఒక వ్యాసంలో వ్రాసాడు. అందులో 5, 6 ఆక్షేపణలు సూచించారు. నన్నయ సత్యవచనుడుకాడు. ఎలాగంటే యుద్ధాల్లో ఓడిపోయిన రాజరాజును 'అన్యరాజ తేజోజయశాలి' అనటం. కాని 1035 ప్రాంతంలో కలిదిండి దగ్గర - అలాగే మరొకసారి రాజరాజు జయించిన సాక్ష్యాలున్నాయి. కాబట్టి ఆ ఆక్షేపణ నిలిచేదికాదు. ఈ సందర్భంలో వ్యాకర్త తెలుగు కవులకూ చారిత్రక సత్యానికీ చుక్కెదురన్నదీ అంతే. మను చరిత్ర, ఆముక్తం, పారిజాతం, కృష్ణరాయ విజయం-లాంటివి చారిత్రకాలకు చరిత్ర భిక్షపెట్టిన గ్రంథాలన్నవి జగమెరిగిన సత్యం కనుక ఈ అభాండం ఛిద్ర భాండం. నిత్య సత్య వచనుడనుకోవటంలో ఆత్మస్తుతి ఉందనటం ఇంకొకటి. రెంటికీ పొత్తేమిటో తెలియదు. అదిసరే! ఆ మాట లోకదృష్ట్యా తప్ప వ్యక్తిదృష్ట్యా కాదు. 'నా పేరు ఫలానా అంటారండీ' అన్న పద్ధతి తెలిసిందేకదా! 'జగద్ధితమంటే పంచమ వేదమైన భారతానువాదమే'—ఈ వాక్యానికి అర్థం మనమే చెప్పకోవాలి కాబోలు. అదంతే మరి!

'నన్నయ రచన ప్రజలకు పనికిరాయిది' — పంపభారతం నేటి కన్నడిగులకు అర్థంకాదు. ప్రాచీనాంగ్లం నేటికి గ్రీకు. అలా

కాకుండా ఈ నాటికీ కావ్యభాష—అలాగే వస్తున్నదంటే - భారతం మన కర్ణమవుతున్నదంటే ఆదికవి భాషానుశాసనమే. అది ఆ మహా ప్రతిభుని భిక్షే.]

నన్నయగారి రచనలో అర్థయుక్తి — తార్కికాన్వయం చాలా గొప్పది. దాని కదొక వుదాహరణ. పద్యవిద్యలో ఇదొక భాగం. పరిషత్తులకు నమస్కరించిన పద్యం చూడవచ్చు. సభాంతర సరసీ వనంబులు—అన్నది కేవల రూపకంకాదు. మహాకవిలో అలంకారమొక భావమూర్తికి సంకేతం కాదు వ్యంజకం. పండితులు పద్మాలు. వాళ్ళు కూర్చున్నచోటు రాజు తీర్చిన పరిషత్తు కావచ్చు. ప్రాచీన కాలంలో సభాస్థలులుండేవి. ఒకటి రాజకీయచర్చలకు, మతసాంస్కృతిక నాటకాది ప్రదర్శనలకు. బుద్ధుని నాటికే ఇలాంటి వనేకం వున్నట్లు సాక్ష్యాలున్నాయి.

కాబట్టి రాజనిర్మిత సభాస్థలి కళారంగస్థలం. పండితులు కూర్చున్నారు. వారిచుట్టూ వాతావరణం అందంగా అలంకృత మౌతుంది నేటికీ అంతే. వారి ప్రక్క కృత్రిమ దీర్ఘికలు అందులో తామరపూలు. ఈ రెంటిని సమన్వయిస్తున్నాడు కవి. ఈ మూర్తి దర్శన సౌందర్యముందా పద్యంలో. కవి అకస్మాత్తుగా - అక్రమంగా ఒకభావంనుండి మరొక భావానికి పోడు. ఇక్కడ సభాస్థలి సరస్సుతో పోల్చటానికి పై పద్యంలో వ్యాసుణ్ణి అంభోరుహమిత్రుడనటం, సూరిచేతో రుచిరాజ్ఞ బోధ సంతుడనటం కారణం. ఈ తార్కికక్రమం వకటి. ఆ పరిషద్వర్ణనలో సహృద్యయుక్తి - సామాన్యంగా నన్నయగారి కవితలో అందమైన లక్షణం. సర్వే సర్వత్ర కన్పిస్తుంది. వినతా కద్రుప ఘట్టంలో అశ్వాన్ని వర్ణిస్తూ ఫేనపుంజనిభు—(2–30) అనటం ఎంత మనోజ్ఞం. అది సముద్రం ప్రక్క విహరిస్తున్నది. దూరాన్నుండి వాళ్ళు చూస్తున్నారు. సముద్రంమీద ఫేనమూ వుంది. ప్రక్క అశ్వమూ వుంది. రెంటినీ చూస్తున్నవారికి అనురుగు దొబ్బా గుఱ్ఱమూ వకలాగేకాదు— అదేగావుంది. సహజ నేపథ్యంనుండి అలంకారం గ్రహించటం — ప్రకృతికీ- తద్గత వస్తువుకూ సమన్వయం చెప్పటం. ఇదొక అపూర్వ విద్య

పద్యమంటే ఛందస్సనుకోవటానికి వీల్లేదన్న మొదటి కవి నన్నయ. మరేమిటి?—పద్యానికి బాహ్యదశ—అంతరదశ—రెండుండగా పైది అక్షరయుక్తి. అంతరము అర్థయుక్తి. దాని అనుభవ విశేషం రమ్యత కాగా దీనిది ప్రసన్నత. సరే. సారమతిన్—పద్యం. అందులో అసలు పద్యంలో ఆయువుపట్లు 1. ప్రారంభాంతాలు 2. ప్రాస-యతి 3. వాక్యచ్ఛేదం—పాదచ్ఛేదం 4. శబ్దాచితి 5. వీటిమధ్య ఒక సమన్వయం వుండటం.

సారమతితో ప్రారంభమై జగద్ధితంతో పద్యం ముగుస్తున్నది. కారణ కార్యభావం సుస్పష్టమే. మహాకవులు మెచ్చేటట్లుగా వ్రాయబడటంచేత కావ్యం జగద్ధితమౌతున్నది. (మూలభారతం గురించి చెప్పిన లక్షణాలన్నీ ఇక్కడ కన్వయించుకోవాలి. ఘట్టంలో వున్న ప్రతిపద్యం—భావం — అన్నీ ఒకదానికొకటి పోషకమే. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని — ఇత్యాదులవల్ల జగద్ధితం కల్గుచున్నది. కాబట్టి) ప్రసన్న కథాకవితార్థయుక్తిలో, నారసి- లో మీగ పద్యపాదం తెగిపోయి ఆరసి రెండవపాద ప్రారంభమౌతున్నది. లోమీది దీర్ఘంతీసి చదవాలి. ఎంతవరకు విశ్రాంతి రహితంగా. ఎంతవరకైనాసరే. అప్పుడు లోతెంతో వ్యంజితమౌతుంది. ప్రక్క అక్షరంలేదు. వుంటే ముందక్షరాన్ని వెనకది తోస్తుంది పద పద అంటూ. పాదాంతంలో వాడితే ఆ బాధలేదు. ఎంతో లోతుకు దిగి చూడాలి. ఎవరు? కవీంద్రుడు. ఇంద్రశబ్దం దివ్యమేధాశక్తి కధిష్ఠాన దైవం. సమేంద్రామేధయాస్పృణోతు — అన్న చాందోగ్యం చూచుకోవాలి దివ్యమేధ--లౌకికమేధ రెండు మేధాశక్తులు. అలౌకిక ప్రజ్ఞవున్నవాడు 'లోనారసి' సత్యదర్శనం చేస్తాడు. అంతర్ముఖీనత పేరు లోనారయుట. చేసేవాడుఇంద్రుడు. ఇతరుడుకాడు. వాడూ ఎల్లా? సారమతిన్—సార తిరగవేస్తే రస—తస్మతి—చేత అని అర్థం. ఇలా ప్రసన్న కథాకలితార్థయుక్తి అలాంటి మహాత్ములకోసం తప్ప అసారమతికోసంకాదు నన్నయ కవితలో ప్రత్యక్షరం పరిశోధించదగిందే. సత్యాన్వేషికి. వేయినా—అంతలోతుకు దిగి సత్యదర్శనంచేసి వారేమంటారు. ఈ చిన్నమాట. ఇది నన్నయమనస్తత్త్వ గాంభీర్యం. నిత్యసత్యవచను డంతకన్నా మాట్లాడడు ఆయనవాక్కు మితమూ— హితమూ సత్యమూ—కలది. అందుకే ఆయన పాత్రలకీ మాటలు ప్రయోగించటం కావ్యంలో దష్టవ్యాంశం. కాక అనుభవభారంలో మాటరాదు. రసానుభవంలో అల్లరి చేయటాలు—మెచ్చుకోవటాలు— వుండవు. ఇది అనుభవైకవేద్యం.

ఆంధ్రకావ్యభారతి ప్రథమావతారం శ్రీవాణీగిరిజా—శ్లోకం. నన్నయి వాల్మీకిని గురు పద్య విద్యకు నాద్యుడన్నాడు. వాల్మీకినోటి నుండి వెలువడిన శ్లోకం ఎంత అర్థ గంభీరమో ధ్వన్యాలోకాదులు గుర్తించాయి. ఛంధః శిల్పంలో కీ.శే. పాటిబండవారు వివరించారు. నన్నయ్యగారు ఆది కవే. ఆయన నోటి నుండీ శ్లోకమే వచ్చింది. ఇదీ 'మానిషాద' లాంటిదే. ఆ శ్లోకం సరస్వతీ ప్రబోధన చేతనని వాల్మీకం. ఇక్కడా 'శ్రీవాణి' యే. వకారప్రాస అమృత బీజం. సరస్వతి అక్షర స్వరూపిణి. అమృతమూర్తి. శబ్దశక్తికి వినాశనం లేదు. కాక నన్నయ్య మనస్సు అమృతాయమానమైనట్టిది. ఆయన అమృతమూర్తి. ఆయన ముఖపద్మం నుండి తొలిసారిగా ఆంధ్రవాణి ఆవిర్భవిస్తున్నది. తొలిశబ్దం శ్రీవాణీ — లక్ష్మి — అని శ్రీ శబ్దాని కర్థం ప్రస్తుతాంశమైనా - శ్లోక తాత్పర్యదృష్ట్యా - శుభావహమైన శారద అని చెప్పకోవచ్చు.

ఆయన ఈ వాణికి శ్రీకారం చుట్టినవాడు అతని మనస్సు సువిశాలం కాకపోతే [వ్యాసుడు సువిశాలబుద్ధి] ఆయన కావ్యకవితకాద్యుడు కాలేదు. అందుకని రాబోయే అనంతకాలంమీద పరచుకొన్న బీజప్రాయంగావున్న సమస్త కావ్యజాతానికీ — త్రికాలాల్లోని ఆంధ్రజాతికీ ఆయన శుభాశంసనం చెబుతున్నాడు త్రిమూర్తులు మీకు శ్రేయస్సు నిచ్చుగాక అని. మీరు ఎవరు? మనం. ఆయనకెదురుగ వున్న శ్రోతలెవరు. సమస్తాంధ్రజాతి. తెనుగువాణ్ణి ఉద్దేశించి నిండు మనస్సుతో పలికినమాట అంత అమృత స్వాంతం

కాబట్టే లోని స్పందన శ్రీవాణి—గా జాలువారింది. ఇదొక నాందీ పద్యంగా భాసించేటట్లు వ్రాయటం నన్నయగారి శిల్పం. ఇతరులు తామన్నట్లుగానే వ్రాసారు. రాజునాశీర్వదించినట్లో — ఇతరంగానో వ్రాసారు. ఇక్కడ 'రాజరాజనరేంద్రుడే — ఉద్దేశిత వ్యక్తి కాదు అన్నది కవి తానైకాదు. కవి సూత్రధారుడై అన్నమాట తప్ప కవి కాదు. అవతారిక అంతా కవి ప్రథమ పురుషలోనె వ్రాసాడు. వ్యక్తిగత నన్నయ కాక ఆ వ్యక్తిగత విశ్వ జనీనవ్యక్తి సూత్రధారుడు వ్రాసిన మాట [ఇది విచిత్రమూ కాదు. అబద్ధమూ కాదు. ఆధునికోద్యమం తెలిసినా — ప్రాచీన భారతీయలంకారిక సిద్ధాంతం తెలిసినా] సంస్కృత నాటకంలో నాంది సూత్రధార వాక్యం తప్ప కవి వాక్యం కానట్లు ఇదీ అంటే ఇలా మంగళా శంసనంతోపాటు కావ్యార్థ సూచనా వుంది. విశ్వ సృష్టికి హేతువు దాంపత్యం. అదే త్రిమూర్తి ద్వంద్వ స్తుతి. ఆ స్థితి స్త్రీపుంసయోగోద్భవం. కనుక ద్వంద్వస్తుతి కథలో ద్రౌపది అవమానం తద్భిన్నదశ. స్థితి రక్షకుడు నారాయణుడు. స్త్రీ అవమానిత కావటం విశ్వస్థితి భగ్నం కావటం. ఈ దుష్చేష్ట రాక్షసం. దానికి శిక్షకుడు నారాయణుడు. సభాపర్వ ద్వితీయాశ్వాసం—కృష్ణప్రాధాన్యం. రక్షణ శిక్షణాదులన్నీ ధ్వనిత రమణీయాలే. నన్నయ నిత్యసత్య వచనత్వం కూడా పై శ్లోకంలో వుంది. చిరాయ—త్రిమూర్తులు — పురుషోత్తమాంబుజభవ శ్రీకధరులు — అన్న మాటలు కవిత్రయాన్ని సంకేతిస్తున్నవి [వ్యంజించటం కాదు] అన్న శ్రీ విశ్వనాథ విమర్శ నిష్కలుషితమైనదే. కొందరంటారు — నన్నయ దాన్ని వుహిస్తాడా? అని. ఇది ప్రశ్నకాదు. ఆ శబ్దం అప్రయత్నా పతితమైతే, శబ్ద శక్త్యై విచిత్రార్థం వస్తుంది. అలాగే శాకుంతల పంచమాంకంలో.

"స్త్రీణామ శిక్షిత పటుత్వ మమానుషీషు
సందృశ్యతే, కిముతయాః ప్రతిబోధవత్యః
ప్రాగంత రిక్ష గమనాత్స్వ మపత్యజాత
మన్యైర్ద్విజైః పరభృతాః ఖలుపోషయంతి"

స్త్రీజాతికి ఎవరూ నేర్పకుండానే కార్యసాధన శక్తి స్వభావసిద్ధం. ఇది పశుపక్ష్యాదుల్లోనే వుంది. కోకిలలు తమ పిల్లల్ని కాకులచే పెంచబడేటట్లు చేసుకోవటం లోకవిదితమే కదా. ఇక మానవుల్లో చెప్పటం దేనికి— ఈ శ్లోకంలో శకుంతలా జన్మరహస్యముంది. ఆమె కూడా పక్షులచేతనే పెంచబడింది కాబట్టి. ఆ నింద మేనకకు తాకుతున్నది. (శాకుంతలము యొక్క అభిజ్ఞానత — విశ్వనాథ) అందుకనే వెంటనే సహించక శకుంతల అనార్య! అన్నది. ఆమె కోపాన్ని తర్వాతి శ్లోకం వర్ణించింది. ఇంతకోపం రావటంలో పై ధ్వనితార్థం సంభావ్యమే — అని చెప్పంటారు కొందరు. (చూ రామదాసయ్యంగారి వ్యాఖ్య.) ఆ ధ్వన్యర్థం దుష్యంతునికి తెలియదు కదా అది. దుష్యంతుడంటే అంతఃకరణ చతుష్టయంలో పై పొరలోవాడా. లోపొరలో వాడా. వాడికి తెలియదు. వీడికి తెలుసు. శబ్దప్రేరణ ప్రతిభాకృతం తప్ప వైయక్తికమనః కృతం కాదు కనుక శబ్దం బయలుదేరిన స్థానంలోవున్న లోపలి అర్థం పైకి శబ్దం తేలే దశకు. పై పొర మనస్సులో అది విస్మారితం కావచ్చు కాని పుట్టినదశలో బీజదశలో లేదనటం దుస్సాధ్యం. అశాస్త్రీయం. కవి అక్కడివాడు. పైపొరలోవాడు కాడు. వీడు దేశకాలబద్ధవ్యక్తి విశిష్టుడు. కాబట్టి నన్నయ నోటి నుండి వచ్చిన శబ్దానికా శక్తి వుంది. పైగా అన్నది సూత్రధరుడు. అది నాందీవాక్యం. ఈ నిత్య సత్య సంస్కృతి — అమరిన తారకా సముదయంబుల నెన్నను — అన్న పద్యంలో భారత భారతీ సముద్రము దరియంగనీదను — అన్న వాక్యంలో కవి సౌజన్యమే అర్థం. కాని నిజంగా ఆయన ఈదలేక పోయాడు. విధాతృనకైనను నేరబోలునే అన్నమాట కవిబ్రహ్మకు తాకేదే. అసలే నన్నయ్య తాను మధ్యలోనే ఆగిపోతానన్న స్ఫూర్తి పద్యరచన వేళలో కవి మనస్సులో వుంటుందా? ఎలా వుంటుంది. కాని ఆ స్ఫూర్తి ప్రేక్షకునకుండవచ్చు. పతాకాస్థానకాలు వున్నాయి. అందులో ఇలాంటి పద్ధతి వుంది. సీత సముద్రాల కావల వున్నా తెచ్చి ఇక్కిస్తాను — ఇది సుగ్రీవ వాక్యం. అన్నప్పుడు వానికి తెలియదుకదా సీత సముద్రాల కావల వున్నదని. నిజంగా అంతేకదా. కాబట్టి లౌకిక మనస్సు భావించకుండా లోపలి మనస్సు మాత్రమే భావించే అర్థం శబ్దోద్భూతిలో వుండవచ్చు. దానికొక అర్థం. దీనికొక అర్థం తెలిసేట్లుగా శబ్దం పుడుతున్నది. ఎలాగా? కవికి అంటే వ్యక్తి విశిష్టుడైననాడికి - తెలియకుండానే కవికి తెలుసు. వాడికి పైనున్న వ్యక్తికి తెలియదు. ఇది సర్వ మహాకవుల అనుభవసారమే. అందుకే కవులు చెప్పగా వింటాం. వేసుకొని ఇలా వ్రాయలేదు. కాని చిత్రం ఈ శబ్దానికింతర్థముందని తర్వాత తెలిసిందని - 'కిమిదం వ్యాహృతం మయా' అన్న వాల్మీకి మాట కదే అర్థం. కాబట్టి భారతం సముద్ర మనటమూ సత్యమే. విధాతృన కైనను నేరబోలునే — అన్నదీ సత్యమే. అలాగే జరిగింది.

ఇది ఆయన ఆర్ష లక్షణం. ఋషి లక్షణం. తస్య వాచమర్థోనుధావత్ అన్నమాట. తిక్కన గారన్నట్లు నన్నయ నిజంగా 'మహాత్ముడు'.

డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు

శెల్వనంబి

ఆంధ్రభోజుని ఆముక్త మాల్యద ద్వితీయాశ్వాసమున "పరదేశి విప్రుడొకడు అళఘర సుందరబాహుస్వామికి తెప్పతిరునాళ్ళరాగా ఆ సుందరబాహుస్వామిని సేవించి మరల తనదేశమునకు పోవుచు బడలికచేత రాత్రియందు మధురలోని వైగా నదిలో సాంధ్యానుష్ఠానములు గావించుకొని ఆ యూరి యందున్న "జేని పౌరోహితుని యింటియందు" ఆతిథ్యము స్వీకరించి చందన పుష్పతాంబూలాదులు స్వీకరించె" అని గలదు. (పద్య సంఖ్య 71, 72, 73)

జేని పురోహితుడు పరదేశి విప్రున కాతిథ్య మిచ్చెను. అదియు పరిపక్వములయిన అరటిపండ్లతో, పనసతొనలతో, నేతి ముద్దవంటి దోసపండ్ల ముక్కలతో, వడపప్పుతో, చెఱకు రసముతో, పానకముతో నివ్వబడినది.

ఆముక్తమునకు మూలములనదగిన దివ్యసూరి చరిత్రాదులలో నీరాజ పురోహితుడున్నాడు. కాని పరదేశి కొసగిన ఆతిథ్యము కానరాదు. పాండీడగు వల్లభదేవుడు (కోనెడుమారన్) నగర శోధనకై వెళ్లి ఆ ఆగంతుక బ్రాహ్మణుని ప్రాసంగిక శ్లోకమగు 'వర్షార్థమష్టౌ' ఇత్యాది శ్లోకమును విని దృష్టమున మనకెట్టి కొదవయు లేదు. అదృష్టమునుగూర్చి ఇకనైన యత్నింపవలయునని వ్యాకులపడి తన పురోహితుడగు శెల్వనంబిని చూచి 'పురుషార్థ నిర్ణయ పూర్వకముగ అదృష్టసిద్ధికి మార్గమేమన పురోహితుడగు శెల్వనంబి 'ధర్మజ్ఞ సమయం ప్రమాణం వేదాశ్చ'. కాన విద్వాంసుల బిలిపించి, వేదాంత సిద్ధమగు పరతత్వ నిర్ణయము చేయించి తన్మార్గమవలంబింపనగునని తెల్పెను.

ఎంచుమించుగ గురుపరంపరాది గ్రంథములందును కథ ఇట్లే సాగినది. "ఈ శెల్వనంబి ఎవరు? (రాయలు పేర్కొన్న అనానుక రాజపురోహితుడు) ఆ ఊరికి వచ్చిపోవు పరదేశిగాండ్రకు నాతిథ్య మొసంగు టొక్కటియేనా ఆతని పని? పురోహితార్హమైన గుర్తింపక రాయలు అంతటితోనే ఆతని పనిని ముగించివేసినాడేమి? అని పాఠకులకు తోచుట సహజము.

వడివళగియనంబి యను నాతడు "ఇతడు విష్ణుచిత్తుని మిత్రుడు. పాండీడగు కోనెడుమాధవర్మ పురోహితుడు. పాండ్యుని మేలు కోరువాడు. ధర్మము తప్ప వేఱేదియు నెరుగనివాడు. నాల్గు వేదములు నేర్చినవాడు. కామ క్రోధాదులచే చెడని మనసుగలవాడు. స్థిరచిత్తుడు" — అని "ఉత్తమనాయ్ తెన్న వనుక్కు ఉయిర్ తునయాయ్" అనెడు పాశురములో వర్ణించియున్నాడు.

రాజు వ్యాకుల చిత్తుడైయున్నప్పుడు 'ధర్మజ్ఞ సమయో వేదాః ప్రమాణశ్చ నృపోత్తమ। అతః శాస్త్ర విదః సర్వాం త్సమాహూయ బుధర్ష భాన్। వాక్యైర్వే దాన్త సిద్ధాన్తైః పర తత్వస్య నిర్ణయమ్। కారయిత్వా బుధ శ్రేష్ఠైః తన్మార్గేణార్య సమ్మతమ్। జ్ఞాతవ్యం తన్మహద్వస్తు పర తత్వ మిదం స్ఫుటమ్" అని బోధించి కర్తవ్యమును గుర్తింపజేసిన ఘనుడు ఆ రాజపురోహితుడు శెల్వనంబి.

భట్టనాథుడు శ్రీమన్నారాయణుని స్వప్నోపదేశమున కంగీకరించి మధురకు రాగా పాండ్యుడతని కెదురేగి నమస్కరించి పూజించెను. అపుడు ఈ శెల్వనంబియు రాజుతో కూడ నుండి భట్టనాథు నాదరమున నాహ్వానించెను. ఈ విషయమును ప్రపన్నామృత మిట్లు ఘోషించుచున్నది.

'స తదా వల్లభో రాజా సంపత్పూర్ణ పురోహితః సంవీక్ష్య తావు భౌ హృష్టౌ భట్టనాథం ద్విజోత్తమం ప్రత్యుత్థాన ప్రణామాది పూర్వకం విధి పూర్వకం అర్చయా మాసతుః—'

రాజపురోహితుడగు శెల్వనంబియె సంస్కృతమున సంపత్పూర్ణులు. శెల్వనంబి భట్టనాథుని శిష్యోత్తముడు. గురువుపై మిగుల నభిమానము గలవాడు. రాజసభలోని పండితు లందరు "విష్ణుచిత్తుడు వేదాదులు నేర్వనివాడని, పూజార్హుడు కాడని పలుకుచుండ గురు తిరస్కృతి నోర్వజాలని శెల్వనంబి లేచి పండితుల సందటిని మందలించిన దిట్ట.

'అసహిష్ణుర్గురు వాత్సల్యాత్ నిర్భర్త్స్య విబుధర్ష భాన్'

అంతేకాదు "స్వామి! వీరి మాటలకేంగాని, దయచేసి పరతత్వ ముపదేశించి తరింపచేయండి" అని ప్రార్థించిన వినయ సంపన్నుడు సంపత్పూర్ణుడు.

"పరతత్వం వినిర్ణీయ వేదాన్త ప్రతిపాదితమ్
బ్రూహి మే విశదం విద్వాన్ శిష్యాయ విబుధాన్తికే"

పరతత్వ నిర్ణయానంతరం పండితులందరు అవాక్కులై చూచుచుండిరి. రాజు పరమానందమొంది విష్ణుచిత్తుని గజాధిరోహణ మొనరింపజేసి పుర ప్రదక్షిణమునకు వెడలినపుడు

'సమ్పత్పూర్ణో మహాభక్త్యా తస్య రాజ్ఞః పురోహితః
జాబ్బూనదమయం ఛత్రం దధార మహిత స్తదా॥'

బంగారు గొడుగును ఆత పత్రముగ బూని గురుని వెన్నంటిన శిష్యోత్తముడు.

ఈ శెల్వనంబిని గూర్చి యెవరో అనినవి అటుంచి పెరియాళ్వారె ఎంతగ శ్లాఘించియున్నారో చూడుడు. విష్ణుచిత్తులు గజాధిరూఢులై ఊరేగుచుండిరి బిడ్డల వైభవమును జూచి యుప్పొంగు తలిదండ్రులవలె ఆ మహాభక్తునికి కలిగిన ఆ మహా సత్కార వైభవమును గనులారా చూచి యానందించుటకై అల వైకుంఠపురము నుండి లక్ష్మీనారాయణు లరుదెంచి సాక్షాత్కరించి యాతనిని ధన్యు నొనర్చిరి. గరుడాధిరూఢులై యరుదెంచిన ఆ లక్ష్మీనారాయణులను జూచి ఈ లోకుల పాపపు చూపులకు వారెచట గురి యగుదురో యను వెఱపున విష్ణుచిత్తుడా పుణ్యదంపతులకు పల్లాండు పాడెను. అది వారి రక్షకమగునని యాతని భ్రమ. ఆ పల్లాండులో ఒక పాశుర మిట్లుగలదు.

"అల్వళకు ఒన్ఱుమ్ ఇల్లా అణి కోట్టియర్ కోన్
అభిమాన తుంగన్ శెల్వనై పోల తిరుమాలే!
నానుమ్ ఉనక్కు పత్తు అడియేన్ — అని.

స్వామీ! అన్యాయమంటే ఏమిటో ఎరుగనివాడు. సుందరమగు తిరుక్కోట్టియూరులో నుండువారికి అధిపతి. అభిమానతుంగుడు. అయిన శెల్వనంబివలె నేనున్ను నీకు తరతరములుగా దాసుడను సుమా!

శెల్వనంబి రాజపురోహితుడే. అవుతేనేం? అతడు తిరుక్కోట్టియూరునకు అధిపతి. అభిమానవంతుడు. తర తరములుగ విష్ణుభక్తితో మునిగితేలిన వంశంలోనివాడు.

స్వామి ప్రత్యక్షమయినపుడు పరవశుడై మంగళా శాసన మొనర్చునపుడు కూడ విష్ణుచిత్తుని స్మృతి పథము నుండి తొలగని అప్పుడు పుణ్యపురుషుడు ఆ శెల్వనంబి.

'పెరియాళ్వారు తిరుమొళి' యను ప్రబంధ రాజమొకటి గలదు. అందు విష్ణుచిత్తులు తిరుక్కోట్టియూరును వర్ణించుచు

''నళిర్న్ద శీలన్ నయాచలన్ అభిమాన తుంగనై నాళ్ తొఱుమ్, తెళిన్ద శెల్వనై చ్చేవకం కొండ శెంగణ్ మాల్ తిరుక్కోట్టియూర్—'' అని పేర్కొంటాడు.

నాళి తిరునామములలో కూడ.

''శెల్వనమ్బి తన్నైప్పోల శిఱప్పిత్తాన్ నాళియే'' అని కలదు. తనతోపాటు శెల్వనంబిని కూడ మహనీయునిగా జేసిన పెరియాళ్వార్ను...అని తదర్థము.

ఈ రీతిగ రాయలు పేర్కొన్న రాజపురోహితుడు ''పాండీని కాపుడు — తిరుక్కోట్టియూరుని కేలక — నయశీలుడు, అభిమాన తుంగుడు — పరమ భాగవతుడు — శెల్వనంబి — సంపత్పూర్ణుడు'' అని బహుముఖముల పేర్కొనబడియుండగా, కేవలము పురోహిత మాత్రుడుగా రాయలచే ఆముక్తమున పరిచయము చేయబడుట పాఠకుల దురదృష్టమో—లేక ఆతని పాపమో, లేక రాయల ఎఱుక ఆపాటిదేనేమో.

ఆ ధా ర ము లు :

1 పెరియాళ్వార్ తిరుమొళి.
2 ఆముక్తమాల్యద.
3 ప్రపన్నామృతము.
4 గురుపరం పరా ప్రభావము.
5 భగపానై వళర్త భక్తన్:
(శ్రీ పి. శ్రీగారు)

శ్రీ టి. పి. భాష్యకారాచార్యులు

మ రో మ న వి

లోకంలో అందరూ మితబోధనులనుకునే హితబోధకులు శ్రీ నిడుదవోలువారి ప్రత్యుత్తరం (భారతి, జనవరి 79)లో నేను లేవనెత్తిన ముఖ్యమైన ప్రశ్నలకుమాత్రం జవాబులేదు. వారి 'మితబోధ'కు జవాబు చెప్పకుంటె దాన్ని అంగీకరించినట్లనుకునే ప్రమాదం ఉంది కాబట్టి ఈ లేఖను వ్రాస్తున్నాను.

(1) బసవన సాహిత్య నిర్మాత కాదన్నది శ్రీ నిడుదవోలు గారి అభిప్రాయం మాత్రమే. కన్నడంలో ప్రసిద్ధ విమర్శకులైన డా. రం. శ్రీ ముగళి బసవేశ్వరుని గురించి వ్రాస్తూ 'అతని వచనాలు వీరశైవ ధర్మానికి, విశ్వధర్మానికి అద్దంపడుతూ భారతీయ సాహిత్యానికి కన్నడం ఇచ్చిన అమూల్యమైన కానుకలై ఉన్నాయి' అన్నారు (కన్నడానికి నా అనువాదం, కన్నడ సాహిత్యద ఇతిహాస, కేంద్ర సాహిత్య అకాడెమీ, 1976, పు 89) శ్రీ ముగళి అంత గొప్ప విమర్శకులూ, ప్రామాణికులు కారంటే శ్రీ నిడుదవోలు వారితో నాకు పేచీలేదు.

(2) బసవనను గూర్చి డా. స్వామిగారు వ్రాసిన తర్వాత వచ్చిన రామయ్యగారి గ్రంథాన్ని వారు చూడలేదని వ్రాసింది శ్రీ నిడుదవోలువారే. డా. స్వామి అస్తవ్యస్తముగా వ్రాసినాడు ('రు' కాదు) అన్నది శ్రీ నిడుదవోలు వారే. రచయిత కనీసము కన్నడములోని బసవన వచనములనైనను సమగ్రముగా చదువలేదని' చెప్తూ ఒక అస్తవ్యస్త వచనమును ఉదహరించినదీ నిడుదవోలు వారే. పైపెచ్చు నేను వారి 'విమర్శ'(?)ను గాని, డా. స్వామిగారి గ్రంథాన్నిగాని చూడలేదు అపవాదు ఒకటి.

(3) స్వామిగారిపై భక్తి తాత్పర్యాలుండడానికి ఆయన మా శాఖాధిపతి కాదు మా మేనమామా కాదు. శ్రీ రామయ్యగారు నా దాయాదీ కాదు. అయితే శ్రీ వేంకటరావుగారికిమాత్రం రామయ్యగారు మేనమామ కాకున్నా, నేను దాయాది కాకున్నా ఆయనపై అవ్యాజానురాగం, నాపై ద్వేషం ఉండడం మాత్రం స్పష్టమయింది. దానికి కారణాలూ కొన్ని ఉన్నాయి. అవి నేను అర్థం చేసుకోగలను.

(4) నేను వ్రాసింది అనవసరం కావచ్చు. కాని శ్రీ నిడుదవోలువారు బసవన వచనాల అనువాదం గురించి తెచ్చిన ప్రసక్తి అసందర్భంకాదా? వారు చేసినవి, చేస్తున్నవి గ్రంథాన్వేషణా, విమర్శా? అసంగతమైన కాలనిర్ణయాన్ని గురించిన ప్రశ్నకు వారి జవాబు ఏమిటి? కన్నడం నేడు వస్తున్న సాహిత్య చరిత్రల పరిచయం, ప్రామాణిక విమర్శల పరిచయం వారికి ఉన్నదా? పీఠికలను సమీక్షలుగా ప్రకటింపజేస్తే అవి విమర్శలవుతాయా? ప్రశంసలవుతాయా? వీటికి సమాధానమేమిటి?

శ్రీ నిడుదవోలువారి పరిశ్రమ చాలా గొప్పది. పరిశోధకులుగా వారికున్న పేరూ పెద్దది. వారిపైన నాకెంతో గౌరవం ఉంది. కాని ఏదో మనసులో పెట్టుకొని, ఎవరి ప్రభావానికో లోనయి వారు పీఠికలు, విమర్శలు, సమీక్షలు, హితబోధలు వ్రాయడం సబబుకాదు.

శ్రీ సుందరం

'ఇంతే సంగతులు'

మిత్రులు సుందరంగారి 'పోస్టల్ ట్యూషన్' వ్రాస్త ఇబ్బంది గానే ఉంది. వారిచ్చిన ముఖ్యమైన ప్రశ్నలకు జవాబులేదని 'రిమైండర్' పంపారు. ఈ 'రిమైండర్'లో కూడా మరో కొన్ని కొత్త ప్రశ్నలు! అన్నిటికి ఒకటే జవాబు వ్రాస్తున్నాను.

లేఖలు వ్యక్తిగతంగా ఉండకుండా ఉంటే వాటికి కూడా సాహిత్యంలో స్థానం ఉంది. ఇటువంటి లేఖలకు ఎవరు గౌరవం ఇస్తారు చెప్పండి? సుందరంగారూ!

నాకు మీరు జవాబు చెప్పాలని నేను వ్రాయలేదు. మీరు వ్రాసిన లేఖకు ప్రత్యుత్తరం మాత్రమే వ్రాశాను. అక్కడికి అంతే. దాన్ని మీరు ''అంగీకరించి నట్లనుకునే ప్రమాదం ఉందని'' భయ పడకండి. నేననుకోను, మా తెలుగు దేశంలో ఎవరూ అనుకొంటా రని అనుకోను. ఇంతే సంగతులు.

శ్రీ వేంకట్రావు

లేఖలు

'భారతి' డిశంబర్ 78 సంచికలో పిరాట్లగారి ''ఫాక్ట్స్ ఆర్ సేక్రెడ్, కామెంట్ ఈజ్ ఫ్రీ'' అన్న వ్యాసంలో జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య పేరును ఉదహరిస్తూ (47వ పేజి) ఇలా అన్నారు: "1974లోనే వి. ర. సం. నుంచి రాజీనామా చేసినా, 1978 దాకా ఉండి జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్యను పెట్ట గలిగిన వ్యవస్థలో ఉన్నాడు. తార్కుండే కమిటీలను, ఓ.పి డి ఆర్. బహిరంగ సభలనూ చూడగల్గుతున్నాడు.''

ఈ సందర్భంగా జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా పిరాట్లగారికి ఒక వివరణ ఇవ్వటం నా బాధ్యత. పిరాట్ల గారు రాసిన వాక్యాలు జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్యను జ్వాలాముఖి పెట్టారు అనే అర్థాన్ని ఇస్తున్నాయి.

'ఫాక్ట్స్ ఆర్ సేక్రెడ్' అనే విషయాన్ని పిరాట్లగారికి గుర్తు చేస్తూ, జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్య ఏదో ఒక వ్యక్తి యొక్క కృషి మాత్రమే కాదనీ, రేపు పిరాట్లగారు సభ్యుడుగా వుండే సంస్థ ఏదైనా ప్రారంభించబడితే అది ఆయనే ఏర్పాటు చేసాడని చెప్పడం తప్పనీ చెప్పదలచుకున్నాను.

జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్యకు సంబంధించిన ప్రణాళిక రూపొందించడానికి, సంస్థ స్థాపించడానికి 1975 నుంచీ జరిగిన సన్నాహక కృషి, జరిగిన విస్తృత సమావేశాలు, సహకరించిన సాహితీ, సాంస్కృతిక రంగాలలోని వ్యక్తులు— వీటన్నిటిని గుర్తించకుండా, ఒక వ్యక్తి మాత్రమే, ఆ వ్యక్తి ఆ సంస్థలో సభ్యుడైనంతమాత్రాన, ఆ సంస్థను పెట్టుకున్నాడని రాయడాన్ని ''కామెంట్ ఈజ్ ఫ్రీ'' అనాల్సి వస్తుంది.

శ్రీ రవిబాబు
ప్రధానకార్యదర్శి,
జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య,
ఆంధ్రప్రదేశ్.

గమనిక

'భారతి' ఫిబ్రవరి సంచికలో నా అనువాద కవితను ప్రచురించారు. ధన్యవాదములు. 'ల్యూసీ స్మిత్' అన్నది స్త్రీ పేరు. వ్రాత ప్రతిని (ఫేర్‌చేసి) పంపునపుడు యిది స్పష్టంగా పేర్కొనక పోవడం పొరబాటని తలుస్తాను. ఆవిడను గూర్చి మూలగ్రంథంలో (Author Biographies) యిలా వున్నది: Lucy Smith (Wilmington, North Carolina) attended public school in Philadelphia, where she works as a furrier. Her first booklet of poems appeared in 1952 entitled No Middle Ground and her work appears in new Negro poets: U S A and Anthologie de la poesie Negre-Americaine.

శ్రీ ముటుమూడి ప్రసాదరావు

సవరణలు

భారతి (ఫిబ్రవరి 79) కథాగూరగంప శీర్షికలో ప్రచురించ బడిన రోణంకి అప్పలస్వామిగారిపై నేను వ్రాసిన చిరువ్యాసంలో ఈ దిగువ సవరణలు గమనించగోర్తాను.

59 పేజీ, 2 కాలం, 6వ లైనులో – ''హీబ్రూ''ను తప్పించి చదువుకోవాలి.

డిటో డిటో 17వ లైను: ''1969''లో బదులు ''28-6-71'' అని సవరించుకోవాలి. 18లైను...19 లైను: ''తరువాత...రిటయిరయ్యారు'' తొలగించాలి.

60వ పేజీ 1 కాలం, 4వ లైను ''భర్తృహరి'' బదులు ''భాస్కరశతకకారుడు'' అని వుండాలి.

శ్రీ మానేపల్లి సత్యనారాయణ

* * *

ఫిబ్రవరి 1979 'భారతి'లో శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి గారి పేరు పొరపాటున వేంకటరామశాస్త్రి అని పడింది. ఈ అచ్చు తప్పు పడినందుకు చింతిస్తున్నాము.

—సంపాదకుడు

గ్రంథ విమర్శలు

భ్రాతృ లేఖః

[లేఖకులు : శ్రీశ్రీ భాష్యం విజయసారథి, (విశ్వేశ్వరాంధ్ర సంస్కృత కళాశాల). డెమ్మీ 14 పుటలు, వెల : తెలియదు, ప్రతులకు : శ్రీ ఎస్. బి. వేంకటాచార్య P. O. రేగుర్తి, కరీంనగర్ తాలూకా, అదే జిల్లా. ఆం. ప్ర. ప్రచురణ : సంస్కృత భారతీ, వరంగల్.]

రచయిత సమర్థులైన సంస్కృత విద్వత్కవులు, సంస్కృత కళాశాలాధ్యాపకులు. ఆయన భ్రాతృలేఖ, మిత్రలేఖ. ఆప్తలేఖ అనే మూడు లఘు కావ్యాలను సంస్కృతంలో రచించారు. వానిలో ఇది 15 ఏళ్ల క్రిందట రచించబడినదట! దీనిని వారి పెద్దన్నగారు శ్రీ గోపాలాచార్యులగారికి వారి షష్టిపూర్తి సందర్భంలో సమర్పించారు.

ఈ లేఖ ప్రక్రియ సంస్కృత సాహిత్యంలో ఒక క్రొత్త సృష్టి అని వారంటున్నారు. ఇతర వాఙ్మయాల్లో విరివిగా ఉన్నా, యీ కాలంలో సంస్కృతంలో ఈ పద్ధతి కొత్తగానే (అదీ శ్లోకాల్లో) కానవస్తున్నది.

ఈ చిన్న పుస్తకంలో వివిధ ఛందస్సులలో 160శ్లోకాలు ఉన్నవి. వీటిలో వారి కుటుంబ వృత్తాంతం మొదలు అనేక విషయాలు చెప్పబడి ఉన్నవి. మొదటి నాలుగు పేజీలలో కుటుంబ చరిత్ర ఉన్నది. దానిబట్టి ఈ కుటుంబాభివృద్ధికి వీరి పెద్దన్నగారే కారకులనీ, ఈ కుటుంబంవారు సంఘ సంస్కర్తలై, పునర్వివాహాలకు, హరిజనోద్యమానికి పూనుకొని, పెక్కు ప్రతిఘటనలను ఎదుర్కొన్నారనీ చెప్పబడింది. తర్వాతి మూడు పుటలలో దేశం — ముఖ్యంగా తెలంగాణా దుఃస్థితి వర్ణించబడింది. మతాంతరుల ప్రవేశంవల్ల దేశం బాగా దెబ్బతిన్నదని చెప్పబడింది.

"యద్వైవ బౌద్ధేన మతేన దేశే
పదం సమాక్రాంత మిహ ప్రజాసు,
తేజస్సహో వీర్య యశోబలానాం
హ్రాసాయ వాందీ ఘటితా తదైవ."

అని బౌద్ధమతం దేశంలో ప్రవేశించడంతోనే దేశానికి క్షీణదశ ప్రారంభమైనదని ఈయన అంటున్నారు. దీనిని ఎందరు ఆమోదిస్తారో చెప్పలేము.

తర్వాత పాతిక శ్లోకాలకుపైగా సంస్కృతభాషా ప్రాశస్త్యం, ఇప్పటి దాని క్షీణదశ, అనాదరణ వివరింపబడినవి. తర్వాత 20 శ్లోకాలకు పైగా నాయకులు తీవ్రంగా విమర్శించబడినారు. "కోళ్లను తిన్నవారు పోయి గొర్రెలను తినేవారు వచ్చా"రనే సామెత. దానికి 'అజాశ నాఽపరం యాతా ఆగతా మహిషా శనాః" అనేది బదులుగా వాడబడింది. నేటి ప్రజాప్రభుత్వం నియంతృ ప్రభుత్వం గానే ఉన్నదనీ, అధికారంలో ఉన్నవారు స్వార్థపరులుగా ఉంటున్నారనీ రచయిత ఎక్కణ. తర్వాత గ్రామీణజీవితాన్ని గురించీ, అక్కడి వాతావరణ పరిస్థితులను గురించీ, దేశ భాషను గురించీ, ఆశ్రయణం గురించీ ఉన్నది.

ఇప్పటి మన వారి ఉభయ భ్రష్టత్వం

"పాశ్చాత్యవన్నో పరమాణు శోధనం
న ప్రాచ్యవద్వా పరమార్థ చింతనమ్,
కుర్వంతి కుందాః పునరస్మదీయాః
ఇత శ్చ్యుతిం యాంతి తతః చ్యులించ"

అని చెప్పడం సముచితంగా లేదు. స్వాతంత్ర్యం వచ్చాక—మందంగానే కావచ్చు. అభివృద్ధి మార్గంలో మనవారు పురోగమిస్తున్నారనీ, పల్లెటూళ్ల అభివృద్ధికి పాటుపడుతున్నారనీ చెప్పవలసి ఉన్నది.

రచన సరళంగా అందరికీ అర్థమయే రీతిలో సాగింది.

"ఆంగీరస"

పచ్చని జీవితానికో నచ్చిన రూలు

[డా॥ పెళ్ళకూరు జయప్రద, స్పందన సాహితీ సమాఖ్య : మచిలీపట్టణం. ఆరురూపాయలు.]

ఈ పుస్తకంలోవున్న తొమ్మిది కథలూ చక్కనివే. ప్రతి కథలోనూ, కథనంలోనూ కొత్తదనం, లాలిత్యం వున్నది. కథావస్తువులు చాలా బాగున్నాయి. వయస్సుకథలో వయస్సుతోపాటు మనస్సుకూడా పరిపక్వం చెందిన స్త్రీ హృదయపరిణామం, అప్పుడే యౌవ్వనంలో అడుగుపెట్టిన స్త్రీ హృదయ పరిణామం ... వాటి వ్యత్యాసాలూ రచయిత్రి అతిసుందరంగా, సున్నితంగా చూపారు. సంసారమే లాటరీలా లెక్కొస్తున్న వో స్కూలు మాస్టారు అదృష్టంమీది ఆశతో వో రెండు లాటరీ టిక్కట్లుకొని, అనక ఆ డబ్బుంటే వో కిలో బియ్యం వస్తాయనే వూహతో అతికష్టంమీద ఆ టిక్కట్లను మరో మాస్టారికి అంటగట్టి, తీరా ఆ టిక్కట్టుకి ప్రయిజు వచ్చిందని తెలిసేసరికి పడిన ఆరాటం, ఆవేదన, ఆ తరువాత నంబరు తప్పచూడ్డం జరిగిందనీ, ప్రయిజు ఆ మేస్టారికి రాలేదని తెలిశాక పొందిన ఆత్మతృప్తి, సగటు మనిషికి, మనస్త్వానికి చక్కని రూపకల్పన. న్యాయంలో ఒకనాటి, చిన్ననాటి తన నేస్తం గోమతి తనస్థితి చితికి నాడు తనవద్దకు సర్దునికి వస్తే చంద్రశేఖర్ ఆవేదన, ఆ తరువాతి అతని నిర్ణయం చాలా వాస్తవికంగా రచయిత్రి చిత్రించారు.

భగవంతుని చుట్టూ అనే కథ తిరుపతిలో భగవంతుని పేర జరిగే అక్రమాలకు, అభూత కల్పనలకూ భూతద్దం, శ్రీరాముడి పెళ్ళి సనాతన మూఢనమ్మకాలమీద, ఆచారాలమీదా దాడి, భేషజాల సంకెళ్ళు తాము పొట్టమీద తడిగుడ్డ వేసుకున్నా బైట లోకం కోసం ఎలాంటి భేషజాలకు పోతారో (మనుష్యులు) చూపే అద్దం. సృష్టి జరిపిన పక్షపాతంలో ఫిజిక్స్ డాక్టరేట్ పొందిన ఉమ కృష్ణ అనే ఆతన్ని ప్రేమించి వివాహం చేసుకుంటుంది. పెళ్ళయ్యాక ఆతని కిదివరకే పెళ్ళయిందని, ఆ పిల్ల తన శీలాన్ని పోగొట్టుకున్నందువల్ల కృష్ణ ఆమెను వదిలేశాడనీ ఆ విషయం ఆ పిల్ల అతనికి చెప్పి తాను ఆ విషయం తెలియని స్థితిలో దాన్ని పోగొట్టుకున్నానని క్షమించమని ప్రాధేయపడినా ఆతను క్షమించ లేదనీ...యీ కథ అతని నోటివెంటే విని, తనకీ విషయం తమ వివాహం ముందే చెప్పలేదని బాధపడి పర్యవసానంగా ఉమ ఆత్మహత్య చేసుకుంటుంది. మీ భార్య ఎంత పవిత్రంగా వుండాలని మీరు అనుకుంటారో, నా భర్త అంతే పవిత్రంగా వుండాలనీ నేనూ కోరుకున్నాను. కానీ...'' అని ఓ వుత్తరంలో తన మనోవ్యథను వ్యక్తపరుస్తుందామె.

సృష్టిదోషంలో తన కొడుకు తాను కన్న కొడుకు కాదని తెలిస్తే ఆ కొడుకు ఎక్కడ తన నొదిలి పోతాడోనని ఆ తల్లి వూగిసలాడిపోతూంటుంది. తన జన్మరహస్యం తెలుసుకున్న ఆమె కొడుకు ఆరాటపడ్డాడు. తన ప్రమేయం లేకుండానే నన్ను నా తల్లి పది నెలలు తన కడుపులో మోసింది. భూమ్మీదపడ్డ మరుక్షణం నుంచి ఓ యిరవైయ్యేళ్ళ నీ దీవెనలతో, నీ మమకారంతో, నీ శరీర కష్టంతో, నీ చల్లని చేతులతో పెరిగి పెద్దవాడినయ్యానమ్మా. నే నెవరి బిడ్డనో నువ్వే నిర్ణయించమ్మా అని తనను పెంచిన తల్లి వొడిలో వాలిపోతాడు. ఆ తల్లి హృదయం పొంగుతుంది.

ఇంత చక్కని కథలు తెలుగు చదువరికి యిచ్చిన రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, అందిచ్చిన స్పందన సాహితీ సమాఖ్యవారూ మిక్కిలి అభినందనీయులు.

అంతా నేనే

[లావణ్య, ప్రతిమ పబ్లికేషన్స్ : విజయవాడ, ఆరు రూపాయలు.]

ఈ అంతానేనేలో రెండు కథలున్నాయి. ఈ రెండూ చాలా అసహజంగా వున్నాయి. రచయిత్రి యీ కథలను తన యిష్టానికి, సరదాకూ వ్రాసుకున్నట్టు చదువరి కనుపిస్తుంది. అంతానేనేలో నాగరాజు ఎందుకు సన్యాసిగా మారుతాడో, మారితే అతనికా మహిమ లేమిటో, నిప్పులమీద నడవడం ఏమిటో, సమాధి కట్టే ఆ సమాధిలోంచి బయటకు నడిచి రావడం ఏమిటో...కథలో పార్వతీ పరమేశ్వరుల ప్రవేశం ఏమిటో...కథ సాంఘికమో, పురాణమో...చదువరికి అంతుపట్టదు. రెండోకథ చిటపటలు...చిరునవ్వులలో భార్యాభర్తల సంభాషణల్లో అశ్లీలాలు కొల్లలు. 115వ పేజీలో...అలివేలుకు ముందుగా రెండు పొడుచుకు వస్తూంటే గుర్నాథం నీళ్ళు ఎమలడంవంటివి...మొగుణ్ణి పెళ్ళాం చంకలో వేసుకోడం వంటివి వున్నాయి.

చేతిలో యింకున్న పెన్ను, ఎదురుగా తెల్లకాగితాలు — బర బర రాయగలిగిన శక్తివుంటే చాలో కథ రాయడానికన్నట్టున్నాయీ రెండు కథలూ.

ఈ పుస్తకానికి అతి సుందరంగా ముఖచిత్రాన్ని రచించిన విఖ్యాత చిత్రకారుడు బాపు అభినందనీయుడు.

పరిష్కారం

[కాశీనాధవిశ్వం, మధుసూధన్ పబ్లికేషన్స్, చిత్తూరు, అయిదు రూపాయల యాభై పైసలు.]

కాశీనాధ విశ్వం రాసిన ఓ పదకొండు కథలను ''పరిష్కారం'' పేరున చిత్తూరు మధుసూధన్ పబ్లికేషన్స్‌వారు ప్రచురించారు. రచయిత ఉపాధ్యాయుడైనంత మాత్రాన ప్రతి కథలోనూ ఉపాధ్యాయుని పాత్ర వుండనవసరంలేదు. అన్ని కథలూ పల్లెవాతావరణానికి చెందినవే. వీటిలో కొన్ని కథలు కేవలం సందేశాలలాగ, ఆరాటాలలాగా వున్నాయి. కాస్త ఆగండి ... ఆలోచించండి లో ఆవేశము, పునరావృతంలో కట్నాలమీద ఆరాటావేశాలూ వున్నాయి. పదండి పోదాం పైపైకిలో శ్రమ జీవులు ఎలా బ్రతుకుతున్నారో అనే ఆవేదన. ఇహ ఎవర్ని గురించి వ్రాయనురో రచయిత తన చుట్టూ సంఘటనలు, పాత్రలూ చూసి కథా వస్తువేది, దేన్ని గురించి వ్రాయను! అని ఆరాటపడతాడు.

మొత్తంమీద కథనంలో చక్కని చురుకుదనం వుండడం వల్ల చదువరి నీ కథలు ఆకట్టుకుంటాయి. రచయితకు తమిళం వచ్చినంత మాత్రాన్నేమో అడమాన పత్రం (తనఖాపత్రం) కట్టుబడి (గిట్టుబాటు) అనే అరవ పదాలు దొర్లాలనిలేదు.

త్రివేణి సంగమం

(ఇసుకపల్లి లక్ష్మీ నరసింహశాస్త్రి, నవ్యభారతి : హైదరాబాదు, రూ. 12-00.)

ఈ త్రివేణి సంగమంలో వున్న పన్నెండు కథలలో త్రివేణి సంగమం మొదటి కథ. కథలో నాయకుడు ఇటార్సీ స్టేషనులో వెయిటింగ్ రూములో కూర్చుని వుండగా వో అమ్మాయివచ్చి తన సూట్‌కేసు చూడమని చెప్పి యిప్పుడే వస్తానని వెళ్ళిపోతుంది. ఆనక పోలీసులొచ్చి ఆ పెట్టెలో స్మగ్లింగ్ వాచీలున్నాయని తీసి చూపి ఆతణ్ణి ఆరెస్టుచేస్తామంటారు. సరుకు పోలీసుల కొదిలేస్తే తనని వాళ్ళొదిలేసే వొప్పందం చేసుకుంటాడతను. అంతా అయి, రైలెక్కి, ఆ రైలు కదిలాక ఆ అమ్మాయి రొప్పుకుంటూ వచ్చి

...కో లిప్తముందు అసలా పోలీసులే దొంగ ...ది నాయకునికి. ఆనక రివ్వునొచ్చిన ...బోతాడు. మరోకథ "ఆత్మసాక్షి ...యువకులను తీర్చిదిద్ది చక్కని పౌరు ...వో అద్దెకొంప కోసం వచ్చిన ఆనంద ...హుడు తాను నట్టేట ముంచిన వో పురుష ద్వేషంతో ఆన తర్వాతికి జరిగిన కారం తీర్చుకుంటున్నట్టు గ్రహించి

అక్కగారింట్లో చేరి ఆమె అహాన్ని ఆసరాగా వుంటూ చివరికి విధవ ...కి పరోక్షంగా తానే కట్నమిచ్చి, ఆ ...టుంది. ముసుగు మనిషిలో ఉదర ...గురుస్వామి ఒక వూళ్ళోని గొప్ప ...దేవికి పిల్లలు లేనిలోటు తీరు ...విషయమే గాక, ఆ కారణమూ తెలి ...పోతాడు. చివరికా గురుస్వామి విషమిచ్చి చంపుతాడు.

జ్యోతి ప్రవర్తన, ఆ పాత్ర చిత్రీ ఆమె అకారణ కోపం, భర్తమీది ...కావు. ముసుగుమనిషి అంతం ...ని ఏదో చేస్తాడనే భ్రమ చదు కథకు న్యాయం చేయలేదు. ...గ్రతాన్న ఆ స్వామి ఎందుకు, ...ధకము.

వుండడం, వచ్చిన సమస్యలను ఇహ మిగతా కథలన్నీ కూడా సాఫీగా వున్నది. నవ్యభారతి ...న్నెండు రూపాయల వెలతో

ఫాలాక్షుడు

...తులు

...వాదకులు చర్ల నారాయణ ...ధను. 119 పుటలు,

...వాదను — చర్ల గణపతి ...౦.

...నువాదకులు చర్ల గణపతి

4. మహాభారత మీమాంస, ప్రథమభాగము వచనము — చర్ల నారాయణశాస్త్రి, పుటలు 240. వెల: 4-00.]

సంస్కృతమున, అతి ప్రసిద్ధుడగు అప్పయ దీక్షితుని సోదరుని పుత్రుడగు నీలకంఠ దీక్షితుడు గీర్వాణ భాషలో రచించిన నీలకంఠ విజయమునకు నిది యాంధ్రానువాదము. అయిదాశ్వాసముల ప్రబంధము.

అనువాదకు లిరువురును సంస్కృతాంధ్ర భాషలలో ఆరితేరిన పండితులు, కవులు నగుటచేత, ప్రస్తుత కావ్యమును ప్రౌఢ రీతిని ప్రాచీన కవితా సంప్రదాయానుసారముగ నలరారుచున్నది.

కావ్యమున వచనము హెచ్చు.

శివుడు, క్షీరాబ్ధి మథన సమయమున జనించిన హాలాహల విషభక్షణము చేసి నీలకంఠనామము దాల్చుట యిందలి యితివృత్తము.

గ్రంథ ముద్రణము సంస్కారము నపేక్షించుచున్నది. ప్రచురణ కర్తలు నీ క్రింది యతి గణభంగములను గమనింపవలయున్నది.

గణభంగములు. 1 పుట. 3వ పద్యము.

చం. ఎటిగినట్టి వెతొయ్ అటి పురాణపు ముక్కలన్ గడున్

ఇచట యొక పదము లోపించినది. పాదము తప్పు.

2వ పుట 3వ పద్యము.

సంతప్యు లైన కవుల్ గలారు బహుమంతవ్యుల్ రసజ్ఞుల్ గలారు

ఇందు గణభంగము. యతిభంగము.

మలి ముద్రణమునగాని, ప్రస్తుత ముద్రణమున గని వీనిని సవరించుకొందురుగాక.

2. రఘువంశలహరి

గణపతిశాస్త్రి కృతము. సంస్కృతమున పంచకావ్యములలో ప్రథమమగు రఘువంశమునకు నిది యాంధ్రానువాదము.

ఆదిని నన్నయ కాలమునుండి యిది వ్యాప్తిలో నున్నది. నన్నయ ఇందలి భావముల ననువదించినాడు. పదబంధము చాలగా నుపయోగించినాడు.

శ్రీ మద్రామాయణ దర్శనము

శ్రీ మద్రామాయణ మహాకావ్య విశిష్టతను వివిధ కోణములలో తెలుపు గ్రంథము. గ్రహదోష పరిహారము నకు ఉమాసంహితలో చెప్పబడిన శ్రీ మద్రామాయణ ఘట్టపారాయణ క్రమము కూడా కలదు. రు. 2-00లు (పోస్టేజితో) M. O. చెయ్యాలి.

ఆర్. వి. ఆర్ మూర్తి

శ్రీ గీతా పవర్ ప్రెస్ — విజయనగరం-531202.

పదునాఱవ శతాబ్దమునుండి అవుడూరి కిచ్చయ మొదలుగా దీనికి ఆంధ్రపద్యానువాదములు వెలసినవి. ఇందలి ఇందుమతీ వివాహము కవుల నాకర్షించినది. ఆధునిక కాలమున దీనికి అనువాదములు వెలసినవి. వానిలో ఆదిపూడి సోమనాథరావుగారిది ప్రశస్తము మూలముతో ముద్రితమైనది.

ప్రస్తుత గ్రంథము రఘువంశము సర్గలకు సంపూర్ణానువాదము. వృత్తములు చాలగా వాడబడినవి.

కాళిదాసు కవిత ప్రతిపద సార్థకత గలది. అందలి పదముల నట్లే యథాతథముగా అనువాదమున వాడవలయును. అట్లున్ననే ఆ యనువాద విశిష్టత యవగాహనమగును. ఇందు తొలి శ్లోకానువాదము చూడుడు—

వాగర్థావివ సంపృక్తే వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరే వందే పార్వతీ పరమేశ్వరా

దీనికి అనువాదము.

క వాగర్థంబులు బోలెం
బాగుగ నాట యిన లోకమాతా పితలన్
శ్రీ గౌరీపరమేశుల
వాగర్థపు తత్త్వ మెఱుఁగి ప్రణతి యొనర్తున్

మూలమున పార్వతి పరమేశ్వర శబ్దము పార్వతి పరమేశులను లక్ష్మీనారాయణులను తెలుపును.

పార్వతిప—పార్వతి పరమేశ్వరులు
పరమేశ్వరు లక్ష్మినారాయణుడు—రమ లక్ష్మి అనువాదము తప్పినది. ఇది యిట్లుండవలెను.

వాక్కు నర్థంబు గలిసిన పగిది గలిసి
అఖిల జగముల తలిదండ్రులైనయట్టి
పార్వతీ పరమేశుల ప్రణుతి సేత
అతుల వాగర్థ ప్రతిపత్తి యమరుటకును

ఛందో విషయమున కొంత విమర్శ :

(1) కందము 4 వ పాదము.
"అది త్రాగిన త్రాగుచు నీడ యటు వెంటాడెన్."
(గణ భంగము) (2–5.)

(2) గీతము — 4 వ పాదము
"పౌర కన్యల్ శుభమగు పేలాలు వోలె"
(ప్రాస భంగము) (2–9)

(3) మత్తేభము 4వ పాదము.
తరువుల్ శీర్షములూద స్వీయ యశమున్ క్ష్మాభర్త
వేడ్కన్ వినెన్.
(యతి భంగము) (2–10)

పునర్ముద్రణమున నెన్నియో గ—
సరిచేయవలసి యున్నవి.

రఘు వంశానువాదములు
పలువురు వ్రాసియే యున్నారు.

బహుభాషా కోవిదులగు శ్రీ
ననువదించియున్నారు.

3. కుమారస్వామి

కాళిదాసు కుమార సంభవము
కరణము గణపతి శాస్త్రులగారి ద్వా
మగునట్లు వ్రాసిరి. కాళిదాసు గ్రం
స్పియర్ కృతులవలె విశ్వ జనీనము
మరి యే ఇతర గ్రంథములకు లే
కేవలము అభిమానము చేతనే అన
మున వచనమునకు ప్రచుర ప్రచార
శ్రిత కృతులకు లేదు. అయినను
ఈ కాలమున లేకపోలేదు. వారీ
ఇతోధికముగా గ్రంథకర్తకు సహా

4. మహాభారత

అనువాదకర్త : చర్ల నా

ప్రసిద్ధ విద్వాంసులు చిం
రచించిన 'ఉపసంహారము' అను
రావు సంపీగారొనర్చిన యనువా
మొదటి భాగము.

ఇది పాశ్చాత్య విమర్శనా
ర్శనమునకు తెలుగు అనువాద
గూర్చి కూలంకషముగా ప్రాచ
వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగా
సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మహ
సూర్యనారాయణమూర్తి మహ

ప్రస్తుత గ్రంథ ప్రచ
విమర్శ గ్రంథ పరంపరలో
యినది. ఇది ఆంధ్ర సాహిత
పాత పండితులకు పరిచయ
మానము గలవారు దీనిని త

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radh
Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawa

కావలెను!

గుజరాత్ సేవింగ్స్ వారి భూదేవి, మహాదేవి లేక రాధా పాస్ పుస్తకాలు కొనుటలో ప్రజలకు మీ సహాయం కావాలి.

బహుమానము!

మీ వృత్తి ఏదైనప్పటికి, మీరు ఏ రంగంలో స్థిరపడినప్పటికి - డాక్టరు - లాయరు - టీచరు విద్యార్థి - సేల్సుమన్ - బ్యాంకు వుద్యోగి - ఇన్సూరెన్స్ ఏజెంటు - లాటరీ ఏజంటు - ప్రభుత్వోద్యోగి - పోస్టుమాస్టరు - మిల్ ఫోర్‌మన్ - షాపు వర్కరు లేదా మరి యే యితర వ్యాపకములు వున్నప్పటికి పని చేయుటకు యిష్టపడేటట్లయితే ....

గుజరాత్ సేవింగ్స్ పాస్ పుస్తకాలద్వారా డబ్బు సంపాదించడానికి, పొదుపు చేయడానికి కూడా దానికదే ప్రత్యేకత.

లక్షల రూపాయల బహుమతులు!

50 నెలల తర్వాత పథకము పూర్తయినప్పుడు మీ డబ్బు మీకు వాపసు.

మీరు ఏజంటు కాదలచినారా?

నేడే ఉచిత బుక్‌లెట్స్‌కు మాకు వ్రాయండి అందులో మేము యిచ్చే ఆకర్షణీయమైన కమీషన్, బోనసు స్కీము వివరాలు పొందుపర్చి వుంటాయి.



మా భూదేవి గ్రూపు

మొదటి డ్రా 30 మార్చి 1979 నెల్లూరులో జరుపుటకు నిర్ణయించబడినది.

డ్రా సమయము, స్థలము త్వరలో ప్రకటించబడును.

త్వరపడండి!

ఈ అవకాశమును వినియోగించుకొని, మీరు ఎట్టి యిబ్బంది లేకుండగనే తగినంత ఆదాయాన్ని గడించండి.

For more details contact or write to

GUJARAT SAVINGS

Regional offices

Bank 5-1-751, Street Kothi Opp Taj Hotel, HYDERABAD-1 Tel: 57406

Gandhi Nagar Kotwari Building Besant Road, VIJAYAWADA- Tel: 72152.

Dr S N. Sahu Building Rani Hat, CUTTACK 7

తిరుపతి : 2వ అంతస్తు 490, బండ్లవీధి, తిరుపతి.

46-22 S.Dondaparthi, Station Road VISHAKHAPATNAM 530 016
1 6-51, Market Road Near Clock Tower, Jagtiyal P O., KARIMNAGAR
Dr Subhedhar's clinic, Gandhi Chowk, NIZAMABAD
1-6 5, Shastri Road, KARIMNAGAR,
Rashtrapati Road, NALGONDA
3-8-27, Shah Bazar, MEHABOOBNAGAR,
D No 23/11-40, Nerala Bldg Elluru-Bazar GUNTUR 3
18/177, Nehru Road KURNOOL.
8 24-151, K V P Bldg, Main Road RAJAHMUNDRY.
Bose Road Opp Ramakrishna Theatre TENALI
Subhash Road KAMAREDDY.
71, Chandralok Building, 111 Sarojini Devi Road, Opp Coromandal, SECUNDERABAD 500 003
P.V N. Mansion, Seshapuran Street, CHITTOOR
Near Ashok Talkies P O. NIRMAL.
Opp Cochin Cafe Trunk Road ONGOLE
21 186 Sowcar Fakir Saheb Street CUDDAPAH.
P R Rao Bldg Main Road KAKINADA
Raja Building 3rd floor Opp Muncipal Bus Stand SRIKAKULAM
7-142 Prakash Road ANANTAPUR
15, J V Muncipal Buildings, Trunk Road NELLORE
8 3 51, Sunder Talkies Road KHAMMAM
Atreya Vilas Main Road MACHILIPATNAM 521 001
Ganesh Bhavan Hanamkonda Chawrasta, WARANGAL 5[illegible]
College Road KADIRI
Door No 6/6 A Gandhi Road PRODDATUR 516 360
Muncipal Building Up Stairs Room No 3 ADONI
Urban Bank Road Near Batam BERHAMPUR ORISSA
Dr S N.Sahu Building Rani Hat CUTTACK-7

BRANCHES ALL OVER INDIA

H.O. 518, Kalbadevi Road, BOMBAY-400 002. Tel: 310605—310533

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారుచేస్తున్నవారు!

- **అమృతాంజనం బాధానివారిణి**
  తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- **అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్**
  పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- **అమృతాంజన్ డెర్మల్ అయింట్‌మెంట్**
  తామర, తీట, గజ్జి వగైరాలకు.
- **అమృతాంజన్ ఇన్‌హేలర్**
  జలుబుచేసి ముక్కుదిబ్బెడ, తుమ్ములు వగైరాలకు.
- **అనోలియమ్-కోల్డ్ రబ్**
  దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- **శాలోఫెన్-బాధానివారిణి మాత్రలు**
  తలనొప్పి, ఫ్లూ, ఒళ్ళు నొప్పులకు.

...ఇండియాలోను,
ఇతర దేశాలలోను
పేరు పొందినవి.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు



PDS/AM.1759 TEL

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104M147
పుస్తకం పేరు	భారతి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	88
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	no
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Navaya
స్కాన్ చేసినది	thasin
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good